

ఈనాడు



విజయవాడ 25-7-2025 శుక్రవారం సిటీ సంపుటి 51 . సంచిక 346

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 14 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

విశాఖ, విజయవాడ మెట్రోలకు కదలిక

- మెట్రో రైలు ప్రాజెక్టుల అంచనా వ్యయంలో 40% విలువైన పనులకు టెండర్లు
- 'ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ విధానం 4.0'కు ఆమోదం
- రూ.79,900 కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు అంగీకారం
- 1.50 లక్షల ఉద్యోగాలకు అవకాశం
- రాష్ట్ర మంత్రిమండలి కీలక నిర్ణయాలు
- తిరుపతి తొక్కిసలాటపై కమిషన్ నివేదికకు క్యాబినెట్ ఆమోదం



క్యాబినెట్ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రులు అనిత, నాదెండ్ల మనోహర్, అచ్చెన్నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, సీఎస్ విజయానంద్, ఐఏఎస్ అధికారి కె.భాస్కర్, మంత్రులు లోకేశ్, కొల్లు రవీంద్ర

ఈనాడు - అమరావతి

విజయవాడ, విశాఖ నగరాల్లో మెట్రో రైలు ప్రాజెక్టులకు టెండర్లు పిలవనున్నారు. విజయవాడలో ఈ ప్రాజెక్టు తొలిదశ కింద రెండు కారిడార్ల అనుమతి మంజూరుకు అడుగులు పడుతున్నాయి. రూ.10,118 కోట్ల అంచనా వ్యయంతో చేపడతారు. ప్రభుత్వ జాయింట్ వెంచర్, ఈక్విటీ ఫండింగ్ సగం సగం ఉండేలా ఈ ప్రాజెక్టు ముందుకు సాగుతుంది. విశాఖ నగరంలో రూ.11,498 కోట్ల అంచనా వ్యయంతో ఇదే పద్ధతిలో పనులు చేస్తారు. ఈ రెండుచోట్ల అంచనా వ్యయంలో 40% మేర విలువైన పనులకు టెండర్లు పిలిచేందుకు మంత్రిమండలి ఆమోదం తెలియజేసింది. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం సమావేశమైన రాష్ట్ర మంత్రిమండలి అనేక కీలక నిర్ణయాలు తీసుకుంది. విశాఖను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు వీలుగా భూ కేటాయింపులు, పెట్టుబడుల ప్రతిపాదనలను ఆమోదించడంతో పాటు ఉత్తరాంధ్రలో భూబ్యాంకు ఏర్పాటుకు నిర్ణయించింది. ఇందుకు 1,941.19 ఎకరాల భూమిని విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లో తీసుకోనున్నారు. విశాఖ అర్బన్ ల్యాండ్ పూలింగ్ పథకం 2016 నిబంధనల ప్రకారం ఈ భూమి తీసుకునేలా విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీకి అనుమతి ఇచ్చారు. రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ పరిశ్రమ విస్తృతమయ్యేలా నిర్ణయాలు తీసుకున్నారు. మంత్రివర్గ నిర్ణయాలను మంత్రి పార్థసారథి విలేకరులకు వెల్లడించారు. ఆ వివరాలివి..

- 'ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ విధానం 4.0'కు ఆమోదం. విడిభాగాలతో సహా మొత్తం ఎలక్ట్రానిక్ పరికరాలు రాష్ట్రంలోనే తయారు కావడానికి ఈ విధానం ఉపకరిస్తుంది. ఏటా 100 నుంచి 150 బిలియన్ డాలర్ల వ్యాపారం ఇక్కడ జరుగుతుందని అంచనా.
- రాష్ట్రంలో రూ.79,900 కోట్ల విలువైన పెట్టుబడుల ప్రతిపాదనలకు పచ్చజెండా. వీటి వల్ల ఇంధన, ఐటీ రంగాల్లో 1.50 లక్షలమందికి ఉపాధి కల్పన.
- తిరుపతిలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనపై జస్టిస్ సత్యనారాయణమూర్తి కమిటీ నివేదికకు మంత్రిమండలి ఆమోదం. నివేదికలోని సిఫార్సుల అమలుకు నిర్ణయం.
- ప్రతి రైతు నుంచి 20 క్వింటాళ్లు మాత్రమే పొగాకు కొనుగోలు చేసేలా (మిగతా 8లో)

రమణకుమార్, హరనాథరెడ్డిపై క్రిమినల్ చర్యలు

తిరుపతిలో తొక్కిసలాట.. ఐదుగురి మృతికి వారిదే పూర్తి బాధ్యత

జేఈఓ గౌతమి పర్యవేక్షణ లోపం ఉంది

నాటి ఎస్పీ సుబ్బరాయుడికి క్లీన్‌చిట్

మంత్రిమండలికి జస్టిస్ సత్యనారాయణమూర్తి కమిషన్ నివేదిక

లోపలి పేజీలో



లండన్ శివారులోని బ్రిటన్ ప్రధాని నివాసం చెకర్స్‌లో భారత, బ్రిటన్ ప్రధానులు మోదీ, కీర్ స్టార్మర్. చిత్రంలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద పత్రాలతో ఇరుదేశాల మంత్రులు జొనాథన్ రేనాల్ప్స్, పీయూష్ గోయల్

భారత్, బ్రిటన్‌ల మధ్య స్వేచ్ఛా వాణిజ్యం

- ఇరు దేశాల మధ్య కుదిరిన ఒప్పందం
- ప్రధానుల సమక్షంలో సంతకాలు
- 99% భారతీయ ఉత్పత్తులపై తగ్గనున్న సుంకాల భారం
- చరిత్రాత్మక రోజుగా పేర్కొన్న మోదీ
- స్టార్మర్‌తో భేటీలో పలు అంశాలపై చర్చ
- 2030 కల్లా ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేసుకోవాలని నిర్ణయం
- 'విజన్ 2035' ఆవిష్కరణ

లండన్: భారత్, బ్రిటన్ సంబంధాల్లో సరికొత్త అధ్యాయానికి తెరలేచింది. రెండు దేశాల మధ్య గురువారం చరిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) లాంఛనప్రాయంగా కుదిరింది. దీంతో ఇరు దేశాల ఉత్పత్తులకు పరస్పర మార్కెట్ ప్రవేశం సులభతరం కానుంది. బ్రిటన్‌కు భారత ఎగుమతుల్లో 99% ఉత్పత్తులపై సుంకాల భారం తగ్గనుంది. దుస్తులు సహా చాలా వ్యవసాయరంగ, ఆహారశుద్ధి ఉత్పత్తులకు టారిఫ్‌ను లండన్ పూర్తిగా మినహాయించనుంది. బ్రిటన్ (యూకే) నుంచి దిగుమతయ్యే స్కాచ్ విస్కీ, జిన్‌లపై సుంకాన్ని మన దేశం సగానికి తగ్గించనుంది. తాజా ఎఫ్‌టీఏతో ఇరు దేశాల్లోనూ పలు రంగాల్లో వేలకొద్దీ ఉద్యోగావకాశాలు పుట్టుకురానున్నాయి. ప్రధాన మంత్రి మోదీ, బ్రిటన్ (మిగతా 8లో)

లోపలి పేజీల్లో

నెల్లూరులో మేత.. ఆఫ్రికాకు మోత
క్వార్ట్జ ఎక్స్‌పోర్టర్ల నుంచి డబ్బు వసూళ్లలో.. మాజీ మంత్రి అనిల్ పీఏ నాగరాజు కీలకం

మద్యం కుంభకోణం నిందితులు నా ఫ్లాట్‌కు వచ్చేవారు
వారికి ఈ కేసుతో సంబంధం ఉన్నట్లు నాకు తెలీదు
సిట్ ఎదుట శ్రవణ్‌రావు వాంగ్మూలం

రూ.వెయ్యి కోట్లతో 2 వేల కి.మీ. రోడ్ల అభివృద్ధి
రూ.500 కోట్లతో మిగిలిన రహదారుల మరమ్మతులు
15 రోజుల్లో నివేదిక రూపొందించండి
సీఎం చంద్రబాబు ఆదేశం

17 కార్పొరేషన్లలో ఆటోమేటిగ్గా మ్యుటేషన్
ఇళ్లు, ఫ్లాట్ల కొనుగోళ్లకు మాత్రమే
ఆగస్టు 1 నుంచి ప్రారంభం



చెస్ ప్రపంచకప్ ఫైనల్లో హంపి

గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి మరో ఘనత సాధించింది. ప్రతిష్ఠాత్మక ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్‌లో ఈ తెలుగమ్మాయి ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం సెమీఫైనల్ టైబ్రేక్‌లో ఆమె 5-3తో చైనా క్రీడాకారిణి లి టింగ్‌జీని ఓడించింది. టైటిల్ కోసం హంపి.. భారత్‌కే చెందిన దివ్య దేశ్‌ముఖ్‌తో తలపడనుండడంతో ఈసారి చెస్ ప్రపంచకప్ మన దేశానికే సొంతం కానుంది. ఫైనల్ శనివారం మొదలవుతుంది.

వివరాలు ఛాంపియన్ లో..

మరో చిచ్చు! థాయ్‌లాండ్, కంబోడియా ఘర్షణ



కంబోడియా దాడితో థాయ్‌లాండ్‌లోని సిసకేట్ ప్రావిన్స్‌లో ఓ గ్యాస్ స్టేషన్ నుంచి వెలువడుతున్న పొగ

- సరిహద్దుల్లో పరస్పరం దాడులు
- థాయ్‌లో 11 మంది మృతి
- 28 మందికి గాయాలు
- నష్టం వివరాలను వెల్లడించని కంబోడియా
- సైనిక స్థావరాలపై వైమానిక దాడులు చేసిన థాయ్
- ఇప్పటికే రష్యా-ఉక్రెయిన్, పశ్చిమాసియా ఘర్షణలు..

10లో

రష్యాలో ఘోర విమాన ప్రమాదం

49 మందితో వెళ్తూ అడవిలో కుప్పకూలిన లోహ విహంగం

అందరూ దుర్మరణం

శిథిలాలను గుర్తించిన అధికారులు

10లో



ప్రమాదానికి గురైన రష్యా విమాన శకలాలు



భారతీయులను నియమించుకోవద్దు

టెక్ కంపెనీలకు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్: అమెరికాకు చెందిన టెక్ కంపెనీలు.. చైనాలో పరిశ్రమలు నిర్మించడం, భారతీయ ఉద్యోగులను నియమించుకోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయన బుధవారం జరిగిన ఏఐ సదస్సులో మాట్లాడుతూ.. "చాలా కాలంగా అమెరికా రాడికల్ గ్లోబలిజాన్ని అనుసరించింది. దీని వలన చాలామంది అమెరికన్లకు ద్రోహం జరిగింది. మన దేశంలోని భారీ టెక్ కంపెనీలు చైనాలో తమ సంస్థలను నెలకొల్పుతున్నాయి. భారతీయ ఉద్యోగులను నియమించుకుంటున్నాయి. ఐర్లాండ్‌ను అడ్డంపెట్టుకొని తక్కువ లాభాలు చూపుతూ స్వేచ్ఛను అనుభవిస్తున్నాయి. ఇక్కడి ప్రజల అవకాశాలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయి. ట్రంప్ పాలనలో ఆ రోజులు ముగిసిపోతాయి. దేశానికే మొదటి ప్రాధాన్యమిస్తూ అన్ని కంపెనీలు పనిచేయాలి" అని ట్రంప్ పేర్కొన్నారు.

ఇదీ సంగతి!



మీరు ఉండగా తను ఇక్కడ ఉండలేనంటూ వెళ్లిపోయింది సార్!



డ్వాక్రా మహిళల చేతికి డ్రోన్లు

- 80% రాయితీపై ఇవ్వనున్న సర్కార్
- ఈ ఏడాది 440 మందికి అందించేలా ప్రణాళిక
- వ్యవసాయానికి చేయూత
- 5-7 నిమిషాల్లోనే ఎకరం పొలం పిచికారి

ఈనాడు, అమరావతి: డ్వాక్రా మహిళల చేతికి ఇక డ్రోన్లు రానున్నాయి. వ్యవసాయంలో సాయ పడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని రాయితీపై అందించనున్నాయి. కేంద్ర ప్రభుత్వం 'నమో డ్రోన్ దీదీ' పథకాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా డ్వాక్రా మహిళలకు 80 శాతం రాయితీతో డ్రోన్లను అందిస్తోంది. దీన్ని అందిపుచ్చుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది 440 మంది మహిళలకు (మిగతా 8లో)



ఈ వనరులతో మీరే ఓ వ్యవస్థగా ఎదగొచ్చు

ఏ విషయాన్నైనా సులువుగా నేర్చుకొనే అవకాశాన్ని ఇంటర్నెట్ మీకు అందిస్తోంది. ఏ స్థాయిలో ఉన్న వ్యక్తితోనైనా సంప్రదింపులు జరపడానికి సామాజిక మాధ్యమాల రూపంలో మీకో వేదిక దొరికింది. మీ కలలకు ఓ రూపం ఇస్తూ దేన్నైనా సృష్టించగల సామర్థ్యం కృత్రిమ మేధ(ఏఐ)తో సాధ్యమవుతోంది. ఈ వనరులను సద్వినియోగం చేసుకుంటే మీరే ఓ వ్యవస్థగా ఎదగొచ్చు.

– డాన్ కో, రచయిత

ఐఆర్‌డీఏఐ ఛైర్మన్‌గా అజయ్ సేథ్

దిల్లీ: భారత బీమా నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) ఛైర్మన్‌గా అజయ్ సేథ్‌ను నియమిస్తున్నట్లు ప్రభుత్వం గురువారం ప్రకటించింది. అజయ్ సేథ్ నియామకానికి మంత్రివర్గ నియామకాల సంఘం ఆమోదం తెలిపింది. ఐఆర్‌డీఏఐ ఛైర్మన్‌గా అజయ్ సేథ్ వచ్చే మూడేళ్లు లేదా ఆయనకు 65 ఏళ్లు వచ్చే వరకు లేదా తదుపరి ఉత్తర్వుల వరకు కొనసాగుతారని ప్రభుత్వం నోటిఫికేషన్‌లో పేర్కొంది. 1987 బ్యాచ్ కర్ణాటక క్యాడర్ ఐఏఎస్ అధికారి అయిన అజయ్ సేథ్, ఈ ఏడాది జూన్‌లో ఆర్థిక వ్యవహారాల కార్యదర్శిగా నాలుగేళ్ల పాటు పనిచేశాక, పదవీ విరమణ చేశారు. ఈ ఏడాది మార్చిలో దేవాశిష్ పండా పదవీ కాలం ముగిసిన తర్వాత, ఐఆర్‌డీఏఐ ఛైర్మన్ పదవి నాలుగు నెలల పాటు ఖాళీగానే ఉంది. కేబినెట్ కార్యదర్శి నేతృత్వంలోని ఫైనాన్షియల్ సెక్టార్ రెగ్యులేటరీ అపాయింట్‌మెంట్స్ సెర్చ్ కమిటీ (ఎస్ఎస్ఆర్ఏఎస్‌సీ) అజయ్ సేథ్ పేరును సిఫారసు చేయగా, ప్రధాని మోదీ నేతృత్వంలోని మంత్రివర్గ నియామకాల సంఘం ఆమోదం తెలిపింది.

మూడు రైళ్లలో అదనంగా స్లీపర్ క్లాస్ బోగీలు

ఈనాడు, హైదరాబాద్: స్లీపర్ బోగీల్లో రిజర్వేషన్లు దొరక్క ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులకు కొంత ఊరట లభించనుంది. మూడు ఎక్స్‌ప్రెస్‌లలో అదనంగా స్లీపర్ బోగీలు జత చేస్తున్నట్లు ద.మ. రైల్వే సీపీఆర్వో ఏ.శ్రీధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్-ఛత్రపతి శివాజీ టెర్మినల్ ముంబయి, ముంబయి ఛత్రపతి శివాజీ టెర్మినల్-హైదరాబాద్ (22731/22732)- ముంబయి ఎక్స్‌ప్రెస్‌లో సెప్టెంబరు 23, 26 తేదీల నుంచి, ఛత్రపతి శివాజీ టెర్మినల్ ముంబయి-హైదరాబాద్, హైదరాబాద్-ఛత్రపతి శివాజీ టెర్మినల్ ముంబయి (12701/12702)- హుస్సేన్‌సాగర్ ఎక్స్‌ప్రెస్‌లో సెప్టెంబరు 24, 25 తేదీల నుంచి రెండు చొప్పున స్లీపర్ బోగీలు పెరగనున్నాయి. సికింద్రాబాద్- భువనేశ్వర్, భువనేశ్వర్-సికింద్రాబాద్ (17016/17015)- విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో సెప్టెంబరు 23, 25 తేదీల నుంచి మూడేసి స్లీపర్ బోగీలు పెరగనున్నాయి.

మద్యం కుంభకోణం నిందితులు నా ఫ్లాట్‌కు వచ్చేవారు

- బేస్ ఎడ్జ్ ప్రాంతంలోని దమాక్ టవర్స్‌లో వారుండేవారు
- అప్పటికి వారు నిందితులు కారు
- సిట్ ఎదుట శ్రవణ్‌రావు వాంగ్మూలం



విజయవాడలోని సిట్ కార్యాలయానికి విచారణకు హాజరైన శ్రవణ్‌రావు

ఈనాడు, అమరావతి: 'మద్యం కుంభకోణం కేసులో నిందితులైన వరుణ్ పురుషోత్తం (ఏ-40), బూనేటి చాణక్య (ఏ-8) సహ మరికొందరు దుబాయ్‌లోని పామ్ హౌస్ టవర్ హోటల్ అండ్ రెసిడెన్సీస్‌లోని నా ఫ్లాట్‌కు తరచూ వచ్చేవారు. ఫిబ్రవరి-మార్చి మధ్య 50 రోజులు నా ఫ్లాట్‌లో ఉన్నారు. అప్పట్లో వారు మద్యం కుంభకోణం కేసులో నిందితులు కారు. వారికి ఈ కేసుతో సంబంధం ఉన్నట్లు నాకు తెలీదు. అందుకే వారితో కలిసి ఉన్నా' అని తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడైన శ్రవణ్‌రావు సిట్ అధికారులకు చెప్పారు. మద్యం కుంభకోణం నిందితులకు దుబాయ్‌లో ఆశ్రయం ఇచ్చారన్న ఆరోపణల నేపథ్యంలో శ్రవణ్‌రావు గురువారం విజయవాడలోని సిట్ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 8వరకూ దాదాపు 7గంటల పాటు అధికారులు ఆయన్ను ప్రశ్నించారు. ప్రధానంగా మద్యం కుంభకోణం నిందితులతో ఎక్కడ, ఎలా పరిచయం ఏర్పడింది? వారితో సంబంధాలేంటనే కోణంలో వివరాలు రాబట్టి ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలివీ.

'ఫోన్‌ట్యాపింగ్ కేసులో ముందస్తు బెయిల్ కోసం సుప్రీంకోర్టులో నేను వేసిన పిటిషన్‌పై విచారణ పెండింగ్‌లో ఉండటంతో.. దుబాయ్‌కు వెళ్లిపోయి అక్కడ నా ఫ్లాట్‌లో ఉన్నా. అదే సమయంలో కొందరు స్నేహితుల ద్వారా వరుణ్ పురుషోత్తం, బూనేటి చాణక్య సహ మరికొందరు పరిచయమయ్యారు. దుబాయ్‌లోని బేస్ ఎడ్జ్ ప్రాంతంలో ఉన్న దమాక్ టవర్స్‌లో ఉంటూ తరచూ నా ఫ్లాట్‌కు వచ్చేవారు. ఈ క్రమంలోనే ఫిబ్రవరి-మార్చి మధ్య 50 రోజుల పాటు నా ఫ్లాట్‌లో ఉన్నారు' అని సిట్ అధికారుల ఎదుట శ్రవణ్‌రావు చెప్పినట్లు తెలిసింది. తనకంటే ముందునుంచే వారు దుబాయ్‌లో ఉన్నారని, తను వచ్చేనాటికి వారు అక్కడే ఉంటున్నారని వివరించినట్లు సమాచారం. ప్రస్తుతం వారి స్థావరం ఎక్కడో తనకు తెలియదని వెల్లడించినట్లు తెలిసింది. మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడైన రాజ్ కెసిరెడ్డితో సంబంధాలపై ప్రశ్నించగా, హైదరాబాద్‌లో ఉన్నప్పుడు కొంత పరిచయం ఉందని శ్రవణ్‌రావు చెప్పినట్లు సమాచారం.

మద్యం కుంభకోణం విలువ రూ.లక్ష కోట్లు

- జగన్‌ను అరెస్టు చేస్తారో, లేదో చూడాలి: ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల



ఈనాడు, అమరావతి, గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: జగన్ హయాంలోని మద్యం కుంభకోణంపై సిట్‌విచారణ డిస్టిలరీల చుట్టే తిరుగుతోందని.. వాస్తవంగా మద్యం తయారీ నుంచి విక్రయాల వరకు అన్ని దశల్లోనూ అవకతవకలు చోటుచేసుకున్నాయని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల పేర్కొన్నారు. వాటన్నింటిపై సమగ్ర దర్యాప్తు చేయాలని కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గన్నవరం విమానాశ్రయంలో గురువారం ఆమె మాట్లాడారు. "ఈ కుంభకోణం రూ.3,500 కోట్లకే పరిమితం కాదు.. రూ.లక్ష కోట్ల మేర అవినీతి జరిగింది. నాసిరకం మద్యం కారణంగా రాష్ట్రంలో 30 లక్షల మందికి కిడ్నీ, లివర్ సమస్యలు వచ్చాయని, 30 వేల మంది వరకు మరణించారని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. దీనిపై కూడా విచారణ చేయాలి. మద్యం కుంభకోణంలో జగన్‌ను అరెస్టు చేస్తారో, లేదో చూడాలి' అని వ్యాఖ్యానించారు. "గత వైకాపా ప్రభుత్వంలో నగదు పద్ధతిలో నాన్ డ్యూటీ పెయిడ్ మద్యాన్ని భారీగా అమ్మి రూ.వేల కోట్లు దోచేశారు. ఇదో పెద్ద ఆర్థికనేరం. మద్యం దుకాణాల్లో నగదు చెల్లింపు పద్ధతిని మాత్రమే అమలు చేశారు. ఈ యుగంలో కూడా ఓన్లీ క్యాష్ అనడం ఎక్కడా లేదు. నమ్మకమైన కంపెనీలవి కాకుండా నాసిరకం మద్యం విక్రయించారు. అలాంటి కంపెనీలకే అనుమతులిచ్చి, ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడారు. వీటన్నింటిపై సమగ్రంగా విచారించాలి" అని డిమాండ్ చేశారు.

జగన్ సమాధానం చెప్పాలి

"మద్యం కుంభకోణంపై జగన్ సూటిగా సమాధానం చెప్పాలి. జవాబు చెప్పాల్సిన పాయింట్‌ను పక్కన పెట్టి, ఇతర అంశాలు మాట్లాడటం ఆయనకు అలవాటు. విశాఖలో రుషికొండను ఎందుకు విధ్వంసం చేశారో ఇంతవరకు చెప్పలేదు. వివేకా హత్య విషయంలో 'సాక్షి' గుండెపోటు అని చెబితే.. దానికీ ఆయన్నుంచి సమాధానం లేదు. జలయజ్ఞం ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదంటే జవాబు లేదు. గంగవరం పోర్టును అదానీకి ఎందుకు అప్పజెప్పారంటే స్పందన లేదు. పోలవరం ఎత్తు తగ్గించిన పాపం జగన్‌ది అంటే.. దానికీ అదే వైఖరి" అని షర్మిల మండిపడ్డారు. కాంగ్రెస్ చంద్రబాబుకి బీ టీమ్ అవ్వాల్సిన అవసరం లేదని, జగనే భాజపాకు బీ టీమ్ అని పేర్కొన్నారు.

కేపీఎంజీ ప్రతినిధులకు సిట్ నోటీసులు

మద్యం కేసులో విచారణకు హాజరుకావాలని ఆదేశం

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థ కేపీఎంజీ ప్రతినిధులకు సిట్ అధికారులు గురువారం నోటీసులిచ్చారు. వైకాపా ప్రభుత్వ హయాంలో మద్యం ఇండెంట్, ఎకౌంటింగ్, ఆడిటింగ్‌పై సలహాలు, సూచనల కోసం ఏపీఎస్‌బీసీఎల్ కేపీఎంజీని కన్సల్టెన్సీగా నియమించుకుంది. వైకాపా మద్యం ముఠా ఆదేశాల మేరకు.. ముడుపులు చెల్లించిన సరఫరా కంపెనీలు, డిస్టిలరీలకే అత్యధికంగా మద్యం సరఫరా ఆర్డర్లు ఇచ్చేందుకు వీలుగా నిబంధనలు మార్చేసిన ఏపీఎస్‌బీసీఎల్.. అంతా చట్టప్రకారమే చేశామనే భావన కల్పించేందుకు కేపీఎంజీ నివేదికను అడ్డుపెట్టుకుంది. ఆ సంస్థ 2019 చివర్లో పలు సిఫార్సులు చేయగా.. వాటిల్లో దోపిడీకి అనుకూలంగా ఉన్న.. మద్యం డిస్టిలరీలు, సరఫరాదారులకు పీడీ ఖాతా నుంచి గ్రీన్ ఛానల్‌లో చెల్లించాలన్న సిఫార్సును మాత్రమే ఏపీఎస్‌బీసీఎల్ అమలు చేసింది. మద్యం కుంభకోణానికి బీజం ఇక్కడే పడింది. 2019 నవంబరు 4న కేపీఎంజీ సంస్థ ప్రతినిధి సందీప్ పైడి ఏపీఎస్‌బీసీఎల్‌కు నివేదిక అందజేయగా.. 2019 డిసెంబరు 6న మరో నివేదిక ఇచ్చినట్లు ఏపీఎస్‌బీసీఎల్ అధికారులు పత్రాన్ని తెరపైకి తెచ్చారు. అందులోని సిఫార్సులు అంతకు ముందు ఇచ్చిన నివేదికలోని వాటికి భిన్నంగా ఉన్నట్లు సిట్ దర్యాప్తులో తేలింది. ఆ రెండో నివేదిక అనుమానాస్పదంగా ఉందని సిట్ వెల్లడించింది. మరోవైపు కేపీఎంజీ నివేదికలోని సిఫార్సులను పరిశీలించి సూచనలు చేసేందుకు నలుగురు అధికారులతో బెవరేజెస్ కార్పొరేషన్ కమిటీని నియమించింది. ఆ కమిటీ అనుమానాస్పదంగా ఉన్న రెండో నివేదికనే పరిగణనలోకి తీసుకుంది. ఈ నేపథ్యంలో అప్పట్లో అసలు ఏం జరిగింది అనేది తేల్చేందుకు సిట్ అధికారులు.. కేపీఎంజీ ప్రతినిధి సందీప్ పైడితో పాటు మరికొందరికి నోటీసులిచ్చినట్లు సమాచారం.

51 మంది మావోయిస్టుల లొంగుబాటు

చర్ల, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపుర్, నారాయణ్‌పుర్, సుక్మా, కాంకేర్ జిల్లాల్లో గురువారం 51 మంది మావోయిస్టులు లొంగిపోయారు. బీజాపుర్ జిల్లాలో ఐజీ సుందర్‌రాజ్ సమక్షంలో 25 మంది లొంగిపోయారు. గతేడాది జనవరి నుంచి బస్తర్ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్లలో 312 మంది మృతి చెందారని, 673 మంది లొంగిపోయారని, 1,103 మందిని అరెస్టు చేసినట్లు ఐజీ వెల్లడించారు. కాంకేర్ జిల్లాలో 13 మంది, నారాయణ్‌పూర్ 8 మంది, సుక్మా జిల్లాలో ఐదుగురు మావోయిస్టులు లొంగిపోయారు. 51 మంది మావోయిస్టులపై కలిపి రూ.2.16 కోట్ల రివార్డు ఉంది. తక్షణ ప్రోత్సాహకం కింద లొంగిపోయిన ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున చెక్కులు అందజేశారు. లొంగిపోయిన వారిలో ఎస్‌జడ్‌సీఎం (స్పెషల్ జోనల్‌కమిటీ మెంబర్) జగదీశ్, మిలటరీ కంపెనీ కమాండర్ మంగ్లూ, ప్లాటూన్ నంబర్ 16 కమాండర్ కమలేశ్ తదితరులు ఉన్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.

రిమాండ్ ఖైదీకి... సహాయకుడి ఏర్పాటు నిబంధనల్లో లేదు

మిథున్‌రెడ్డికి కల్పించిన సౌకర్యంపై జైలు పర్యవేక్షణాధికారి రివ్యూ పిటిషన్

ఈనాడు, రాజమహేంద్రవరం: మద్యం కుంభకోణంలో అరెస్టై రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న వైకాపా ఎంపీ పి.మిథున్‌రెడ్డికి సహాయకుడిని ఏర్పాటుచేయాలంటూ ఏసీబీ న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలపై పర్యవేక్షణాధికారి రాహుల్.. రివ్యూ పిటిషన్ వేశారు. జైలు నిబంధనల్లో సహాయకుడి ఏర్పాటు అంశంలేదని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. ఎవరైనా ఖైదీ తన పనుల్ని తాను చేసుకోలేని పరిస్థితి ఏర్పడటం.. తీవ్ర అనారోగ్యానికి గురవడం వంటి సందర్భాల్లోనే జైలులోని ఆరోగ్య సిబ్బంది(ఎంఎన్‌వో/ఎఫ్ఎన్‌వో)ని సహాయకులుగా ఏర్పాటు చేస్తామని ఓ ఉన్నతాధికారి తెలిపారు.

బెయిల్ కోసం మిథున్‌రెడ్డి పిటిషన్

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో బెయిల్ మంజూరు చేయాలని విజయవాడ ఏసీబీ కోర్టులో ఎంపీ మిథున్‌రెడ్డి గురువారం పిటిషన్ దాఖలు చేశారు. నోటీసులు, కౌంటర్ దాఖలు నిమిత్తం ఈనెల 29కి న్యాయాధికారి విచారణను వాయిదా వేశారు.

★ ఏ31 ధనుంజయరెడ్డి, ఏ32 కృష్ణమోహన్‌రెడ్డి, ఏ33 గోవిందప్ప బాలాజీ.. బెయిల్ పిటిషన్లపై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ ఏసీబీ కోర్టు న్యాయాధికారి 29కి వాయిదా వేశారు.

రాజ్ కెసిరెడ్డి వంట పిటిషన్‌పై 30న తీర్పు

విజయవాడ కారాగారంలో వంట చేసుకునేందుకు అనుమతించాలంటూ ఏ1 రాజ్ కెసిరెడ్డి ఏసీబీ కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై జైలు అధికారులు కౌంటర్ దాఖలు చేశారు. జైలు నిబంధనల ప్రకారం ఖైదీలు వంట చేసుకునే వెసులుబాటు లేదని, భద్రతా కారణాల దృష్ట్యా ఇది కుదరదని పేర్కొన్నారు. ఇటువంటి పిటిషన్లను అనుమతించొద్దని ప్రాసిక్యూషన్స్ జేడీ రాజేంద్రప్రసాద్ వాదించారు. వాదనలు ముగిశాయి. ఈ నెల 30న న్యాయాధికారి భాస్కరరావు తీర్పును వెలువరించనున్నారు.

రిలయన్స్ సీబీజీ ప్లాంట్ల పనులను వేగవంతం చేయాలి: మంత్రి గొట్టిపాటి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో రిలయన్స్ సంస్థ ప్రతిపాదించిన కంప్రెస్డ్ బయో గ్యాస్ (సీబీజీ) ప్లాంట్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆ సంస్థ ప్రతినిధులను కోరారు. ప్లాంట్ల ఏర్పాటు, భూముల కేటాయింపు అంశాలపై మంత్రి సచివాలయంలో గురువారం సమీక్షించారు. 'ప్రకాశం జిల్లాలోని వాయుమడుగు, పీసీ పల్లి ప్రాంతాల్లో సీబీజీ ప్లాంట్ల నిర్మాణాన్ని ఆ సంస్థ ప్రారంభించింది. ఇకపై ప్రతి 15 రోజులకోసారి వాటి పురోగతిపై సమీక్షిస్తాం. జిల్లాలో మరిన్ని ప్లాంట్ల ఏర్పాటు ద్వారా సీబీజీ హబ్‌గా మారుస్తాం. నెల్లూరు, కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోనూ ఈ తరహా ప్లాంట్లు రానున్నాయి. తర్వాత దశలో నంద్యాల, అనంతపురం జిల్లాల్లో ఏర్పాటు చేస్తాం. నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం నుంచి సహకారం అందిస్తాం' అని మంత్రి పేర్కొన్నారు.

నైట్రోజన్ గ్యాస్ పైపులైను నిర్మాణంపై 'నోవా ఎయిర్'తో శ్రీసిటీ ఒప్పందం

శ్రీసిటీ(వరదయ్యపాళెం), న్యూస్‌టుడే: నైట్రోజన్ గ్యాస్ పైపులైన్ నిర్మాణానికి నోవా ఎయిర్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో శ్రీసిటీ గురువారం ఒప్పందం చేసుకుంది. తద్వారా శ్రీసిటీ పారిశ్రామికవాడలోని తయారీ రంగ పరిశ్రమలకు స్థిరమైన, నాణ్యమైన నైట్రోజన్ గ్యాస్ సరఫరా అవుతుంది. ఒప్పందం మేరకు నోవా ఎయిర్ సంస్థ పారిశ్రామికవాడ అంతటా దశలవారీగా పైపులైను నిర్మాణం చేపట్టనుంది. ఈ ఒప్పందం శ్రీసిటీని ప్రపంచ స్థాయి పారిశ్రామిక మౌలిక సదుపాయాలకు నమూనాగా మార్చే తమ ప్రయాణంలో మరో ముందడుగుగా ఆ సంస్థ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి తెలిపారు. నోవా ఎండీ, సీఈవో గజానన్ నబార్ మాట్లాడుతూ.. యుటిలిటీ పైపులైను సదుపాయం అభివృద్ధి చెందిన దేశాల్లోని పారిశ్రామిక పార్కుల్లో సాధారణం కాగా, భారతదేశంలో ఈ తరహా ఒప్పందం ఇదే మొదటిసారని పేర్కొన్నారు.

ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం

- నేడు మరింత బలపడుతుందని అంచనా
- ఉత్తరాంధ్రకు భారీ నుంచి అతిభారీ వర్ష సూచన



విశాఖ తీరంలో అలల హోరు

ఈనాడు, విశాఖపట్నం: ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినట్లు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) పేర్కొంది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఇది శుక్రవారం నాటికి మరింత బలపడుతుందని, క్రమంగా పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ పశ్చిమ బెంగాల్, ఉత్తర ఒడిశా తీరాల వైపు కదిలే అవకాశముందని ఐఎండీ తెలిపింది. మరోవైపు అల్పపీడన ప్రాంతం వరకు రుతుపవన ద్రోణి కొనసాగుతోంది. వీటి ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. శుక్రవారం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, విశాఖపట్నం, కాకినాడ, తూర్పు గోదావరి, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్ జిల్లాల్లో భారీ వర్షాలకు అవకాశముందని వివరించింది. సోమవారం వరకు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

★ శనివారం ఉత్తరాంధ్రలో అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు, మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి వానలు పడతాయని అంచనా వేస్తోంది.

★ అల్పపీడనం ప్రభావంతో పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం, విజయనగరం, కాకినాడ, పల్నాడు, కాకినాడ, కృష్ణా తదితర జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి.

శ్రీశైలం జలాశయం నుంచి 2 గేట్ల ద్వారా నీటి విడుదల

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి వరద కొనసాగుతుండడంతో శ్రీశైలం జలాశయం 2 గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. స్పిల్ వే ద్వారా 54,406 క్యూసెక్కులు, జలవిద్యుత్తు కేంద్రాల నుంచి 66,648 క్యూసెక్కుల ప్రవాహాన్ని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. జూరాల, సుంకేసుల నుంచి 1,01,785 క్యూసెక్కుల వరద శ్రీశైలం వైపు వస్తోంది. శ్రీశైలం జలాశయం నీటి మట్టం గురువారం సాయంత్రం 6 గంటల సమయానికి 883.10 అడుగులు, నీటినిల్వ 205.2258 టీఎంసీలుగా నమోదైంది.

గ్రహం అనుగ్రహం

25-7-2025 శుక్రవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; వర్ష రుతువు, శ్రావణ మాసం, శుక్లపక్షం
పాడ్యమి: రా. 12-02 తదుపరి విదియ
పుష్యమి: సా. 5-27 తదుపరి ఆశ్లేష
వర్జ్యం: లేదు
అమృత ఘడియలు: ఉ.11-19 నుంచి 12-43 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-14 నుంచి 9-05 వరకు
తిరిగి మ. 12-31 నుంచి 1-23 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ.5.40; సూర్యాస్తమయం: సా.6.32

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
కడప	35.0	25.0
నెల్లూరు	33.2	25.2
విజయనగరం	32.0	26.0
తిరుపతి	31.7	24.3
తాడేపల్లిగూడెం	31.4	25.7
విశాఖపట్నం	31.2	27.4
అనంతపురం	31.2	23.4
ఒంగోలు	30.6	25.5
శ్రీకాకుళం	30.0	26.0
నరసాపురం	29.6	26.5
విజయవాడ	28.8	25.0
కర్నూలు	28.5	23.4
గుంటూరు	28.0	26.0
రాజమహేంద్రవరం	28.0	26.0
హైదరాబాద్	25.4	20.9

అనిల్ అంబానీ గ్రూప్ కంపెనీల్లో ఈడీ సోదాలు

- రూ.3,000 కోట్ల బ్యాంకు రుణ 'మోసం' కేసులో

ముంబయి: రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీకి చెందిన కంపెనీలు రూ.3,000 కోట్ల విలువైన బ్యాంకు రుణ మోసానికి పాల్పడ్డాయనే ఆరోపణలపై నమోదైన మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పలుచోట్ల సోదాలు నిర్వహించింది. ఈ కంపెనీలు తీసుకున్న మరిన్ని బ్యాంకు రుణాలనూ ఈడీ పరిశీలిస్తోంది. బయటకు వెల్లడించని కొన్ని విదేశీ ఆస్తులూ సంస్థ ఆధీనంలో ఉన్నాయన్న ఆరోపణలున్నాయి. 50 కంపెనీలు, 25 మంది వ్యక్తులకు చెందిన ముంబయిలోని 35 ప్రాంగణాల్లో సోదాలు జరిగాయి. 2017-19 మధ్య అనిల్ అంబానీ గ్రూప్ కంపెనీలకు యెస్ బ్యాంక్ ఇచ్చిన రూ.3,000 కోట్ల రుణాలు చట్టవ్యతిరేక పద్ధతుల్లో దారిమళ్లాయన్న ఆరోపణలపై ఈడీ దిల్లీకి చెందిన దర్యాప్తు యూనిట్ దర్యాప్తు చేపట్టినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. తాజా సోదాల వల్ల తమ వ్యాపార కార్యకలాపాలు, ఆర్థిక పనితీరు, వాటాదార్లు, ఉద్యోగులు, ఇతర వర్గాలపై ఎటువంటి ప్రభావం లేదని గ్రూప్ కంపెనీలైన రిలయన్స్ పవర్, రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్.. స్టాక్ ఎక్స్ఛేంజీలకు వేర్వేరుగా సమాచారం అందించాయి. రిలయన్స్ కమ్యూనికేషన్స్, రిలయన్స్ హోమ్ ఫైనాన్స్‌కు చెందిన లావాదేవీలపై ఆ ఆరోపణలు వచ్చినట్లు ఆ కంపెనీలు తెలిపాయి.

అరవింద్ కంటి ఆస్పత్రుల మాజీ ఛైర్మన్ నంపెరుమాళ్ స్వామి కన్నుమూత



చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: ప్రముఖ వైద్యుడు, అరవింద్ కంటి ఆస్పత్రుల మాజీ ఛైర్మన్ డాక్టర్ నంపెరుమాళ్ స్వామి (85) వయోధిక ఆరోగ్య సమస్యలతో మదురై అన్నానగర్‌లోని ఆయన నివాసంలో గురువారం కన్నుమూశారు. 1976లో మదురైలోని అరవింద్ కంటి ఆస్పత్రిని స్థాపించినవారిలో నంపెరుమాళ్ స్వామి ఒకరు. ఈయన మదురై ప్రభుత్వ రాజాజీ వైద్య కళాశాలలో ప్రొఫెసర్‌గా వైద్య జీవితాన్ని ప్రారంభించారు. అమెరికాలో శిక్షణ పొందిన తర్వాత మదురై రాజాజీ ఆస్పత్రిలో విట్రియస్ సర్జరీ సెంటర్‌ను ప్రారంభించారు. అది దేశంలోనే మొదటిది. అనంతరం 1979లో అరవింద్ కంటి ఆస్పత్రిలోనూ దాన్ని ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ సాయంతో వరల్డ్ డయాబెటిస్ ఫౌండేషన్, టోక్యోలోని టాప్‌కాన్ సంస్థతో కలిసి డయాబెటిక్ రెటినోపతి కోసం ఒక ప్రత్యేక కేంద్రాన్ని స్థాపించారు. దాని ద్వారా డయాబెటిస్ గురించి అవగాహన, ఆరోగ్య విద్య, డయాబెటిక్ రెటినోపతి శిక్షణ, పరిశోధనలు చేపట్టారు. పద్మశ్రీతో పాటు మరి కొన్ని విశిష్ట పురస్కారాలను ఆయన అందుకున్నారు. 2010లో టైమ్స్ మ్యాగజైన్ విడుదల చేసిన ప్రపంచంలో ప్రజాదరణ పొందిన 100 మంది ప్రముఖుల జాబితాలో ఆయన స్థానం పొందారు. మదురై అన్నానగర్‌లోని ఆయన నివాసంలో పార్థివదేహాన్ని ఉంచారు. శుక్రవారం సొంతూరైన తేని జిల్లా అంబసముద్రంలో అంత్యక్రియలు జరగనున్నాయి.

26 నుంచి సీఎం సింగపూర్ పర్యటన

- పెట్టుబడుల సాధనే లక్ష్యంగా వివిధ సంస్థలతో భేటీలు
- ప్రవాసాంధ్రులతో సమావేశం

ఈనాడు, అమరావతి: 'బ్రాండ్ ఏపీ' ప్రమోషన్‌లో భాగంగా రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు ఆరు రోజుల పాటు సింగపూర్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పలు దిగ్గజ సంస్థల ప్రతినిధులు, యాజమాన్యాలు, పారిశ్రామికవేత్తలతో ఆయన భేటీ అవుతారు. పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రంలో ఉన్న వనరులు, ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, నూతన పారిశ్రామిక పాలసీలు, భూముల లభ్యత, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలు, నిపుణులైన మానవవనరుల లభ్యత గురించి వారికి వివరించనున్నారు. ఆయా సంస్థల ప్రతినిధులను రాష్ట్రానికి ఆహ్వానిస్తారు. తొలి రోజు సింగపూర్ సహా సమీప దేశాల్లోని ప్రవాసాంధ్రులతో నిర్వహించే తెలుగు డయాస్పోరా సమావేశంలో సీఎం పాల్గొంటారు. పేదరిక నిర్మూలన కోసం తెచ్చిన పీ4లో భాగస్వాములవ్వాల్సిందిగా పారిశ్రామికవేత్తలతో పాటు ప్రవాసాంధ్రుల్ని కోరనున్నారు.

■ విశాఖపట్నంలో ఈ నవంబరులో నిర్వహించనున్న పెట్టుబడుల సదస్సుకు విదేశీ పారిశ్రామికవేత్తల్ని చంద్రబాబు ఆహ్వానించనున్నారు. ఈ మేరకు వివిధ దేశాల ప్రముఖులతో ఆయన భేటీ అవుతారు. "పోర్టు ఆధారిత ప్రాజెక్టులు, సెమి కండక్టర్లు, ఏఐ, డేటా సెంటర్ల ఏర్పాటుపైనా చంద్రబాబు వారితో చర్చిస్తారు. డిజిటల్ ఎకానమీ, ఫిన్‌టెక్‌పై నిర్వహించే బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశాల్లో పాల్గొంటారు. సింగపూర్‌లో నిర్వహించే బిజినెస్ రోడ్‌షోకు హాజరవుతారు. సింగపూర్‌లోని వివిధ మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్ కేంద్రాల్ని సందర్శిస్తారు' ' అని సీఎం కార్యాలయం తెలిపింది.

క్వాంటమ్ వ్యాలీలో క్యూపీఐఏఐ భాగస్వామ్యం

- సీఎం చంద్రబాబును కలిసిన సంస్థ ప్రతినిధులు



అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుపై క్యూపీఐఏఐ వ్యవస్థాపకుడు నాగేంద్ర నాగరాజన్, ఇతర ప్రతినిధులతో చర్చిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: అమరావతి క్వాంటమ్ వ్యాలీలో క్యూపీఐఏఐ సంస్థ భాగస్వామ్యం కానుంది. 8 క్యూబిట్ సామర్థ్యం ఉన్న క్వాంటమ్ కంప్యూటర్‌ను సంస్థ ఏర్పాటు చేయనుంది. దీనికి సంబంధించి సంస్థ వ్యవస్థాపకుడు నాగేంద్ర నాగరాజన్‌తో పాటు ఇతర ప్రతినిధులతో సచివాలయంలో గురువారం సీఎం చంద్రబాబు చర్చించారు. ప్రజలకు అవసరమైన ఆవిష్కరణలు, విద్యార్థుల పరిశోధనలకు ఉపయోగపడే కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాన్ని అమరావతిలో ఏర్పాటు చేయాలి. దీనివల్ల విద్యార్థులు, పరిశోధకులు, స్టార్టప్‌లు క్వాంటమ్ అల్గారిథం, అప్లికేషన్‌లను రూపొందించేందుకు అవకాశం ఉంటుంది' అని అన్నారు.

వివిధ రంగాల్లో క్వాంటమ్ సేవలు

పంటల సాగులో కచ్చితత్వం, తెగుళ్ల అంచనాలకు క్వాంటమ్ కంప్యూటింగ్ ఉపయోగపడాలని సీఎం ఆకాంక్షించారు. 'వ్యవసాయ ఉత్పత్తులు పెరిగేలా సలహాలు, సూచనలు ఇవ్వడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచేందుకు సాంకేతికత ఉపయోగపడాలి. రాష్ట్రంలోని నీటి వనరుల సమర్థ నిర్వహణ.. వ్యాధుల నిర్ధారణ.. మెడికల్ లాజిస్టిక్స్ వంటి అంశాల్లో క్వాంటమ్ సిమ్యులేషన్‌ను సమర్థంగా వినియోగించవచ్చు. ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచడంలో క్వాంటమ్ సాంకేతికతను వినియోగించే అంశంపై కార్యాచరణను రూపొందిస్తున్నాం. విద్య, పరిశోధన, నవకల్పనల్లో డీప్ టెక్ ద్వారా సమాజానికి విస్తృత ప్రయోజనాలు కల్పించడమే లక్ష్యం. దీనిని సాధించేందుకు క్యూపీఐఏఐ, నేషనల్ క్వాంటమ్ మిషన్, అమరావతి క్వాంటమ్ వ్యాలీ కలిసి పనిచేస్తాయి' అని సీఎం వివరించారు.



పండుతో లాభాలు మెండు

- అలసట తొలగి నూతనోత్తేజం కోసం- అరటిపండు
- రోగనిరోధక శక్తి పెరగడానికి- నారింజ
- గుండె ఆరోగ్యం కోసం- అవకాడో
- జ్ఞాపకశక్తి మెరుగుదలకు- బ్లూబెర్రీ
- ప్రశాంత నిద్రకు- కివీ

– క్రిస్టెన్ జకోబిట్జ్, న్యూట్రిషన్ కోచ్

ఆగస్టు 15 నాటికి 15 లక్షల బంగారు కుటుంబాల దత్తత

పూర్తి చేయాలని కలెక్టర్లకు సీఎస్ విజయానంద్ ఆదేశం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పీ4 కార్యక్రమం కింద ఆగస్టు 15 నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ కలెక్టర్లను ఆదేశించారు. ఇప్పటి వరకు 6.57 లక్షల బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకున్నారని తెలిపారు. సచివాలయం నుంచి కలెక్టర్లతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పీ4పై ఆగస్టు 5లోగా సర్వే పూర్తి చేయాలని నిర్దేశించారు. చిత్తూరు, అనంతపురం, వైఎస్సార్ కడప, శ్రీసత్యసాయి, తిరుపతి జిల్లాల్లో గ్యాస్ సరఫరా నెట్‌వర్క్‌పై దృష్టి పెట్టాలని కలెక్టర్లకు సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో జీవోలు, మెమోలు, సర్క్యులర్లు, నోటిఫికేషన్లు, లేఖలు, చట్టాలు, నిబంధనలు, పాలసీలు సహా అన్ని డాక్యుమెంట్లనూ అప్‌లోడ్ ఏజెంట్ స్పేస్‌లో భద్రపర్చాలని ఐటీ శాఖ కార్యదర్శి భాస్కర్ కోరారు. ఆర్టీజీఎస్ లెన్స్ ప్లాట్‌ఫాంను వినియోగించుకోవాలని సూచించారు.

రూ. 1,000 కోట్లతో 2,000 కి.మీ. రోడ్ల అభివృద్ధి

ఆర్‌అండ్‌బీ శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశం



సచివాలయంలో ఆర్ అండ్ బీ శాఖపై సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ) ప్రాజెక్ట్, కేంద్ర రహదారి నిధి (సీఆర్ఎఫ్) కింద మంజూరై, పనులు చేపట్టకపోవడంతో గతంలో రద్దుచేసిన.. 2వేల కి.మీ.మేర రహదారులను రూ. 1,000 కోట్లతో అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఇందుకు అంచనాలు రూపొందించి, త్వరగా టెండర్ల ప్రక్రియ చేపట్టాలని కోరారు. ఇప్పటికే రాష్ట్రమంతటా 20 వేల కి.మీ. మేర గుంతలు లేకుండా రహదారుల మరమ్మతులు పూర్తిచేయగా, మిగిలిన రోడ్లను కూడా రూ.500 కోట్లతో గుంతలు రహితంగా మార్చాలని ఆదేశించారు. వర్షాకాలం అయినప్పటికీ.. వీలున్నచోట్ల త్వరగా గుంతలు పూడ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. గురువారం సచివాలయంలో ఆర్‌అండ్‌బీ శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. చంద్రబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఐదేళ్లపాటు రహదారుల నిర్మాణం, మరమ్మతుల విషయంలో తీవ్ర నిర్లక్ష్యం చూపడంతో.. రోడ్లన్నీ అధ్వానంగా మారాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని రోడ్లు మరమ్మతులు చేయాల్సి ఉంది, ఎన్ని పునరుద్ధరించాలి, నిర్వహణకు ఏయే రహదారులను అప్పగించాలి.. తదితర అంశాలతో 15 రోజుల్లో సమగ్ర నివేదిక తయారు చేయాలని ఆదేశించారు.

50 కి.మీ.కు ఓ సీసీ కెమెరా..


రాష్ట్ర రహదారులన్నింటినీ.. జాతీయ రహదారుల స్థాయి ప్రమాణాలతో నిర్మించాలని సీఎం ఆదేశించారు. సంప్రదాయ విధానంలోనే కాకుండా కొత్తకొత్త టెక్నాలజీతో రోడ్ల నిర్మాణంపై దృష్టిపెట్టాలని తెలిపారు. వైట్ టాపింగ్‌తో సిమెంట్ రోడ్లు, సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా నిర్మిస్తున్న ప్లాస్టిక్ రోడ్లు, ఫుల్ డెప్త్ రిక్లమేషన్ టెక్నాలజీ వంటివన్నీ పరిశీలించాలని చెప్పారు. రహదారుల నిర్వహణ పనులను గుత్తేదార్లకు అప్పగించి, వర్షాకాలంలో ఆయా రోడ్లు దెబ్బతింటే వెంటనే మరమ్మతులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏ రహదారి ఏ గుత్తేదారు నిర్మించారు, నిర్వహణ పనులు చూసేది ఎవరన్న వివరాలన్నీ రోడ్లవారీగా ఆన్‌లైన్‌లో ఉంచాలని పేర్కొన్నారు. ప్రతి 50 కి.మీ. ఒక సీసీ కెమెరా చొప్పున ఏర్పాటు చేయాలని, దీనివల్ల ఆయా రోడ్లపై ఎంత ట్రాఫిక్ ఉంటోందనేది తెలుసుకునే వీలుంటుందని పేర్కొన్నారు.

పీపీపీ విధానంలో రోడ్ల విస్తరణపై అధ్యయనం

రాష్ట్రంలో 12,653 కి.మీ. రాష్ట్ర రహదారులు ఉండగా, వీటిలో 10,200 కి.మీ. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం విధానం (పీపీపీ)లో విస్తరించేందుకు అవకాశం ఉందని అధికారులు సీఎంకు వివరించారు. ఇందులో అత్యధిక రద్దీ ఉన్న 18 రోడ్లు (1,332 కి.మీ) ఫేజ్-1ఎ కింద, 40 కి.మీ. కంటే పొడవున్న 67 రహదారులు (3,854 కి.మీ.) ఫేజ్-1బి కింద, మిగిలిన 175 రోడ్లు (5,039 కి.మీ) ఫేజ్-2 కింద విస్తరించేలా ప్రతిపాదనలు రూపొందించినట్లు వివరించారు. యలమంచిలి-గాజువాక, గాజులమండ్యం-శ్రీసిటీ రోడ్లను కూడా పీపీపీ విధానంలోనే విస్తరించనున్నట్లు అధికారులు తెలిపారు. వీటిపై మరింత అధ్యయనం చేసి తుది నివేదిక రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు.

నెల్లూరులో మేత.. ఆఫ్రికాకు మోత!

- క్వార్ట్జ్ ఎక్స్‌పోర్టర్ల నుంచి డబ్బు వసూళ్లలో.. మాజీ మంత్రి అనిల్ పీఏ నాగరాజు కీలకం
- నగదు రూపంలో తీసుకుని.. 'ముఖ్య'నేతకు చేరవేసింది అతడే
- ఆఫ్రికాలో మైనింగ్ వ్యవహారాలు చూసిన మరో పీఏ రాజీవ్‌రెడ్డి
- అక్రమార్కులంతా దుబాయ్‌కి పరార్



ఈ చిత్రంలోని.. పేపరుపై రూ. 28.77 లక్షలు స్వీకరించినట్లు సంతకం చేసినది మాజీ మంత్రి అనిల్ కుమార్‌యాదవ్ పీఏ నాగరాజు. పొదలకూరు మండలం తాటిపర్తి సమీపంలోని గడువు ముగిసిన రుస్తుం మైన్ నుంచి 2023 డిసెంబరు 10-15 తేదీల మధ్య 14 లారీల్లో 411.31 టన్నుల క్వార్ట్జ్‌ను సన్ ఎక్స్‌పోర్ట్ పేరుతో తరలించారు. దీనికి అనిల్‌కుమార్ యాదవ్ ముఠా టన్నుకు రూ.7 వేల చొప్పున వసూలు చేసింది. ఈ మేరకు అనిల్ పీఏ ఇలా సంతకం చేసి ఇచ్చారు.

ఈనాడు, నెల్లూరు: వైకాపా ప్రభుత్వ హయాంలో నెల్లూరు జిల్లాలో జరిగిన క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలు, ఎగుమతిదారుల నుంచి వసూళ్ల వ్యవహారంలో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. మాజీ మంత్రి, వైకాపా నేత అనిల్‌కుమార్ యాదవ్ ముఠా వసూళ్ల ద్వారా వచ్చిన డబ్బును కొన్నిచోట్ల రియల్ ఎస్టేట్‌లో, మరికొంత ఆఫ్రికాలో మైనింగ్‌లో పెట్టుబడిగా పెట్టినట్లు వెలుగులోకి వచ్చింది. చైనాలో క్వార్ట్జ్‌కు మంచి ధర పలికినంత కాలం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఇష్టానుసారం తవ్వకాలు సాగేలా ఈ ముఠా చూసింది. ఖనిజాన్ని తరలించేటప్పుడు టన్నుకు రూ.7 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేసింది. అలా వచ్చిన సొమ్ములో నెలకు రూ.20 కోట్ల చొప్పున 'ముఖ్యనేత'కు చేరవేసి. . మిగిలిన సొమ్మును అనిల్‌కుమార్ వేర్వేరు చోట్ల పెట్టుబడులు పెట్టారు. గూడూరు, నాయుడుపేటల వద్ద రియల్ ఎస్టేట్ వెంచర్లు వేశారు. హైదరాబాద్‌లోని మణికొండ, తుర్కయాంజాల్‌లో విల్లాల నిర్మాణాలకు వెచ్చించారు. మరికొంత సొమ్మును ఆఫ్రికాలోని ఐవరీకోస్ట్ దేశంలో గ్రాఫైట్ మైనింగ్‌లో పెట్టుబడులు పెట్టినట్లు తేలింది. అనిల్‌కుమార్ వద్ద నాగరాజు, రాజీవ్‌రెడ్డి అనే ఇద్దరు పీఏలు ఉన్నారు. వారిలో రాజీవ్‌రెడ్డి.. ఆఫ్రికాలోని వ్యాపార లావాదేవీలు చూసుకుంటున్నట్లు తెలుస్తోంది.

వసూళ్లలో పీఏ నాగరాజుది పాత్ర

క్వార్ట్జ్ ఎగుమతిదారుల నుంచి డబ్బులు వసూలు చేయించడం, అందులో 'ముఖ్యనేత'కు వాటా పంపడం, మిగిలింది అనిల్‌కుమార్ యాదవ్ చెప్పినట్లు వెచ్చించడం వంటివన్నీ ఆయన పీఏ నాగరాజు చూసేవారు. సైదాపురం, రాపూరు, గూడూరు, పొదలకూరు మండలాల నుంచి క్వార్ట్జ్ లోడుతో వెళ్తున్న లారీల్లో.. ఎంత ఖనిజం ఉందో పరిశీలించి, ఎగుమతిదారులు ఎంత చెల్లించాలనేది అనిల్‌కుమార్ ముఖ్య అనుచరుడు బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి నిర్ణయించేవారు. అలా ఆ ముఠాలోని దువ్వూరు శ్రీకాంత్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి, సాకేత్‌రెడ్డిలు వసూళ్లు చేసి తమ నేత వద్దకు చేర్చేవారు. ఆ సొమ్ములో ఎవరికి ఎంత చేరవేయాలనేది పీఏ నాగరాజు చూసుకునేవాడని తెలిసింది.

పరారీలో కీలక వ్యక్తులు

వసూళ్ల దందాలో కీలకంగా వ్యవహరించిన అనిల్‌కుమార్ యాదవ్ అనుచరులు ఇప్పటికే పరారీలో ఉన్నారు. పోలీసు ఉచ్చు బిగుస్తోందని తెలిసిన వెంటనే కోడూరు దిలీప్‌రెడ్డి (అనిల్‌కుమార్ యాదవ్ స్నేహితుడు), సాకేత్‌రెడ్డి, దువ్వూరు శ్రీకాంత్‌రెడ్డి (జిమ్ శ్రీకాంత్), సాముద్దీన్‌లు పరారయ్యారు. వీరిలో దిలీప్‌రెడ్డి, సాకేత్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిలు రెండు రోజుల కిందటే దుబాయ్ వెళ్లినట్లు సమాచారం. అక్కడి నుంచి ఆఫ్రికాకు వెళ్లనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

వీడియోలు చూస్తే డబ్బులే డబ్బులంటూ ఎర!

- లక్షల మంది బాధితులు.. రూ.కోట్లలో మోసం



యాప్ పనిచేయడం లేదని చూపుతున్న బాధితులు

మదనపల్లె నేరవార్తలు, పెద్దమండ్యం, న్యూస్‌టుడే: వీడియోలు చూస్తే డబ్బుతో పాటు బహుమతులు ఇస్తామని మోసం చేసిన ఘటన అన్నమయ్య జిల్లా మదనపల్లెలో వెలుగులోకి వచ్చింది. దీనిపై 300 మంది బాధితులు గురువారం మదనపల్లె ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ దందాలో మదనపల్లెకు చెందిన మోహన్‌బాబు ఏపీ, కర్ణాటకలకు ఇన్‌ఛార్జిగా వ్యవహరించారని బాధితులు పేర్కొన్నారు. ముందుగా కొంత డబ్బు కట్టి 'ఆరా' అనే యాప్ డౌన్‌లోడ్ చేసుకొని, అందులో వీడియోలు చూస్తే డబ్బులు, కానుకలు వస్తాయని నిందితుడు ప్రజలను నమ్మించాడు. రూ.2 వేలు మొదలు ఆపై ఎంతైనా చెల్లించొచ్చని చెప్పడంతో చాలా మంది డబ్బు కట్టారు. మొదట్లో డబ్బు, బహుమతులూ రావడంతో ఎక్కువ మంది ఆకర్షితులయ్యారు. నెల తర్వాత ఆ యాప్ మొరాయించింది. వచ్చిన డబ్బు యాప్ నుంచి తీసుకోవడానికి వీల్లేకుండా పోయింది. దీంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఇలా మోసపోయిన వారు లక్షల మంది ఉంటారని, నిందితులు రూ.కోట్లలో వసూలు చేసిఉంటారని పోలీసులకు తెలిపారు. ఇంత జరిగినా.. ఇప్పటికీ యాప్‌ను యాక్టివేట్ చేసుకునేందుకు రూ.1,800 నుంచి రూ.5 వేల వరకు చెల్లించాలని సంక్షిప్త సందేశాలు వస్తున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ మహేంద్ర తెలిపారు.

నాన్నే నాకు వ్యతిరేకంగా ప్రచారం చేశారు

- 'ఈనాడు' ముఖాముఖిలో అశోక్ గజపతిరాజు



ఈనాడు, విజయనగరం: కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు గోవా గవర్నర్‌గా రాజ్‌భవన్‌లోకి త్వరలో అడుగుపెట్టనున్నారు. ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రిగా.. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు ప్రజల్లో ఉన్నారు. శుక్రవారం ఆయన గోవా వెళ్తున్న సందర్భంగా గురువారం 'ఈనాడు'తో ముచ్చటించారు.

ఆ స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి..

"తండ్రి, సోదరుడు రాజకీయాల్లో ఉండడంతో నేను దూరంగా ఉండాలనుకున్నా. ఎమర్జెన్సీలో ప్రజాస్వామ్యాన్ని బతికించాలని ఆలోచించా. లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ స్ఫూర్తితో 1978లో జనతా పార్టీ అభ్యర్థిగా విజయనగరం నుంచి తొలిసారి పోటీచేసి గెలిచాను. అప్పటికి నా తండ్రి పీవీజీ రాజు కాంగ్రెస్‌లో ఉన్నారు. ఆ ఎన్నికల్లో నాకు వ్యతిరేకంగా ప్రచారం చేశారు. నాకంటే ముందు అన్న ఆనంద గజపతిరాజు రాజకీయాల్లోకి వచ్చినా.. మా ఇద్దరిలో చట్టసభల్లో మొదట అడుగుపెట్టింది నేనే. నా కుమార్తె అదితి విజయలక్ష్మి విజయనగరం ఎమ్మెల్యే. నా బినామీ కాదు. ఓ ప్రజాప్రతినిధిగా నిర్ణయాలు తీసుకునే హక్కు ఆమెకుంది. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌ను గవర్నర్ రామ్‌లాల్ తొలగించారు. అప్పుడు రాజ్‌భవన్ వద్ద అరెస్టయిన ఎమ్మెల్యేల్లో నేనూ ఉన్నా. గవర్నర్ అధికారాలు దుర్వినియోగం కారాదని అప్పట్లోనే ఎన్టీఆర్ కేంద్రంపై ఒత్తిడి చేశారు. ఈ నేపథ్యంలో వచ్చిన సర్కారియా కమిషన్ సిఫార్సులను వీపీసింగ్ ప్రభుత్వం ఆమోదించింది. దాని ప్రకారం రాజ్యాంగం, చట్టాలను పక్కాగా అమలు చేయాల్సింది గవర్నర్లే. ఇప్పుడా బాధ్యత నాపై ఉంది.

అధికారం శాశ్వతం కాదు

నేనిప్పుడు రాజకీయాలు మాట్లాడదల్చుకోలేదు. కానీ గత ప్రభుత్వ హయాంలో కొందరు పోలీసు అధికారులు నిబంధనలు అతిక్రమించారు. కేంద్ర బలగాల రక్షణ తొలగిస్తే చంద్రబాబును ఫినిష్ చేస్తామని గతంలో వైకాపా నాయకులు బెదిరించారు. కానీ ప్రజలు ప్రజాస్వామ్యాన్ని కాపాడుతూ ఓ నిజమైన నాయకుడికి సీఎం బాధ్యతలు అప్పగించారు. అధికారం శాశ్వతం కాదని గుర్తుపెట్టుకోవాలి.

టాప్-500 ర్యాంకర్లలో 12 మందే..

- ఇంజినీరింగ్‌లో ప్రవేశాల తీరు

ర్యాంకులు	సీట్లు పొందిన వారు
1-100	1
101-200	1
201-500	10
501-1000	68
1001-5000	2,124
5001-10,000	3,602
10001-20,000	7,361
20001-30,000	7308
30001-40,000	7142
40001-50,000	6,922
50001-1,00,000	32,450
1,00,001-1,50,000	31,971
1,50001-చివరి ర్యాంకు	19,565

ఈనాడు, అమరావతి: ఇంజినీరింగ్‌లో ప్రవేశాలకు నిర్వహించిన ఈఏపీసెట్‌లో మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులు కన్వీనర్ కోటాలో చేరేందుకు ఆసక్తి చూపడం లేదు. ఐఐటీ, నిట్, ఇతర రాష్ట్రాల్లోని ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో చేరేందుకు తరలిపోతున్నారు. ఈఏపీసెట్‌లో 1 నుంచి 200లోపు ర్యాంకులు సాధించిన వారిలో ఇద్దరు మాత్రమే ఇక్కడ కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు. 500లోపు ర్యాంకులు వచ్చిన వారిలో 12మంది విద్యార్థులు ఏపీలో ఇంజినీరింగ్ విద్య చదివేందుకు మొగ్గుచూపారు. మెరికలు, మంచి ర్యాంకులు సాధించిన పిల్లలు ఐఐటీ, నిట్, బిట్స్‌లాంటి ప్రముఖ విద్యా సంస్థల్లో చేరేందుకు వెళ్లిపోతున్నారు. వెయ్యిలోపు ర్యాంకులు సాధించిన వారిలో 80 మందే ప్రవేశాలు పొందారు. 10వేల లోపు ర్యాంకులు వచ్చిన వారిలో 5,806(58%)మంది ఈఏపీసెట్ కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు. ఈఏపీసెట్ కన్వీనర్ కోటా సీట్ల కేటాయింపును పరిశీలిస్తే 50వేల నుంచి లక్ష మధ్య ర్యాంకులు వచ్చిన విద్యార్థులే ఎక్కువ మంది ప్రవేశాలు పొందారు.

అంతా సాఫ్ట్‌వేర్‌కు సంబంధించినవే..

సీట్లు పొందిన విద్యార్థుల్లోనూ ఎక్కువ మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు సంబంధించిన బ్రాంచిలనే ఎంచుకున్నారు. కంప్యూటర్ సైన్సు ఇంజినీరింగ్‌లో రాష్ట్రవ్యాప్తంగా 47,519 సీట్లు ఉండగా.. 41,504 మంది సీట్లు పొందారు. మరో 6,015 సీట్లు మిగిలాయి. ప్రాంగణ నియామకాలు సరిగాలేని, తరగతులు సక్రమంగా నిర్వహించని కళాశాలల్లోనే ఈ సీట్లు మిగిలాయి. సీఎస్ఈ ఏఐ, మెషీన్ లెర్నింగ్‌లో 16,665 సీట్లు ఉంటే 13,602 మంది ప్రవేశాలు పొందారు. సీఎస్ఈ డేటా సైన్స్‌లో 8,043 సీట్లు ఉంటే 5,912 భర్తీ అయ్యాయి. ఈసీఈలో 25,250 సీట్లకు 18,846 కేటాయించారు. ఈఈఈలో 8,564 సీట్లు ఉంటే 5,155 భర్తీ అయ్యాయి. మెకానికల్‌లో అత్యల్పంగా 7,743 సీట్లకుగాను 4,653 మంది చేరారు. సివిల్ ఇంజినీరింగ్‌లో 6,507 సీట్లు ఉంటే 3,760 నిండాయి.



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి నారా లోకేశ్

జెమ్స్ అండ్ జ్యువెలరీ పార్క్‌ను మోడల్‌గా నిర్మించాలి

అధికారులతో మంత్రి లోకేశ్

తాడేపల్లి, న్యూస్‌టుడే: దేశంలోనే అత్యుత్తమంగా మంగళగిరిలో జెమ్స్ అండ్ జ్యువెలరీ పార్కును నిర్మించాలని మంత్రి నారా లోకేశ్ సూచించారు. ఉండవల్లి నివాసంలో జెమ్స్ అండ్ జ్యువెలరీ పార్కుపై అధికారులతో ఆయన గురువారం సమీక్ష నిర్వహించారు. టాప్-20 జ్యువెలరీ సంస్థల యూనిట్లు ఇందులో స్థాపించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఏటా నాలుగువేల మందికి ఆభరణాల తయారీలో శిక్షణ ఇచ్చేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. మంగళగిరిలో ఏర్పాటు చేయనున్న జెమ్స్ అండ్ జ్యువెలరీ పార్క్‌తోపాటు కేంద్ర ప్రభుత్వ సహకారంతో కామన్ ఫెసిలిటీ సెంటర్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆభరణాల తయారీ యూనిట్లు, రిటైల్ షాపులు స్థాపించేలా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఉడుపిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జెమ్స్ అండ్ జ్యువెలరీ (ఐఐజీజే) పనితీరును అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. మంగళగిరిలో యువతకు నైపుణ్య శిక్షణ అందించే మోడల్ కెరీర్ సెంటర్ (ఎంసీసీ)ను త్వరితగతిన ఏర్పాటు చేయాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో గణేష్‌కుమార్ స్పందిస్తూ పార్క్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, కామన్ ఫెసిలిటీ సెంటర్, ఇండస్ట్రియల్ జోన్, కమర్షియల్ అండ్ రిటైల్ జోన్, మాన్యుఫ్యాక్చరింగ్ జోన్, రెసిడెన్షియల్ ఎన్‌క్లేవ్ జోన్లు అంతర్భాగాలుగా ఉంటాయని వివరించారు. మంగళగిరిలో ఇప్పటివరకు చేపట్టిన మూడు జాబ్ ఫెయిర్లకు 1170 మంది యువకులు హాజరుకాగా 453 మందికి ఉద్యోగాలు లభించాయని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

బతికించుకునే 'మార్గం' లేక!

సకాలంలో వైద్యం అందక గిరిజనుడి మృతి



వాగుపై రాకపోకలకు వీలుగా వేసిన కర్రలు



బాలరాజు మృతదేహం

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: వర్షానికి రోడ్డు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోవడంతో సకాలంలో వైద్యం అందక ఓ గిరిజనుడు మృతి చెందాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం జర్రెల పంచాయతీ జె.కొత్తూరు గ్రామానికి వెళ్లే మార్గంలో వాగుపై ఉన్న రోడ్డు ఇటీవలి వర్షానికి తెగిపోయింది. దీంతో గ్రామానికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. బుధవారం రాత్రి గ్రామానికి చెందిన లోత బాలరాజుకు గుండెనొప్పి వచ్చింది. కుటుంబసభ్యులు ఆయన్ను ఆసుపత్రికి తీసుకెళ్లాలనుకున్నా.. ద్విచక్ర వాహనమూ వెళ్లలేని పరిస్థితి ఉండటంతో సాధ్యపడలేదు. దీంతో బాధితుడు ఇంటి వద్ద మృతి చెందారు. వంతెన ఉంటే బతికించుకునే వాళ్లమని కుటుంబసభ్యులు తెలిపారు. గురువారం అంత్యక్రియలు నిర్వహించినా.. ఇతర ప్రాంత బంధువులు వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులుపడ్డారు.

ఎస్సీ విద్యార్థులకు కేంద్రం వాటా నిధులు 20 రోజుల్లో జమ

- తల్లిదండ్రులెవరూ ఆందోళన చెందొద్దు
- 'తల్లికి వందనం'పై సాంఘిక సంక్షేమ శాఖ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఎయిడెడ్ పాఠశాలలు/కళాశాలల్లో 9, 10 తరగతులు, ఇంటర్మీడియట్ చదువుతున్న షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు సంబంధించి 'తల్లికి వందనం' పథకంలోని కేంద్రం వాటా మరో 20 రోజుల్లో జమ అవుతుందని సాంఘిక సంక్షేమ శాఖ ప్రకటించింది. తల్లిదండ్రులు ఎవరూ ఆందోళన చెందొద్దని తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా ఆయా తరగతులు చదువుతున్న ఎస్సీ విద్యార్థులు 3.93 లక్షల మంది ఉన్నట్లు వివరించింది. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే వారికి ఆర్థిక వెసులుబాటు కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు రూ.382.66 కోట్లు ఇప్పటికే జమ చేసిందని వివరించింది. 9, 10 తరగతులు చదివే ఎస్సీ డే స్కాలర్ విద్యార్థులకు వారి తల్లి బ్యాంకు ఖాతాకు రూ.10,900, వసతి గృహ విద్యార్థుల తల్లి బ్యాంకు ఖాతాకు రూ.8,800 చొప్పున జమచేసినట్లు పేర్కొంది. ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు రూ.5,200 నుంచి రూ.10,972 వరకు నేరుగా విద్యార్థుల సొంత బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు తెలిపింది. ఇక కేంద్రం వాటా నిధులు తల్లి/విద్యార్థుల ఆధార్ అనుసంధాన బ్యాంకు ఖాతాలకు నేరుగా జమవుతాయని వివరించింది.


ఈనాడు

పట్టణాల తలరాత మారాలి!

పారిశ్రామిక, సేవారంగాల విస్తరణతో ఆర్థిక కార్యకలాపాలు జోరుగా సాగుతున్న పట్టణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. ప్రపంచ బ్యాంక్ తాజా నివేదిక ప్రకారం- 2030 నాటికి ఇండియాలో కొత్తగా అందుబాటులోకి వచ్చే కొలువుల్లో 70శాతానికి నగరాలే నెలవులు కానున్నాయి. ఈ నేపథ్యంలో బంగారు భవిష్యత్తును వెతుక్కుంటూ విద్యాధిక యువత నగర భారతం బాటపడుతుంటే- సాగు రంగంలో సంక్షోభం మూలంగా గ్రామీణ శ్రామికశక్తి సైతం అక్కడికే తరలిపోతోంది. పోటెత్తుతున్న వలసలతో 2050 నాటికి మన పట్టణ జనాభా 95 కోట్లకు చేరనుంది. జనసంఖ్యకు తగినంతగా మౌలిక వసతులను విస్తరించకపోతే నగరాల్లో జనజీవనం దుర్భరమవుతుందని ప్రపంచ బ్యాంకు నివేదిక హెచ్చరిస్తోంది. వాతావరణ మార్పులతో కొన్నేళ్లుగా కుండపోత వానలు పెరిగాయి. వాటిని నిభాయించగలిగేలా నగరాల్లోని మురుగు, వరదనీటి పారుదల వ్యవస్థ మెరుగుపడట్లేదు. పైగా అక్రమ నిర్మాణాలు విచ్చలవిడిగా పుట్టుకొస్తున్నాయి. దాంతో చినుకు రాలితే పట్టణాలు మునుగుతున్నాయి. ప్రణాళికా రహిత పట్టణీకరణ దుష్ఫలితంగా గతంలో వరద ముప్పు ఎరగని ప్రాంతాలపైనా నేడు జలఖడ్గం వేలాడుతోంది. ఆకస్మిక వరదలూ ముంపు పరిస్థితుల కారణంగా 2070 నాటికి నగర భారతం ఏడాదికి రెండున్నర లక్షలకోట్ల రూపాయల మేర నష్టపోవాల్సి వస్తుందన్న హెచ్చరికలు- తక్షణ దిద్దుబాటు చర్యల ఆవశ్యకతను గుర్తుచేస్తున్నాయి.

పట్టణాల్లో భూముల విలువ బంగారాన్ని మించిపోతుండటంతో వర్షపు నీరు ఇంకడానికి ఇసుమంత జాగా కూడా మిగలట్లేదు. భూగర్భ జలాలను ఇష్టారీతిగా తోడేస్తుండటంతో నీటికొరత ముమ్మరిస్తోంది. దీనికితోడు ఉన్న జలవనరులు ఆక్రమణల బారినపడుతున్నాయి. దానివల్ల వానొస్తే వరదనీరు రోజుల తరబడి జనావాసాల్లో నిలిచిపోతోంది. బుడమేరు కబ్జాల పాల బడటం వల్లే నిరుడు విజయవాడలో పలు ప్రాంతాలు వరద విలయాన్ని చవిచూశాయి. మరోవైపు, పట్టణాల్లో నిత్యం ఏడుకోట్ల లీటర్లకు పైగా మురుగు ఉత్పన్నమవుతోంది. అందులో ముప్పావుశాతం శుద్ధికి నోచుకోకుండానే నదులు, చెరువుల్లోకి చేరుతూ జలకాలుష్యానికి కారణమవుతోంది. భూగర్భ జలాలనూ విషతుల్యం చేస్తోంది. ఇంకోపక్క చెత్త సేకరణలో లోపాల వల్ల పట్టణాల్లో వ్యర్థాలు ఎక్కడికక్కడ పేరుకుపోతున్నాయి. 2050 నాటికి ఇండియాలో ఏటా 41.5 కోట్ల టన్నుల మేర ఘనవ్యర్థాలు పోగుపడతాయని అంచనా. వాటి నిర్వహణలో అలక్ష్యం వహిస్తే- కాలుష్యం కట్టుతప్పి వ్యాధులు ఇంకా విజృంభించి జాతి సౌభాగ్యాన్ని కబళిస్తాయి!

కాంక్రీటు నిర్మాణాలు, వాహనాల రద్దీతో మెట్రోసిటీల్లో ఉష్ణోగ్రతలు విపరీతమవుతున్నాయి. భరించలేని ఉష్ణతాపం ఉత్పాదకతను హరించి దేశాభివృద్ధిని కుంగదీస్తుంది. వడగాడ్పుల ప్రమాదాన్ని పెంచి ఆకస్మిక మరణాలకు కారణమవుతుంది. నగరాలు నరకానికి నకళ్లుగా మిగిలిపోకూడదంటే- పచ్చదనం పెంపుతోపాటు పునరుత్పాదక ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహించాలి. ప్రజారవాణా సదుపాయాలను విస్తృతం చేయాలి. అవినీతి మత్తులో జోగుతున్న నగర, పురపాలక సంఘాల నిర్వాకాల మూలంగానే అక్రమ నిర్మాణాలు తామరతంపరగా వెలుస్తున్నాయి. పట్టణాల తలరాత మారాలంటే అన్నింటికన్నా ముందు పురపాలికలను పూర్తిగా ప్రక్షాళించాలి. మురుగునీటి పారుదల వ్యవస్థను చక్కదిద్ది ఎంత వర్షం కురిసినా వరద సాఫీగా వెళ్లిపోయేలా చూడాలి. వర్షపు నీరు భూమిలోకి ఇంకేలా తగిన ఏర్పాట్లు చేయాలి. అన్ని పట్టణాలకు బృహత్ ప్రణాళికలను రూపొందించి అవి పటిష్ఠంగా అమలయ్యేలా ప్రభుత్వాలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి!



కష్టపడి పనిచేసేవాళ్లు ఎప్పుడూ ఉల్లాసంగా ఉంటారు. ఎందుకంటే వారికి సమస్యలూ బాధల గురించి ఊహించుకుని బాధపడే సమయం ఉండదు. నిజమైన కష్టాల కన్నా ఆ ఊహలూ ఆలోచనలే దారుణంగా ఉంటాయి మరి.

- జిమ్ కార్బెట్

ధర్మమేవ జయతే!

ధర్మో రక్షతి రక్షితః! ధర్మాన్ని మనం రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుందంటారు. ఈ సూక్తిలో దైవానుగ్రహమూ, పురుషార్థమూ రెండూ ఇమిడి ఉన్నాయి. ధర్మార్థకామమోక్షాలు చతుర్విధ పురుషార్థాలు. వీటిలో ధర్మం మొదటిదే కాదు ప్రధానమైంది కూడా!

విశేషమేమిటంటే ధర్మ సాధనాల్లో మొదటిది శరీరమే. 'శరీరమాద్యం ఖలు ధర్మసాధనం' అన్నారు కదా. అందువల్ల ధర్మకార్యాలు చేయడానికి వీలుగా శరీరానికి తగినంత పోషణనివ్వాలి. ధ్యానం, వ్యాయామాదులతో ఆరోగ్యంగా ఉండాలి. మనిషి జీవితంలో అర్థం, కామం ధర్మబద్ధంగా ఉన్నప్పుడే మోక్షప్రాప్తి కలుగుతుంది. అధర్మమైన కామ ప్రయత్న ఫలితాలే... రామాయణంలోని రావణవధ, మహాభారతంలోని కీచకవధ. ధర్మం అత్యంత ఆవశ్యకమైంది, ఆదర్శ ప్రాయమైంది కాబట్టే ధర్మ స్వరూపుడైన శ్రీ రామచంద్రుణ్ని ఆరాధిస్తాం. 'రామో విగ్రహవాన్ ధర్మః' అని తొలుత అన్నవాడు మారీచుడు. ఎవరు చెప్పినా అది మంచి మాటే. అందుకే ఇప్పటికీ ప్రపంచమంతా ప్రతిధ్వనిస్తోంది. ధర్మ సంస్థాపన కోసమే ప్రతి యుగంలోనూ పుడతానన్నాడు శ్రీకృష్ణ పరమాత్ముడు.



అంతర్యామి

ధర్మదేవత కృతయుగంలో నాలుగు పాదాలతో, త్రేతాయుగంలో మూడు పాదాలతో, ద్వాపరయుగంలో రెండు పాదాలతో నడిచిందనీ, ఇప్పుడు కలియుగంలో ఒక్క పాదంతోనే నడుస్తోందని పెద్దలు చెబుతుంటారు. ధర్మవర్తనను బట్టే యుగం స్థాయిని నిర్ణయించడం విశేషం. కల్యాణానికైనా, లోక కల్యాణానికైనా ధర్మం తప్పనిసరి. ఎక్కడ ధర్మం ఉంటే అక్కడ విజయం ఉంటుంది. అధర్మం తాత్కాలికంగా విజయం సాధించినా, అంతిమ విజయం మాత్రం ధర్మానిదే. ఇందుకు కురుక్షేత్రం ఒక తార్కాణం. అందుకే కురుక్షేత్రాన్ని ధర్మక్షేత్రమంటారు.

ధర్మాన్ని అనుసరించేవాడు ఫలానా వృత్తినే చేయాలనే నియమనిబంధనలేమీ లేవు. ఇందుకు ధర్మవ్యాధుడు అద్భుతమైన ఉదాహరణ. మిథిలానగరంలో మాంసం అమ్మే వృత్తిలో ఉన్న అతడు తపోధనుడైన కౌశికుడికి ధర్మబోధ చేయడం అందరికీ తెలిసిందే. మనిషి బ్రహ్మచర్యంలో ఉన్నా, గృహస్థాశ్రమ ధర్మంలో కొనసాగుతున్నా, సన్యాసం స్వీకరించినా, వానప్రస్థాశ్రమానికి వెళ్లినా దేని ధర్మం దానిదే. అయితే ధర్మం వేరు, ధర్మసూక్ష్మం వేరు. దాన్ని కూడా తెలుసుకుని పాటించాలి. లేకపోతే అప్పుడప్పుడు తడబడాల్సి వస్తుంది.

మనుషులందరూ ఒకే రకంగా పుడతారు. కానీ పెరిగేకొద్దీ ధర్మాచరణను బట్టి మంచి చెడ్డలు నిర్ణయమై వారికి గుర్తింపు లభిస్తుంది. 'ధర్మమే నృపులకు తారకయోగంబు' అంటాడు యోగి వేమన. మాన్యులూ సామాన్యులు... ఎవరికైనా యోగమదే. నీతినిజాయతీలు, సత్యాహింసలు, న్యాయం లాంటివి ధర్మానికి పర్యాయపదాలే. మనిషిలోని అసలైన జ్ఞానమిదే. ఎప్పటికప్పుడు ఆత్మావలోకనం చేసుకుని తప్పులను సరిదిద్దుకుని ముందుకు సాగితే అతడే ధర్మపరుడు. అతడే జ్ఞాని. అతడే విద్యావంతుడు. స్వీయ లోపంబు లెరుగుట పెద్ద విద్య అన్నారు కదా! ఆచరణకు దూరంగా ఉండి ధర్మాధర్మాల తర్క వితర్కాలు చేయకుండా... ఆత్మసాక్షిగా మంచి వైపు ముందుకు సాగడమే ధర్మం.

- శంకర నారాయణ

తగ్గిన డ్రాగన్ దూకుడు

దేశాభివృద్ధికి ఆధునిక ఫైనాన్షియల్, మార్కెట్ వ్యవస్థలు కీలకం. ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థ కూడా అవసరమే. ఇవేవీ అంతగా లేకపోయినా చైనా యాభై ఏళ్లలో ఆర్థికంగా అపూర్వ ప్రగతిని సాధించింది. సాంకేతికతలో అమెరికా, ఐరోపా దేశాలతో పోటీపడే స్థాయికి ఎదిగింది. ప్రపంచానికే ఫ్యాక్టరీగా మారింది. కానీ, డ్రాగన్ వేగాన్ని కొవిడ్ కాస్త తగ్గిస్తే, అమెరికాతో ఆర్థిక యుద్ధమేమో బ్రేకులు వేసింది.



స్వాతంత్య్రం తరవాత భారత్, చైనాలు ఒకే ఆర్థిక స్థాయి నుంచి ప్రయాణం మొదలుపెట్టాయి. 1980ల తరవాత అభివృద్ధిలో అందనంత ఎత్తులకు చేరుకుంది చైనా. కానీ, కొవిడ్ తరవాత ఆ దేశ ఆర్థిక ప్రగతి మందగించింది. 6.7శాతంగా ఉన్న చైనా వృద్ధిరేటు 2020లో 2.3శాతానికి పడిపోయింది. ప్రభుత్వ ఉద్దీపన చర్యలు, ఎగుమతుల పెంపుతో 2021లో వృద్ధిరేటు కాస్త పుంజుకున్నా, ఆ తరవాతి సంవత్సరంలో జీరో కొవిడ్ విధానం కింద లాక్‌డౌన్‌తో ప్రగతి మళ్లీ పడకేసింది. 2023లో అన్ని ఆంక్షలు ఎత్తివేయడంతో వృద్ధిరేటు విజృంభిస్తుందని ఆశలు పెట్టుకున్నా నెరవేరలేదు. కొవిడ్‌తో 2020లో భారత ఆర్థికాభివృద్ధి రేటు తిరోగమించినా, ఆ తరవాత అంతర్జాతీయ గిరాకీ, ప్రభుత్వ ఉద్దీపన చర్యలు, డిజిటల్ రూపాంతరీకరణ సత్ఫలితాలు ఇచ్చాయి. 2022-25 మధ్య ఇండియా ప్రపంచంలోనే వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. కాకపోతే, పెరుగుతున్న నిరుద్యోగం, అసమానతలే భారతదేశ దీర్ఘకాలిక ప్రగతిపై నీలినీడలు ప్రసరిస్తున్నాయి.

అగ్రరాజ్యంతో వాణిజ్య యుద్ధం

చైనాలో 16-24 వయోవర్గంలోని పట్టణ యువతలో నిరుద్యోగం ఆందోళనకర స్థాయికి చేరుకుంది. ఇది ఆ దేశానికి సామాజికంగా, ఆర్థికంగా చిక్కులు తెచ్చిపెట్టనుంది. అధిక జనాభా అనర్థమని భావించిన చైనా గతంలో 'ఒకే బిడ్డ' విధానాన్ని నిర్బంధంగా అమలు చేసింది. దాంతో జననాలు తగ్గి, ఇప్పుడు వృద్ధుల జనాభా పెరిగిపోతోంది. 1950లలో చైనాలో 6.1గా ఉన్న సంతానోత్పత్తి రేటు కొవిడ్‌కు ముందు 1.3కు పడిపోయింది. మరోవైపు చైనా పౌరుల సగటు ఆయుర్దాయం 44 ఏళ్ల నుంచి 77 ఏళ్లకు పెరిగింది. 2050కల్లా అది 80 ఏళ్లకు పెరగవచ్చు. ఏక సంతానం విధానంలో కుటుంబాలు మగ బిడ్డలకే ప్రాధాన్యం ఇవ్వడంతో ఇప్పుడు మహిళలకన్నా పురుషులు నాలుగు శాతం ఎక్కువగా ఉన్నారు. గ్రామాల్లో ఈ అంతరం అధికంగా ఉంది. పెళ్లిళ్లు చేసుకోవడం, పిల్లలను కనడం తగ్గిపోతోంది. జననాలకన్నా మరణాలు అధికమవుతున్నాయి. వృద్ధుల సంఖ్య పెరిగిపోయింది. ఇది మున్ముందు కార్మికుల కొరతను సృష్టించనుంది. అప్పుడు వయోవృద్ధుల ఆలనాపాలన చూసుకోవడం మలితరానికి భారంగా మారుతుంది.

అమెరికా ప్రారంభించిన వాణిజ్య యుద్ధం వల్ల కూడా చైనా ఆర్థిక ప్రగతికి బ్రేకులు పడుతున్నాయి. 2024లో చైనా నుంచి అమెరికా 43,900 కోట్ల డాలర్ల విలువైన సరకులు దిగుమతి చేసుకుంది. డ్రాగన్‌కు కేవలం 11,400 కోట్ల డాలర్ల విలువైన ఎగుమతులనే చేయగలిగింది. అమెరికా వాణిజ్య లోటు 32,500 కోట్ల డాలర్లుగా లెక్కతేలుతోంది. దీన్ని భర్తీ చేసుకోవడానికే బీజింగ్‌పై వాషింగ్టన్ భారీగా వాణిజ్య సుంకాలు విధించింది. దీనివల్ల చైనా నుంచి చవక దిగుమతులు తగ్గి అమెరికన్ పరిశ్రమలు పునరుజ్జీవం పొందుతాయని అమెరికా ఆశిస్తోంది. 2025లో ట్రంప్ సర్కారు చైనాపై సుంకాలను 245శాతం పెంచేసింది. బీజింగ్ కూడా ప్రతి సుంకాలు విధించడంతో రెండు దేశాల మధ్య వాణిజ్య వైరం ముదిరింది. చివరికి ఈ ఏడాది మే నెలలో అమెరికా తన సుంకాలను 51శాతానికి తగ్గించింది. అయినా ఇది కొవిడ్ ముందునాటి సుంకాలకన్నా ఎక్కువే. ఇకపై అమెరికా మీద అతిగా ఆధారపడకుండా సాంకేతిక పరిజ్ఞాన పరంగా స్వావలంబన సాధించాలని, ఎగుమతులపై కాకుండా స్వదేశంలో గిరాకీ పెంచడం మీదనే ఆధారపడాలని చైనా భావిస్తోంది. ఇతర దేశాలతో వాణిజ్య సంబంధాలను వృద్ధి చేసుకోవాలని ఆశిస్తోంది. ఇది ఆ దేశ ఆర్థిక భవితకు మేలు చేసే విధానమనడంలో సందేహం లేదు. పెరిగిన అమెరికా సుంకాలు కొన్నికాలం చైనా జీడీపీని 2.6శాతం మేర తగ్గించవచ్చు. 2025లో అయిదు శాతం జీడీపీ వృద్ధిరేటు సాధించాలని చైనా భావిస్తున్నా, చివరికి అది 4-5 శాతం మధ్య స్థిరపడవచ్చు.

పురోగతికి ఆటంకం

చైనాలో స్థిరాస్తి బుడగ పేలిపోతుందేమోనని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అతిగా విస్తరిస్తున్న స్థిరాస్తి రంగానికి చైనా కేంద్ర ప్రభుత్వం 2020-21 మధ్యకాలంలో పగ్గాలు వేయసాగింది. రియల్ ఎస్టేట్ కంపెనీలకు అప్పటికే రుణభారం విపరీతం కావడంతో అవి తీసుకోగల అప్పులపై పరిమితులు విధించింది. అయినా రుణ ఎగవేతలు పెరిగాయి. చాలా గృహ నిర్మాణ ప్రాజెక్టులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. కొనుగోలుదారులు గృహ, తనఖా రుణాలను తీర్చలేకపోయారు. రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు భూముల విక్రయం ద్వారా ఆదాయం గడించే రాష్ట్ర ప్రభుత్వాలకు ఇది తీరని నష్టం కలిగించింది. వాటి రుణ భారమూ పెరిగిపోవడం యావత్ చైనా ఆర్థిక వ్యవస్థకు చేటు తెచ్చిపెట్టింది.

కొవిడ్ తరవాత చైనా కాస్త తేరుకున్నా నిరుద్యోగం, ఆర్థిక మందగతి సమస్యలుగా మారుతున్నాయి. అధునాతన చిప్స్ ఇతర ఆధునిక టెక్నాలజీలు అందకుండా అమెరికా ఆంక్షలు విధించడం డ్రాగన్ పురోగతికి ఆటంకం కలిగిస్తోంది. మరోవైపు యువ జనాభా, ఉత్పాదక శక్తి తగ్గిపోవడమూ తీవ్ర సమస్యలే. ఇలాంటివన్నీ పరిగణనలోకి తీసుకుంటూ చైనా నాయకత్వం ఎలాంటి దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందడుగు వేస్తుందో చూడాలి. చైనాకు భిన్నంగా భారత్ యువజనాభాతో విలసిల్లుతున్నా నిరుద్యోగం తీవ్రంగా ఉంది. ఆధునిక పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాలు మన యువతలో కొరవడ్డాయి. మన విద్యావిధానాన్ని సమూలంగా సంస్కరించడం ద్వారా 21వ శతాబ్దికి కావాల్సిన నైపుణ్యాలను యువత సంతరించుకునేలా ప్రభుత్వం పకడ్బందీ కార్యాచరణతో ముందుకు సాగాలి. విద్యాసంస్థలు అందుకు తోడుగా నిలవాలి.



డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు
ఆచార్యులు, ఐఐఎం-ముంబయి



గొప్పలకు పోతే...

ఉదయం పది గంటలకు రూ.60వేల జీతం పడింది. 10:10కి ఇంటి అద్దె, 10:15కి క్రెడిట్ కార్డు బిల్లు, 10:30కి పర్సనల్ లోన్, వెహికిల్ లోన్ ఈఎంఐలు... డెబిట్ అయిపోయాయి. 10:40 అయ్యేసరికి ఖాతాలో మిగిలింది రూ.10వేలే. తీరా చూస్తే ఇంకా ఒకటో తేదీనే. ముప్పై రోజులకు చేతిలో మిగిలింది ఇదేనా? అని పైన ఒక క్వశ్చన్ మార్క్, కింద రజనీకాంత్ నవ్వుతూ ఉన్న వీడియో ఈమధ్య వైరల్ అయింది. మీరూ చూసే ఉంటారు! వీళ్లకి నా గురించి ఎలా తెలిసింది.. అని ఉలిక్కిపడ్డారా? మీరు కాకపోయినా చాలామంది పరిస్థితి అదే.

అసలు జీతంలో సగం క్రెడిట్ కార్డుకు ఎందుకవుతుంది? పర్సనల్ లోన్ తీసుకోవాల్సిన అవసరం ఎప్పుడొస్తుంది? సంపాదనకి తగినట్లుగా ఖర్చు చేయాల్సింది పోయి కార్డు లిమిట్ ఎంత ఉంటే అంతా వాడేస్తుంటారు చాలామంది. బ్యాంకుల సొమ్మేం పోయింది... వ్యాపారం కాబట్టి వెంటపడి మరీ కార్డులిస్తాయి. చేతిలో కార్డుంది కదా అని గొప్పలకు పోయి ఖర్చు పెడితే మిగిలేది అప్పులే. కొందరేమో 'శుభలగ్నం' సినిమాలో హీరోయిన్‌లా ఇరుగుపొరుగు వారితో పోటీపడితే, మరికొందరు 'బ్రాండ్ బాబు' సినిమాలో హీరోలా బ్రాండ్‌ల వెంట పరుగులు తీస్తుంటారు. ఒకప్పుడు పండుగో పబ్బమో వస్తే షాపింగ్‌కి వెళ్లేవారు. ఇప్పుడు ఏమీ తోచకపోతే షాపింగ్‌కి వెళ్లిపోతున్నారు. 35 ఏళ్లలోపు యువత ఏటా ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ వస్తువుల మీద పెడుతున్న ఖర్చు లక్షల కోట్లలో ఉంటోందని ఓ అధ్యయనంలో వెల్లడైంది. మరో నివేదిక ప్రకారం- కేవలం దుస్తులు, యాక్సెసరీస్ మీదే ఏడాదికి రెండు లక్షల రూపాయలు ఖర్చు పెట్టేవారు అనేక మంది ఉన్నారు మన దేశంలో. ఆర్బీఐ ఇటీవల విడుదల చేసిన ఫైనాన్షియల్ స్టెబిలిటీ రిపోర్ట్ చెబుతున్న విషయమూ ఆందోళనకరంగానే ఉంది. 5 నుంచి 10శాతం మధ్యతరగతి భారతీయులు అప్పుల్లో కూరుకుపోయి ఉన్నారట. వీరిలో 67శాతం వ్యక్తిగత రుణాలు తీసుకుని మరీ ఖర్చు పెట్టుకున్నారట. వడ్డీ ఎక్కువగా ఉండే ఈ రుణాలను ప్రాణాల మీదికి వస్తే తప్ప తీసుకోకూడదంటారు నిపుణులు. కానీ బ్యాంకులు ఫోన్ చేసి మరీ జీరో ప్రాసెసింగ్ ఫీజు అని చెబుతోంటే... తీసుకుని కోరుకున్న వస్తువు కొనేసుకుంటే పోలా... అనుకుంటున్నారు వినియోగదారులు.

కొనేటప్పుడు డోపమైన్ హార్మోన్ ప్రభావం సంతోషాన్నిస్తుంది కానీ బిల్లు కట్టేటప్పుడో? డబ్బులన్నీ అయిపోతే నెల గడిచేదెలా అన్న ఆలోచన ఒత్తిడిని పెంచి కార్టిసోల్ హార్మోన్ విడుదలకు కారణమవుతుంది. పలు అనారోగ్యాలకు అది దారితీస్తుంది. సింపుల్‌గా చెప్పాలంటే అనవసరమైన ఖర్చులు చేసి చేజేతులా అనారోగ్యాలను ఆహ్వానించడం అన్నమాట. జీతం... జీవితం రెండూ ఒకటే! చేజారిపోయేవరకూ రెండిటి విలువా తెలీదు. అప్పు పేరుతో తప్పు చేయడం మానేద్దాం. 'వినాశకాలే విపరీత బుద్ధి' అన్నారు పెద్దలు. ఆ వినాశకాలాన్ని విలాసాలతో కొని తెచ్చుకోవద్దు.

- తోనంగి శారద

బంగారం... భారీగా!

కరెన్సీలను స్థిరీకరించడానికి, ఆర్థిక సవాళ్లను నియంత్రించడానికి, అంతర్జాతీయంగా తమ పట్ల విశ్వాసాన్ని పెంపొందించుకోవడానికి అన్ని దేశాలూ బంగారాన్ని నిల్వ చేసుకుంటూ ఉంటాయి. ఈ క్రమంలోనే వాటి కేంద్ర బ్యాంకుల రిజర్వుల్లో బంగారం ప్రధాన పాత్ర పోషిస్తోంది. గోల్డ్ నిల్వల్లో అమెరికా అగ్రస్థానంలో నిలుస్తోంది. ప్రస్తుతం దాని దగ్గర ఎనిమిది వేల టన్నులకు పైగా బంగారం ఉంది. ఈ ఏడాది మార్చి నాటికి ఆయా దేశాల దగ్గర ఉన్న బంగారం నిల్వలు... (టన్నుల్లో)


జర్మనీ	3,351
ఇటలీ	2,451
ఫ్రాన్స్	2,437
చైనా	2292
ఇండియా	879
జపాన్	846
తుర్కియే	623
కజకిస్థాన్	290
సింగపూర్	215
బ్రెజిల్	129
మెక్సికో	120
యూకే	310

(ఆధారం: వరల్డ్ గోల్డ్ కౌన్సిల్)

ఐరాస తీర్మానం... న్యాయపథంలో ముందడుగు!

ఇద్దరు వ్యక్తులు, రెండు వర్గాలు, వ్యవస్థల మధ్య వివాద పరిష్కార ప్రక్రియలో క్లిష్టమైన బాధ్యతలు నిర్వర్తించడం న్యాయమూర్తుల విధి. ఇందులో తీవ్రస్థాయి మానసిక ఆందోళన, భావోద్వేగ ఒత్తిళ్లనూ ఎదుర్కోవాల్సి ఉంటుంది. నేడు అంతర్జాతీయ న్యాయ శ్రేయో దినోత్సవం సందర్భంగా...

నిర్దేశిత న్యాయ విధానాన్ని అనుసరించి, విచారణలు చేపట్టి తీర్పులు ఇవ్వడం సులభమైన ప్రక్రియేమీ కాదు. రోజూ దాదాపు ఎనిమిది గంటలపాటు సాక్ష్యాల నమోదు, వాదప్రతివాదనలు వినడం న్యాయమూర్తుల శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. కేసుల విచారణ సమయంలో కక్షిదారుల విపరీత ప్రవర్తన, న్యాయవాదుల వ్యాఖ్యలు, పోలీసులూ ప్రభుత్వ వర్గాల నిర్లక్ష్య ధోరణులు న్యాయమూర్తులను మనస్తాపానికి గురిచేస్తుంటాయి. మరోవైపు, తీర్పులతో అసంతృప్తి చెందిన కక్షిదారులు, కొంతమంది న్యాయవాదులు అసత్య ప్రచారాలకు దిగుతుంటారు. క్రమశిక్షణతో, నిజాయతీతో అహర్నిశలు శ్రమించే న్యాయమూర్తులకు ఇవన్నీ బాధాకరమే! కొంతమంది వ్యక్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది వ్యక్తిగత కక్షలతో న్యాయమూర్తులపై తప్పుడు ఆరోపణలు చేయడం నిత్యకృత్యమైంది. ఇంకోవైపు, కక్షిదారుల బాధలు, వికృత నేరగాథలు న్యాయమూర్తుల మనసులపై తీవ్ర ప్రభావం చూపుతుంటాయి. కఠిన ఆంక్షల కారణంగా దగ్గరి బంధువులు, స్నేహితులను కలుసుకోవడం కూడా తక్కువే. వృత్తిరీత్యా, ప్రవృత్తి రీత్యా ఇతర వర్గాలతో మమేకం కాలేని న్యాయమూర్తుల సమస్యలను పట్టించుకునేవారే లేరు. వారి సమస్యలను శాస్త్రీయంగా పరిశీలించి, అర్థం చేసుకునే వ్యవస్థలూ కరవే.



సమస్యలపై అవగాహన పెంచాలని...

ఇలాంటి పరిస్థితుల్లో కొద్దిగా మార్పు మొదలైంది. న్యాయమూర్తుల సమస్యలను అంతర్జాతీయ స్థాయిలో గుర్తించి విశ్లేషించడం జరిగింది. ఈ నేపథ్యంలోనే అంతర్జాతీయ న్యాయ శ్రేయోదినోత్సవ నిర్వహణకు ఐరాస సర్వప్రతినిధి సభ మొన్న మార్చిలో ప్రత్యేక తీర్మానం చేసింది. గ్లోబల్ జ్యుడీషియల్ ఇంటిగ్రిటీ నెట్‌వర్క్ అనే సంస్థ చేసిన సర్వే ఆధారంగా ఈ తీర్మానాన్ని రూపొందించారు. ప్రపంచవ్యాప్తంగా చేసిన ఆ సర్వేలో పాల్గొన్న న్యాయమూర్తులలో 92శాతం మంది అధిక పనిభారంతో ఆందోళనకు గురవుతున్నట్లు వివరించారు. వ్యవస్థాగతంగా తగిన మద్దతు దొరకడం లేదని 83శాతం మంది వాపోయారు. మానసిక భావోద్వేగ ఆందోళనలపై మాట్లాడటాన్ని కనీసం హర్షించని మనుషుల మధ్యలో న్యాయమూర్తుల శ్రేయస్సుకు తగిన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆ సర్వే అభిప్రాయపడింది. ఐరాస సర్వప్రతినిధి సభ దాన్ని పరిగణనలోకి తీసుకుంది. న్యాయమూర్తుల సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సభ్య దేశాలకు సూచించింది. ప్రపంచవ్యాప్తంగా న్యాయవ్యవస్థలు, విద్యాసంస్థలు, న్యాయమూర్తుల సంఘాలు, పౌర సమాజ వర్గాలు న్యాయశ్రేయో దినోత్సవాన్ని నిర్వహించడం ద్వారా సమస్యలపై అవగాహన పెంచాలని కోరింది. నౌరు అనే చిన్న దేశంలో జరిగిన సమావేశం ఈ మార్పులకు శ్రీకారం చుట్టింది. 2024 జులై 25న ఐరాస, స్థానిక న్యాయ వ్యవస్థ, కామన్‌వెల్త్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో న్యాయశ్రేయస్సుపై నౌరు ప్రకటన వెలువడింది. అందుకే ఏటా జులై 25వ తేదీన అంతర్జాతీయ న్యాయ శ్రేయో దినోత్సవాన్ని నిర్వహించాలని ఐరాస తీర్మానించింది. నౌరు సదస్సులో న్యాయమూర్తుల శ్రేయస్సు కోసం ఏడు ప్రాథమిక అంశాలను గుర్తించారు. న్యాయ వ్యవస్థ స్వతంత్రంగా, నిర్భయంగా, నిష్పాక్షికంగా పనిచేసేందుకు... ఆ మేరకు దాని నిర్వహణా సామర్థ్యాన్ని పెంపొందించేందుకు న్యాయమూర్తుల శ్రేయస్సు అత్యవసరమని పేర్కొన్నారు. ప్రతి దేశంలో న్యాయమూర్తుల శ్రేయస్సుకోసం ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపట్టాల్సిన బాధ్యత న్యాయవ్యవస్థ, ప్రభుత్వాలపై ఉందని వివరించారు.

నిత్యం ఎంతో ఒత్తిడి...


ఆధునిక న్యాయవ్యవస్థ ఏర్పాటైన ఎన్నో ఏళ్ల తర్వాత న్యాయమూర్తుల శ్రేయస్సుపై అంతర్జాతీయ స్థాయిలో చర్చ జరగడం ఆనందించాల్సిన విషయమే. ఐరాస తీర్మానాన్ని ఆమోదించిన దేశాల్లో భారత్ కూడా ఉండటం మరింత సంతోషకరం. వాదప్రతివాదనల మధ్య నిత్యం ఏకాగ్రతతో, ఓర్పుతో సంయమనం కోల్పోకుండా విధులు నిర్వహించే న్యాయమూర్తులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతుంటారు. అది వారి శారీరక దౌర్బల్యానికి దారితీస్తుంది. ఈ విషయాన్ని న్యాయవాదులు, కక్షిదారులు, కోర్టు సిబ్బంది వంటివారంతా గుర్తించాలి. న్యాయమూర్తులు సెలవు దినాల్లోనూ పని చేయాల్సి ఉంటుందన్న సంగతిని గమనించాలి. న్యాయమూర్తులపై దాడులు, వ్యక్తిత్వ హననాలను తీవ్రంగా ఖండించాలి. న్యాయమూర్తుల శ్రేయస్సుకు నష్టం కలిగించే వారిపై చర్యలు చేపట్టాలి. ఉన్నత న్యాయస్థానాలు సైతం ఈ దిశగా అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

- డాక్టర్ కోపూరు పట్టాభి రామారావు
ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి, హనుమకొండ

బుజ్జిమేక సాహసం..

హాయ్! బుజ్జీ!!

ఒక బుజ్జిమేక తల్లితో రోజూ ఆహారం కోసం వెళ్తూ ఉండేది. ఒకరోజు అలా వెళ్లినప్పుడు.. 'అదిగో ఆ కొండ మీదికి వెళ్లి చూస్తే చెరువు, పొలాలు భలే అందంగా కనిపిస్తాయి' అని చెప్పింది తల్లి. ఆ మాటలు విని ఎలాగైనా ఆ కొండ ఎక్కాలని నిర్ణయించుకుందా బుజ్జిమేక. దాని మిత్రులతో కూడా ఎప్పుడూ అదే విషయం చెబుతూ ఉండేది. ఒకరోజు ఎవరికీ చెప్పకుండా ఆ కొండెక్కడం మొదలుపెట్టింది బుజ్జిమేక. కొంత దూరం బాగానే వెళ్లింది కానీ.. వెళ్తున్న కొద్దీ కాళ్లు మట్టిలో దిగబడుతూ ఉన్నాయి. అప్పుడే దానికి ఒక ఎలుగుబంటి కనిపించి.. 'నువ్వు పైకి వెళ్లలేవు. దారి అస్సలు బాలేదు. నేనే సగం దూరం వెళ్లి వెనక్కి వస్తున్నాను. నా మాట విని



వచ్చేయి' అంది. కానీ అక్కడికి వెళ్తే కనిపించే దృశ్యాల గురించి వాళ్ల అమ్మ చెప్పిన మాటలు తలచుకుని ముందుకు వెళ్తూనే ఉంది బుజ్జిమేక. ఇంకొంత దూరంలో ఒక కోతి కనిపించి.. ఎలుగు చెప్పిన మాటలే చెప్పింది. అయినా లెక్కచేయకుండా నడుస్తూనే ఉంది. దాంతో ఒక్కసారిగా జారి పడిపోయింది. దానికి అప్పుడు చాలా భయమేసింది. అయినా ఏడ్చుకుంటూనే కొండ మీదికి ఎక్కసాగింది. అది చూసిన కోతి.. 'చెబితే విన్నావా? ఇప్పుడైనా వెళ్లిపో' అంది. కానీ తను చేరాల్సిన చోటు దగ్గరవుతున్న కొద్దీ ఉత్సాహంగా ఎక్కుతూనే ఉందా బుజ్జిమేక. చివరికి కొండ అంచును చేరుకుంది. వాళ్లమ్మ చెప్పినట్లుగా ఉన్న అద్భుతమైన దృశ్యాలను చూసి ఎంతో ఆనందించింది. 'ఎంత బాగుందో ఈ ప్రదేశం దారిలో అయిన గాయాలన్నీ మర్చిపోయేలా చేసింది' అనుకుంది. కిందకి వస్తూ ఎలుగుబంటి, కోతుల్ని చూసి.. 'మీ వల్ల కాలేదని ఇంకెవరూ చేయలేరని అనుకోవద్దు. ఇంకెప్పుడూ ఈ కొండెక్కడానికి వచ్చిన వాళ్ల ప్రయత్నాన్ని ఆపొద్దు' అని చెప్పింది.

- నారంశెట్టి ఉమామహేశ్వరరావు



అక్షరాల చెట్టు

ఈ అక్షరాలతో అర్థవంతమైన పదం తయారు చేయండి.

జవాబు: DISCIPLINE

నైపుణ్య శిక్షణ కావాలా?.. ఉపాధి అవకాశాలు తెలుసుకోవాలా?

జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ వివిధ కోర్సుల్లో నిరుద్యోగులకు శిక్షణ ఇస్తోంది. ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులకు ఏఐ, మెషిన్ లెర్నింగ్‌తో పాటుగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి ప్రణాళిక రూపొందిస్తోంది. ఆయా అంశాలతో పాటు ప్రైవేటు సంస్థల్లో కొలువులు, జాబ్‌మేళాల నిర్వహణ.. ఉపాధి అవకాశాల గురించి తెలుసుకొనే అవకాశం 'ఈనాడు-మీతోడు' కల్పిస్తోంది. ఎన్టీఆర్ జిల్లాలో పది, ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ తప్పిన, పూర్తి చేసిన విద్యార్థులు దిగువ నంబరుకు సూచించిన సమయంలో ఫోన్ చేస్తే జిల్లా నైపుణ్య శిక్షణ అధికారి ఎస్.శ్రీనివాసరావు మీ ప్రశ్నలకు సమాధానాలు ఇస్తారు. సందేహాలు నివృత్తి చేస్తారు. - కరెన్సీనగర్, న్యూస్‌టుడే

ఈనాడు మీతోడు

నైపుణ్య శిక్షణాధికారితో ఫోన్ ఇన్ నేడు

శ్రీనివాసరావు

☎ 96033 43003 | తేదీ: శుక్రవారం (25.07.2025) | సమయం: ఉదయం 11 నుంచి 12 వరకు

దారిలో గండం.. దాటలేక దండం



యుద్ధప్రాతిపదికన రహదారుల నిర్మాణం చేపట్టాలని అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం ఆదేశించింది. దీంతో విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ 2024 నవంబరు 2న ప్రజలకు ఎంతో ముఖ్యమైన కానూరు-ఆటోనగర్-మురళీనగర్-మహానాడు ప్రాంతాలను కలిపే రహదారి నిర్మాణ పనులు ప్రారంభించారు. 8 నెలలు కావస్తున్నా రహదారి రూపు మారలేదు. రోడ్డు నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసి తమ సమస్య తీర్చాలని వాహనదారులు కోరుతున్నారు. - ఈనాడు, అమరావతి

చిన్న రైతులను ఆదుకుంటా: జ్వాల



మాది... అమలాపురం. అత్యధిక జీపీఏతోపాటు రైతులతో మమేకమై సలహాలు ఇచ్చినందుకు మొత్తం 5 బంగారు పతకాలు వచ్చాయి. ఎంబీఏ పూర్తి చేసి వ్యవసాయానికి సంబంధించిన వ్యాపారం చేయాలనే ఆలోచన ఉంది. చిన్న రైతులు మార్కెటింగ్ చేసుకునే అవకాశం లేక చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి సాంకేతిక పరిష్కారం చూపేందుకు నావంతు ప్రయత్నం చేస్తా.

సేంద్రియ ఆహారం అందిస్తా: తేజస్వి



మాది... తెనాలి. కమ్యూనిటీ సైన్స్‌లో అత్యధిక మార్కులు సాధించినందుకు బంగారు పతకం రావడం ఆనందంగా ఉంది. ప్రస్తుతం సాగులో రసాయనాల వినియోగం పెరిగింది. దీంతో మంచి ఆహారం అందడం లేదు. కొందరు రైతులను సంఘంగా ఏర్పాటు చేసి సేంద్రియ పంటలు పండించి.. వాటిని ప్రజలకు తక్కువ ధరకు అందించేందుకు ప్రయత్నిస్తా. మిల్లెట్స్ వినియోగిస్తే ఆరోగ్యం కూడా మెరుగవుతుంది.



వేదికపై గవర్నర్ అబ్దుల్‌నజీర్, హరి జవహర్‌లాల్, వేణుప్రసాద్, ఉపకులపతి శారదా జయలక్ష్మీ దేవి, ప్రొఫెసర్లు...



పట్టభద్రుల ప్రతిజ్ఞ

అక్షర మాగాణం.. మెరిసె సువర్ణం

స్వర్ణభారత్ ట్రస్టులో ఘనంగా ఆచార్య ఎన్జీ రంగా వర్సిటీ స్నాతకోత్సవం

"60 ఏళ్ల చరిత్ర.. ఎన్నో సంస్కరణలకు అపురూప వేదిక.. అలాంటి ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం నుంచి పట్టభద్రులు కావడం... మీరు భవిష్యత్తులో చేరుకునే గొప్ప లక్ష్యాలకు నాంది కాబోతోందని'' గవర్నర్ అబ్దుల్ నజీర్ తెలిపారు. కృష్ణా జిల్లా పరిధిలోని ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో గురువారం ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ 57వ స్నాతకోత్సవం వైభవంగా జరిగింది. ఉత్తమ జీపీఏ సాధించిన విద్యార్థులకు గవర్నర్ బంగారు పతకాలు అందించారు. 1,420 మందికి డిగ్రీ, 196 మందికి పీజీ, 46 మందికి డాక్టరేట్ పట్టాలను ముఖ్యఅతిథిగా హాజరైన పంజాబ్ ప్రభుత్వ మాజీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఏ.వేణుప్రసాద్ అందించారు.



తమ పిల్లలు డిగ్రీ పట్టాలు, బంగారు పతకాలు తీసుకోవడం చూసేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు తరలివచ్చారు. పట్టాలు అందుకున్న వారు... కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి స్వీయ, బృంద చిత్రాలు తీసుకుంటూ సరదాగా గడిపారు. ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి శారదా జయలక్ష్మీదేవి, రిజిస్ట్రార్ రామచంద్రరావు, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, కృష్ణా జిల్లా జేసీ గీతాంజలిశర్మ, ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు. - ఈనాడు, అమరావతి

- న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం

యాంత్రీకరణతో మేలు: బేబీ శ్రీవిద్య



మాది.. వైఎస్సార్ కడప జిల్లా దత్తాపురం. 2020-23లో యూజీలో అత్యధిక మార్కులు వచ్చినందుకు బంగారు పతకం వరించింది. ప్రస్తుతం నేను ఫీల్డ్ ఆఫీసర్‌గా... రైతులు రుణాలు పొందడం, తిరిగి చెల్లించడం, వడ్డీభారం తగ్గించుకోవడం వంటి అంశాలపై గ్రామాల్లోకి వెళ్లి అవగాహన కల్పిస్తున్నా. వ్యవసాయంలో ఏఐ వాడకాన్ని ప్రోత్సహిస్తా. డ్రోన్లు, ఇతర యంత్రాలు వాడేందుకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాల్లో నేనూ పాల్గొంటా.

సుగంధ ద్రవ్యాలు పండిస్తా: మోహన్‌కుమార్



మాది... ఏలూరు. 2019-23లో సాయిల్ సైన్స్‌లో అత్యధిక మార్కులు సాధించినందుకు బంగారు పతకం వచ్చింది. ప్రస్తుతం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో అసిస్టెంట్ బయ్యర్‌గా పనిచేస్తున్నా. రైతులకు అవగాహన కల్పించి స్పైసెస్ సాగు చేయించాలని ఉంది. నేను కూడా కొంత పొలంలో సాగు చేస్తా.. వాటి డిమాండ్‌ను వినియోగించుకుని మంచి ఆదాయం వైపు రైతులను తీసుకువెళ్లాలని ఉంది.

శుభఘడియలు వచ్చేశాయ్



నేటి నుంచే శ్రావణ మాసం ప్రారంభం

ఇబ్రహీంపట్నం గ్రామీణం, గుంటుపల్లి, న్యూస్‌టుడే: శుభప్రదంగా భావించే శ్రావణ మాసం శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న వివాహాది శుభకార్యాల బాజా భజంత్రీలు మోగనున్నాయి. మూఢంతో గత నెల 10వ తేదీ తర్వాత ఆగిపోయిన శుభకార్యాలు మళ్లీ ప్రారంభం కానున్నాయి. గత నెలన్నర రోజులుగా వివాహాది ఫంక్షన్లు లేకపోవడంతో వివిధ వృత్తులవారు, వ్యాపారులు ఉపాధి లేక ఇబ్బందులు పడ్డారు. మళ్లీ ముహూర్తాలు మొదలు కావడంతో డెకరేషన్, ఫొటోగ్రఫీ, ఈవెంట్లు, కేటరింగ్ నిర్వాహకులతోపాటు జ్యువెలరీ, వస్త్ర, కిరాణా తదితర వ్యాపారాలకు గిరాకీ పెరగనుంది. ఉమ్మడి కృష్ణాజిల్లా వ్యాప్తంగా కల్యాణ మండపాల బుకింగ్ కోసం వారం రోజుల నుంచే వధూవరుల బంధువులు పోటీపడుతున్నారు.

ఆలయాలకు ఆధ్యాత్మిక శోభ

శ్రావణ మాసోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమై ఆగస్టు 23తో ముగియనున్నాయి. అమావాస్యకు ముందు వచ్చే నెల 18వ తేదీ వరకు శుభకార్యాలు నిర్వహించుకోవచ్చని వేదపండితులు తెలిపారు. ఈ నెల 26, 27, 30, 31, ఆగస్టు 3, 5, 7, 8, 10, 11, 14, 15, 17, 18 వరకు వివాహ శుభఘడియలు ఉన్నాయని వివరించారు. భూమిపూజ, శంకుస్థాపనలు, గృహప్రవేశాలు తదితర శుభకార్యాలను నిర్వాహకులు పురోహితులను సంప్రదించి ముహూర్త తేదీలను ఖరారు చేసుకుంటున్నారు. ఈ శ్రావణమాసంలోనే విశిష్ట పర్వదినాలైన వరలక్ష్మి వ్రతం, రాఖీ పౌర్ణమి, కృష్ణాష్టమిలతో ఆలయాలు మరింత ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనున్నాయి.

మెట్రో... ముందడుగు!

నేడు టెండర్లు పిలవనున్న ప్రభుత్వం



ఈనాడు - అమరావతి: విజయవాడ నగరానికి మణిహారంగా భావిస్తున్న మెట్రో రైలుకు సంబంధించి శుక్రవారం కీలక అడుగు పడబోతోంది. రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు పిలవనుంది. వైకాపా హయాంలో పక్కనపెట్టిన ఈ ప్రాజెక్టుకు.. కూటమి ప్రభుత్వం రాకతో ముందడుగు పడింది. ఈ ప్రాజెక్టుకు రూ.10,118 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఇందులో 40 శాతం పనులకు ప్రస్తుతం టెండర్లు పిలవనున్నారు. మొత్తం వ్యయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం భరించనున్నాయి. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటాగా సీఆర్డీఏ నుంచి రూ.3,497 కోట్లు సమకూర్చనున్నారు.

సీఎంపీ పూర్తి.. కేంద్రానికి సమర్పణ: కీలకమైన సీఎంపీ (కాంప్రిహెన్సివ్ మొబిలిటీ ప్లాన్)ను మెట్రో రైల్ కార్పొరేషన్ తయారు చేయించింది. రద్దీ వేళలు, మిగిలిన సమయాల్లో ఏపీ కూడళ్లలో ట్రాఫిక్ పరిస్థితి.. ఆయా కూడళ్లలో వెళ్లే వాహనాల సంఖ్య వివరాలతో దీనిని రూపొందించి కేంద్రానికి పంపించారు. త్వరలో డీపీఆర్‌కు ఆమోదం లభించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

రెండు కారిడార్లలో.. గన్నవరం సమీపంలో కేసరపల్లి వద్ద మెట్రో కోచ్ డిపో ఏర్పాటు చేయనున్నారు. అక్కడి నుంచి ఆరంభమై విజయవాడలో పీఎన్‌బీఎస్ వరకూ ఒక కారిడార్ వస్తుంది. ఈ 26 కిలోమీటర్ల మార్గమే కీలకం. గన్నవరం నుంచి గూడవల్లి, నిడమానూరు, ప్రసాదంపాడు, రామవరప్పాడు చౌరస్తా వరకు జాతీయ రహదారి మీదుగా వస్తుంది. అక్కడి నుంచి ఏలూరు రోడ్డులోకి మలుపు తిరిగి.. గుణదల, మాచవరండౌన్, బీసెంట్‌రోడ్డు, రైల్వే స్టేషన్ మీదుగా పీఎన్‌బీఎస్ వరకు వస్తుంది. పెనమలూరు వరకు వెళ్లే రెండో కారిడార్ కూడా పీఎన్‌బీఎస్ నుంచే ఆరంభం అవుతుంది. 12.5 కిలోమీటర్ల ఈ రూట్ బందరు రోడ్డు మీదుగా విజయవాడలో కీలకమైన ఆటోనగర్, బెంజిసర్కిల్, ఇందిరా గాంధీ మైదానం వంటి రద్దీ ప్రాంతాలను కలుపుతూ వెళుతుంది. ఈ రెండు మార్గాల్లో మొత్తం 33 స్టేషన్లు ప్రతిపాదించారు. మెట్రో స్టేషన్లను వీలైనంత మేర వివిధ రవాణా వ్యవస్థలైన ఆర్టీసీ, విమానాశ్రయం, రైల్వేతో అనుసంధానం చేయనున్నారు.

తుది దశకు భూసేకరణ ప్రక్రియ

మెట్రోకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ చివరి దశకు చేరింది. ఇప్పటికే కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లతో మెట్రో రైలు కార్పొరేషన్ ఎండీ రామకృష్ణారెడ్డి సమావేశమై చర్చించారు. తొలి దశలో చేపట్టబోయే కారిడార్ 1ఎ, కారిడార్ 1బికి.. రెండు జిల్లాల్లో 82.66 ఎకరాలు అవసరం. కృష్ణా జిల్లాలో 70.95 ఎకరాలు, ఎన్టీఆర్ పరిధిలో 11.71 ఎకరాలను సేకరిస్తున్నారు. ఇందుకు రూ.1,152 కోట్లు అవుతుందని అంచనా. రెండు జిల్లాల్లో 82.66 ఎకరాల్లో.. రైల్వే సహా కేంద్ర ప్రభుత్వ సంస్థల స్థలం 1.03 ఎకరాలు, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలది 4.86 ఎకరాలు, ప్రైవేటు భూమి 76.77 ఎకరాలు ఉన్నాయి. రామవరప్పాడు చౌరస్తా నుంచి గన్నవరం వరకు జాతీయ రహదారి మీదుగా మెట్రో లైన్ రానుంది. ఈ మార్గంలో పైవంతెనల నిర్మాణమూ ఉండటంతో.. ఒకదానిపై మరో పైవంతెన, దానిపైన మెట్రో.. డబల్ లైన్‌లో వస్తాయి.

బాబు ముందుచూపుతోనే ప్రగతి



తోటచర్లలో మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

పెనుగంచిప్రోలు: ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపు, చొరవ.. రాష్ట్రాభివృద్ధికి దోహదపడుతోందని మంత్రి టీజీ భరత్ తెలిపారు. తోటచర్లలో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఆధ్వర్యంలో గురువారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ముద్రించిన కరపత్రాలను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ వైకాపా ఐదేళ్ల పాలనలో పరిశ్రమలు వెనక్కి వెళ్లాయని, కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో వారంతా తిరిగి వస్తున్నారని చెప్పారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారా యువతకు ఉపాధి కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. వచ్చే నెల నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కలగబోతుందన్నారు.

నిత్యావసరాల ధరలపై నిఘా

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నిత్యావసరాల ధరలను అదుపులో ఉంచేందుకు పటిష్ఠ పర్యవేక్షణ అవసరమని, రైతుబజార్లు, హోల్‌సేల్, రిటైల్ దుకాణాల్లో తనిఖీలు చేస్తూ గట్టి నిఘా ఉంచాలని జేసీ ఎస్.ఇలక్కియా ఆదేశించారు. నగరంలోని జేసీ ఛాంబర్‌లో జిల్లా స్థాయి ధరల పర్యవేక్షణ, నియంత్రణ కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. కూరగాయలు, కందిపప్పు, పామాయిల్, బియ్యం తదితరాలపై సమీక్షించారు. ప్రస్తుతానికి ధరలు స్థిరంగా ఉన్నాయని, పప్పు శనగ పప్పు ధర కొద్దిగా పెరిగిందని పేర్కొన్నారు. తగ్గింపుపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యామ్నాయంగా బఠానీలు వినియోగించవచ్చని ఆమె సూచించారు. ● టమాటా ధరలు పెరిగినట్లు గుర్తించామని జేసీ పేర్కొన్నారు. టమాటాలను కొనుగోలు చేసి, రైతుబజార్లకు సరఫరా చేసి, వినియోగదారులకు తక్కువ ధరకు అందించాలని మార్కెటింగ్ శాఖ అధికారులకు జేసీ సూచించారు. డీఎస్‌వో ఎ.పాపారావు, ఏఎంవో బి.రాజాబాబు, జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కానూరు దారిలో కష్టాలకు మోక్షం



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్, అధికారులు

ఈనాడు స్పందన

కానూరు, న్యూస్‌టుడే: కానూరు ప్రధాన రహదారి అభివృద్ధి పనులకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. చర్చి, కెడీ స్కూల్ ఎదురుగా గోతులు, వాన కారణంగా కొన్ని రోజులుగా స్థానికులు, వాహనదారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో విజయవాడ బందరు రోడ్డు నుంచి కానూరు వెళ్లే ప్రధాన రహదారి దుస్థితిపై 'దారంతా డొల్ల.. ఒళ్లంతా గుల్ల' శీర్షిక గురువారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, పురపాలక అధికారులు స్పందించారు. రోడ్డుపై నిలిచిన నీటిని గురువారం ఉదయం తోడించారు. లారీల్లో కంకర బూడిద తెప్పించి గుంతలు పూడ్చించారు. అనంతరం తారువేసే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఆయా పనులను ఎమ్మెల్యే స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రెయిన్లలో ఆక్రమణల వల్లే వాన నీరు నిలవడానికి సమస్య ఏర్పడిందన్నారు.



దుర్గమ్మకు వైదిక సిబ్బంది కుటుంబాల ఆషాఢ సారె

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఆషాఢ మాస ఉత్సవాల సందర్భంగా వైదిక సిబ్బంది వేద పండితుల కుటుంబాలు అమ్మవారికి సంప్రదాయ సారెను గురువారం సమర్పించారు. దేవస్థానం సిబ్బంది మేళతాళాలతో సారె బృందానికి స్వాగతం పలికారు. జగన్మాత దుర్గమ్మ అలంకరణకు సిబ్బంది తరఫున రూ.4.25 లక్షల విలువైన 40 గ్రాముల బంగారు హారాన్ని బహూకరించారు. దుర్గమ్మ సన్నిధిలో ఉంచి పూజ చేసిన అనంతరం దేవస్థానం ఈవో శీనానాయక్‌కు అందజేశారు. సారెను మల్లిక ఖార్జున మహామండపం 6 అంతస్తులో సమర్పించారు. దేవస్థానం ప్రధానార్చకులు దుర్గాప్రసాద్, స్థానాచార్య శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు కోట ప్రసాద్, వేదపండితులు పాల్గొన్నారు.



వైదిక సిబ్బంది కుటుంబాలతో ఈవో శీనా నాయక్, ప్రధానార్చకులు దుర్గాప్రసాద్, స్థానాచార్య శివప్రసాదశర్మ.. బహూకరించిన బంగారు హారం

బ్రాయిలర్ ధరలు (కిలో రూ.లలో)

విజయవాడ: బ్రాయిలర్ ఫాం లైవ్ రూ.114, డ్రెస్డ్ రూ.196, విత్ స్కిన్ - 197, విదౌట్ స్కిన్ - 224. ఆధారం: వెంకీ పౌల్ట్రీ & వెంకీస్ ఎగ్ ఇన్ఫర్మేషన్. బ్రాయిలర్ ఫాం లైవ్ రూ.122, 131, 142, డ్రెస్డ్ రూ.242.

జిల్లా అంతటా వర్షం

ఎన్టీఆర్ కలెక్టరేట్: జిల్లా అంతటా వర్షాలు కురిశాయి. గురువారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు నమోదైన వివరాలు ఇలా ఉన్నాయి. వత్సవాయి 6.6 మి.మీ., విజయవాడ గ్రామీణ 6.4, అజిత్‌సింగ్‌నగర్ 5.8, గాంధీనగర్, భవానీపురం 5.4, పటమట 5.2, పెనుగంచిప్రోలు 5.2, మైలవరం 4.8, విస్సన్నపేట 4.6, చందర్లపాడు 4.2, తిరువూరు 4, ఇబ్రహీంపట్నం 2.8, ఎ.కొండూరు 2.6, వీరులపాడు, గంపలగూడెం 2.2, జగ్గయ్యపేట 1.8, రెడ్డిగూడెం 1.6, నందిగామ, జి.కొండూరు, కంచికచర్లలో 1.2 మిల్లీ మీటర్ల చొప్పున వర్షం పడింది.

3.5 కోట్లకు పైగా కొత్త ఉద్యోగాల కల్పనే లక్ష్యం



మాట్లాడుతున్న వీరభద్రస్వామి, పక్కన భాస్కరరావు, రాజకుమార్ తదితరులు

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: ఉపాధి ఆధారిత ప్రోత్సాహక పథకం(ఈఎల్ఐ) ద్వారా 3.5 కోట్లకు పైగా ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యమని అదనపు సెంట్రల్ పీఎఫ్ కమిషనర్ వి.వీరభద్రస్వామి అన్నారు. గురువారం ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎంజీ రోడ్డులోని కార్యాలయంలో ఉద్యోగ ఆధారిత ప్రోత్సాహక పథకం(ఈఎల్ఐ), టీడీఎస్, టీసీఎస్ నిబంధనలు, పాటించాల్సిన పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈఎల్ఐ పథకం వల్ల యజమానులు, తొలిసారి ఉద్యోగులకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. ఈపీఎఫ్‌వో రిజిస్ట్రేషన్, ఆధార్ ఆధారిత ప్రత్యక్ష ప్రయోజన బదిలీ(డీబీటీ), తయారీ రంగానికి విస్తరించిన ప్రోత్సాహకాలను వెల్లడించారు. ఆదాయపన్ను శాఖ అధికారి పి.అనిల్‌కుమార్ టీడీఎస్, టీసీఎస్ నిబంధనలు, వర్తింపులు, తాజా సవరణలు గురించి వివరించారు. ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ వెంకటేశ్, ప్రభుదత్త, అబ్దుల్ ఖాదర్, ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి బి.రాజకుమార్, కోశాధికారి అక్కియ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. ఎంఎస్ఎంఈ, తయారీ, సేవలు, వాణిజ్యం వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు.

పింఛను పోతుందని పొలం రాయించుకున్నాడు..

కుమారుడి మోసంపై తల్లి ఫిర్యాదు

కంచికచర్ల, నందిగామ, న్యూస్‌టుడే: పింఛను రద్దవుతుందని చెప్పి సంతకాలు, వేలిముద్రలు తీసుకొని తన పొలాన్ని కన్నకొడుకే అక్రమంగా రాయించుకున్నాడంటూ కంచికచర్లకు చెందిన వృద్ధురాలు గుత్తా శాంతమ్మ.. కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేసినట్లు ఆలస్యంగా వెలుగు చూసింది. గత 30 ఏళ్లుగా తన రెండవ కుమారుడైన గుత్తా శివాజీ వద్ద ఉంటున్నాననీ, పెద్ద కుమారుడైన వెంకటరావు, అతని కుటుంబ సభ్యులు ఏనాడూ తనను పట్టించుకోలేదని తెలిపింది. ఇదిలా ఉండగా గత మార్చిలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో అధికారులమంటూ కొందరు వ్యక్తులు వచ్చి 'మీ పింఛను రద్దవుతుంది. వేలి ముద్రలు ఇవ్వాలి' అని చెప్పారని ఆమె పేర్కొన్నారు. అనంతరం వారి వద్ద ఉన్న ల్యాప్‌టాప్‌లో తన వేలిముద్రలు తీసుకుని పత్రాలపై సంతకాలు చేయించుకున్నారని వృద్ధురాలు తెలిపారు. తన పెద్ద కుమారుడు వెంకటరావు, మనుమడు రమేష్‌లు అధికారులతో కుమ్మక్కై తనకు కంచికచర్ల పరిధిలోని సర్వే నంబరు 76-2లో ఉన్న 4.12 ఎకరాలను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆమె ఆరోపించారు. తనను మోసగించి చేయించుకున్న రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలంటూ ఈ నెల 21న కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు.

చట్టపరంగా చర్యలు తీసుకుంటాం: ఆర్డీవో

గుత్తా శాంతమ్మను మోసం చేసి ఆస్తి కాజేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్థానిక ఆర్డీవో బాలకృష్ణ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం.. ఈ నెల 28న సాయంత్రం 4 గంటలకు విచారణకు హాజరు కావాలని ఇరుపక్షాల వారిని ఆదేశించారు. సదరు వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సిందిగా పోలీస్ శాఖ అధికారులు కోరినట్లు ఆర్డీవో తెలిపారు. శాంతమ్మకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 475 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.92/-.

బెయిల్ షరతులు సడలించాలని కోర్టులకు వంశీ వినతి

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: శ్వాసకోశ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నానని.. శస్త్ర చికిత్స నిమిత్తం బెయిల్‌లో విధించిన షరతులు సడలించాలని కోరుతూ వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ కోర్టుల్లో గురువారం పిటిషన్ దాఖలు చేశారు. వారంలో మంగళవారం, శుక్రవారం మినహా ఇతర రోజుల్లో కోర్టులతో పాటు పటమట, గన్నవరం, వీరవల్లి, హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్లలో వంశీ ష్యూరిటీ సంతకాలకు హాజరవుతున్నారు. గన్నవరం తెదేపా కార్యాలయంపై దాడి, సత్యవర్ధన్ కిడ్నాప్, బెదిరించి భూకబ్జా కేసుల్లో తనకు ఈ మినహాయింపు ఇవ్వాలని కోర్టును ఆశ్రయించారు. శస్త్రచికిత్స నేపథ్యంలో హాజరుకావడం ఇబ్బందికరంగా ఉంటుందన్న వైద్యుల సూచనల మేరకు షరతులు సడలించాలని కోరారు.

జిల్లాకు 54 మంది నూతన ఎస్సైలు



సీపీ రాజశేఖరబాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ప్రొబేషనరీ ఎస్సైలు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌కు కేటాయించిన నూతన ప్రొబేషనరీ ఎస్సైలు గురువారం పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖపట్నం రేంజ్ గ్రేహౌండ్స్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం ఎన్టీఆర్ కమిషనరేట్‌కు 54 మంది ఎస్సైలను కేటాయించారు. ఈ సందర్భంగా సీపీ.. వారికి విధి నిర్వహణకు సంబంధించి పలు సూచనలను చేశారు. నిర్భయంగా, నిష్పక్షపాతంగా, క్రమశిక్షణ, నిజాయతీ, పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. నిందితులకు శిక్షలు పడేలా పని చేయాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేర పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం, సాధన, పోలీసులు ఎదుర్కొనే సవాళ్లను అధిగమించేందు ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలని కోరారు. పోలీస్‌స్టేషన్లలో విధులు, రికార్డులు, స్థానిక చట్టాలు, భౌగోళిక పరిస్థితులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. సాంకేతికతను వినియోగించి ఉత్తమ ఫలితాలు సాధించాలని.. ప్రజలకు మరింత సేవ చేయాలని కోరారు. కేసుల నమోదు, దర్యాప్తు, రికార్డుల తయారీ, సీడీఆర్ విశ్లేషణ, డ్రోన్స్ వినియోగం, క్లౌడ్ పెట్రోలింగ్, సీసీ కెమెరాలు ఉపయోగించే విధానం, బందోబస్తు నిర్వహణ, క్రైం రికార్డుల నిర్వహణ తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో డీసీపీలు కె.జి.వి.సరిత, సిటీ ట్రైనింగ్ సెంటర్ ఏసీపీ బి.ఉమామహేశ్వర్‌రెడ్డి, సౌత్ ఏసీపీ డి.పావన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంద్రకీలాద్రిపై శ్రావణమాస ఉత్సవాలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై ఈ నెల 25 నుంచి శ్రావణ మాస ఉత్సవాలు ప్రారంభమవుతాయని దుర్గగుడి ఈవో శీనానాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. రాజగోపురం ప్రాంగణంలో ఉదయం 11 గంటల నుంచి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆగస్టు 8 నుంచి 10 వరకు నూతన యాగశాలలో పవిత్రోత్సవాల దృష్ట్యా అన్ని రకాల ఆర్జిత సేవలు నిలిపేస్తున్నట్లు తెలిపారు. 8న వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకొని దుర్గమ్మను వరలక్ష్మీదేవిగా అలంకరిస్తున్నట్లు పేర్కొన్నారు. 16న శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని ఉట్టి కొట్టే వేడుకలు రాజగోపురం ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 8గంటలకు అనివేటి మండపం(ఆశీర్వచన మండపం)లో శ్రీకృష్ణ భగవానుడికి పూజా కార్యక్రమాన్ని అర్చకులు నిర్వహిస్తారని, 22న సామూహిక ఉచిత వరలక్ష్మీ వ్రతం ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు నిర్వహిస్తారని, పాల్గొనే మహిళలు ముందుగా దేవస్థానానికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కృష్ణా నదిలో కొనసాగుతున్న వరద

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కృష్ణా నదిలో గురువారం స్థానిక వరద ప్రవాహం కొనసాగుతోంది. ఉదయం 6 గంటలకు ఎగువ నుంచి 22,321 క్యూసెక్కుల వరద రాగా, 25 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. సముద్రంలోకి 18,000 క్యూసెక్కులు విడుదల చేశారు. కాలువలకు 4,321 క్యూసెక్కులు ఇచ్చారు. క్రమేపీ వరద పెరిగింది. మధ్యాహ్నం 12 గంటలకు ఎగువ నుంచి 29,591 క్యూసెక్కులు రాగా, 35 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. సముద్రంలోకి 25,270 క్యూసెక్కులు వదిలారు. సాయంత్రం వరకు నిలకడగా ఉంది. రాత్రి 9 గంటల నుంచి తగ్గుముఖం పట్టింది. దీంతో 30 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. 21,570 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేశారు. కీసర (మునేరు) నుంచి 21,923, పాలేరు నుంచి 2,595, వజినేపల్లి నుంచి 1,018, వెలగలేరు (బుడమేరు) నుంచి 2,070 క్యూసెక్కుల మేర బ్యారేజీకి నీరు వస్తోంది. పంట కాలువలకు 4,321 క్యూసెక్కులు ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 3,305, కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వకు 1,016 క్యూసెక్కుల చొప్పున ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ నుంచి రైవస్ కాల్వకు 2,005, కేఈబీ కాల్వకు 1,300 క్యూసెక్కులు విడుదల చేశారు. బందరు, ఏలూరు కాల్వలు కట్టేసి ఉన్నాయి.

4వేల గంజాయి చాక్లెట్ల పట్టివేత



విద్యాధరపురం, న్యూస్‌టుడే: కాన్పూరు నుంచి గంజాయి చాక్లెట్లు తెచ్చి విజయవాడలో చెలామణి చేద్దామని ఓ కిరాణా దుకాణం వ్యాపారి రచించిన పథకం బెడిసికొట్టింది. విజయవాడ పాతబస్తీలో 4వేల గంజాయి మత్తు చాక్లెట్ ప్యాకెట్లను వన్‌టౌన్ పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. పాతబస్తీ మానుకొండవారి వీధిలో లాల్‌చాంద్ కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. కాన్పూరు నుంచి 'మహకర్ మన్ కపటి' పేరుతో గంజాయి చాక్లెట్ ప్యాకెట్లను తీసుకొచ్చి మొదటిసారి ఇక్కడ విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్ ఆదేశాల లాల్‌చాంద్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు.

కుప్పకూలిన ఐరన్ షెడ్

పటమట, న్యూస్‌టుడే: బందరు రోడ్డులోని ఫార్చ్యూన్ మురళీ హోటల్ బస్టాండ్ సమీపంలో ఓ ఖాళీ స్థలంలో నిర్మాణంలో ఉన్న భారీ ఐరన్ షెడ్ గురువారం కుప్పకూలింది. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఇక్కడ ఐరన్ రాడ్లతో మూడు అంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. ఇందు కోసం సుమారు 40 అడుగుల ఎత్తులో 20 ఇనుప స్తంభాలు నిలబెట్టారు. మొదటి అంతస్తులో సుమారు 15 అడుగుల ఎత్తులో స్తంభాలకు అడ్డంగా ఇనుప రాడ్లు అమర్చారు. మూడు రోజులుగా భారీ వర్షాలు కురవడంతో పనులు ఆపారు. గురువారం సాయంత్రం భారీ ఈదురు గాలులతో వర్షం కురవడంతో షెడ్డు ఒక్కసారిగా కూలింది. రెండు స్తంభాలు రోడ్డుపై పడ్డాయి. అక్కడ ఎవరూ రాకపోకలు సాగించకపోవడం, సైటులో పని చేయకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. దీంతో అందరూ ఊపిరి పిల్చుకున్నారు. ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పడిన స్తంభాలు తొలగిస్తున్నారు. నిబంధనలు పాటించకుండా హడావుడిగా నిర్మాణం చేపట్టారని అందుకే భవనం కూలినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. గతంలో కూడా ఇదే తరహాలో ఈ ఐరన్ భవనం కూలినట్లు చెబుతున్నారు.



చెల్లా చెదురుగా పడిన ఐరన్ రాడ్లు

గురుకులాల్లో ఖాళీ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఉమ్మడి కృష్ణా జిల్లాలోని బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లలో ఇంకా పలు సీట్లు ఖాళీగా ఉన్నాయని సమన్వయ అధికారి ఎ.మురళీకృష్ణ తెలిపారు. ప్రవేశ పరీక్ష రాసి సీట్లు పొందని వారు, ప్రవేశ పరీక్ష రాయని వారికీ అవకాశం ఉందని పేర్కొన్నారు. మోటూరు, బల్లిపర్రు, రుద్రవరం, పామర్రు, తిరువూరు, కృష్ణారావుపాలెం పాఠశాలల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రవేశ పరీక్ష రాయని విద్యార్థులకు ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయిస్తామని వివరించారు.

నర్సింగ్ మహిళలకు జర్మనీలో ఉపాధి

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నర్సింగ్ కోర్సు పూర్తి చేసిన 35 ఏళ్ల వయసులోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ మహిళలకు జర్మనీలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, సాధికారిత శాఖ జిల్లా అధికారిణి రమాదేవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బి.ఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి రెండేళ్ల క్లినికల్ అనుభవం లేదా జీఎన్ఎం నర్సింగ్ పూర్తి చేసి మూడేళ్ల క్లినికల్ అనుభవం ఉండాలని చెప్పారు. ముందుగా జర్మనీ భాషలో శిక్షణ ఇచ్చి, ఆ దేశంలో ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 29వ తేదీలోగా విజయవాడ బెంజిసర్కిల్, పంట కాలువ రోడ్డులోని కార్యాలయానికి లేదా dscweontr@gmail.com మెయిల్ ఐడీకి రెజ్యూమ్, విద్యార్హతలు, కుల ధ్రువీకరణ పత్రాలు పంపాలన్నారు. మరిన్ని వివరాలకు 94402 01284, 70756 24856 చరవాణి నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

అమృత్ భారత్ స్టేషన్ల పనులు వేగవంతం



పీసీసీఎం రమేష్‌కు స్వాగతం పలుకుతున్న డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్

విజయవాడ (రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: విజయవాడ డివిజన్‌లో అమృత్ భారత్ స్టేషన్ల పనులు వేగవంతం చేయాలని దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్(పీసీసీఎం) ఎన్.రమేష్ అధికారులను ఆదేశించారు. ఒక రోజు పర్యటన నిమిత్తం విజయవాడ వచ్చిన ఆయన గురువారం డీఆర్ఎం కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్, ఇతర వాణిజ్య విభాగం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. డివిజన్ వ్యాప్తంగా 15 గూడ్స్‌షెడ్ల పనులు ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. గూడ్స్‌షెడ్ల ఆధునికీకరణ వల్ల డివిజన్ సరకు రవాణా ఆదాయం గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రయాణికుల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రపంచ స్థాయి సౌకర్యాలు కల్పించాలని కోరారు. టికెట్ తనిఖీ పనితీరును సమీక్షించారు. టీటీఈలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రైల్ మదద్ ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని అధికారులను ఆదేశించారు. ప్రయాణికుల సౌకర్యాల విషయంలో రాజీపడొద్దని సూచించారు. సిబ్బంది పనితీరును మెరుగుపర్చుకొని కమర్షియల్ ఆదాయాన్ని పెంచాలని కోరారు. కార్యక్రమంలో సీసీఎం(ఫ్రైట్ సర్వీసెస్) కె.సాంబశివరావు, సీసీఎం(ప్యాసింజర్ సర్వీసెస్) డి.సత్యనారాయణ, విజయవాడ ఏడీఆర్ఎంలు కొండా శ్రీనివాసరావు, పి.ఇ.ఎడ్విన్, సీనియర్ డీసీఎం వి.రాంబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఇబ్రహీంపట్నం గ్రామీణం 9773300487 గొల్లపూడి 8008574638

? చెవుటూరు ఉన్నత పాఠశాలలో పంచాయతీ బోరు మరమ్మతులకు గురై నీటి సరఫరా నిలిచిపోయింది. తక్షణమే మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా పునరుద్ధరించాలి. **- బి.బాలకుమారి, పీఎంసీ ఛైర్మన్** ✔ తక్షణమే సిబ్బందిని పంపి బోరు మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా పునరుద్ధరిస్తాం. **- మురళీ, పంచాయతీ కార్యదర్శి** – న్యూస్‌టుడే, జి.కొండూరు

స్పందనకు వందనం



◆ స్థానిక పంచాయతీ 7 వార్డులోని డ్రెయినేజీలో పూడిక పేరుకుపోయి మురుగు పారుదలకు ఇబ్బందిగా ఉందని స్థానికులు మేమున్నాం.. మీకు తోడుగాకు తెలిపిన సమస్యపై పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావు స్పందించారు. గురువారం సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. – న్యూస్‌టుడే, రెడ్డిగూడెం



◆ పట్టణంలోని 15వ వార్డులో రోడ్డు పక్కన చెత్తతో అపరిశుభ్రంగా ఉందని స్థానికులు మేమున్నాం.. మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును పురపాలిక కమిషనర్ కె.మనోజ దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించి పురపాలిక సిబ్బందితో శుభ్రం చేయించారు.

◆ పట్టణంలోని 7వ వార్డులో రహదారి పక్కన పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగి ఇబ్బందిగా ఉందని స్థానికులు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్‌కు తెలుపగా స్పందించి పురపాలిక కార్మికులతో పిచ్చి మొక్కలను తొలగింపజేశారు.

◆ పట్టణంలోని గ్రామ దేవత ముత్యాలమ్మ గుడికి ఎదురుగా రహదారిపై వరద నీరు నిలిచి రాకపోకలకు అసౌకర్యంగా ఉందని స్థానికులు తెలిపిన సమస్యను శానిటరీ అధికారికి వివరించగా ఆయన స్పందించి పురపాలిక కార్మికులతో రహదారిపై నీరు నిల్వలేకుండా బాగుజేయించారు. – న్యూస్‌టుడే, తిరువూరు

మానవహారాన్ని విజయవంతం చేయాలి

మైలవరం, న్యూస్‌టుడే: సెంట్రల్ సివిల్ పెన్షనర్స్ ఫోరం ఏపీ ఆధ్వర్యంలో ఈ నెల 25న విజయవాడలోని ధర్నాచౌక్‌లో నిర్వహించే మానవహారాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం ఏపీ శాఖ ఉపాధ్యక్షుడు శాగం జమిలి రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. న్యాయపరమైన డిమాండ్ల సాధనకు నిర్వహించే కార్యక్రమంలో విజయవాడ పరిసర ప్రాంతాల్లోని కేంద్ర, రాష్ట్ర పింఛన్‌దారులు పాల్గొనాలని కోరారు.

పవన్‌కల్యాణ్ అభిమానుల సందడి

మైలవరం, న్యూస్‌టుడే: ప్రముఖ సినీనటుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నటించిన తాజా చిత్రం 'హరిహర వీరమల్లు' చిత్రం విడుదల సందర్భంగా గురువారం మైలవరంలో ఆయన అభిమానులు, జనసేన కార్యకర్తలు సందడి చేశారు. ప్రధాన రహదారిపై ప్రదర్శన చేశారు. నాయకులు అక్కల రామ్మోహనరావు, శీలం బ్రహ్మయ్య, నవ్యశ్రీ, శ్రీనివాసరావు, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

జి.కొండూరు, న్యూస్‌టుడే: వాసవ్య మహిళా మండలి, దీ లీవ్ లవ్ లాఫ్ ఫౌండేషన్ సహకారంతో జి.కొండూరు మండలం కవులూరులో గురువారం నిమ్రా కళాశాల వైద్య బృందం కమ్యూనిటీ మానసిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి దాదాపు 200 మంది రోగులు హాజరు కాగా మానసిక వైద్యురాలు కామాక్షి వైద్య సేవలందించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో నిమ్రా కళాశాల వైద్యులు హర్షవర్ధన్, అస్మాతస్వీర్, శేషుమాధవ్, వాసవ్య మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

కాటన్ సేవలు మరువలేనివి



కాటన్, జాషువా చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దేవినేని

గొల్లపూడి, న్యూస్‌టుడే: గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన మహానుభావుడు సర్ ఆర్థర్ కాటన్ అని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. కాటన్ వర్ధంతిని గొల్లపూడి లోని కార్యాలయంలో గురువారం నిర్వహించి ఆయన సేవలను కొనియాడారు. ◆ సమాజంలోని మూఢాచారాలపై తన కవిత్వాన్ని ఆయుధంగా చేసుకొని, దళితుల ఆత్మగౌరవం, సమసమాజ నిర్మాణం కోసం గుర్రం జాషువా కృషి చేశారని పేర్కొన్నారు. కవి గుర్రం జాషువా వర్ధంతిని కూడా నిర్వహించి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ఆగండి.. ఇందులో ఎక్కకూడదు..!

పల్లెవెలుగు బస్సులకే పాస్‌ల అనుమతితో విద్యార్థుల ఇబ్బందులు

మైలవరం, జి.కొండూరు, న్యూస్‌టుడే

దూర గ్రామాల నుంచి మైలవరంలోని పాఠశాలలు, కళాశాలలకు హాజరయ్యే విద్యార్థులు ఆర్టీసీ బస్సుల కోసం తిప్పలు పడుతున్నారు. రాయితీపై ఇచ్చే పాస్‌లతో కేవలం పల్లెవెలుగు బస్సుల్లోనే ప్రయాణించాలన్న షరతులు ఉన్నాయి. వాటిని సడలించాలని దీర్ఘకాలంగా కోరుతుంటే, అన్నీ కావాలంటే నగదు చెల్లించాల్సిందేనంటూ ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఫలితంగా సమయానికి ఆ బస్సు అందక, తరగతులను చేరుకోలేక దండన తప్పడంలేదు.

వందల సంఖ్యలో.. మైలవరంలో ప్రభుత్వ, ప్రైవేటుతో కలిపి పది వరకు విద్యాసంస్థలు ఉన్నాయి. రెండు ప్రభుత్వ కళాశాలల్లో కలిపి సుమారు 800 మంది వరకు విద్యార్థులు చదువుతుండగా, వారిలో 300 మందికి పైగా దూర ప్రాంతాల నుంచి వచ్చేవారే. ప్రైవేటు పాఠశాలల బస్సు ఫీజులు చెల్లించలేని విద్యార్థులు సైతం ఆర్టీసీ బస్సుల్లో పాస్‌లు తీసుకుని నిత్యం మైలవరం వస్తున్నారు. ఎ.కొండూరు మండలంలోని చీమలపాడు మొదలు, కొండపల్లి, జి.కొండూరు, రెడ్డిగూడెం మండల గ్రామాల నుంచి వందల సంఖ్యలో వస్తుంటారు.

ఒకప్పుడు కాంబినేషన్ టికెట్లు: ఆర్టీసీ ఆర్డినరీగా పిలిచే పల్లెవెలుగు సర్వీసుల్లో ఎప్పుడో కోతలు పడ్డాయి. దాంతో సరిపడా బస్సులులేక విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. విజయవాడ నుంచి మైలవరం వరకు నిత్యం ప్రతి 20 నిమిషాలకొక 350 నంబరు ఆర్డినరీ సర్వీసును నడుపుతోంది. కానీ అందులో విద్యార్థులకు అనుమతి లేదు. గతంలో ఇతర బస్సుల్లో పాస్‌లున్న విద్యార్థుల నుంచి రూ.10 కాంబినేషన్ టికెట్లు ఇచ్చి అనుమతించేవారు. ప్రస్తుతం లేదంటూ బస్సు దగ్గరకే రానివ్వడంలేదని పిల్లలు వాపోతున్నారు. ఎ.కొండూరు, రెడ్డిగూడెం నుంచి వచ్చేవారికి పల్లెవెలుగు మిస్ అయితే ఇంటికి వెళ్లాల్సిందే.



బస్సు వద్ద అవస్థలు పడుతూ..

అవకాశం కల్పించాలి: రాఘవేంద్ర, ప్రభుత్వ జూనియర్ కళాశాల

జి.కొండూరు మండలం కట్టుబడిపాలెం నుంచి వస్తున్నా. పల్లెవెలుగు బస్సులు సమయానికి ఉండవు. నిత్యం ఇబ్బందిగానే రావాల్సి వస్తోంది. 350 సర్వీసు బస్సుల్లో అవకాశం కల్పించాలి.

ఆదరాబాదరా రావాల్సి వస్తోంది

- రేబాక రాణి, ఇంటర్, దాసుళ్లపాలెం

బస్సులు తక్కువగా ఉండడంతో ఉదయాన్నే ఆదరాబాదరా బయలుదేరాల్సి వస్తోంది. సాయంత్రం ఇబ్బందులే. ఎక్కువ బస్సుల్లో ప్రయాణించే అవకాశం కల్పించాలి. పల్లెవెలుగులైనా పెంచాలి.

ఆలస్యమైతే తరగతి బయటే..

- జి.సౌజన్య, ప్రభుత్వ డిగ్రీ కళాశాల

కొండపల్లి నుంచి ఉదయం 9 గంటల బస్సు తప్పితే, 10 గంటల తర్వాత బస్సుకు వెళ్లినా తరగతి గది బయటే. చాలా మంది ఇబ్బందులు పడుతున్నాం. కాంబినేషన్ టికెట్‌నైనా అనుమతించాలి.

కృష్ణవేణి పాస్‌లు తీసుకోవాల్సిందే

- సుబ్రహ్మణ్యం, వేణు, తిరువూరు, ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్లు

పల్లెవెలుగుకే అనుమతులున్నాయి. కావాలంటే డబ్బులు చెల్లించి, కృష్ణవేణి పాస్‌లు తీసుకోవాల్సిందే. సంస్థ నిర్ణయం. మేము చేసేదేమీ లేదు.

సాగు భూములకు పట్టాలివ్వాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తూ..

జి.కొండూరు, న్యూస్‌టుడే: ఏళ్ల తరబడి బంజరు, అసైన్డ్ భూములు సాగు చేస్తున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ ఇచ్చిన పిలుపు మేరకు ఆయన గురువారం జి.కొండూరులో తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లుకు ఈ సమస్యను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా సాగుదారులుగా ఉన్న పేదలకు పట్టాలివ్వకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో బుడ్డి రమేష్, గూడురు శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు



దుకాణంలో నిల్వలు తనిఖీ చేస్తున్న సబ్‌కలెక్టర్ కావూరి చైతన్య

జి.కొండూరు, న్యూస్‌టుడే: ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి నల్లబజారులో అక్రమంగా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని సబ్ కలెక్టర్ కావూరి చైతన్య దుకాణదారులను హెచ్చరించారు. కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్(గ్రోమోర్) ఎరువుల దుకాణాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిల్వ సమాచారం, బిల్లు రిజిస్టర్, ఈ పోస్‌ను పరిశీలించారు. ఈ పోస్‌లో ఆధార్ నంబర్‌తో కచ్చితంగా కొనుగోలు నమోదు చేయాలని సూచించారు. తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, ఏవో సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.2 కోట్లతో రహదారి పనులు

ఈనాడు కథనానికి స్పందన



టెంకాయ కొట్టి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

కట్టుబడిపాలెం -కవులూరు గ్రామాల మధ్యలో ఆర్ అండ్ బీ రహదారి గుంతలతో చెరువును తలపిస్తూ రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రజలు న్యూస్‌టుడే దృష్టికి తీసుకురాగా సమస్యపై ఈ నెల 19వ తేదీన 'గుంతల మార్గం.. అవస్థల నిత్యం' శీర్షిక ఈనాడులో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ప్రభుత్వ యంత్రాంగం కట్టుబడిపాలెం నుంచి పైడూరుపాడు వరకు రహదారి 1.7 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు వేసేందుకు రూ.2 కోట్లు మంజూరు చేసింది. ఈ క్రమంలో మైలవరం నియోజకవర్గం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ స్థానిక నాయకులతో కలిసి రహదారి పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. నూతన రహదారి నిర్మాణం చేపట్టడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. - న్యూస్‌టుడే, జి.కొండూరు

మత్తుకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దు

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సూచించారు. బిడ్డల భవిష్యత్తుపై తల్లిదండ్రులకు ఎన్నో ఆశలు ఉంటాయని, వారి ఆశలను సఫలం చేయాలంటే ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో శ్రద్ధగా చదవాలన్నారు. 'గంజాయిని నిర్మూలిద్దాం -యువతను కాపాడుకుందాం' అనే నినాదంతో విద్యార్థులతో బైపాస్ రోడ్డు నుంచి రాజుపేట అంబేడ్కర్ విగ్రహం వరకు గురువారం ఆయన ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. నియోజకవర్గంలోని తెదేపా నాయకులు, విద్యార్థులు పాల్గొని డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదాం, మత్తు పదార్థాలను బహిష్కరిద్దాం, చదువుపై దృష్టిపెట్టి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేరుద్దామని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరువూరు నియోజకవర్గంలో గంజాయి అనే మాట వినపడకుండా చేద్దామని, అందుకు ప్రజలు సహకరించాలన్నారు. డ్రగ్ రవాణా, విక్రయాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొంటున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ప్రదర్శనలో ఎస్సై కేవీజీవీ.సత్యనారాయణ సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.



ప్రదర్శనలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు, తెదేపా నాయకులు

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



అవగాహన కల్పిస్తున్న ఎస్సై రామకృష్ణ

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన ఉండాలని, ఆ నేరాల బారిన పడకుండా తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఎస్సై జి.రామకృష్ణ సూచించారు. మండల కేంద్రంలోని శ్రీశ్రీ డిగ్రీ కళాశాలలో గురువారం సైబర్ నేరాలు, రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. తెలియని వ్యక్తుల నుంచి సంక్షిప్త సందేశాలు, ఓటీపీలకు స్పందించవద్దని సూచించారు. చట్టాలపై కూడా అవగాహన పెంచుకోవాలని, తమ హక్కులకు భంగం కలిగినప్పుడు అధికారులకు ఫిర్యాదు చేయడం ద్వారా చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పెదకొమిర(గంపలగూడెం), న్యూస్‌టుడే: ఆడపిల్లలు ఉన్నత విద్యతో మంచి ఉద్యోగాలు, స్వయం ఉపాధి అవకాశాలు మెరుగు పరుచుకోవాలని ఎస్సై ఎ.శ్రీను సూచించారు. మండలంలోని పెదకొమిర కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో గురువారం విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

ఫల..శాకంబరి అలంకరణకు ఏర్పాట్లు



కూరగాయలను దండలుగా కడుతున్న భక్తులు

నెమలి (గంపలగూడెం), న్యూస్‌టుడే: శ్రావణమాసం సందర్భంగా మండలంలోని నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం నిర్వహించే ఫల..శాకంబరి అలంకరణకు ఆలయ అధికారులు, పాలకవర్గం ఏర్పాట్లు చేస్తున్నారు. పలువురు భక్తులు ఫలాలు, కూరగాయలు వితరణగా అందించారు. గురువారం సాయంత్రం గుడి ప్రాంగణంలో భక్తబృందం పాల్గొని అలంకరించే పనులు పూర్తి చేశారు.

బడులకు శుద్ధ జలం ఏదండీ...



చిలుకూరు ఉన్నత పాఠశాలలో పనిచేయని నీటిశుద్ధి యంత్రం

ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి కష్టాలు తీరడం లేదు. వైకాపా హయాంలో నాడు నేడు పథకంలో రూ.లక్షలు వెచ్చించి పాఠశాలల్లో నీటి శుద్ధి యంత్రాలను అమర్చిన నిర్వహణ గాలికి వదిలేయడంతో మూలకు చేరాయి. దీంతో రూ.లక్షల వ్యయం వృథా అయ్యాయి. ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలంతో పాటు కొండపల్లి పురపాలికలో 31 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో వీటిని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రెండు మూడు బడుల్లోనే పనిచేస్తున్నట్లు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. గుత్తేదారులకు పలుమార్లు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదని తెలిపారు. దీంతో విద్యార్థులు ఇంటి నుంచి సీసాలతో తాగునీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. అవి ఉదయం నుంచి సాయంత్రం వరకు సరిపోక అవస్థలు పడుతున్నారు. **- న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం**

రెండో రోజూ నిలిచిన రాకపోకలు



మండలంలోని వినగడప సమీప కట్లేరు వంతెన వద్ద రెండో రోజైన గురువారం కూడా రాకపోకలు నిలిచాయి. ఎగువన కురిసిన వర్షాలతో కట్లేరుకు చేరిన వరద నీరు వినగడప వంతెన వద్ద మళ్లింపు రహదారిపై ప్రవహిస్తోంది. దీంతో ఎస్సై శ్రీను వంతెన వద్ద ప్రమాదాల నివారణకు ముందుస్తు జాగ్రత్తగా రాకపోకలను ఆపేశారు. కట్లేరుకు వరద ప్రవాహం తగ్గితే మళ్లింపు రహదారిపై ప్రజలు, వాహనదారులు రాకపోకలు సాగించేందుకు అనుమతిస్తామన్నారు. గురువారం ఉదయం నుంచి ఎగువన వర్షం కురుస్తోంది. దీంతో శుక్రవారం కూడా మళ్లింపు రహదారిపై వరద ప్రవహిస్తుందని భావిస్తున్నారు.

- న్యూస్‌టుడే, గంపలగూడెం

స్తంభం ఒరిగింది..రక్షణ కరవైంది



ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం మార్గం వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరా స్తంభం ఒరిగిపోయింది. ఇక్కడ రెండేళ్ల కిందట పోలీస్ ఔట్‌పోస్టుగా ఓ కంటైనర్‌ను ఏర్పాటు చేశారు. అక్కడ పర్యవేక్షణ చేసేందుకు ఇద్దరు పోలీస్ సిబ్బందిని విధులు వేయగా.. అందులో భాగంగానే సీసీ కెమెరాను ఏర్పాటు చేశారు. అయితే మూన్నాళ్ల ముచ్చటగా అవుట్ పోస్టు మారిపోయి కొన్ని రోజులకే ఆ సేవలను పోలీసులు నిలిపివేశారు. పక్కనే ఏర్పాటు చేసిన సీసీ కెమెరా మరమ్మతులకు గురై స్తంభం ఒరిగిపోయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు శాఖ పునరుద్ధరించలేదు. దీనిపై పోలీసులు, పురపాలిక అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం

నేత్రాలపై శ్రద్ధ వహించాల్సిందే



స్థానికులకు కంటి వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: కంటి చూపునకు ఇబ్బంది కలిగించేలా ఉన్న జీవన విధానాన్ని గుర్తించి దానిని మార్చుకోవాలని వైద్యులు పాషా అన్నారు. ఇబ్రహీంపట్నం జాకీర్‌హుస్సేన్ కళాశాలలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రతి ఒక్కరూ సెల్‌ఫోన్, టీవీలకు ఎక్కువ సమయం కేటాస్తుండడంతో నేత్ర సమస్యలు అధికమయ్యాయన్నారు. ఇబ్రహీంపట్నం పరిసరాల్లో అధిక శాతం దుమ్ము ఉందని.. ఈ ప్రాంతంలో వారు కళ్లపై శ్రద్ధ వహించి జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం మ్యాక్స్ విజన్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్స్ జాఫర్ సాధిక్, మస్తాన్‌వలీ, న్యాయవాది నాగపవన్, సుబాని, సంతోష్, జ్యోతి, అలీ, బేగ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే ఉద్యోగాల నుంచి తొలగిస్తాం



ఉపాధి హామీ పథకం ప్రజావేదికలో మాట్లాడుతున్న అధికారులు

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడితే సంబంధిత సిబ్బందిని ఉద్యోగాల నుంచి తొలగిస్తామని డ్వామా పీడీ ఎ.రాము హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన ఉపాధి పనుల సామాజిక తనిఖీల ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.22.86 కోట్ల విలువైన 2,026 పనులు నిర్వహించారని తెలిపారు. ఈ నెల 8 నుంచి 22వ తేదీ వరకు గ్రామాల్లో జరిగిన పనులపై సామాజిక తనిఖీలు చేశారు. తనిఖీ నివేదికలను సంబంధిత సిబ్బంది ప్రజావేదికలో వెల్లడించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఉపాధి పనులను పారదర్శకంగా, బాధ్యతగా నిర్వహించాలన్నారు. లోపాలు గుర్తిస్తే బాధ్యులపై చర్యలు ఉంటాయన్నారు. మస్టర్ నిర్వహణ, కొలతల్లో వ్యత్యాసాలపై సిబ్బందిని వివరణ కోరారు. గుర్తించిన లోపాలకు సంబంధించి సదరు ఉద్యోగులకు జరిమానా విధించారు. ఏపీడీ పార్థసారథి, ఏపీవో వెంకటేశ్వరరావు, విజిలెన్స్ అధికారి రానా, సిబ్బంది పాల్గొన్నారు.

26న విస్సన్నపేటలో మెగా జాబ్‌మేళా

విస్సన్నపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని శ్రీశ్రీ డిగ్రీ కళాశాలలో శనివారం ఉదయం 9 నుంచి కేశినేని ఫౌండేషన్, ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ సీహెచ్.రాజేంద్రప్రసాద్ తెలిపారు. జాబ్ మేళాలో 20కి పైగా ప్రముఖ కంపెనీల నిర్వాహకులు పాల్గొంటారన్నారు. పది, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, బి.ఫార్మసీ, పీజీ చదివిన 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న వారు అర్హులన్నారు. జాబ్‌మేళాకు సదరు అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలతో పాల్గొనాలని చెప్పారు.

బాధితుడికి ఎల్వోసీ అందజేత

గొల్లపూడి, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న గొల్లపూడికి చెందిన బోగ్యం స్వరకుమార్ చికిత్స చేయించుకునేందుకు వీలుగా ప్రభుత్వం అందించే రూ.3లక్షల 40వేల విలువైన ఎల్వోసీని ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ గురువారం అందజేశారు. మార్కెట్‌యార్డు ఛైర్మన్ నర్రా వాసు, గ్రామ తెదేపా అధ్యక్షుడు నారదా, నాయకులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన తప్పనిసరి



పుస్తకాల ప్రదర్శనలో వ్యవసాయాధికారులు

తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు, న్యూస్‌టుడే: ఖరీఫ్ పంటల సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతు సేవా కేంద్రాల సిబ్బంది అవగాహనతో ఉండాలని జిల్లా వనరుల కేంద్రం ఉప సంచాలకులు టి.వెంకటేశ్వర్లు సూచించారు. పంటల సాగులో రసాయన ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాలకు చెందిన రైతు సేవా కేంద్రాల సిబ్బందికి గురువారం తిరువూరులో ఆయన శిక్షణ తరగతి నిర్వహించారు. పంటల సాగులో మెలకువలు, యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. సమగ్ర పోషక యాజమాన్యం, ఎర పంటలు, లింగాకర్షక బుట్టలు, పసుపు, నీలి జిగురు అట్టల ఉపయోగాలపై అవగాహన కల్పించారు. వరి, పత్తి పంటలను ఆశించే శత్రు పురుగుల జీవితచక్రం, సమగ్ర చీడపీడల యాజమాన్యంపై శిక్షణ ఇచ్చారు. ఏడీఏ ఏవీఎస్.రంగారావు, ఏవోలు పి.పద్మ, వి.హరీష్ కుమార్, బి.సాయిశ్రీ, ఎస్‌కే.టిప్పుసుల్తాన్ పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధే లక్ష్యంగా కూటమి పాలన



జి.కొండూరు: కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

జి.కొండూరు, న్యూస్‌టుడే: పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించే లక్ష్యంగా కూటమి పాలన కొనసాగుతోందని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. కట్టుబడిపాలెం గ్రామంలో గురువారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో గత ఏడాది నుంచి కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, త్వరలో అమలు చేయబోయే అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను పంచారు. జంపాల సీతారామయ్య, ఉయ్యూరు వెంకటనరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మైలవరం, న్యూస్‌టుడే: తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు లంకా లితీష్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్సీ ఏరియాలో కరపత్రాలు పంచారు.

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి 179వ బూత్ పరిధిలో గురువారం నాయకులు నరసయ్య చిమటా ప్రసాద్, బాబు తదితరుల సమక్షంలో కరపత్రాలు పంచారు.

దూండీ రాకేష్ కృషి అభినందనీయం

తిరువూరు, న్యూస్‌టుడే: ఆర్యవైశ్యుల అభివృద్ధికి రాష్ట్ర ఆర్యవైశ్య సంక్షేమ సంఘం అధ్యక్షుడు దూండీ రాకేష్ చేస్తున్న కృషి అభినందనీయమని ఆ సంఘం నాయకుడు, తిరువూరు పురపాలిక కౌన్సిలర్ నాళ్లా సురేంద్ర అన్నారు. రాకేష్ పుట్టినరోజు సందర్భంగా గురువారం పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సంఘీయుల ఆధ్వర్యంలో కేకు కోసి మిఠాయిలు పంచారు. నాయకులు జి.రాము, జి.మురళి, రామలింగేశ్వరరావు, అజయ్‌కుమార్, పండు, సాయిప్రసాద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కేకు కోస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

పండ్ల తోటల సాగుతో లబ్ధి



మాట్లాడుతున్న నారాయణరావు, అధికారులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఉపాధిహామీ పథకం ద్వారా పండ్ల తోటలు సాగు చేసి సన్న, చిన్నకారు రైతులు లబ్ధిపొందాలని తహసీల్దార్ జె.సుశీలాదేవి, ఎంపీడీవో టి.కె.వి.రమణ సూచించారు. గురువారం రుద్రవరం, మద్దులపర్వ గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో రైతులకు అవగాహన కల్పించారు. పండ్ల తోటలతో పాటు, పూలతోటల పెంపకానికి ఉపాధిహామీ పథకం ద్వారా నూరు శాతం రాయితీలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రుద్రవరం సర్పంచి జె.చాంది, ఉప సర్పంచి కృష్ణారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణ, మద్దులపర్వ సర్పంచి వి.నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అపహరణ కేసులో నిందితుడి అరెస్టు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: మండలంలోని ఒక గ్రామానికి చెందిన బాలికను అపహరించినట్లు నమోదైన కేసులో నిందితునిగా ఉన్న నూజివీడుకు చెందిన కేశినేని రమేష్‌ను అరెస్టు చేసి, తిరువూరు న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు ఎస్సై జి.రామకృష్ణ గురువారం తెలిపారు. ఈ నెల 15న విస్సన్నపేట పోలీస్‌స్టేషన్‌లో బాలిక అపహరణ కేసు నమోదైన సంగతి తెలిసిందే.

అనుమానాస్పదస్థితిలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి

పెనమలూరు, న్యూస్‌టుడే: తాడిగడపలో ఓ ట్రాక్టర్ డ్రైవర్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం గుళ్లపూడికి చెందిన చల్లా వెంకటేశ్వరరావు(30) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. కొంత కాలం నుంచి కుటుంబంతో కలిసి తాడిగడపలో నివసిస్తున్నాడు. ఈ నెల 23వ తేదీ అర్ధరాత్రి సమయంలో అతడు కుర్చీలో కూర్చొని ఉన్నట్లుండి కిందపడ్డాడని, తలకు తీవ్ర గాయం కావడంతో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారని భార్య గాయత్రి.. వెంకటేశ్వరరావు తల్లి ఇందిరమ్మకు ఫోన్‌చేసి చెప్పింది. దీంతో ఆమె తాడిగడప చేరుకొని తన కుమారుడి మృతిపై విచారణ జరపాలని కోరుతూ పెనమలూరు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. దీంతో అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సచివాలయాల సిబ్బందికి శిక్షణ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామ సచివాలయాల సిబ్బందికి రెడ్డిగూడెం మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ జె.సుశీలాదేవి, ఎంపీడీవో టి.కె.వి.రమణ, పీహెచ్‌సీ వైద్యాధికారి మణిబాబు తదితరులు పాల్గొన్నారు.

భారత్, బ్రిటన్‌ల మధ్య స్వేచ్ఛా వాణిజ్యం



భారత క్రికెటర్లు సంతకాలు చేసిన క్రికెట్ బ్యాట్‌ను విద్యార్థులకు బహుమతిగా ఇస్తున్న భారత, బ్రిటన్ ప్రధానులు మోదీ, కీర్ స్టార్మర్

(మొదటి పేజీ తరువాయి)
ప్రధాని కీర్ స్టార్మర్‌ల సమక్షంలో ఇరు దేశాల వాణిజ్య మంత్రులు ఈ మేరకు వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఎఫ్‌టీఏకు అధికారికంగా 'సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సెటా)'గా నామకరణం చేశారు. దీనిపై మోదీ స్పందిస్తూ.. "భారత్, బ్రిటన్ సంబంధాల్లో ఇదొక చరిత్రాత్మక రోజు. ఏళ్ల తరబడి చేసిన శ్రమ ఫలితంగా ఇరు దేశాల మధ్య సెటా కుదిరింది" అని పేర్కొన్నారు. మరోవైపు- ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 కల్లా రెట్టింపు చేసుకోవాలని దిల్లీ, లండన్ తాజాగా తీర్మానించుకున్నాయి. ఇప్పటికే ఉన్న సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి రాబోయే దశాబ్ద కాలంలో కొత్త ఊపునిచ్చేలా రక్షణ, సాంకేతికత, శుద్ధ ఇంధనం, మైగ్రేషన్ రంగాల్లో సంబంధాలను మరింత బలోపేతం చేసుకునేందుకు 'విజన్ 2035'ను ఆవిష్కరించాయి.

ఆర్థిక నేరగాళ్లను అప్పగించండి

బ్రిటన్ ప్రధాని నివాసమైన 'చెకర్స్'లో స్టార్మర్‌తో మోదీ భేటీ అయ్యారు. పలు ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై చర్చించారు. అనంతరం ఇద్దరు ప్రధానులు సంయుక్తంగా విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడిని ఖండించినందుకు బ్రిటన్‌కు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఉగ్రవాదంపై పోరులో ద్వంద్వ ప్రమాణాలకు తావులేదని స్పష్టం చేశారు. ఆర్థిక నేరగాళ్ల అప్పగింత సహా పలు అంశాల్లో సమన్వయ సహకారాలను మరింతగా పెంచుకునేందుకు భారత్, బ్రిటన్ భద్రతా సంస్థలు కృషిచేస్తాయన్నారు. ఆర్థిక నేరాలకు పాల్పడి పలాయనంలో ఉన్నవారికి శిక్షపడేలా చేయడంలో సహకరించాలని బ్రిటన్ ప్రధానిని కోరినట్లు తెలిపారు. విజయ్ మాల్యా, నీరవ్ మోదీ, లలిత్ మోదీ వంటి ఆర్థిక నేరగాళ్లను అప్పగించాలని లండన్‌ను దిల్లీ చాలాకాలంగా కోరుతున్న సంగతి గమనార్హం. తీవ్రవాద భావజాలమున్న శక్తులు ప్రజాస్వామిక స్వేచ్ఛను దుర్వినియోగం చేయకుండా అడ్డుకోవాల్సిన ఆవశ్యకతను మోదీ నొక్కిచెప్పారు. బ్రిటన్‌లో ఖలిస్థానీ అనుకూలవాదుల కార్యకలాపాలు పెరుగుతుండటంపై భారత్ కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఆయన తాజా వ్యాఖ్య ప్రాధాన్యం సంతరించుకుంది.

పటిష్ఠ భాగస్వామ్యం కోరుకుంటున్నాం

బ్రిటన్‌తో భారత్ బంధం గురించి మోదీ క్రికెట్ పరిభాషలో మాట్లాడారు. "కొన్నిసార్లు ప్రయత్నించి విఫలమవ్వొచ్చు. కానీ మనం ఎల్లప్పుడూ స్ట్రెయిట్ బ్యాట్‌తోనే ఆడతాం. బ్రిటన్‌తో హైస్కోరింగ్, పటిష్ఠ భాగస్వామ్యాన్ని మేం కాంక్షిస్తున్నాం' అని వ్యాఖ్యానించారు. రెండు దేశాలకూ క్రికెట్ కేవలం ఆట కాదని, ప్యాషన్ అని పేర్కొన్నారు. లండన్‌లో బకింగ్‌హాం స్ట్రీట్ క్రికెట్ హబ్ ఆటగాళ్లతో మోదీ, స్టార్మర్ కొద్దిసేపు ముచ్చటించారు. మరోవైపు- రక్షణ రంగంలో పలు కీలక ఉత్పత్తులను సంయుక్తంగా అభివృద్ధి చేసేందుకు, కలిసి తయారుచేసేందుకు భారత్, బ్రిటన్ ప్రత్యేక రోడ్‌మ్యాప్‌ను ఖరారు చేసుకున్నాయి.

ఇబ్బందేం లేదు.. ఆంగ్ల పదాలు వాడండి

స్టార్మర్ ఆంగ్లంలో మాట్లాడుతుండగా.. హిందీ అనువాదకురాలు కాస్త ఇబ్బందిపడ్డారు. అది గుర్తించిన మోదీ.. "ఇబ్బంది పడకండి. అవసరమైతే ఆంగ్ల పదాలను ఉపయోగించొచ్చు. చింతించకండి" అని పేర్కొన్నారు. అనువాదకురాలు క్షమాపణలు చెప్పగా.. పరిస్థితిని మోదీ చక్కదిద్దారు. ఇదంతా గమనించిన స్టార్మర్ చిరునవ్వులు చిందించారు.

ఇది అభివృద్ధివాద యుగం

తాజా ఎఫ్‌టీఏతో.. భారతీయ వ్యవసాయ ఉత్పత్తులు, పాదరక్షలు, ఆభరణాలు, శుద్ధిచేసిన ఆహారానికి బ్రిటన్ విపణిలో మెరుగైన ప్రవేశం లభిస్తుందని మోదీ పేర్కొన్నారు. ప్రధానంగా భారతీయ యువత, రైతులు, మత్స్యకారులతోపాటు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) ఇది లబ్ధి చేకూరుస్తుందని వివరించారు. ఉక్రెయిన్, పశ్చిమాసియాల్లో ఉద్రిక్తతలపై స్టార్మర్‌తో తాను చర్చించినట్లు వెల్లడించారు. ప్రస్తుతమున్నది విస్తరణవాద యుగం కాదని, అభివృద్ధివాద యుగమని పేర్కొన్నారు. ఐరోపా సంఘం (ఈయూ) నుంచి బయటికొచ్చిన తర్వాత బ్రిటన్ కుదుర్చుకున్న ఆర్థికంగా అతిపెద్ద, అత్యంత కీలక వాణిజ్య ఒప్పందంగా తాజా ఎఫ్‌టీఏను స్టార్మర్ పేర్కొన్నారు. ఈ ఒప్పందంతో బ్రిటన్ జీడీపీ 480 కోట్ల పౌండ్ల మేర వృద్ధి చెందుతుందని ఆ దేశ విదేశాంగ మంత్రి డేవిడ్ లామీ అంచనా వేశారు.



బ్రిటన్ ప్రధాని నివాసం చెకర్స్‌లో మోదీ, కీర్ స్టార్మర్

వాణిజ్య ఒప్పందం పూర్తి వివరాలు.. బిజినెస్ లో

రాజధానిలో స్టార్టప్ ప్రాజెక్టుకు సింగపూర్ సిద్ధంగా లేదు



మైత్రిని పునరుద్ధరించేందుకు ఆ దేశ పర్యటనకు వెళుతున్నా: చంద్రబాబు

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వంలో ఎదురైన వేధింపులను సింగపూర్ ప్రభుత్వం ఇప్పటికీ మర్చిపోలేదని, రాజధాని అమరావతిలో మళ్లీ స్టార్టప్ ప్రాంత అభివృద్ధి ప్రాజెక్టు చేపట్టేందుకు సిద్ధంగా లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వ నిర్వాకంతో దెబ్బతిన్న రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ని పునరుద్ధరించేందుకు, సింగపూర్‌తో మళ్లీ సత్సంబంధాలు నెలకొల్పేందుకు ఆ దేశ పర్యటనకు వెళుతున్నట్టు గురువారం మంత్రివర్గ సమావేశంలో ఆయన తెలిపారు. సింగపూర్ సిద్ధంగా లేదని సీఎం చెప్పినప్పుడు కారణమేంటని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అడిగారు. "సింగపూర్ సంస్థల కన్సార్షియం, అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) కలసి అమరావతిలో స్టార్టప్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు 2019కి ముందు అంతా సిద్ధమైంది. భారీ ఎత్తున పెట్టుబడులు ఆకర్షించి, ఉపాధి కల్పించడం ద్వారా రాజధాని అభివృద్ధికి ఆ ప్రాజెక్టు ఉత్ప్రేరకంగా పనిచేసేది. దాన్ని జగన్ ప్రభుత్వం చెడగొట్టింది. సింగపూర్ సంస్థలపై బురద చల్లడంతో ఏపీ అంటే వాళ్లు విరక్తి చెందారు. సింగపూర్ మొదటినుంచీ మనకు స్నేహహస్తం అందించింది. రాజధానికి మాస్టర్ ప్లాన్ ఉచితంగా ఇచ్చింది. రాష్ట్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని వారితో స్నేహ సంబంధాల్ని పునరుద్ధరించుకోవాలి. స్టార్టప్ ప్రాంత అభివృద్ధి ప్రాజెక్టు చేపట్టేందుకు ముందుకు రాకపోయినా, అమరావతి నిర్మాణంలో వారి సేవల్ని ఎక్కడ వినియోగించుకోవచ్చో చూడాలి" అని సీఎం పేర్కొన్నారు. 'ఆపోలో టైర్స్, లులు వంటి సంస్థలనూ జగన్ ప్రభుత్వం ఇబ్బందిపెట్టింది. మనకున్న విశ్వసనీయతకు అదృష్టం తోడై రాష్ట్రానికి ఇప్పుడు భారీ ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి" అని సీఎం తెలిపారు. మంత్రివర్గ సమావేశం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగింది. మొత్తం 54 ఎజెండా అంశాలపై చర్చించారు.

వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలు పెడితే ఎక్కువ రాయితీలు

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, వెనుకబడిన జిల్లాల్లో పెట్టుబడులు పెట్టేవారికి నిబంధనల్ని సడలించి ఎక్కువ రాయితీలు ఇద్దామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. "పెట్టుబడుల ప్రతిపాదనలు గడువు ప్రకారం ఆచరణలోకి వచ్చేలా ఇన్‌ఛార్జి మంత్రులు పర్యవేక్షించాలి. రాయలసీమలో ఉత్పాదక రంగ పెట్టుబడులకు అవకాశముంది. కొత్తగా తీసుకొచ్చిన ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ పాలసీ ద్వారా రాయలసీమ అభివృద్ధిపై దృష్టిపెట్టాలి" అని ఆయన తెలిపారు.

బీపీఎస్‌పై నిర్ణయం వాయిదా

అనధికారిక లేఔట్ల క్రమబద్ధీకరణ పథకానికి ఆమోదం తెలిపిన మంత్రివర్గం... అనధికారిక భవనాల క్రమబద్ధీకరణ (బీపీఎస్) అంశాన్ని తదుపరి సమావేశానికి వాయిదా వేసింది. ఎజెండాలో ఈ అంశం ప్రస్తావనకు వచ్చినప్పుడు... మంత్రి నాదెండ్ల మనోహర్ అభ్యంతరం వ్యక్తం చేసినట్టు తెలిసింది. తెనాలిలో ఒక వ్యక్తి 150 గజాల్లో ఏకంగా ఆరంతస్తుల భవనం కట్టారని, అలాంటివాటిని క్రమబద్ధీకరిస్తే ఇక నియంత్రణ ఎక్కడ ఉంటుందని ఆయన ప్రశ్నించినట్టు సమాచారం. దాంతో దీనిపై వచ్చే సమావేశంలో లోతుగా చర్చించి, ఎలా అమలుచేయాలన్న విషయంపై నిర్ణయం తీసుకోవాలని మంత్రివర్గం నిర్ణయించింది. దీనిపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. అనధికారిక భవనాల క్రమబద్ధీకరణకు ఇదే చివరి అవకాశమని స్పష్టం చేశారు. ఇకపై నిబంధనలు కఠినంగా అమలు చేస్తామని, డ్రోన్‌లను వినియోగించి అక్రమ నిర్మాణాలను ఎప్పటికప్పుడు గుర్తించి, తొలగిస్తామని తెలిపారు. నాలా చట్టం రద్దు తర్వాత.. భూ వినియోగ మార్పిడి ఫీజుల వసూళ్లను ఏ శాఖ పర్యవేక్షించాలన్న అంశాన్నీ వాయిదా వేసింది. పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల స్థలాలు కేటాయించి, ఇళ్ల నిర్మాణం చేపట్టే అంశంపై ప్రత్యేకదృష్టి పెట్టాలని సీఎం ఆదేశించారు.



పవన్‌కల్యాణ్, నారా లోకేశ్‌ల ఆత్మీయ ఆలింగనం

పవన్ కల్యాణ్‌కు అభినందనలు

ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా విడుదలైన సందర్భంగా పవన్ కల్యాణ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు అభినందనలు తెలిపారు. సమావేశానికి సీఎం రావడానికి ముందు మంత్రులు పవన్ కల్యాణ్‌ను కలిశారు. "సినిమా టాక్ ఎలా ఉంది? బాగా వచ్చిందంటున్నారు. మీ నటనే హైలైట్ అంటున్నారు" అంటూ మంత్రులు ఆయనను అభినందించారు. మంత్రి లోకేశ్ ఆయనను ఆలింగనం చేసుకుని అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి సమావేశ మందిరంలోకి వచ్చాక పవన్ కల్యాణ్‌తో కరచాలనం చేసి అభినందనలు తెలియజేశారు. సినిమాపై వస్తున్న స్పందనను పవన్ ఆయనకు వివరించారు.

మెట్రోరైల్ ప్రాజెక్టులకు నేడు టెండర్లు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో విశాఖపట్నం, విజయవాడలో మెట్రోరైల్ ప్రాజెక్టు తొలి దశ పనులకు శుక్రవారం టెండర్లు పిలవనున్నారు. వీటికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికపై కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం లభించేలోగా రాష్ట్ర వాటా నిధులతో పనుల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం రాష్ట్ర మెట్రోరైల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మొదటి దశ పనులకు టెండర్లు పిలిచి ఖరారు చేయనున్నారు. సవరించిన అంచనాల ప్రకారం విశాఖలో రూ.11,498 కోట్లతో, విజయవాడలో రూ.10,118 కోట్లతో మెట్రోరైల్ ప్రాజెక్టులు చేపట్టనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 50% చొప్పున నిధులు సమకూర్చాలి. 100% నిధులు కేంద్ర ప్రభుత్వమే సమకూర్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే లేఖ రాశారు. కూటమి ఎంపీలు కూడా ఇటీవల దిల్లీలో కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రిని కలిసి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈలోగా రెండు నగరాల్లోనూ మెట్రో రైల్ ప్రాజెక్టు పనులు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది.



అంధుల ఆశ్రమ పాఠశాల



పాఠశాలలో విద్యార్థులు

అంధ విద్యార్థుల అరణ్య రోదన!

- వసతులు, సిబ్బంది లేక అంధుల ఆశ్రమ పాఠశాల వెలవెల

హిందూపురం పట్టణం, పరిగి, న్యూస్‌టుడే: ఒకప్పుడు వెలుగు వెలిగి, అంధుల జీవితాల్లో అక్షర బాటలు వేసిన పాఠశాల అది. నేడు సరిపడా ఉపాధ్యాయులు, సిబ్బంది లేక భారంగా నడుస్తోంది. పాత వారు ఉద్యోగ విరమణ చేసి వెళ్తుంటే.. కొత్తవారిని తీసుకోవాలనే ముందుచూపు లేకపోవడం వల్ల ఉన్న వారితోనే నెట్టుకొస్తున్నారు. అదే శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం సమీపంలోని అంధుల ఆశ్రమ పాఠశాల. అంధుల జీవితాల్లో అక్షర వెలుగులు నింపాలని మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 1983లో 20 ఎకరాల్లో దీన్ని నెలకొల్పారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు అక్కడే ఉండి చదువుకునేలా వసతులు కల్పించారు. ప్రిన్సిపల్, సబ్జెక్ట్ టీచర్లు, సంగీత ఉపాధ్యాయుడు, సహాయకులు ఇలా 36 మంది ఎప్పుడూ విద్యార్థుల ఆలనాపాలనా చూడటంతో తల్లిదండ్రులూ పిల్లలను చేర్పించేందుకు ఇష్టపడేవారు. 4 దశాబ్దాల్లో ఎంతో మంది అంధులకు దారి చూపిన ఈ పాఠశాల.. ఇప్పుడు సిబ్బంది, వసతుల కొరతతో కొట్టుమిట్టాడుతోంది.

36 మందికి ఆరుగురు దిక్కు

ప్రస్తుతం ప్రిన్సిపల్, నలుగురు సబ్జెక్టు టీచర్లు, ఒక వంట మనిషి మాత్రమే బడిలో ఉన్నారు. సహాయ సిబ్బంది లేక రోజువారి పనులు చేసుకునేందుకు పిల్లలు ఇబ్బందిపడుతున్నారు. అంత పెద్ద పాఠశాలలో ఊడ్చటానికి కార్మికులు, కాపలాకు సెక్యూరిటీ గార్డు లేరు. పాఠశాల స్థితి చూసిన తల్లిదండ్రులు పిల్లలను చేర్పించేందుకు వెనుకాడుతున్నారు. ప్రస్తుతం 70 మంది విద్యార్థులే ఉన్నా.. వారి అవసరాలూ తీర్చలేకపోతున్నారు. సిబ్బందిని కొత్తగా నియమించడం లేదు. 'ఇక్కడ పని చేస్తున్న వారిలో చాలా మంది పదవీ విరమణ పొందడం, మరి కొందరు బదిలీ కావడంతో కొరత ఏర్పడింది. సిబ్బంది లేక పిల్లలు చాలా ఇబ్బందిపడుతున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామ'ని ప్రిన్సిపల్ రాజేశ్వరి తెలిపారు.

విశాఖ, విజయవాడ మెట్రోలకు కదలిక

(మొదటి పేజీ తరువాయి)
మార్గదర్శకాలకు ఆమోదం. మొత్తం 20 మిలియన్ టన్నుల సేకరణ లక్ష్యం. మొదట వచ్చిన వారి నుంచి మొదట కొనే పద్ధతికి బదులు 20 క్వింటాళ్ల వరకే కొనుగోలు. మొదట కొద్దిమొత్తంలో సరకు ఉన్న రైతుల నుంచి కొనుగోళ్లు మొదలుపెడతారు. అవసరమయితే మరిన్ని సేకరణ కేంద్రాల ఏర్పాటు. జులై 12 వరకు కొనుగోళ్లకు సంబంధించిన షెడ్యూలు యధాతథంగా అమలు. ఆ తర్వాతి నుంచి తాజా విధానాల ప్రకారం షెడ్యూల్ రూపొందించి కొనుగోళ్లు.

■ నంద్యాల జిల్లా పాణ్యం మండలంలో గోరకల్లు బ్యాలెన్సింగ్ జలాశయం మరమ్మతులకు తొలి దశ కింద రూ.53 కోట్లతో చేపట్టేందుకు ఆమోదం.

విశాఖ ఐటీ హబ్‌గా అడుగులు: విశాఖను ప్రభుత్వం ఐటీ హబ్‌గా తీర్చిదిద్దుతోంది. ఇందుకు వీలుగా వివిధ సంస్థలకు భూములు కేటాయిస్తూ నిర్ణయాలు తీసుకున్నాం. ఇది విశాఖను కీలక డేటా హబ్‌గా మలచి టెక్నాలజీ ఆధారిత సంస్థలను ఆకర్షిస్తాం. క్లౌడ్ కంప్యూటింగ్, డేటా స్టోరేజ్, డిజిటల్ సేవల్లో అభివృద్ధికి ఇది తోడ్పడుతుంది' అని మంత్రి పార్థసారథి వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పెట్టుబడులు ఆకర్షించేందుకు సింగపూర్ వెళ్తున్నారని తెలిపారు. అక్కడ రాష్ట్రం బ్రాండ్‌ను ప్రమోట్ చేస్తారని చెప్పారు.

విశాఖ అభివృద్ధికి కీలక అడుగులు

- పలు సంస్థలకు భూముల కేటాయింపులు
- పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ఉపసంహరణకు అదానీ గ్రీన్ ఎనర్జీకి అనుమతి
- మంత్రిమండలి నిర్ణయాలు

ఈనాడు, అమరావతి: విశాఖలో ఐటీ రంగం అభివృద్ధికి మంత్రిమండలి సమావేశం కీలక నిర్ణయాలను తీసుకుంది. పలు సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా భూములను కేటాయించింది. పెట్టుబడుల ప్రోత్సాహక మండలి ఆమోదం మేరకు ఈ నిర్ణయాలు తీసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.

■ మధురవాడ, రుషికొండ ఐటీ పార్కులలో ఫీనమ్ పీపుల్ సంస్థకు 4.45 ఎకరాల కేటాయింపు. ఎకరానికి రూ.4.05 కోట్ల చొప్పున వసూలు. రూ.207.50 కోట్ల విలువైన పెట్టుబడులు, 2,500 ఉద్యోగాలు కల్పించే ప్రాజెక్టులకు ప్రోత్సాహకాలు అందించేందుకు ఆమోదం. 12 నెలల్లో ఈ సంస్థ కార్యకలాపాలు ప్రారంభించాలి. తొలి ఏడాది 1,250, తర్వాత రెండేళ్లలో 1,250 ఉద్యోగాలు ఇవ్వాలి.



క్యాబినెట్ నిర్ణయాలను వెల్లడిస్తున్న మంత్రి పార్థసారథి

■ మధురవాడ ఐటీ హిల్ 3పై 3.6 ఎకరాలు ఎకరం రూ.కోటి చొప్పున, పరదేశిపాలెంలో ఎకరం రూ.50 లక్షల చొప్పున 50 ఎకరాలు సిఫీ ఇన్ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్‌కు కేటాయింపు. వారి రూ.16,466 కోట్ల పెట్టుబడుల ప్రతిపాదన, 600 ఉద్యోగాల కల్పనకు ఆమోదం.

■ మధురవాడ ఐటీ హిల్‌పై 30 ఎకరాల భూమి సత్వ డెవలపర్స్‌కు ఎకరం రూ.1.50 కోట్ల ధరకు అప్పగించేందుకు ఆమోదం. రూ.1,500 కోట్ల పెట్టుబడులతో 25 వేల ఉద్యోగాల కల్పన లక్ష్యం.

■ మధురవాడ ఐటీ హిల్ నంబరు 3పై 2.5 ఎకరాలు, హిల్ నంబరు 4పై 7.79 ఎకరాలు ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్‌కు కేటాయింపులు. రూ.1,000 కోట్ల పెట్టుబడులు, 10,000 ఉద్యోగాల కల్పన ప్రాజెక్టు ప్రతిపాదనకు ఆమోదం. ప్రోత్సాహకాల అందజేతకు నిర్ణయం.

■ ఎండాడలో 30 ఎకరాల భూమి ఎకరం 1.5 కోట్ల చొప్పున బీవీఎం ఎనర్జీ అండ్ రెసిడెన్సీ సంస్థకు కేటాయింపు. రూ.1,250 కోట్ల పెట్టుబడులు, 15 వేల ఉద్యోగాల కల్పన లక్ష్యం.

■ ఆంధ్రప్రదేశ్ అధీకృత లే అవుట్లు, ప్లాట్ల నియంత్రణ చట్టం 2020 సవరణలకు ఆమోదం.

■ అనకాపల్లి జిల్లా చెర్లోపల్లికందం గ్రామంలో 2007లో ప్రారంభించిన 58.18 ఎకరాల భూ సమీకరణ కొనసాగించేందుకు విశాఖ మెట్రోపాలిటన్ కమిషనర్‌కు అనుమతి.

■ ఖనిజాభివృద్ధి సంస్థ రూ.5,526.18 కోట్ల సబ్‌స్క్రిప్షన్ స్వీకరించడానికి 9.3% కూపన్ ధరతో బిడ్ చేయడం తదితర కార్యకలాపాలకు ఆమోదం.

■ అంతర రాష్ట్ర సరిహద్దు వివాదాలతో ప్రభావితమైన కురుకుట్టి పీఎస్‌పి (1200 మెగావాట్లు), కర్రివలస పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు (1,000 మెగావాట్లు) కేటాయింపుల రద్దుకు ఆమోదం. అదానీ గ్రీన్ ఎనర్జీ సంస్థ వాటిని ఉపసంహరించుకునేందుకు ప్రతిపాదించింది.

■ ఆంధ్రప్రదేశ్ గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ తీర్మాన ప్రతిపాదనలకు ఆమోదం.

■ నీటి పన్ను బకాయిలపై రూ.85.81 కోట్ల అసాధారణ వడ్డీ మొత్తాన్ని రైతుల నుంచి బకాయిలు వసూలు చేసేటప్పుడు మాఫీ చేసే ప్రతిపాదనకు ఆమోదం.

ఈ ఎముకల గూళ్లు.. ఓ జాతి ఆనవాళ్లు

భారీ జీవుల్లో తిమింగలాలు ఒకటి. వాటి గురించి తెలుసుకోవాలనుకుంటే విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయానికి వెళ్లాలి. ఇక్కడ ఉన్న రెండు తిమింగలాల అస్థిపంజరాలు ఉన్నాయి. చిత్రంలో ఎడమ వైపు ఉన్నది పిల్ల (బేబీ) తిమింగలానికి చెందిన అస్థిపంజరం. 1960లో కాకినాడ సముద్ర తీరానికి 27 అడుగుల పొడవున్న ఈ తిమింగలం కళేబరం కొట్టుకొచ్చింది. కుడి వైపు ఉన్నది మరో భారీ తిమింగలం పుర్రె. 80 అడుగుల పొడవున్న ఈ తిమింగలం కళేబరం 1949లో బాపట్ల సముద్ర తీరంలో దొరికింది. ఈ రెండింటి అవశేషాలను దశాబ్దాల నుంచి వర్సిటీలో భద్రపరిచి సంరక్షిస్తున్నారు.



27 అడుగుల పిల్ల తిమింగలం అస్థిపంజరం, 80 అడుగుల తిమింగలం పుర్రె

- ఈనాడు, విశాఖపట్నం; ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే

డ్వాక్రా మహిళల చేతికి డ్రోన్లు

(మొదటి పేజీ తరువాయి)
వీటిని పంపిణీ చేయాలని నిర్ణయించింది. డ్రోన్ ధర రూ.10 లక్షలు కాగా ఇందులో రూ.8 లక్షలు రాయితీగా లభిస్తుంది. మిగతా రూ.2 లక్షలను బ్యాంకు లింకేజీ లేదా స్త్రీనిధి లేదా వీవో నుంచి రుణంగా అందించాలని నిర్ణయించింది. ఇప్పటికే రాష్ట్రంలో 88 మంది లబ్ధిదారులను సెర్ప్ అధికారులు గుర్తించారు. మిగతా వారి ఎంపిక ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. త్వరలో వీటిని లబ్ధిదారులకు అందిస్తారు.

బ్యాటరీ ఆధారంగా వినియోగం..

వ్యవసాయ వినియోగానికి సంబంధించిన డ్రోన్లను కేంద్రమే వివిధ కంపెనీలను ఎంపిక చేసి ఆయా రాష్ట్రాలకు సరఫరా చేస్తుంది. ఆంధ్రప్రదేశ్‌కు డీహెచ్-ఏజీ-ఈ10 రకం డ్రోన్లను అందించనుంది. బరువు 15 కిలోల కంటే తక్కువగా ఉండటంతో వీటిని సులభంగా తీసుకెళ్లొచ్చు. ఇవి బ్యాటరీ ఆధారంగా పనిచేస్తాయి. డ్రోన్ల వినియోగంపై ప్రభుత్వమే శిక్షణ ఇప్పిస్తుంది.

ఆరోగ్యం...ఆదాయం

వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంతో రైతులకు ఆదాయం పెరగడంతోపాటు ఆరోగ్యపరంగా కూడా మేలు చేకూరనుంది. సాగుపై రైతులు మాన్యువల్‌గా రసాయనాలను పిచికారి చేయడం వల్ల వారికి వివిధ రకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పలు అధ్యయనాలు పేర్కొంటున్నాయి. అయితే డ్రోన్లను వినియోగిస్తే నేరుగా మందుల్ని పిచికారి చేయాల్సిన అవసరం ఉండదు.. అంతేకాకుండా మాన్యువల్‌గా పిచికారి చేస్తే మందుల వినియోగం ఎక్కువగా ఉంటుంది. డ్రోన్ల వినియోగంతో నిర్దిష్టంగా తెగులు సోకిన ప్రాంతంలోనే మందుల్ని పిచికారి చేయొచ్చు.

10 శాతం తగ్గనున్న రసాయనాల వినియోగం..

■ రైతులు నేరుగా పిచికారి చేయడంతో పోలిస్తే డ్రోన్ వినియోగం వల్ల 10 శాతం మేర రసాయనాల వాడకం తగ్గుతుంది.

■ డ్రోన్లను రోజుకు 8 గంటలు వినియోగించవచ్చు.

■ సమయమూ ఆదా అవుతుంది. 5-7 నిమిషాల్లోనే ఒక ఎకరంలో పిచికారి చేయొచ్చు.

■ ఇతరులకు అద్దె ప్రాతిపదికన వీటిని అందించవచ్చు. ఆ మేరకు రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుంది.

■ డ్రోన్ వినియోగానికి ఇప్పటికే పలు చోట్ల ఎకరానికి రూ.500 చొప్పున ప్రైవేటు వ్యాపారాలు అద్దె వసూలు చేస్తున్నారు.



నేల చదువులు.. ఎన్నాళ్లీ కష్టాలు?

కర్నూలు జిల్లా సి.బెళగల్ మండలం ముడుమాలలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 540 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు కింద 12 గదులు నిర్మించేలా పనులు చేపట్టారు. అప్పటికే ఉన్న భవనాలను కూల్చేశారు. నిధులు మంజూరు కాకపోవడంతో నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో విద్యార్థులు అసంపూర్తి గదుల్లో ఇసుకపై కూర్చోవాల్సి వస్తోంది. మరికొన్ని తరగతులను ఆరుబయట నిర్వహిస్తున్నారు.

- ఈనాడు, కర్నూలు, - న్యూస్‌టుడే, సి.బెళగల్

25 మండలాల్లో ఆయిల్‌పామ్ అభివృద్ధి పథకం

ఈనాడు, అమరావతి: ఆయిల్‌పామ్ అభివృద్ధి పథకం కింద 25 మండలాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. గుంటూరు జిల్లాలోని తాడికొండ, ఫిరంగిపురం, మేడికొండూరు, గుంటూరు తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, కాకుమాను, తుళ్లూరు, పెదనందిపాడు, పల్నాడులో దాచేపల్లి, గురజాల, కారంపూడి, రెంటచింతల, వెల్దుర్తి, నరసరావుపేట, నూజెండ్ల, రొంపిచర్ల, శావల్యాపురం, వినుకొండ, అచ్చంపేట, క్రోసూరు, ముప్పాళ్ల, నకరికల్లు, పెదకూరపాడు మండలాలున్నాయి.

1.09 లక్షల మందికి కొత్తగా స్పౌజ్ పింఛన్లు

ఈనాడు, అమరావతి: ఎన్టీఆర్ భరోసా పథకం కింద ఆగస్టు 1న కొత్తగా 1,09,155 మందికి స్పౌజ్ పింఛన్లు అందించనున్నట్లు సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులకు నెలకు రూ.4 వేల చొప్పున పంపిణీ చేయనున్నామని తెలిపారు.

వసుంధర

vasundhara@eenadu.in

శ్రావణలక్ష్మికి శుభ స్వాగతం



వానలతో పచ్చదనంతో ప్రకృతికాంత పులకరించే వేళ... శుభగడియల్ని వెంటపెట్టుకుని శ్రావణం శోభాయమానంగా వచ్చేసింది. ఈ మాసంతో స్త్రీలది అవినాభావ సంబంధం. పెళ్లిళ్లు, పండుగలు, నోములు, వ్రతాలు, పేరంటాలు... ఒకటేమిటి అన్నింటా మనదే సందడి. ఈ విశ్వావసు నామ సంవత్సరంలో శ్రావణమాసం శుక్రవారంతో ఆరంభమవుతోంది. ఈ నెలలో ఒక్కోరోజు ఒక్కో రూపంలో సమస్త దేవతామూర్తులనూ కొలుస్తాం. ముఖ్యంగా జగన్మాతను గౌరిగా, లక్ష్మిగా ఆరాధించి ప్రసన్నం చేసుకోవడం మన సంప్రదాయం. శాంతి, ఆహ్లాదం, ప్రసన్నత, ఆర్ద్రత, నిండుదనం, సహనం... వంటివెన్నో లక్ష్మీదేవి సుగుణాలు. వీటిని తమలోనూ పెంపొందించుకోవాలని... పూజలు, వ్రతాలు చేస్తారు. ముఖ్యంగా ఈ నెలలో వచ్చే సోమవారాలతోపాటు మంగళవారం మంగళగౌరీ నోము, శుక్రవారాల్లో వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తారు. అంతేకాదు, పౌర్ణమి రోజున ఆడపిల్లలు తమ సోదరులకు రక్షాబంధన్ కడతారు. ఎలా చూసినా ఇది... ప్రత్యక్షంగా అతివలకూ పరోక్షంగా వారి కుటుంబాలకూ శుభాలను ప్రసాదించే మాసం కాబట్టే దీన్ని స్త్రీలమాసంగానూ చెబుతారు.

– చైతన్య

అమ్మతనం... ఇలా భద్రం!

ఎంత చదువుకున్నా ఏ స్థాయికి ఎదిగినా ఎన్ని సాధించినా 'అమ్మా' అన్న పిలుపును కోరుకోని అమ్మాయిలు ఉండరు. అలాగని తమ ఆశల్నీ ఆశయాల్నీ వదులుకోలేక పెళ్లినీ పిల్లల్నీ వాయిదా వేస్తున్నారు. దాంతో వయసు మీదపడ్డాక అమ్మ కావడం కష్టంగా మారుతోంది. అందుకే ఆధునిక వైద్య విధానాల్ని అనుసరిస్తున్నారు, కోరుకున్నప్పుడే అమ్మవుతున్నారు. అలా పెరుగుతోన్న ట్రెండే ఎగ్ ఫ్రీజింగ్!





అండాలను భద్రపరచుకోవడమే ఎగ్ ఫ్రీజింగ్... ఒకప్పుడు దీని గురించి అరుదుగా వినేవాళ్లం. అదీ సంపన్నులకీ సెలెబ్రిటీలకే పరిమితం. క్రమంగా ఇదో ట్రెండ్‌గా మారింది. చదువు, కెరియర్, వ్యాపారం... ఇలా రకరకాల కారణాలతో పెళ్లినీ పిల్లల్నీ వాయిదా వేస్తోంది తరం. ఈమధ్య సాధారణంగానే జీవనశైలి తెచ్చిన మార్పులతో సంతానలేమితో బాధపడే దంపతుల సంఖ్య పెరుగుతోంది. దీనికి తోడు వయసు పెరిగితే ఈ సమస్య మరింత ఎక్కువయ్యే ప్రమాదం ఉంది. ఆ భయంతోనే అమ్మాయిలు 'ఎగ్ ఫ్రీజింగ్' లేదా 'ఓ సైట్ క్రయో ప్రిజర్వేషన్' పట్ల ఆసక్తి చూపిస్తున్నారు. క్రయో ప్రిజర్వేషన్‌లో వస్తోన్న అత్యాధునిక పద్ధతుల వల్ల కూడా దీన్ని అనుసరించే వాళ్ల సంఖ్య పెరుగుతోంది.

కెరియర్ ఒక్కటే కాదు, ఎండోమెట్రియాసిస్, జన్యు సమస్యలతో బాధపడేవాళ్లూ; క్యాన్సర్, ఇతరత్రా అనారోగ్యాలకి చికిత్స చేయించుకుంటోన్న మహిళలూ భవిష్యత్తులో తల్లి కావాలన్న ఉద్దేశంతో ఎగ్ ఫ్రీజింగ్‌ను ఎంచుకుంటున్నారు. ఈ పద్ధతిలో హైదరాబాద్, విశాఖపట్టణం వంటి నగరాల్లో అండాలు భద్రపరచుకునేందుకు వచ్చే మహిళల సంఖ్య గత రెండేళ్లతో పోలిస్తే ఇటీవల బాగా పెరిగింది. కొంతవరకూ ధర అందుబాటులోకి రావడం ఓ కారణమైతే, ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్(ఐవీఎఫ్) సక్సెస్ రేటు పెరగడం మరో కారణం.

మన తెలుగు రాష్ట్రాల్లో తొలి టెస్ట్ ట్యూబ్ బేబీ 90వ దశకంలోనే పుట్టింది. అప్పట్లో ఈ పద్ధతిలో సక్సెస్ రేటు 5-10 శాతమే. ఆ తరవాత ప్రీ ఇంప్లాంటేషన్ జెనెటిక్ టెస్టింగ్ వంటి అత్యాధునిక టెక్నాలజీలు రావడంతో ఐవీఎఫ్ ద్వారా సంతాన సాఫల్యరేటు 40-45 శాతానికి పెరిగింది. పైగా ఒకప్పుడు ఐవీఎఫ్ బేబీల పట్లా అపోహలెన్నో. నైతికత లేదనుకునేవారు. అదంతా మారిందిప్పుడు. పుట్టే పద్ధతి వేరయినా ఐవీఎఫ్ పిల్లల శారీరక, మానసిక సామర్థ్యాల్లోనూ సహజంగా గర్భం దాల్చిన బేబీల్లో మాదిరే ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఎగ్ ఫ్రీజింగ్ పెరగడానికి పరోక్షంగా ఇదీ ఓ కారణం. అమెరికాలోని సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ చేసిన ఓ అధ్యయనంలో- నలభై దాటిన మహిళల్లో తాజా అండాలతో ఐవీఎఫ్ ద్వారా 30 శాతమే గర్భం దాల్చగా, ఫ్రీజ్ చేసిన అండాలను ఉపయోగించినప్పుడే గర్భధారణ అధిక శాతంలో విజయవంతమైనట్లు తేలింది.

ఏ వయసులో మేలు?

ఎగ్ ఫ్రీజింగ్ చట్టబద్ధమే అయినప్పటికీ వయసు పెరిగేకొద్దీ అండాల సంఖ్య, నాణ్యత తగ్గుతూ వస్తాయి. అది దృష్టిలో పెట్టుకుని 21-38 ఏళ్ల వయసులోనే భద్రపరచాలి అన్న నిబంధన మనదేశంలో ఉంది. అందులోనూ 20-30ఏళ్ల వయసులో అయితే ఉత్తమం అంటున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ నగరాల్లోని సంతానోత్పత్తి క్లినిక్‌లు చాలావరకూ ఈ ఎగ్ ఫ్రీజింగ్ సేవల్ని అందుబాటులోకి తీసుకొచ్చాయి.

మొత్తమ్మీద ఎగ్ ఫ్రీజింగ్‌కయ్యే ఖర్చు ఆసుపత్రిని బట్టి యాభై వేల నుంచి రెండు మూడు లక్షల రూపాయల వరకూ ఉంటుంది. ఒకసారి నిల్వ చేశాక ఏడాదికోసారి తిరిగి వాడుకునేవరకూ ఐదు నుంచి అరవై వేల రూపాయల ఫీజు ఉండొచ్చు. కారణమేదయినా అమ్మయ్యే రోజు కోసం ముందు జాగ్రత్తగా తమ అండాల్ని భద్రపరచుకుంటోందీ తరం!

(నేడు ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవం!)

ఎలా చేస్తారు?

అండాల్ని భద్రపరచుకోవాలంటే- ముందుగా ఆమె శారీరక స్థితిని పరీక్షిస్తారు. తరవాత ఆమెలోని అండాశయాలు ఎక్కువ అండాలను ఉత్పత్తి చేసేలా ప్రేరేపిస్తారు. ఇందుకోసం ట్యాబ్లెట్లు లేదా ఇంజెక్షన్లు ఇస్తారు. ఆ సమయంలో అల్ట్రాసౌండ్ ద్వారా అండాల పెరుగుదలని పరీక్షించి, అవి అభివృద్ధి చెందాక సేకరిస్తారు. ఆపై విట్రిఫికేషన్ ద్వారా ఫ్రీజ్ చేసి, వీటిని తిరిగి వాడేవరకూ -196 డిగ్రీల వద్ద ప్రత్యేక స్టోరేజ్ ట్యాంక్‌లో నిల్వ చేస్తారు. ఇదే క్రయో ప్రిజర్వేషన్. ఇలా ఘనీభవింపచేసిన అండాలను ఎంతకాలమైనా నిల్వ చేయవచ్చు. అయితే ఎక్కువ క్లినిక్‌లు పదేళ్ల వరకూ భద్రపరుస్తున్నాయి. తల్లి కావాలనుకున్నప్పుడు ఆ అండాలను కరిగించి, స్పెర్మ్‌తో ఫలదీకరణం చేసి, ఐవీఎఫ్ ద్వారా గర్భాశయంలో ప్రవేశపెడతారు. దాంతో ముప్పై దాటినా ఆరోగ్యకరమైన పిల్లలకు జన్మనివ్వొచ్చన్నమాట.



– డా. చీపురుపల్లి వసుంధర,
సీనియర్ గైనకాలజిస్ట్ (కిమ్స్ కడల్స్)

మీకు తెలుసా?

అప్పుడే పుట్టిన శిశువుల్లో 75-78 శాతం నీరు ఉంటుందట. ఏడాది తరవాత ఈ శాతం 65కు తగ్గుతుందని పరిశోధనలు చెబుతున్నాయి.



క్రాంతి గౌడ్... లేడీ బుమ్రా!

పెద్ద నగరాల నుంచి రాలేదు... స్థితిమంతుల కుటుంబమూ కాదు. కానీ క్రికెట్ అంటే ఇష్టం. 'అమ్మాయికి క్రికెట్టా' అన్నారు ఇరుగుపొరుగు. వద్దన్నకొద్దీ పట్టుదలని పెంచుకుంది. అనతి కాలంలోనే టీమ్ ఇండియాలో కీలక క్రీడాకారిణిగా మారింది క్రాంతి గౌడ్.

ఆడుతున్నది నాలుగో మ్యాచ్... సిరీస్ విజేతను నిర్ణయించే కీలక పోటీ... ప్రత్యర్థి ఇంగ్లండ్. వాళ్ల గడ్డపైనే ఆరు వికెట్లు పడగొట్టింది 21 ఏళ్ల క్రాంతి. ఈ ఘనత సాధించిన పిన్న భారతీయ మహిళా బౌలర్. తాజాగా జరిగిన ఈ మ్యాచ్‌లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సెంచరీ చేసి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచినా, తన మెడల్‌ని క్రాంతితో పంచుకుంది. 'మాకు ఎప్పుడు వికెట్ కావాలన్నా, తనొచ్చి తీసి మ్యాచ్‌ని మలుపు తిప్పుతుంది' క్రాంతి గురించి హర్మన్ చెప్పిన మాటలివి.

స్పిన్ బౌలింగ్ తెలీదు...

క్రాంతిది మధ్యప్రదేశ్‌లోని ఛతర్‌పుర్ జిల్లా, ఘొరా గ్రామం. వీళ్ల ఇంటి ఎదురుగా అబ్బాయిలు టెన్నిస్ బాల్‌తో క్రికెట్ ఆడుతుంటే గమనించేది. బంతి ఇంటి వైపు వస్తే, తిరిగి ఇచ్చేది. 'అప్పుడే అనుకున్నా నేనూ క్రికెట్ ఆడాలని' అని చెప్పే క్రాంతి... క్రమంగా వారితో కలిసి ఆడటం మొదలుపెట్టింది. అందరూ ఫాస్ట్ బౌలింగ్ వేస్తుంటే తనూ అనుకరించింది. అసలు స్పిన్ బౌలింగ్ ఉంటుందని అప్పటికి క్రాంతికి తెలీదు. తండ్రి రిటైర్డ్ పోలీస్ కానిస్టేబుల్. ఆరుగురు సంతానంలో చివరి అమ్మాయి. 'అమ్మాయికి క్రికెట్ ఎందుకు' అని చెప్పేవారు ఇరుగుపొరుగు. కుటుంబ సభ్యులు మాత్రం ఆపలేదు. అబ్బాయిలతోనే టోర్నీలు ఆడేది. 'ఓసారి అమ్మాయిల టోర్నమెంట్ చూడ్డానికి వెళ్లినప్పుడు... టీమ్‌లో ఒకరు తక్కువైతే నన్ను ఆడమన్నారు. ఆరోజు మూడు వికెట్లు తీసి, 25 పరుగులు చేయడంతో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యా' అంటూ మొదటిసారి లెదర్‌బాల్‌తో ఆడిన మ్యాచ్‌ని గుర్తుచేసుకుంటుంది క్రాంతి. అప్పటికి తనకు 15 ఏళ్లు.

టర్నింగ్ పాయింట్...

తర్వాత ఛతర్‌పుర్‌లో క్రికెట్ అకాడమీ నడుపుతున్న రాజీవ్ బిల్తారే దగ్గరకు క్రాంతిని తీసుకువెళ్లారు ఆమె తండ్రి. క్రాంతి బంతిలో వేగాన్ని గుర్తించి అకాడమీలో చేర్చుకున్నారు రాజీవ్. ఆమె ఆర్థిక ఇబ్బందులు తెలిసి ఫీజు తీసుకోలేదు. షూస్, క్రికెట్ కిట్‌ని ఇచ్చారు. 'వేగం ఆమెకు దేవుడిచ్చిన వరం. బంతిని రెండు వైపులా స్వింగ్ చేయగలదు' అని క్రాంతి గురించి చెబుతారు రాజీవ్. ఇందౌర్‌లో జరిగిన ఓపెన్ ట్రయల్స్‌లో 17 ఏళ్లప్పుడు మధ్యప్రదేశ్ జట్టుకి ఎంపికైంది. కోచ్ చంద్రకాంత్ పండిట్ శిక్షణలో మరింత మెరుగైంది. మధ్యప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ మహిళా విభాగానికి జాయింట్ సెక్రటరీ సిధియానీ పాఠ్నీ ప్రోత్సాహం క్రాంతికి అందేది. 'సీనియర్ విమెన్స్ వన్డే ట్రోఫీ'ని 2024లో మధ్యప్రదేశ్ మొదటిసారి గెలవడంలో క్రాంతిది కీలకపాత్ర. విమెన్ ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్) 2025 సీజన్లో రూ. 10 లక్షలు చెల్లించి యూపీ వారియర్స్ ఆమెను దక్కించుకుంది. అక్కడా రాణించి మేలో టీమ్ ఇండియాకి ఎంపికైంది. ఛతర్‌పుర్ వస్తే, అకాడమీ క్రీడాకారులతో తన అనుభవ పాఠాలను పంచుకుంటుంది క్రాంతి. 'లేడీ బుమ్రా' అవుతుందంటారు క్రికెట్ విశ్లేషకులు.



క్రాంతి

'జోర్డాన్ ఫార్ములా'... ప్రయత్నించారా?

ఇష్టమైన ఆహారం ముందుంటే... నోరు కట్టుకు కూర్చోవటం అందరికీ సాధ్యమేనా? ఒకటితో మొదలుపెట్టి, తెలియకుండానే ఎక్కువ మొత్తంలో తినేస్తుంటారు చాలా మంది. ఫలితం అనారోగ్యమే కదా! అయితే, ఈ అతి ఆకలికి 'జోర్డాన్ ఫార్ములా'తో చెక్ పెట్టొచ్చు అంటున్నారు పోషకాహార నిపుణులు. మైండ్‌ఫుల్‌గా తినటమే ఈ సూత్రం ప్రధాన లక్ష్యం... ఉదాహరణకు మనకు దోశ తినాలి అనిపించినప్పుడు, ఒక దోశ తినాలి. ఆ తరవాత కూడా కావాలనిపిస్తుందనుకోండి... 'మూడో దోశ తినగలనా?' అని ప్రశ్నించుకోవాలి. తినగలను... అనుకుంటేనే రెండో దోశ వేసుకోవాలి, లేదంటే ఒకటి దగ్గరే ఆపేయాలి. ఒకవేళ మూడు దోశలు తినగలిగిన వారైతే, ఐదో దోశ కూడా తినగలనా? అని ఆలోచించుకోవాలి. తినగలనంటే నాలుగోది వేసుకోవాలి, లేదంటే మూడింటితో ఆపేయాలి. మొత్తంగా... ఇంకాస్త తినగలను అనుకున్నప్పుడే ఆపేయాలన్నమాట. దీనివల్ల మైండ్‌ఫుల్‌గా, నియంత్రణతో తినగలుగుతామట. ఎప్పుడు తిన్నా సరే... ఈ నియమం గుర్తుపెట్టుకుంటే అతి ఆకలికి చెక్ పెట్టొచ్చట.



ఓవైపు కుటుంబ బాధ్యతలు, మరో వైపు కెరియర్ లక్ష్యాలు... వీటిని సమన్వయం చేసుకోవడంలో మహిళలకు నిత్యం సవాళ్లే. అంతేకాదు, పనిచేసే చోట వివక్ష, సమాన వేతనం లేకపోవడం, నాయకత్వ స్థానాల్లో చోటు దక్కకపోవడం లాంటి సమస్యలూ ఉన్నాయి. అయినా, వీటన్నింటినీ అధిగమించి ముందుకు వెళ్లడం గొప్ప విషయం.



- ప్రతిభా ప్రహ్లాద్,
నృత్యకారిణి, విద్యావేత్త

విశ్రాంతి రోజుల్లోనూ పనే..!

'నా పని... నేను తప్ప ఇంకెవరూ చేయలేరు' 'వాళ్లకు వర్క్ అప్పజెప్పా కానీ... ఏం చేస్తారో ఏమో' 'అసలే కొత్తవాళ్లు ఫాలో అప్ చేయకపోతే తడబడుతుంటారు' మేనేజర్ స్థానాల్లో ఉండే మహిళలు ఆలోచించే విధానం ఇది. ఏ తప్పూ రాకుండా, టీమ్‌ను ముందుకు తీసుకువెళ్లడం మంచిదే కానీ... ఆ జాగ్రత్తలో మీ కోసం ఆలోచించుకోవడం మరచిపోతున్నారేమో ఒక్కసారి చూసుకోండి. కారణాలేవైనా సెలవురోజుల్లోనూ అవిశ్రాంతంగా పనిచేస్తున్నారు ఆడవాళ్లు. వీటన్నింటి పర్యవసానమే మరుసటి రోజుకి అలసటా, ఒత్తిడీ, ఆందోళనా లాంటి మానసిక సమస్యలు. అయితే ఇది ఏ ఒక్కరి సమస్యో కాదు. నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్(నాస్కామ్), అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ)ల ప్రకారం కార్పొరేట్ రంగాల్లో ఉన్న 65 శాతం మంది మహిళలు సెలవు రోజుల్లోనూ పనిచేస్తున్నారట. ఫోన్‌కాల్స్, మెయిల్స్ పేరుతో ఇంటిదగ్గరి నుంచే సేవలు అందిస్తున్నారట. చిన్న, మధ్యతరగతి సంస్థల్ని నడుపుతున్న వారైతే 70-80శాతం మంది విశ్రాంతి రోజుల్లోనూ అందుబాటులో ఉంటున్నారట. వారికి ప్రత్యామ్నాయం లేకపోవడమే ఇందుకు కారణం అంటున్నాయి సర్వేలు. అయితే ఇదంతా కనపడని శ్రమే. పేరుకే సెలవు... ఆ రోజు కూడా పనే. వర్క్‌లైఫ్ బ్యాలెన్స్ లేకపోవడమే ఇందుకు కారణం. అలా అని మీ బాధ్యతలు పూర్తిగా విస్మరించమని అనట్లేదు. మీ ఆరోగ్యం గురించి ఆలోచించమని చెప్పడమే నిపుణుల ఉద్దేశం. సెలవు రోజుల్లో గంటో రెండు గంటలో దీనికి కేటాయించమంటున్నారు. మిగిలిన సమయమంతా డిజిటల్ డీటాక్స్ పాటించమని చెబుతున్నారు. అలానే ముందుగానే వీక్ ఆఫ్ రోజున ఏం చేయాలో పక్కాగా ప్రణాళిక వేసుకోమంటున్నారు. ఇలా ప్రతి పనికీ ఓ సమయం కేటాయించుకోవడం వల్ల మన ధ్యాస దానిమీదే కేంద్రీకృతమై ఉంటుందట. మొదట్లో కాస్త కష్టంగా అనిపించినా... రానురానూ అలవాటవుతుంది. ఎంతైనా ఈ ఉరుకులు పరుగుల జీవన విధానంలో, డిజిటల్ యుగంలో మనల్ని మనం ప్రేమించుకోవడమూ అవసరమే... ప్రయత్నిస్తారు కదా!



ఎంత డిటర్జెంట్ వాడుతున్నారు?



దుస్తులు చేత్తో ఉతుకుతున్నా, వాషింగ్ మెషీన్‌లో వేస్తున్నా... మోతాదుకు మించి డిటర్జెంట్ వాడొద్దు. అలా చేస్తే డబ్బుతో పాటు వనరుల్నీ వృథా చేస్తున్నట్టే!

బట్టలకు మురికి, చెమట, మరకలు ఎక్కువగా పడితే చేత్తో ఉతికినా, వాషింగ్ మెషీన్‌లో వేసినా డిటర్జెంట్ కాస్త ఎక్కువ వేయడానికి చూస్తాం. ఈ అదనపు డిటర్జెంట్‌వల్ల అదనపు శుభ్రత లభిస్తుందన్న ఆలోచనతో ఇలా చేస్తాం. నిజానికి దీనివల్ల లాభంకంటే నష్టమే ఎక్కువట. ఎక్కువ డిటర్జెంట్ వాడటంవల్ల నురుగు అధికంగా తయారవుతుంది. కానీ దాన్ని పోగొట్టడానికి అవసరమైనట్లు వాషింగ్‌మెషీన్ ఎక్కువసార్లు తిరగలేదు. మెషీన్ లోపల దుస్తులు ఒకదానికొకటి రుద్దుకోవడంవల్లనే వాటికుండే మురికి పోతుంది. ఎక్కువ డిటర్జెంట్ ఉండటంవల్ల దుస్తులు అలా రుద్దుకోకుండా జారిపోతాయి. దాంతో అది బట్టలపైనా, వాషింగ్ మెషీన్ లోనూ మిగిలిపోతుంది. చేత్తో ఉతికినప్పుడు ఎక్కువ డిటర్జెంట్ ఉంటే ఎక్కువ నీటిని ఉపయోగించాల్సి వస్తుంది. దీనివల్ల నీరు, విద్యుత్ వృథాతోపాటు పర్యావరణానికీ నష్టమే. 'ఎక్కువ డిటర్జెంట్ ఉపయోగిస్తున్నట్టు ఎలా తెలుస్తుంద'ంటారా? ఉతకడం పూర్తయినా, దుస్తుల్ని పట్టుకుంటే కాస్త జిడ్డుగా, చేతికి అంటుకుంటున్నట్లు ఉంటాయి. బట్టలు రంగులు పోయి త్వరగా వెలిసిపోతాయి. సాధారణంగా ఒక లోడ్ వేసేటప్పుడు టేబుల్ స్పూన్ లిక్విడ్ డిటర్జెంట్ లేదా పావు కప్పు పౌడర్ వేయాలి. జాగ్రత్తగా గమనిస్తే తక్కువలో తక్కువ ఎంత వేయొచ్చో మీకే నిర్ధారణ అవుతుంది.

విషెస్‌నీ మొలకెత్తించొచ్చు

బహుమతులు, రిటర్న్ గిఫ్టులు... ఏవిచ్చినా మన విషెస్‌ని జోడిస్తూ కార్డు పెట్టడం సహజమే. చదివినప్పుడు ముఖంపై చిరునవ్వు చిందినా... తరవాత అవి చేరేది దాదాపుగా చెత్తబుట్టలోకే. వాటినీ పర్యావరణ హితంగా మార్చొచ్చు. తగ్గట్టుగా విత్తనాలతో కూడిన మెసేజ్ కార్డులు వస్తున్నాయి. కావాలని నాటినా, తెలియక చెత్తబుట్టలో పడేసినా... ప్రకృతికి మేలే జరుగుతుంది. చక్కగా మొక్కలు వచ్చేలా రూపొందించిన వీటిని ఈసారి నుంచి ప్రయత్నించండి మరి. ఇవే కాదు, పిల్లలు వాడే ఏ4 పేపర్లూ అలాగే వస్తున్నాయి. వాటిని వాడినా మేలే.



బంగారం - వెండి

24న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,02,250	92,950	1,18,470
విజయవాడ	99,310	92,550	1,18,000
ప్రొద్దుటూరు	98,900	90,990	1,17,000
రాజమహేంద్రవరం	1,00,970	92,550	1,28,000
విశాఖపట్నం	1,00,600	92,550	1,20,000
తమిళనాడు	-----	92,550	1,28,000

ఆల్ఫా జనరేషన్‌కి ఇవి నేర్పాల్సిందే...



'మా తరంలో మేమెప్పుడూ సొంత నిర్ణయాలు తీసుకోలేదు. అమ్మానాన్నలు ఏం చెబితే అది చేసేవాళ్లం' అనే ఈతరం తల్లిదండ్రులు చాలామందినే చూసుంటాం. అయితే, ఇప్పటి తరమూ అలానే ఉండాలని కోరుకోవడం మాత్రం అత్యాశే. ఎందుకంటే, అప్పటి సామాజిక వ్యవస్థ, ఆర్థికాంశాలు, కుటుంబ వాతావరణం... వంటివాటిపై ఆధారపడి పిల్లల పెంపకం ఉండేదంటున్నారు నిపుణులు. ఇప్పుడు ఆ పరిస్థితులు మారిపోయాయి. అందుకు తగ్గట్లే తల్లిదండ్రులు కూడా తమ పేరెంటింగ్ స్టైల్ మార్చాల్సిందే అని సూచిస్తున్నారు. ముఖ్యంగా ఆల్ఫా జనరేషన్ (2010-2025) పిల్లల్ని పెంచడంలో సాంకేతికతనూ అందిపుచ్చుకోవాలి అని చెబుతున్నారు. అదెలాగంటే... స్క్రీన్ సమయం నిషేధించే బదులు... వారు ఉపయోగించే యాప్‌లు, ఆడే ఆటలు, వారు చూసే వీడియోల గురించి మీరూ తెలుసుకుంటే మేలు. అప్పుడు చిన్నారులూ నియంత్రణలో ఉంటారు. మీరు వద్దనుకున్న వాటి నుంచి... వాళ్లని మళ్లించడమూ సులువవుతుంది.

దీంతోపాటే పిల్లలకు ఆన్‌లైన్ భద్రత, సైబర్ బుల్లీయింగ్ ఎదుర్కోవడం, స్క్రీన్ సమయాన్ని బ్యాలెన్స్ చేసుకోవడం వంటివి నేర్పించండి. అలానే వాళ్లు టెక్నాలజీని కేవలం కంటెంట్ చూడటానికి మాత్రమే ఉపయోగించనివ్వొద్దు. బదులుగా వీడియోలు రూపొందించడం, కథలు రాయడం, కోడింగ్ నేర్చుకోవడం... వంటివాటిపై శ్రద్ధపెట్టేలా చేయండి. అలానే, వాళ్లకేదైనా సమస్య ఎదురైతే... వెంటనే తీర్చేయకుండా వాళ్లంతట వారుగా పరిష్కారాలు వెతుక్కునేలా చేయండి. రోజువారీ జీవితంలో వాళ్ల వయసుకి తగ్గ పనులు, వాటికి ప్రత్యామ్నాయాలూ చూపించండి. మీరు కూడా పిల్లలు మాట్లాడే విషయాలను ఓపిగ్గా వినాలి. సమయం ఇవ్వాలి. అప్పుడే వాళ్ల భావోద్వేగాలను అర్థం చేసుకోగలరు.



సంప్రదాయం

మట్టిగాజులకు... కాసుల సొబగులు!








ప్రేమగా అన్నం వడ్డించేటప్పుడు... పాపాయిని ఆడించేటప్పుడు... భర్తని ఆఫీసుకి సాగనంపేటప్పుడు ఆమె ప్రేమ, ఆప్యాయతలేనా ఆకర్షించేది? మృదువుగా సవ్వడి చేసే ఆ గాజుల గలగలలూ మనసుని తాకుతాయి. పని చేస్తున్నా, విసురులే విసిరినా అవి చేసే సందడి శ్రవణానందమే. ఆ శబ్దం ఏ సంగీతానికీ తీసిపోదంటే కాదనగలరా ఎవరైనా? అందుకే తరాలెన్ని మారినా మట్టిగాజులపై అభిమానం తగ్గదు. శుభానికీ, సౌభాగ్యానికీ సూచిక. ఇవి లేకుండా అలంకరణ పూర్తి కాదు. కాబట్టే, పెళ్లి, సీమంతం, పండుగ, వ్రతం... వేడుకేదైనా అమ్మాయి చేతికి గాజుల సింగారం ఉండాల్సిందే. ఆరోగ్యానికీ మేలు చేస్తాయన్న నమ్మకం. అందుకే బంగారం, వజ్రాలతో పొదిగినవే ఉన్నా... నాలుగైనా మట్టిగాజులు తగిలిస్తేనే ముచ్చట తీరేది. పైగా ఆకుపచ్చ అదృష్టం, పసుపు సంతోషానికి చిహ్నం, ఎరుపు శక్తికి సూచిక... అంటూ ఒక్కోరంగు గాజుకీ ఒక్కో అర్థం. దాన్ని పరిశీలించుకునేవారూ చాలామందే. అసలే శ్రావణమాసం. దాంతో పాటే పెళ్లిళ్ల సందళ్లు. సంప్రదాయ వస్త్రధారణలో ఆడవాళ్లంతా మహాలక్ష్ముల్లా సిద్ధమవుతారు. అందుకోసం చీరలు, పరికిణీలు, లంగా-ఓణీలంటూ అన్నీ సిద్ధం చేసి పెట్టుకుంటారు. మరి వాటికి తగ్గట్టు గాజులూ ఉండాల్సిందే కదా! దుస్తులకు తగ్గట్టుగా రంగులు ఎంచుకోవడమైతే తప్పనిసరి. సాదా, పువ్వులు... ఏవి తీసుకోవాలి? సైడ్ గాజులు ఏవి సెట్ చేయాలన్న మీమాంస చంపేస్తోందా? అయితే వీటిని చూసేయండి. మట్టిగాజులే... కుందన్లు, కాసులు, పూసలు, రాళ్లతో సెట్లుగా ఎంత బాగా తీర్చిదిద్దారో కదా! ఏ ఫ్యాన్సీ గాజులకీ తీసిపోవంటే అతిశయోక్తి కాదేమో! చీరలకు తగ్గట్టుగా వీటిని డిజైన్ చేసిచ్చేవారూ ఆన్‌లైన్‌లో బోలెడు మంది. మీ మనసు దోచాయా? ఆ గాజుల సందడి మీ చేతుల్నీ



ఝార్ఖండ్‌లో అడవికి.. వందేళ్లుగా గిరిజనుల కాపలా

ఈటీవీ భారత్: ఝార్ఖండ్‌లోని ఖుంటీ జిల్లాలోని బురుమా అడవిని ముండా తెగకు చెందిన గిరిజనులు సొంత తల్లిలా భావిస్తూ వందేళ్లుగా సంరక్షిస్తున్నారు. ఏటా గ్రామస్థులు సమావేశమై 'బిర్ హోరో'గా (అటవీ సంరక్షకుడిగా) ఒకరిని ఎన్నుకుంటారు. ఆ ఏడాదంతా స్మగ్లర్ల నుంచి అడవులను కాపాడే బాధ్యత అతడిదే. ముర్హు బ్లాకు ప్రాంతంలోని నాలుగు గ్రామాల చుట్టూ బురుమా అడవి విస్తరించి ఉంది. ప్రస్తుతం ఆంథోనీ ఒడెయా (62) ఈ అడవిని కాపాడుతున్నాడు.



ఆంథోనీ ఒడెయా

ఉదయాన్నే ఇనుప రాడ్డు పట్టుకొని అరణ్యంలోకి బయలుదేరుతాడు. అనుమతి లేకుండా అడవి నుంచి ఎవరైనా కలపను నరికితే రూ.5,000 జరిమానా చెల్లించాలి. ఏడాదికి ఒకసారి గ్రామంలోని 110 కుటుంబాల నుంచి 10 గిన్నెల బియ్యం, కొంత నగదు అటవీ సంరక్షకుడికి ఇస్తారు.

ఇందిర రికార్డును అధిగమించనున్న మోదీ



దిల్లీ: ప్రధాని మోదీ ఒక రికార్డు సృష్టించబోతున్నారు. దేశంలో వరసగా ప్రధాని పదవిని చేపట్టి ఎలాంటి విరామం లేకుండా సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న రెండో నేతగా ఇందిరాగాంధీ పేరిట ఉన్న రికార్డును ఆయన అధిగమించబోతున్నారని అధికార వర్గాలు వెల్లడించాయి. 2014 మే 26న తొలిసారి ప్రధాని అయిన ఆయన శుక్రవారంతో 4,078 రోజులు పూర్తి చేసుకోనున్నారు. దివంగత ఇందిరాగాంధీ 24.01.1966 నుంచి 24.3.1977 వరకు 4,077 రోజులు ప్రధానిగా ఉన్నారు. దేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మొదట ఈ రికార్డు సాధించారు. వరసగా మూడు లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీలకు విజయాన్ని సాధించిన ఘనత నెహ్రూ, మోదీలకు దక్కుతుంది.

★ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా దీర్ఘకాలం కొనసాగిన ఖ్యాతి మోదీకే చెందుతుంది. 2001లో గుజరాత్ సీఎం అయిన ఆయన 2014లో ప్రధాని అయ్యేవరకు ఆ పదవిలో కొనసాగుతూ వచ్చారు. అప్పటినుంచి ప్రధానిగా ఉన్నారు.

★ స్వాతంత్ర్యానంతరం జన్మించి, దీర్ఘకాలం ప్రధానిగా ఉన్న కాంగ్రెసేతర పార్టీ తొలి నేత కూడా మోదీయే. కేంద్రంలో రెండుసార్లు పూర్తి పదవీకాలాన్ని పూర్తిచేసుకున్న కాంగ్రెసేతర పార్టీ నేత ఆయనే.

★ దేశంలో ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రులందరిలో వరసగా ఆరు ఎన్నికల్లో ఒక పార్టీపక్ష నేతగా ఎన్నికైన ఏకైక నేత నరేంద్రమోదీ. 2002, 2007, 2012లలో గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గి ఆయన సీఎం అయ్యారు. 2014, 2019, 2024 సార్వత్రిక ఎన్నికల్లో నెగ్గి ప్రధాని అయ్యారని అధికార వర్గాలు గుర్తుచేశాయి.

ముంబయి రైలు పేలుళ్ల కేసు.. హైకోర్టు తీర్పుపై సుప్రీం స్టే

నిర్దోషులుగా ప్రకటించిన వారు జైలుకు వచ్చి లొంగిపోవాల్సిన అవసరంలేదని స్పష్టీకరణ

దిల్లీ: ముంబయి రైళ్ల పేలుళ్ల కేసు(2006)లో నిందితులుగా ఉన్న 12 మందిని నిర్దోషులుగా ప్రకటిస్తూ బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు గురువారం స్టే విధించింది. అయితే స్టే ఉన్నప్పటికీ ఇప్పటికే విడుదలైన 11 మంది విడుదలపై స్టే ఇవ్వడానికి మాత్రం నిరాకరించింది. వారు మళ్లీ జైలుకొచ్చి లొంగిపోవాల్సిన అవసరం లేదని తెలిపింది. ఈ కేసులో తీర్పు మిగతా కేసులకు ఓ ప్రమాణం కాకూడదని పరిమిత ఉద్దేశంతోనే స్టే ఇచ్చినట్లు స్పష్టంచేసింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది. తీర్పును తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని, నిందితుల వాదనలు విన్న తర్వాతే నిర్ణయం తీసుకుంటామని వెల్లడించింది. ఈ కేసులో ఓ నిందితుడు ఇప్పటికే మృతి చెందాడు.

ఆసియాలో మరో చిచ్చు!

బ్యాంకాక్: ఇప్పటికే రష్యా-ఉక్రెయిన్, పశ్చిమాసియా యుద్ధాలతో ఇబ్బందిపడుతున్న ప్రపంచానికి మరో తలనొప్పి మొదలైంది. ఆసియా దేశాలైన థాయ్‌లాండ్, కంబోడియా గురువారం ఉదయం నుంచి ఘర్షణ పడుతున్నాయి. సరిహద్దుల్లో పలుచోట్ల పరస్పరం చేసుకున్న దాడుల్లో ఇప్పటివరకు థాయ్‌లాండ్‌లో 11 మంది మృతి చెందారు. చనిపోయిన వారిలో ఎక్కువ మంది సాధారణ పౌరులే ఉన్నారు. 28 మంది గాయపడ్డారు. తమకు జరిగిన నష్టం వివరాలను కంబోడియా వెల్లడించలేదు. రెండు దేశాలు.. పిరంగులు, రాకెట్లతో దాడులు చేసుకుంటున్నాయి. థాయ్‌లాండ్ వైమానిక దాడులూ చేసింది.



ఉబన్ రాట్చథాని ప్రావిన్సులో మందుపాతరల కోసం అన్వేషిస్తున్న థాయ్ సైనికులు

మందుపాతర పేలుడుతో ఉద్రిక్తత

థాయ్, కంబోడియా సరిహద్దుల్లో 6 చోట్ల దాడులు కొనసాగుతున్నాయి. థాయ్‌లాండ్ భూభాగంలోని ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్న వీడియోలు వైరలయ్యాయి. బుధవారం సరిహద్దుల్లో థాయ్‌లాండ్ భూభాగంలో మందు పాతర పేలడం ఉద్రిక్తతలకు తెరలేపింది. ఈ ఘటనలో ఐదుగురు గాయపడ్డారు. దీంతో కంబోడియాలోని తమ రాయబారిని ఉపసంహరించుకోవడంతోపాటు ఆ దేశ రాయబారిని థాయ్‌లాండ్ బహిష్కరించింది. అన్ని సరిహద్దు గేట్లను మూసివేసింది. తమ పౌరులు కంబోడియా నుంచి వెనక్కి రావాలని ఆదేశించింది. అటు కంబోడియా ఆదే చర్యలు తీసుకుంది. తమ సిబ్బందిని వెనక్కి రావాలని ఆదేశించింది.

మేలో ఘర్షణకు బీజం

మే నెలలో థాయ్‌లాండ్ దాడిలో కంబోడియన్ సైనికుడు ఒకరు మృతి చెందడం ఘర్షణ తీవ్రంగా మారడానికి కారణమైంది. గురువారం నాటి ఘర్షణలు భారీ స్థాయిలో జరిగాయి. తొలి ఘర్షణ సరిహద్దులోని థాయ్.. సురిన్ ప్రావిన్సులో ఉన్న పురాతన తా ముయెన్ థామ్ ఆలయం సమీపంలో జరిగింది. ఈ ప్రాంతం కంబోడియాలోని ఒడ్డార్ మీంచే ప్రావిన్సు సమీపంలో ఉంది.

కంబోడియా రెచ్చగొట్టింది: థాయ్

సరిహద్దుల వద్ద డ్రోన్‌ను ప్రయోగించడంతో పాటు ఆయుధాలు ధరించిన కంబోడియా సైనికులు తమ సైనికులపై దూసుకొచ్చారని, తాము హెచ్చరించినా వినలేదని థాయ్ సైన్యం వెల్లడించింది. ● కంబోడియా సైనిక స్థావరాలపై తాము వైమానిక దాడులు చేశామని థాయ్‌లాండ్ సైన్యం వెల్లడించింది. ● సైనిక, సైనికేతర ప్రాంతాలతోపాటు ఒక ఆసుపత్రిపై కంబోడియా దాడులు చేసిందని థాయ్‌లాండ్ ఆరోపించింది. ● కంబోడియా దాడుల్లో 10 మంది పౌరులతోపాటు ఒక సైనికుడు మృతి చెందారని, 28 మంది గాయపడ్డారని, అందులో నలుగురు సైనికులున్నారని థాయ్ తాత్కాలిక ప్రధాని ఫుంథామ్ వెచయాచాయ్ తెలిపారు. ● తాము కాల్పులకు దిగడానికి ముందే థాయ్‌లాండ్ డ్రోన్‌ను ప్రయోగించిందని, స్వీయ రక్షణ కోసం వెంటనే స్పందించి కాల్పులు జరపాల్సి వచ్చిందని కంబోడియా సైన్యం వెల్లడించింది.

నాలుగో రోజూ అదే తీరు

బిహార్‌పై స్తంభించిన పార్లమెంటు ● ఉభయ సభలు నేటికి వాయిదా

దిల్లీ: పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో వరసగా నాలుగోరోజూ ఎలాంటి కార్యకలాపాలు జరగలేదు. బిహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)పై ఉభయసభల్లో విపక్ష సభ్యులు మరోసారి పెద్దఎత్తున ఆక్షేపణ తెలిపి, కార్యకలాపాలను స్తంభింపజేశారు. ఉదయం ప్రారంభమైనప్పటి నుంచి వాయిదాపడుతూ వచ్చిన సమావేశాలు.. మధ్యాహ్నం భోజన విరామం తర్వాత మరోసారి సమావేశమై, వెంటనే శుక్రవారానికి వాయిదాపడిపోయాయి. ఎస్ఐఆర్‌ను ఉపసంహరించుకోవాలని రాజ్యసభలో ప్రతిపక్ష సభ్యులు నినాదాలతో హోరెత్తించారు. సముద్ర రవాణాకు సంబంధించిన బిల్లుపై చర్చను కొనసాగించడానికి సభాధ్యక్ష స్థానంలో ఉన్న భువనేశ్వర్ కలీతా ప్రయత్నించినా విపక్షాలు దానికి ఆస్కారమివ్వలేదు. పలువురు సభ్యులు సభాపతి స్థానంవద్ద బైఠాయించారు. బిల్లుపై మాట్లాడుతున్న సభ్యుల స్థానాల వద్దకు విపక్ష ఎంపీలు వెళ్లి ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా అక్కడా నినాదాలిచ్చారు. తమిళనాడుకు చెందిన ఆరుగురు సభ్యులు గురువారం రిటైరవుతున్న సందర్భంగా వారికి వీడ్కోలిచ్చిన తర్వాత మళ్లీ నిరసనలు కొనసాగాయి. 30 వాయిదా తీర్మాన నోటీసులను డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ తిరస్కరించడంపై సభ్యులు గళమెత్తారు. ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన జగదీప్ ధన్‌ఖడ్‌కు హుందాగా వీడ్కోలు పలకాలని కాంగ్రెస్ కోరినా ప్రభుత్వం నుంచి స్పందనరాలేదు. రాజ్యసభ సభ్యుడిగా నియమితుడైన ఉజ్వల్ దేవ్‌రావ్ నికం బాధ్యతలు స్వీకరిస్తూ ప్రమాణం చేశారు. లోక్‌సభలోనూ విపక్ష నిరసనలు కొనసాగాయి. ఎంతవారిస్తున్నా ప్రతిపక్ష ఎంపీలు వెల్‌లోకి దూసుకువచ్చి నినాదఫలకాలు ప్రదర్శించడంతో స్పీకర్ ఓంబిర్లా అభ్యంతరం తెలిపి.. ఏడు నిమిషాల్లోనే సభను వాయిదా వేశారు. మధ్యాహ్నం తిరిగి సమావేశమయ్యాక గోవాలో ఎస్టీ స్థానాల బిల్లుపై చర్చలో పాల్గొనాలని సభాపతి స్థానంలో ఉన్న తెన్నేటి కృష్ణప్రసాద్ కోరినా విపక్షాలు వెనక్కి తగ్గలేదు. దీంతో సభను వాయిదావేశారు.



గురువారం లోక్‌సభ కార్యకలాపాలు

కోడలిని రూ.లక్షకు అమ్మేసిన అత్తమామలు!

అర్నీ: భర్తను కోల్పోయిన కోడలికి అండగా ఉండాల్సిన అత్తమామలే ఆమెను అమ్మేసిన దారుణమైన ఘటన మహారాష్ట్రలోని యావత్మల్ జిల్లాలో చోటుచేసుకుంది. మహిళను కొనుగోలు చేసిన వ్యక్తి, రెండేళ్ల పాటు శారీరకంగా, మానసికంగా వేధించి ఓ బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత బాధితురాలిని గ్రామంలో విడిచిపెట్టి వెళ్లిపోయాడు. అర్నీ పోలీస్ స్టేషన్ ప్రాంతానికి చెందిన బాధితురాలి భర్త, కుమారుడు కొన్నేళ్ల క్రితం చనిపోయారు. ఆమె తన కుమారుడు, కుమార్తెతో అత్తమామల ఇంట్లో నివసిస్తోంది. దీంతో అత్తమామలు బాధితురాలిని అమ్మేందుకు కుట్రపన్నారు. గుజరాత్‌కు చెందిన ఓ వ్యక్తితో రూ.లక్షా ఇరవై వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ తర్వాత ఆమెను అప్పగించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నలుగురిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు వెల్లడించారు.

రష్యాలో ఘోర విమాన ప్రమాదం

- 49 మంది దుర్మరణం

మాస్కో: రష్యాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. మొత్తం 49 మందితో వెళ్తున్న ప్రయాణికుల విమానం అమూర్ ప్రాంతంలోని ఓ అడవిలో కుప్పకూలింది. విమానంలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో ఆరుగురు సిబ్బందిసహా 49 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఐదుగురు చిన్నారులున్నారు. తొలుత ఈ విమానం అదృశ్యమైనట్లు వార్తలు రాగా.. కాసేపటికే అది కూలిపోయినట్లు అధికారులు నిర్ధారించారు. అంగారా ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఏఎన్-24 విమానం గురువారం ఉదయం బ్లాగోవెషెంకో పట్టణం నుంచి చైనా సరిహద్దుల్లో ఉన్న టిండాకు బయల్దేరింది. మరికొద్ది సేపట్లో గమ్యాన్ని చేరుకుంటుందనగా రాడార్ నుంచి విమానం అదృశ్యమైంది. వెంటనే అప్రమత్తమైన అధికారులు గాలింపు చేపట్టగా గంటసేపటి తర్వాత గమ్యస్థానానికి 15 కి.మీ. దూరంలో ఉన్న అడవిలో విమాన శకలాలు కనిపించాయి. ఈ విమానం తొలుత ల్యాండింగ్‌కు ప్రయత్నించగా.. పరిస్థితులు అనుకూలించలేదు. రెండోసారి ల్యాండింగ్ చేసేందుకు ప్రయత్నిస్తుండగా.. ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రతికూల వాతావరణమా.. పైలట్ తప్పిదమా.. సాంకేతిక సమస్యలా అన్న కోణాల్లో దర్యాప్తు జరుగుతోందని అధికారులు తెలిపారు. 2018 నుంచి ఈ తరహా నాలుగు విమానాలు ప్రమాదాలకు గురయ్యాయని రష్యా పౌర విమానయాన సంస్థ మీడియాకు తెలిపింది. అదీగాక ఈ విమానాలు 50ఏళ్ల కిందటివి.



జస్టిస్ వర్మపై ఆరోపణల విచారణకు కమిటీ!

దిల్లీ: అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మపై వచ్చిన ఆరోపణల మీద విచారణకు కమిటీని ఏర్పాటు చేయాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా భావిస్తున్నట్లు సమాచారం. సభలో ఈ అంశంపై తీవ్ర వాదోపవాదాలు చోటుచేసుకుంటుండటంతో ఆయన ఈ నిర్ణయం దిశగా యోచిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. జస్టిస్ వర్మపై ఇచ్చిన అభిశంసన నోటీసు ఇప్పుడు సభ ఆస్తి అని, దానిపై ముగ్గురు సభ్యులతో కమిటీ ఏర్పాటుకు స్పీకర్ చర్చలు ప్రారంభించారని వివరించాయి. కమిటీలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గానీ.. న్యాయమూర్తిగానీ, హైకోర్టు న్యాయమూర్తి, న్యాయ కోవిదుడు సభ్యులుగా ఉండే అవకాశముంది. దీనిపై త్వరలో సీజేఐకి స్పీకర్ లేఖ రాయనున్నట్లు తెలుస్తోంది.

పాక్ డ్రోన్‌లను అడ్డుకున్న బీఎస్ఎఫ్

తుపాకులు,హెరాయిన్ ప్యాకెట్లు స్వాధీనం

చండీగఢ్: పంజాబ్‌లోని అమృత్‌సర్ జిల్లాలో సరిహద్దు దగ్గర పాకిస్థాన్ నుంచి వచ్చిన ఆరు డ్రోన్‌లను సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) అడ్డుకుంది. ఆ డ్రోన్లలో ఉన్న మూడు తుపాకులను, కిలో బరువున్న నాలుగు హెరాయిన్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుంది. గురువారం తెల్లవారుజామున జరిగిన మరో సంఘటనలో అట్టారీ గ్రామం సమీపంలో డ్రోన్‌ను అడ్డుకుని, ఓ తుపాకీ, రెండు మ్యాగజైన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు బీఎస్ఎఫ్ అధికారులు వెల్లడించారు.



నకిలీ ఓట్లను ఎలా అనుమతిస్తాం!

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్



దిల్లీ: బిహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పై విపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తున్న వేళ.. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. నకిలీ ఓటర్లను ఎలా అనుమతిస్తామంటూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియను సమర్థించుకున్నారు. గురువారం ఓ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. "మన దేశ ప్రజాస్వామ్యానికి రాజ్యాంగం తల్లి లాంటిది. దానికి అనుగుణంగానే ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంతో పాటు పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించేందుకు ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను చేపట్టాం. ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేశాం. విమర్శలు, వివాదాలకు భయపడి రాజ్యాంగానికి వ్యతిరేకంగా మేం ఎలా పని చేయగలం? చనిపోయిన ఓటర్ల పేరుతో నకిలీ ఓట్లను ఎలా అనుమతిస్తాం? శాశ్వతంగా వలస వచ్చిన వారు, రెండు ప్రాంతాల్లో ఓటు నమోదు చేసుకున్న వారు, విదేశీయులతో ఎలా ఓటు వేయిస్తాం? పారదర్శక పనితీరు కోసం ప్రక్షాళన చేయకూడదా? రాజకీయ సిద్ధాంతాలకు అతీతంగా దేశ పౌరులంతా ఈ ప్రశ్నలపై పునరాలోచన చేయాలి" అని సీఈసీ పేర్కొన్నారు.

కర్ణాటకలో ఓట్ల మోసంపై 100% రుజువులున్నాయి

- ఎన్నికల సంఘంపై రాహుల్ ఆరోపణ

దిల్లీ: కర్ణాటకలోని ఓ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఓటరు జాబితాలో జరిగిన మోసాన్ని నిరూపించడానికి తమ వద్ద వంద శాతం సాక్ష్యాలున్నాయని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ తప్పిదం నుంచి ఎన్నికల సంఘం అధికారులు తప్పించుకోలేరని దిల్లీలోని పార్లమెంటు ప్రాంగణంలో మాట్లాడుతూ హెచ్చరించారు. 'ఒక నియోజకవర్గం ఓటరు జాబితాను పరిశీలించినప్పుడు ఈ మోసాన్ని తెలుసుకున్నాం. ప్రతి నియోజకవర్గంలోనూ ఇదే తంతు కొనసాగుతోంది. 45, 50, 60, 65 సంవత్సరాలున్న వేల మంది కొత్త ఓటర్లు ఒక నియోజకవర్గం జాబితాలోకి ఎలా వచ్చారు?' అని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ఈ తప్పిదాలకు పాల్పడిన ఎన్నికల సంఘం అధికారులను తాము వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై ఎన్నికల సంఘం(ఈసీ) వెంటనే స్పందించింది. నిరాధారమైన ఆరోపణలంటూ తోసిపుచ్చింది. 'అక్రమాలు జరిగాయని భావిస్తే ఎన్నికల ప్రక్రియ ముగిసిన 45 రోజుల్లోగా హైకోర్టులో పిటిషన్ వేశారా? పిటిషన్ వేస్తే తీర్పు వచ్చే వరకూ ఆగండి. పిటిషన్ వేయకుంటే నిరాధార ఆరోపణలు చేయకండి' అని తెలిపింది. 2024 లోక్‌సభ ఎన్నికలపై నిరాధారమైన ఆరోపణలు చేయడంతో పాటు రాజ్యాంగబద్ధమైన సంస్థపై రాహుల్ గాంధీ బెదిరింపులకు దిగడం దురదృష్టకరమని ఈసీ అధికార ప్రతినిధి తెలిపారు.

ఇండియా కూటమి ఎంపీల నిరసన

ఎన్నికల సంఘం బిహార్ ఓటరు జాబితాలకు చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తూ విపక్ష ఇండియా కూటమి నేతలు, ఎంపీలు గురువారం పార్లమెంటు ప్రాంగణంలో నిరసనకు దిగారు. ఈ సవరణ కసరత్తును విరమించుకోవాలని, ఈ అంశంపై పార్లమెంటు ఉభయసభల్లో చర్చించాలని డిమాండ్ చేశారు. గురువారం నాటి సభాకార్యక్రమాల ప్రారంభానికి ముందు నిర్వహించిన ధర్నాలో కాంగ్రెస్ నేతలు సోనియా, ప్రియాంకా గాంధీ, కె.సి.వేణుగోపాల్‌తో పాటు సమాజ్‌వాదీ పార్టీ, టీఎంసీ, డీఎంకే, ఆర్జేడీ, జేఎంఎం, వామపక్ష పార్టీల ఎంపీలు పాల్గొన్నారు.



దేశానికి రెండో తరం ఆర్థిక సంస్కరణలు అవశ్యం: ఖర్గే

దిల్లీ: అత్యంత ప్రభావం చూపగల రెండో తరం ఆర్థిక సంస్కరణలను దేశంలో చేపట్టాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీ పాలనలో గత 11 ఏళ్లుగా స్వాభావికమైన జడత్వం నెలకొందని విమర్శించారు. దార్శనికత, కార్యాచరణ లోపించిన వినాశకరమైన ఆర్థిక విధానాల వల్ల అభివృద్ధి మందగించిందని తెలిపారు. దేశంలో ఆర్థిక సరళీకరణకు బాటలు వేసిన 1991 కేంద్ర బడ్జెట్‌ను ప్రస్తావిస్తూ సామాజిక మాధ్యమం 'ఎక్స్‌'లో ఖర్గే ఈ వ్యాఖ్యలు పోస్టు చేశారు.

అమెరికాలో ఆఫ్రో అమెరికన్‌పై పోలీసుల అమానుష దాడి

వాషింగ్టన్: అమెరికాలోని ఫ్లోరిడాలో ఒక ఆఫ్రో అమెరికన్ యువకునిపై పోలీసులు జరిపిన అమానుష దాడికి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. ఈ దాడిపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. బాధితుడు జాక్సన్‌విల్ (22)కు తగిలిన గాయాలు మానడానికి చాలాకాలం పట్టనుందని న్యాయవాదులు చెబుతున్నారు. కుటుంబ సభ్యులు, పౌరహక్కుల న్యాయవాదులతో కలిసి జాక్సన్‌విల్ బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఒక ట్రాఫిక్ సిగ్నల్ వద్ద తనను పోలీసులు అడ్డుకున్నారని, అది ఎందుకోసమని అడిగినందుకు కిరాతకంగా దాడి జరిపారని వివరించాడు. బాధితుని కారులో అమర్చివున్న కెమెరా ఈ దాడి ఘటన మొత్తాన్ని రికార్డు చేయడంతో విషయం బహిర్గతమైంది. ఈ సంఘటన గత ఫిబ్రవరిలో జరిగినా సోషల్ మీడియాలో గతవారం వైరల్ అయింది. దీనిపై నగర శాంతిభద్రతలను పరిరక్షించే అధికారి (షరీఫ్) అంతర్గత విచారణకు ఆదేశించారు. ఈ అంశంపై ప్రభుత్వ అటార్నీ కార్యాలయం నిర్వహించిన విచారణలో అధికారుల తప్పేమీ లేదని వెల్లడైనట్లు షరీఫ్ ప్రకటించారు. పోలీసులు బాధితుని కారు అద్దం పగలగొట్టి అతని ముఖంపై పంచ్ చేయడం, అనంతరం అతణ్ని బయటికి లాగి మళ్లీ ముఖంపై పిడిగుద్దులు కురిపించడం, నేలపై అదిమిపట్టడం వీడియోలో రికార్డు అయింది. వీడియోను తాను చూడకపోయినా పోలీసులకే మద్దతు చెబుతున్నట్లు ఫ్లోరిడా గవర్నర్ రాన్ డెసాంటిస్ అన్నారు.

6 ఎయిర్‌బ్యాగుల తప్పనిసరి పిటిషన్ కొట్టివేత

దిల్లీ: ప్రయాణికుల వాహనాల్లో ఆరు ఎయిర్‌బ్యాగులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను గురువారం సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. దీనిపై ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని, ఇది తమ పరిధిలోకి రాదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం పిటిషనర్‌కు తెలిపింది.

జడ్జీల నియామకాల్లో జాప్యంపై రెండు వారాల్లో విచారణ

కొలీజియం పునరుద్ఘాటించిన కొంతమంది న్యాయమూర్తుల నియామకాల్లో కేంద్ర ప్రభుత్వ జాప్యాన్ని ప్రశ్నిస్తూ దాఖలైన పిటిషన్లను రెండు వారాల తర్వాత విచారించేందుకు ఇదే ధర్మాసనం అంగీకరించింది. "2019, 2020, 2022లో కొంతమంది న్యాయమూర్తుల పేర్లు పునరుద్ఘాటించినా ఇప్పటికీ వారిని నియమించలేదు. నిర్ణయాలు తీసుకోవడానికి నిర్దిష్ట కాలపరిమితి ఉంటుంది. 4 ఏళ్లుగా ఈ పేర్లు పెండింగ్‌లో ఉన్నాయి. కాలం గడిచేకొద్దీ కొలీజియం సిఫార్సు చేసిన వ్యక్తి ఆసక్తి, సీనియారిటీని కోల్పోతారు. దిల్లీ, ముంబయిల్లో పేర్లు సిఫార్సు చేసిన న్యాయమూర్తులు చివరికి తమ పేర్లను ఉపసంహరించుకున్న సందర్భాలూ ఉన్నాయి" అని సీనియర్ న్యాయవాదులు అరవింద్ దతార్, ప్రశాంత్ భూషణ్‌లు పేర్కొన్నారు.

భారత్‌లో రేడియోథెరపీ సౌకర్యాల కొరత

- ఐసీఎంఆర్ అధ్యయనంలో వెల్లడి

దిల్లీ: క్యాన్సర్ చికిత్స కోసం ఉపయోగించే రేడియోథెరపీ యంత్రాల కొరత భారత్‌లో గణనీయంగా ఉన్నట్లు భారతీయ వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. క్యాన్సర్ రోగుల సంరక్షణ సేవలు అందరికీ లభ్యమయ్యేలా చూసేందుకు ఈ లోటును అధిగమించాల్సిన అవసరం ఉందని సూచించింది. 28.5 శాతం మంది క్యాన్సర్ బాధితులు మాత్రమే రేడియోథెరపీ పొందుతున్నారని పేర్కొంది. ఇది 58.4 శాతంగా ఉండాలని తెలిపింది. భారత్‌లో ఈ తరహా చికిత్స పొందుతున్నవారిలో రొమ్ము, తల, మెడ, ఊపిరితిత్తులు, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బాధితులు 60 శాతం మంది ఉన్నారని వివరించింది. ఐసీఎంఆర్ నివేదికలో ముఖ్యాంశాలివీ..

★ రానున్న కొన్నేళ్లలో రేడియోథెరపీకి డిమాండ్ పెరుగుతుంది. పేద, మధ్యాదాయ దేశాల్లో రొమ్ము, తల, మెడ, ఊపిరితిత్తుల క్యాన్సర్లు 70 నుంచి 100 శాతం పెరగొచ్చు.

★ ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్లలో భారత్ వాటా 7 శాతం. చైనా, అమెరికాల తరవాత మూడో స్థానంలో మన దేశం ఉంది.

★ ఈ ఏడాది చివరి నాటికి భారత్‌లో క్యాన్సర్ కేసులు 15.7 లక్షలకు పెరగొచ్చు. ఇది గణనీయ స్థాయిలో ప్రజారోగ్య సవాల్‌గా మారుతుంది. అకాల మరణాలకు ఇది ఐదో అతిపెద్ద కారణమవుతోంది. ఈ నేపథ్యంలో నివారణ, వ్యాధి నిర్ధారణ, చికిత్స మెరుగుపడాల్సిన అవసరం ఉంది.

★ క్యాన్సర్ చికిత్సలో రేడియోథెరపీ చాలా కీలకం. కణితి ఎదుగుదలను నియంత్రించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. శస్త్రచికిత్సకు ముందు కణితి పరిమాణాన్ని తగ్గిస్తుంది. వ్యాధి ముదిరిన దశలో ఉన్నవారికి ఇది నొప్పిని బాగా తగ్గిస్తుంది.

★ భారత్ వంటి దేశాల్లో రేడియేషన్‌థెరపీ లభ్యత పరిమితంగానే ఉంది. దీనికి సంబంధించిన యంత్రాల ఏర్పాటు, నిర్వహణ ఖర్చులు ఎక్కువగా ఉండటమే ఇందుకు కారణం.

★ ప్రతి 10 లక్షల మందికి కనీసం ఒక రేడియోథెరపీ యంత్రం ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. కానీ పది లక్షల మందికి 4 యంత్రాలు ఉండటం సబబని పేర్కొంది.

★ ఈ లెక్కన భారత్‌లో కనీసం 1,450 యంత్రాలు ఉండాలి. అయితే ప్రస్తుతం 794 మెగావోల్టేజ్ యంత్రాలే అందుబాటులో ఉన్నాయి. మొత్తంమీద 45 శాతం కొరత ఉంది. భారత్‌కు 1,585 నుంచి 2,545 వరకూ యంత్రాలు అవసరం.



ఆషాఢ అమావాస్య సందర్భంగా ముంబయిలో గురువారం దీపాల ముందు ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

రెండు తలలతో శిశువు జననం

ఇందౌర్: మధ్యప్రదేశ్‌లోని ఇందౌర్‌లో ఓ ప్రభుత్వాసుపత్రిలో రెండు తలలతో ఆడశిశువు జన్మించింది. ఈ శిశువుకు ఒకే మొండెం, రెండు గుండెలున్నాయి. ఒక గుండె ఏమాత్రం ఎదగలేదు. రెండోదానిలో చాలా లోపాలు కనిపిస్తున్నాయి. 22 ఏళ్ల మహిళ మంగళవారం ఈ శిశువుకు జన్మనిచ్చింది. పాపాయి బరువు 2.8 కిలోలు. ఆమెకు శిశువుల ప్రత్యేక ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. శ్వాస తీసుకోవడంలో ఆ చిన్నారి పలు సమస్యలు ఎదుర్కొంటోంది. ప్రాణాధార వ్యవస్థపై చికిత్స అందిస్తున్నారు.

తేజస్వి నోట ఎన్నికల బహిష్కరణ మాట

పట్నా: బిహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) వివాదాస్పదంగా మారిన నేపథ్యంలో రాబోయే శాసనసభ ఎన్నికల్ని బహిష్కరించే విషయంపై ఆలోచిస్తామని రాష్ట్ర శాసనసభలో ప్రతిపక్షనేత, ఆర్జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ గురువారం నొక్కిచెప్పారు. శాసనసభ ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. "సమయం వచ్చినపుడు కూటమి సభ్యులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటాం. బిహార్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో పెద్ద మోసం జరుగుతోంది. నమోదు పత్రాలపై ఓటర్ల తరఫున బూత్ స్థాయి అధికారులే సంతకాలు పెట్టేస్తున్నారు. ఖాళీ ఓటరు నమోదు పత్రాలను చిత్తు కాగితాల్లా వాడుతున్నారు. ఈ అంశాలను లేవనెత్తుతున్న జర్నలిస్టులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నారు" అని తేజస్వీ ఆరోపించారు.

అమిత్‌షాకు నీతీశ్‌పై నమ్మకం పోయింది

"కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్‌పై నమ్మకం పోయింది. జేడీ(యూ) అధ్యక్షుని నాయకత్వంలో రానున్న శాసనసభ ఎన్నికలు జరుగుతాయని నీతీశ్ పదేపదే చెప్తున్నారు. ఏ ముఖ్యమంత్రి నేతృత్వంలో ఎన్నికలు జరుగుతాయన్నది కాలమే నిర్ణయిస్తుంది. ఒకవేళ నీతీశ్ నాయకత్వంపై అమిత్‌షాకు నమ్మకం ఉంటే ఆయన 2030 దాకా ముఖ్యమంత్రిగా కొనసాగుతారని ప్రకటించమనండి" అని బిహార్ ప్రతిపక్ష నాయకుడు యాదవ్ అన్నారు

తేజస్వీకి ఎన్నికల భయం: ఎన్డీయే


ప్రతిపక్షం ఎన్నికలకు ముందే ఓటమిని అంగీకరించిందని అధికార ఎన్డీయే కూటమి గురువారం పేర్కొంది. ఎన్నికల్ని బహిష్కరించే విషయాన్ని పరిశీలిస్తున్నామంటూ తేజస్వీ వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఎన్డీయే ఈ మేరకు స్పందించింది. 'ఎన్నికల్లో ఓడిపోతున్నామని తేజస్వీ భావిస్తున్నారు. వారి మోసం బయట పడిపోయింది కాబట్టే ఎన్నికల్ని బహిష్కరిస్తామని అంటున్నారు' అని ఎన్డీయే పేర్కొంది.

ఎస్ఐఆర్ పిచ్చి తుగ్లక్ విధానం

బిహార్‌లో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ పిచ్చి తుగ్లక్ విధానంగా అభివర్ణించింది. ఈ సవరణను వీలైన అన్ని వేదికలపై తీవ్రంగా వ్యతిరేకిస్తామని ఆ పార్టీ స్పష్టం చేసింది.

దక్షిణాఫ్రికాలో ఏనుగు దాడి.. సీఈవో మృతి

ఇంటర్నెట్ డెస్క్: దక్షిణాఫ్రికాలో విలాసవంతమైన గోండ్వానా ప్రైవేటు గేమ్ రిజర్వుకు సీఈవోగా వ్యవహరిస్తున్న ఎఫ్.సి.కాన్రాడీ (39) ఏనుగు దాడిలో ప్రాణాలు కోల్పోయారు. దక్షిణాఫ్రికా ఎకోటూరిజంలో ఈయన అందరికీ సుపరిచితులు. రోజూలాగే టూరిస్టు లాడ్జిలకు దూరంగా ఏనుగుల గుంపును అదిలిస్తుండగా.. అందులో ఒకటి విపరీతంగా ప్రవర్తించింది. కాన్రాడీని తన దంతాలతో నెట్టి, పలుమార్లు తొక్కింది. పక్కనే ఉన్న రేంజర్లు కాపాడేందుకు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.



గోండ్వానా ప్రైవేటు గేమ్ రిజర్వు అనేది ఫైవ్ స్టార్ సఫారీ లాడ్జి. బిగ్ ఫైవ్ (ఆఫ్రికా సింహం, ఏనుగు, చిరుతపులి, కేప్ బఫెలో, ఖడ్గ మృగం)లను చూసే అనుభూతి కోసం పలువురు ప్రముఖులు, పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు.

చాంపియన్

నాలుగో టెస్టులో టీమ్‌ఇండియా వెనుకబడింది. జోరుమీదున్న ఇంగ్లాండ్‌ను ఆపడం ఇక సవాలే. సిరీస్‌లో నిలవాలంటే కనీసం డ్రా అయినా చేసుకోవాల్సిన భారత జట్టు.. మాంచెస్టర్‌లో కష్ట పడుతోంది. ఆతిథ్య జట్టు పట్టుబిగించడానికి ప్రయత్నిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్‌ను 358 పరుగులకే పరిమితం చేసిన ఇంగ్లాండ్.. బజ్‌బాల్ ఆటతో దూసుకుపోతోంది. ఆ జట్టు రెండే వికెట్లు కోల్పోయి 225 పరుగులు చేసింది. పంత్ గాయం భారత్ పరిస్థితిని మరింత క్లిష్టంగా మారుస్తోంది.

వెనుకబడ్డారు..

- 358కి ఆలౌటైన భారత్
- దంచేస్తున్న ఇంగ్లాండ్; 225/2

- మెరిసిన డకెట్, క్రాలీ

మాంచెస్టర్

నాలుగో టెస్టులో టీమ్‌ఇండియా గట్టి పరీక్షను ఎదుర్కొంటోంది. రెండో రోజు ఆధిపత్యాన్ని ప్రదర్శించిన ఇంగ్లాండ్.. మంచి ఆధిక్యం దిశగా సాగుతోంది. ఓపెనర్లు డకెట్ (94; 100 బంతుల్లో 13×4), క్రాలీ (84; 113 బంతుల్లో 13×4, 1×6) చెలరేగడంతో గురువారం ఆట ముగిసే సమయానికి ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 2 వికెట్ల నష్టానికి 225 పరుగులు చేసింది. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 264/4తో మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్.. 358 పరుగులకు ఆలౌటైంది. గాయంతో ఇబ్బందిపడుతూనే పంత్ అర్ధశతకం (54) పూర్తి చేశాడు. చేతిలో 8 వికెట్లున్న ఇంగ్లాండ్ ఇంకా 133 పరుగులు మాత్రమే వెనుకబడి ఉంది. మూడో రోజు ఆ జట్టును భారత్ ఎంత మేర కట్టడి చేయగలదన్నదానిపైనే మ్యాచ్ గమనం ఆధారపడి ఉంది. ఈ మ్యాచ్‌తో భారత పేసర్ అన్షుల్ కాంబోజ్ అరంగేట్రం చేశాడు.

ఇంగ్లాండ్ జోరు: మూడో టెస్టులో బజ్‌బాల్‌ను పక్కన పెట్టిన ఇంగ్లాండ్ మాంచెస్టర్‌లో మళ్లీ తనదైన శైలిలో బ్యాటుకు పనిచెప్పింది. ధనాధన్ బ్యాటింగ్‌తో స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. ఓపెనర్లు డకెట్, క్రాలీ భారత బౌలర్లను అలవోకగా ఎదుర్కొన్నారు. ఏమాత్రం అవకాశం చిక్కినా బంతిని బౌండరీ దాటించిన ఈ జంట.. అయిదుకు పైగా రన్‌రేట్ స్కోరు బోర్డును నడిపించింది. కొత్త బంతిని భారత బౌలర్లు సద్వినియోగం చేసుకోలేకపోయారు. లంచ్ విరామానికి ఇంగ్లాండ్ 77/0తో నిలవగా.. విరామం తర్వాత కూడా బ్యాటర్ల జోరు కొనసాగింది. డకెట్ 46 బంతుల్లో, క్రాలీ 73 బంతుల్లో అర్ధశతకాలు సాధించారు. శార్దూల్ ఠాకూర్ మరింత ధారాళంగా పరుగులిచ్చాడు. 5 ఓవర్లలో ఏకంగా 35 పరుగులు సమర్పించుకున్నాడు. జడేజా తొలి ఓవర్లో క్రాలీ సిక్స్, ఫోర్ బాదేశాడు. చూస్తుండగానే స్కోరు 150 దాటేసింది. ఓపెనర్లు సెంచరీలు చేసేలా కనిపించారు. కానీ జోరుమీదున్న క్రాలీని జడేజా ఔట్ చేసి, 166 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యాన్ని విడదీయడంతో ఎట్టకేలకు భారత్‌కు ఊరట లభించింది. అయినా డకెట్ ఆగలేదు. బౌండరీల వేట కొనసాగించాడు. అయితే సెంచరీ ముంగిట అతణ్ని అరంగేట్ర బౌలర్ కాంబోజ్ ఔట్ చేయడంతో భారత్ ఖాతాలో రెండో వికెట్ చేరింది. రూట్, పోప్ మరో వికెట్ పడనివ్వలేదు. బుమ్రా పరుగులు తక్కువగానే ఇచ్చినా వికెట్ల వేటలో విజయవంతం కాలేకపోయాడు.

లోయర్ ఆర్డర్ విఫలం: ఉదయం 264/4తో ఇన్నింగ్స్ కొనసాగించిన టీమ్‌ఇండియా.. ఆశించిన స్కోరు చేయలేకపోయింది. లోయర్ ఆర్డర్ మరోసారి నిరాశపరిచింది. గురువారం రెండో ఓవర్లోనే భారత్‌కు గట్టి దెబ్బ తగిలింది. రోజు ఆరంభంలోనే ఇంగ్లాండ్ రెండో కొత్త బంతిని ఎంచుకోగా, ఓవర్‌నైట్ వ్యక్తిగత స్కోరుకు ఒక్క పరుగే జత చేసిన జడేజా (20).. జోఫ్రా ఆర్చర్ ఔట్‌స్వింగర్‌కు రెండో స్లిప్‌లో బ్రూక్‌కు దొరికిపోయాడు. కానీ మరో ఓవర్‌నైట్ బ్యాటర్ శార్దూల్ ఠాకూర్ (41), వాషింగ్టన్ సుందర్ (27) చక్కని బ్యాటింగ్‌తో ఇన్నింగ్స్‌ను నడిపించారు. కఠిన పరిస్థితుల్లో ఇంగ్లాండ్ పేస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. జట్టు స్కోరును మూడొందలు దాటించారు. ఓ దశలో భారత్ 314/5తో మెరుగ్గానే కనిపించింది. కానీ లంచ్‌కు కొద్దిసేపు ముందు శార్దూల్ ఔట్ కావడంతో పతనం వేగంగా సాగింది. శార్దూల్ (ఓవర్‌నైట్ 19)ను వెనక్కి పంపడం ద్వారా 48 పరుగుల ఆరో వికెట్ భాగస్వామ్యాన్ని స్టోక్స్ విడదీశాడు. ప్రేక్షకుల చప్పట్ల మధ్య పంత్ (ఓవర్‌నైట్ 37) కుంటుతూనే క్రీజులోకి వచ్చాడు. కష్టంగా సింగిల్స్ తీశాడు. లంచ్ వేళకు భారత్ 321/6తో నిలిచింది. విరామం తర్వాత ఆట మొదలయ్యాక ఇన్నింగ్స్ ఎంతోసేపు సాఫీగా సాగలేదు. స్టోక్స్ ఒకే ఓవర్లో సుందర్, అన్షుల్ కాంబోజ్ (0)ను ఔట్ చేసి భారత్‌ను దెబ్బతీశాడు. ఆర్చర్ ఓవర్లో ఓ సిక్స్, స్టోక్స్ బౌలింగ్‌లో ఓ ఫోర్‌తో అర్ధశతకం పూర్తి చేసిన పంత్.. ఆ తర్వాత ఎక్కువ సేపు నిలువలేదు. ఆర్చర్ బౌలింగ్‌లోనే బౌల్డయ్యాడు. ఆర్చర్ తన తర్వాతి ఓవర్లో బుమ్రా (4)ను ఔట్ చేయడంతో భారత్ ఇన్నింగ్స్‌కు తెరపడింది. టీమ్‌ఇండియా 44 పరుగుల వ్యవధిలో చివరి 5 వికెట్లు చేజార్చుకుంది. ఇంగ్లాండ్ కెప్టెన్ స్టోక్స్ 2017 తర్వాత తొలిసారి 5 వికెట్ల ఘనత సాధించడం విశేషం.



శార్దూల్ 41



పంత్ 54



డకెట్ 94 క్రాలీ 84

భారత్ తొలి ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (సి) బ్రూక్ (బి) డాసన్ 58; రాహుల్ (సి) క్రాలీ (బి) వోక్స్ 46; సాయి సుదర్శన్ (సి) కార్స్ (బి) స్టోక్స్ 61; శుభ్‌మన్ గిల్ ఎల్బీ (బి) స్టోక్స్ 12; పంత్ (బి) ఆర్చర్ 54; జడేజా (సి) బ్రూక్ (బి) ఆర్చర్ 20; శార్దూల్ (సి) డకెట్ (బి) స్టోక్స్ 41; వాషింగ్టన్ సుందర్ (సి) వోక్స్ (బి) స్టోక్స్ 27; అన్షుల్ కాంబోజ్ (సి) స్మిత్ (బి) స్టోక్స్ 0; బుమ్రా (సి) స్మిత్ (బి) ఆర్చర్ 4; సిరాజ్ నాటౌట్ 5; ఎక్స్‌ట్రాలు 30 మొత్తం: (114.1 ఓవర్లలో ఆలౌట్) 358; **వికెట్ల పతనం:** 1-94, 2-120, 3-140, 4-235, 5-266, 6-314, 7-337, 8-337, 9-349; **బౌలింగ్:** వోక్స్ 23-5-66-1; ఆర్చర్ 26.1-3-73-3; కార్స్ 21-1-71-0; స్టోక్స్ 24-3-72-5; డాసన్ 15-1-45-1; రూట్ 5-0-19-0

ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలీ (సి) రాహుల్ (బి) జడేజా 84; డకెట్ (సి) జురెల్ (బి) కాంబోజ్ 94, పోప్ బ్యాటింగ్ 20; రూట్ బ్యాటింగ్ 11; ఎక్స్‌ట్రాలు 16 మొత్తం: (46 ఓవర్లలో 2 వికెట్లకు) 225; **వికెట్ల పతనం:** 1-166, 2-197; **బౌలింగ్:** బుమ్రా 13-4-37-0; అన్షుల్ కాంబోజ్ 10-1-48-1; సిరాజ్ 10-0-58-0; శార్దూల్ 5-0-35-0; జడేజా 8-0-37-1

ఇక ట్రోఫీ మనకే..

- చెస్ ప్రపంచకప్ ఫైనల్లో హంపి
- మరో భారత క్రీడాకారిణి దివ్యతో ఢీ

బాటుమి (జార్జియా)

ఇప్పటిదాకా ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్‌లో ఏ భారత క్రీడాకారిణీ సెమీస్ చేరిన చరిత్రే లేదు. అలాంటిది ఈ ఏడాది ట్రోఫీయే భారత్ సొంతం కాబోతోంది. ఈసారి ప్రపంచకప్‌లో ఫైనల్ చేరిన ఇద్దరు క్రీడాకారిణులూ భారతీయులే కావడం విశేషం. అందులో ఒకరు తెలుగమ్మాయి కోనేరు హంపి. ఈ గ్రాండ్‌మాస్టర్ సెమీస్‌లో అద్భుత ప్రదర్శనతో ఫైనల్‌కు దూసుకెళ్లింది. చైనా క్రీడాకారిణి లీ టింగ్ జీతో సెమీస్‌లో హంపి రెండు గేమ్‌లనూ డ్రాగా ముగించడంతో టైబ్రేక్ అనివార్యమైంది. గురువారం టైబ్రేక్‌లో హంపి 5-3తో విజయం సాధించింది. సుదీర్ఘంగా సాగిన 8 గేమ్‌ల్లో ఇద్దరూ హోరాహోరీగా తలపడగా.. చివరికి హంపినే పైచేయి సాధించింది. మరో భారత క్రీడాకారిణి, ఇంటర్నేషనల్ మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్‌తో హంపి ఫైనల్లో తలపడనుంది. శని, ఆదివారాల్లో వీరి మధ్య రెండు రౌండ్ల పోరాటాలు జరుగతాయి. అందులో ఫలితం రాకపోతే సోమవారం టైబ్రేక్ జరుగుతుంది. సెమీస్‌లో దివ్య.. చైనాకే చెందిన జాంగ్‌యిని ఓడించిన సంగతి తెలిసిందే. హంపి గత ఏడాదే ప్రపంచ ర్యాపిడ్ ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది. ఇప్పుడు ప్రపంచకప్‌లో ఛాంపియన్ అయ్యే దిశగా అడుగులేస్తోంది. కెరీర్ రికార్డు, అనుభవం ప్రకారం చూస్తే హంపినే టైటిల్‌కు ఫేవరెట్ అనడంలో సందేహం లేదు. అయితే ప్రస్తుత టోర్నీలో అంచనాలను మించి రాణించి, అగ్రశ్రేణి క్రీడాకారిణులను ఓడించిన దివ్యను తక్కువగా అంచనా వేయడానికి వీల్లేదు.



హంపి

సిరీస్ నుంచి పంత్ ఔట్!

- జగదీశన్‌కు పిలుపు!

మాంచెస్టర్: ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో ఇప్పటికే వెనుకబడ్డ టీమ్‌ఇండియాకు గట్టి ఎదురు దెబ్బతగిలింది. గాయం కారణంగా నాలుగో టెస్టులో అతడిక వికెట్ కీపింగ్ చేయడు. ఇంకా అధికారికంగా ప్రకటించలేదు కానీ.. అయిదో టెస్టుకు కూడా అతడు దూరమైనట్లే. తొలి రోజు ఇంగ్లాండ్ పేసర్ క్రిస్ వోక్స్ బంతిని రివర్స్‌స్వీప్ చేసే ప్రయత్నంలో పంత్ గాయపడ్డ సంగతి తెలిసిందే. పాదానికి దెబ్బ తగలడంతో అతడు 37 పరుగుల వద్ద రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరిగాడు. "మాంచెస్టర్ టెస్టు తొలి రోజు గాయపడ్డ రిషబ్ పంత్ ఈ మ్యాచ్‌లో ఇక వికెట్‌కీపింగ్ చేయడు. ధ్రువ్ జురెల్ ఆ బాధ్యతలు స్వీకరిస్తాడు. గాయమైనప్పటికీ పంత్ రెండో రోజు జట్టుతో చేరాడు. అవసరాన్ని బట్టి బ్యాటింగ్‌కు వస్తాడు" అని రెండో రోజు పంత్ బ్యాటింగ్‌కు దిగడానికి ముందు బీసీసీఐ ఎక్స్‌లో పేర్కొంది. శార్దూల్ ఔటయ్యాక పంత్ క్రీజులోకి వచ్చాడు. గాయమైన పాదానికి రక్షణ కోసం అతడు మూన్ బూట్ (ఆర్థోపెడిక్ బూట్) ధరించాడు. అసౌకర్యంగా కనిపించిన పంత్.. ఎక్కువసేపేమీ నిలువలేదు. అర్ధశతకం పూర్తి చేశాక ఆర్చర్ బౌలింగ్‌లో బౌల్డయ్యాడు. పంత్ పాదంలో చీలిక వచ్చినట్లు స్కానింగ్‌లో తేలిందని సమాచారం. గాయం నుంచి కోలుకోవడానికి అతడికి కనీసం ఆరు వారాల విశ్రాంతి అవసరమవుతుందని తెలుస్తోంది. సిరీస్‌లో పంత్‌కు ఇది రెండో గాయం. మూడో టెస్టు సందర్భంగా కీపింగ్ చేస్తుండగా అతడి వేలికి గాయమైంది. గాయం కారణంగా టీమ్‌ఇండియా ఇప్పటికే నితీశ్ కుమార్‌రెడ్డిని కోల్పోయిన సంగతి తెలిసిందే. ఫాస్ట్‌బౌలర్లు అర్ష్‌దీప్, ఆకాశ్‌దీప్ గాయాల కారణం నాలుటో టెస్టుకు దూరమయ్యారు.

అతడికి అవకాశం!: పంత్ ఇక సిరీస్‌లో ఆడే అవకాశం లేకపోవడంతో సెలక్టర్లు ముందు జాగ్రత్త చర్యగా అయిదో టెస్టు కోసం తమిళనాడు వికెట్‌కీపర్ బ్యాటర్ జగదీశన్‌ను ఎంపిక చేయనున్నట్లు సమాచారం. బీసీసీఐ ఇంకా అధికారికంగా ప్రకటించలేదు కానీ.. అతడు ఇంగ్లాండ్ బయల్దేరనున్నాడు. 29 ఏళ్ల జగదీశన్ ఇప్పటివరకు 52 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 47.50 సగటుతో 3373 పరుగులు చేశాడు. ఇందులో 14 అర్ధశతకాలు, 10 శతకాలు ఉన్నాయి. గత రంజీ సీజన్‌లో 56.16 సగటుతో 674 పరుగులు చేశాడు. పంత్ స్థానంలో ఇషాన్ కిషన్‌ను ఎంపిక చేస్తారని మొదట భావించారు. కానీ అతడు కూడా గాయంతో బాధపడుతున్నాడు.

సింధుకు ఉన్నతి షాక్



ఉన్నతి


చాంగ్‌జౌ: చైనా ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత యువ షట్లర్, ప్రపంచ 35వ ర్యాంకర్ ఉన్నతి హుడా సంచలనం సృష్టించింది. డబుల్ ఒలింపిక్ పతక విజేత, భారత స్టార్ క్రీడాకారిణి పి.వి.సింధుకు ఉన్నతి షాకిచ్చింది. గురువారం హోరాహోరీగా సాగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్‌ఫైనల్లో ఉన్నతి 21-16, 19-21, 21-13తో 15వ ర్యాంకర్ సింధును ఓడించింది. 73 నిమిషాల పాటు పోరాడిన 17 ఏళ్ల ఉన్నతి తన కెరీర్‌లో తొలిసారిగా సూపర్ 1000 టోర్నీలో క్వార్టర్స్‌లో అడుగుపెట్టింది. అంతర్జాతీయ టోర్నీలో తోటి భారత క్రీడాకారిణి చేతిలో సింధు ఓడటం ఏడేళ్లలో ఇదే మొదటి సారి. 2018 కామన్వెల్త్ క్రీడల ఫైనల్లో సైనా నెహ్వాల్ చేతిలో సింధు పరాజయం చవిచూసింది. 2022లో ఒడిషా మాస్టర్స్, 2023లో అబుదాబి మాస్టర్స్ (సూపర్ 100 టైటిళ్లు) గెలిచిన ఉన్నతి.. క్వార్టర్స్‌లో రెండు సార్లు ప్రపంచ ఛాంపియన్, మూడో సీడ్ అకానె యమగూచి (జపాన్)తో తలపడనుంది. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్- చిరాగ్‌శెట్టి జోడీ క్వార్టర్స్‌లోకి దూసుకెళ్లింది. ప్రిక్వార్టర్స్‌లో సాత్విక్- చిరాగ్ జోడీ 21-19, 21-19తో లియో రోలీ- బాగాస్ మౌలానా (ఇండోనేసియా) జంటపై విజయం సాధించింది. క్వార్టర్స్‌లో ఆంగ్ యూ సిన్- తియో యీ (మలేసియా) జంటతో సాత్విక్- చిరాగ్ జోడీ పోటీపడనుంది. పురుషుల సింగిల్స్‌లో హెచ్.ఎస్.ప్రణయ్ పోరాటం ముగిసింది. ప్రిక్వార్టర్స్‌లో ప్రణయ్ 21-18, 15-21, 8-21తో చౌ తీన్ చెన్ (చైనీస్ తైపీ) చేతిలో పరాజయం చవిచూశాడు.

ఫైనల్లో అడ్వాణీ ఓటమి

ప్రపంచ 6-రెడ్ స్నూకర్

మనామా (బహ్రెయిన్): ప్రపంచ 6-రెడ్ స్నూకర్ టైటిల్‌ను భారత దిగ్గజ క్యూయిస్ట్ పంకజ్ అడ్వాణీ త్రుటిలో కోల్పోయాడు. ఫైనల్లో అతను 4-5తో 16 ఏళ్ల యువ సంచలనం రిలీ పావెల్ (వేల్స్) చేతిలో పరాజయం పాలయ్యాడు. పంకజ్ గురువారమే 40వ పుట్టిన రోజు జరుపుకున్నాడు. అతను సెమీస్‌లో భారత్‌కే చెందిన ఆదిత్య మెహతాపై విజయం సాధించాడు.

పాక్‌కు ఊరట విజయం



సల్మాన్ మీర్జా

మీర్పూర్: బంగ్లాదేశ్‌కు టీ20 సిరీస్‌ను కోల్పోయిన పాకిస్థాన్.. నామమాత్రమైన మూడో మ్యాచ్‌లో ఘనవిజయం సాధించి ఊరట పొందింది. గురువారం ఆ జట్టు 74 పరుగుల తేడాతో బంగ్లాను చిత్తు చేసింది. మొదట సాహిబ్‌జాదా ఫర్హాన్ (63; 41 బంతుల్లో 6×4, 5×6), హసన్ నవాజ్ (33; 17 బంతుల్లో 1×4, 3×6), మహ్మద్ నవాజ్ (27; 16 బంతుల్లో 2×4, 2×6) మెరుపులు మెరిపించడంతో పాక్ 7 వికెట్లకు 178 పరుగులు చేసింది. బంగ్లా బౌలర్లలో తస్కిన్ అహ్మద్ (3/38), నసుమ్ అహ్మద్ (2/22) రాణించారు. అనంతరం సల్మాన్ మీర్జా (3/20), ఫహీమ్ అష్రాఫ్ (2/13), మహ్మద్ నవాజ్ (2/4) విజృంభించడంతో బంగ్లా 16.4 ఓవర్లలో 104 పరుగులకే కుప్పకూలింది. సైఫుద్దీన్ (35) టాప్‌స్కోరర్.

5 టీ20లు, 3 వన్డేలు

వచ్చే ఏడాదిలో ఇంగ్లాండ్‌లో ఆడనున్న భారత్

మాంచెస్టర్: పరిమిత ఓవర్ల క్రికెట్ సిరీస్ కోసం టీమ్‌ఇండియా వచ్చే ఏడాది ఇంగ్లాండ్‌లో పర్యటించనుంది. ఈ పర్యటనలో ఇంగ్లాండ్‌తో అయిదు టీ20లు, మూడు వన్డేలు ఆడుతుంది. ఈ విషయాన్ని ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు గురువారం ప్రకటించింది. జులై 1న టీ20 మ్యాచ్‌తో 2026లో భారత జట్టు ఇంగ్లాండ్ పర్యటన మొదలవుతుంది. మాంచెస్టర్ (జులై 4)లో రెండో టీ20, నాటింగ్‌హామ్ (జులై 7)లో మూడో టీ20 జరుగుతాయి. చివరి రెండు మ్యాచ్‌లకు బ్రిస్టల్ (జులై 9), సౌథాంప్టన్ (జులై 11) ఆతిథ్యమిస్తాయి. జులై 14 (బర్మింగ్‌హామ్), జులై 16 (కార్డిఫ్), జులై 19 (లార్డ్స్)వ తేదీల్లో వన్డే మ్యాచ్‌లు జరుగుతాయి. వచ్చే ఏడాది భారత మహిళల జట్టు కూడా ఇంగ్లాండ్‌లో పర్యటిస్తుంది. అక్కడ మూడు టీ20 మ్యాచ్‌లు, ఒక టెస్టు మ్యాచ్ ఆడుతుంది. మే 28, మే 30, జూన్ 2వ తేదీల్లో టీ20 మ్యాచ్‌లు జరుగుతాయి. ఏకైక టెస్టు జులై 10న లార్డ్స్‌లో మొదలవుతుంది.

యూఏఈలో ఆసియా కప్‌కు బీసీసీఐ ఆతిథ్యం

దిల్లీ/ఢాకా: ఆసియా కప్ నిర్వహణపై సందిగ్ధత వీడినట్లే. ఈ టీ20 టోర్నీ ఆతిథ్యానికి బీసీసీఐ సంసిద్ధత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అయితే భారత్‌లో కాకుండా యూఏఈలో ఆసియా కప్‌ను నిర్వహించే అవకాశం ఉన్నట్లు ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) వర్గాలు తెలిపాయి. ఈ టోర్నీలో భారత్, పాకిస్థాన్ మధ్య మ్యాచ్ కూడా జరిగే అవకాశాలున్నాయి. గురువారం ఢాకాలో జరిగిన ఏసీసీ సమావేశంలో 25 సభ్య దేశాలు పాల్గొని వేదిక గురించి చర్చించాయి. బీసీసీఐ ప్రతినిధిగా ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా సమావేశంలో వర్చువల్‌గా పాల్గొన్నాడు. "యూఏఈలో జరిగే ఆసియా కప్‌కు బీసీసీఐ ఆతిథ్యమిస్తుంది. భారత్ తన మ్యాచ్‌లన్నీ దుబాయ్‌లో ఆడే అవకాశముంది. షెడ్యూల్‌పై చర్చలు జరుగుతున్నాయి" అని ఏసీసీ వర్గాలు పేర్కొన్నాయి. సెప్టెంబరు చివరి వారంలో వెస్టిండీస్‌తో భారత్ టెస్టు సిరీస్ ప్రారంభం కానున్న నేపథ్యంలో అంతకుముందే ఆసియా కప్ జరగొచ్చు.

క్వార్టర్స్‌లో తన్వి, వెన్నెల


ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్



తన్వి

సోలో (ఇండోనేసియా): భారత యువ షటర్లు తన్వి శర్మ, వెన్నెల కలగొట్ల ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో క్వార్టర్స్‌కు చేరుకున్నారు. రెండో సీడ్ తన్వి మహిళల సింగిల్స్‌లో 21-19, 21-14తో షి చెన్ (చైనా)పై, 21-14, 21-15తో ఫనాచెట్ (థాయ్‌లాండ్)పై విజయాలు సాధించి ముందంజ వేసింది. వెన్నెల సైతం వరుసగా రెండు విజయాలతో క్వార్టర్స్‌లో అడుగు పెట్టింది. పురుషుల డబుల్స్‌లో భార్గవ్ రామ్-విశ్వతేజ్ జోడీ సెమీస్ చేరింది. ఈ ద్వయం క్వార్టర్స్‌లో 21-15, 21-15తో హరు-షోగో (జపాన్) జంటను ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో రౌనక్ చౌహాన్, అన్ష్ నేగి ప్రిక్వార్టర్స్‌లో అడుగు పెట్టారు. మహిళల డబుల్స్‌లో వెన్నెల, రేషిక జోడీ కూడా ప్రిక్వార్టర్స్‌కు చేరుకుంది.

కివీస్ చేతిలో జింబాబ్వే చిత్తు



ఇష్ సోధి

హరారె: ముక్కోణపు టీ20 సిరీస్‌లో నామమాత్రమైన చివరి లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ 60 పరుగుల తేడాతో ఆతిథ్య జింబాబ్వేను చిత్తు చేసింది. గురువారం టిమ్ సీఫర్ట్ (75; 45 బంతుల్లో 9×4, 1×6), రచిన్ రవీంద్ర (63; 39 బంతుల్లో 7×4, 2×6), మైకేల్ బ్రాస్‌వెల్ (26 నాటౌట్; 16 బంతుల్లో 2×4, 1×6) మెరుపులు మెరిపించడంతో మొదట కివీస్ 6 వికెట్లకు 190 పరుగులు చేసింది. జింబాబ్వే బౌలర్లలో రిచర్డ్ ఎంగరవ (4/34), మపోసా (2/33) సత్తా చాటారు. అనంతరం 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' ఇష్ సోధి (4/12), మ్యాట్ హెన్రీ (2/34)ల ధాటికి జింబాబ్వే 18.5 ఓవర్లలో 130 పరుగులకే ఆలౌటైంది. టోనీ మున్యోంగ (40; 30 బంతుల్లో 2×4, 3×6) టాప్‌స్కోరర్. సిరీస్‌లో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ జింబాబ్వే ఓటమి పాలైంది. శనివారం జరిగే ఫైనల్లో దక్షిణాఫ్రికాతో కివీస్ తలపడుతుంది.

ఐఓఏ సీఈఓ వివాదానికి తెర

దిల్లీ: భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) సీఈఓ రఘురాం అయ్యర్ నియామకంపై నెలకొన్న వివాదానికి తెరపడింది. సీఈఓ నియామకానికి గురువారం ఐఓఏ కార్యనిర్వాహక మండలి ఆమోదం తెలిపింది. దేశంలో డోపింగ్ కేసుల పెరుగుదలపై అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) ఆందోళన నేపథ్యంలో ప్రత్యేక ప్యానెల్‌ను ఐఓఏ ఏర్పాటు చేసింది. 2024 జనవరిలో సీఈఓగా రఘురాం అయ్యర్‌ను ఐఓఏ అధ్యక్షురాలు పి.టి.ఉష నియమించింది. అయితే నెలకు రూ.20 లక్షలు వేతనం, ఇతర ప్రోత్సాహకాలతో కూడిన ఈ నియామకాన్ని ఎగ్జిక్యూటివ్ కమిటీ (ఈసీ) ఆమోదించలేదు. అయితే కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ జోక్యంతో ఎట్టకేలకు ఈ వివాదానికి తెరపడింది. "అంతా సర్దుకుంది. అందుకే అయ్యర్ సీఈఓ కుర్చీలో కూర్చున్నాడు. లేకపోతే అక్కడ కూర్చునేవాడు కాదు. ఇకమీదట ఐఓఏ పనితీరు సజావుగా సాగుతుంది" అని ఉష తెలిపింది. డేవిస్ కప్ నాన్ ప్లేయింగ్ కెప్టెన్ రోహిత్ రాజ్‌పాల్ నేతృత్వంలో ఏడుగురు సభ్యుల డోపింగ్ నిరోధక ప్యానెల్‌ను ఐఓఏ ఏర్పాటు చేసింది. బ్యాడ్మింటన్ మాజీ క్రీడాకారిణి అపర్ణ పోపట్, స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణుడు చంద్రన్ తదితరులు ప్యానెల్‌లో ఉన్నారు.

సెకండ్ హ్యాండ్.. చెయ్యివ్వద్దంటే..

ఆదిలాబాద్‌లో కొద్దిరోజుల క్రితం ఒక్తిపాయల అమ్ముతున్న ఐదుగురు సభ్యుల బిహారీ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. వారి అధీనంలో 2125 పాత సెల్‌ఫోన్లు.. 107 సిమ్‌కార్డులు.. 600 మొబైల్ బ్యాటరీలు లభించడం పోలీసుల్ని ఆశ్చర్యపరిచింది. దీనిపై లోతుగా దర్యాప్తు చేస్తే సైబర్‌నేరాల కోణం బహిర్గతమైంది. ఇలా కొన్న పాత సెల్‌ఫోన్లను సైబర్‌నేరాల కోసం వినియోగిస్తున్నట్లు తేలింది. సెల్‌ఫోన్ల ఐఎంఈఐ (ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ) నంబర్లను పోలీసులు ట్రాక్ చేస్తారు కాబట్టి తప్పించు కునేందుకు ఇలా కొనుగోలు చేసిన ఫోన్లను సైబర్ నేరస్థులు వినియోగిస్తున్నట్లు వెల్లడైంది.



కొత్తసిన ఫోన్ల ఐఎంఈఐ నంబర్లను మార్చి అమ్మేసే ముఠాలు కార్యకలాపాలు సాగిస్తున్నందున జాగ్రత్తలు తప్పనిసరి అని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మంచి బ్రాండెడ్ ఫోన్.. సెకండ్ హ్యాండ్‌లో తక్కువకు వస్తుందంటే.. ముందూ వెనకా ఆలోచించకుండా కొనేస్తుంటాం..! పాతమొబైల్‌ను రీప్లేస్ చేస్తే.. రాయితీలు లభిస్తాయని దాన్ని అమ్మేస్తాం..! అయితే.. సెకండ్ హ్యాండ్ ఫోన్‌లు కొనేటప్పుడు.. పాతవాటిని అమ్మేటప్పుడు.. సరైన జాగ్రత్తలు తీసుకోకుంటే.. భారీ మూల్యం చెల్లించాల్సి రావచ్చు.

కొనేటప్పుడు

- ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్లతో సెల్‌ఫోన్లు మార్కెట్లను ముంచెత్తుతుండటంతో వినియోగదారులు పాతఫోన్ల స్థానంలో కొత్తవి కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు.
- పాత సెల్‌ఫోన్లను రీప్లేస్ చేస్తే రాయితీలు లభిస్తుండటంతో చాలామంది ఆకర్షితులవుతున్నారు. కొందరైతే ఆన్‌లైన్‌లో పాతసెల్‌ఫోన్లను విక్రయించేస్తున్నారు.
- మరికొందరేమో తక్కువ ధరకు వస్తున్నాయని తమ వద్ద ఉన్న పాత సెల్‌ఫోన్‌కంటే మెరుగైన సెకండ్‌హ్యాండ్ ఫోన్లను కొంటున్నారు.
- తొలుత ఫోన్‌లో *#06# డయల్ చేస్తే ఐఎంఈఐ నంబర్ వస్తుంది. బిల్లుపై ఉన్న ఐఎంఈఐ నంబర్ అదేనా అని తనిఖీ చేసుకోవాలి.
- 'సంచార్‌సాథీ' పోర్టల్‌లోనూ తనిఖీ సదుపాయముంది. పోర్టల్‌లోని 'సిటిజన్ సెంట్రిక్ సర్వీస్ - నో జెన్యూన్‌నెస్ ఆఫ్ యువర్ మొబైల్ హ్యాండ్‌సెట్' ఆప్షన్‌లోకి వెళ్లి వివరాలు నమోదు చేస్తే తెలిసిపోతుంది.
- కేవైఎం అని టైప్ చేసిన అనంతరం ఐఎంఈఐ నంబర్‌ను 14422 నంబర్‌కు ఎస్ఎంఎస్ చేసినా సమాచారం వస్తుంది.
- 'సీఈఐఆర్'(సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) వెబ్‌సైట్‌లోనూ ఈ సమాచారం తెలుసుకునే వెసులుబాటు ఉంది.
- ఐఎంఈఐ నెంబరు చెక్ చేసుకోకుండా ఫోన్‌ను కొంటే, అది కొట్టేసినదైతే ఇబ్బందుల్లో పడతారు.

పాత సెల్‌ఫోన్ల క్రయ విక్రయాల్లో ఏమరుపాటుగా ఉంటే నేరాల్లో ఇరుక్కోవచ్చు.. సైబర్‌ఉచ్చులోనూ పడొచ్చు.





అమ్ముతున్నప్పుడు

- **డేటా బ్యాకప్ కీలకం:** అప్పటివరకు సెల్‌ఫోన్‌లో ఉన్న ఫొటోలు, వీడియోలు, ఇతర ఫైళ్లలాంటి డేటాను గూగుల్‌డ్రైవ్‌లోకి బ్యాకప్ చేసుకోవాలి. అలాగే కాంటాక్ట్స్, కాల్‌రికార్డులు, కాంటాక్టు నంబర్లను స్టోర్ చేసుకునేందుకు ఎస్ఎంఎస్ బ్యాకప్, రీస్టోర్ సదుపాయంతో కూడిన నమ్మదగిన థర్డ్‌పార్టీ సాఫ్ట్‌వేర్‌లను వినియోగించి బ్యాకప్ చేసుకోవచ్చు. కాంటాక్టు నంబర్లను గూగుల్ మెయిల్‌కు లింక్ అయ్యేలా సెట్టింగుల్లో మార్పులు చేసుకోవాలి.
- **క్లౌడ్ సర్వీసులు:** డేటా బ్యాకప్ కోసం గూగుల్‌వన్, గూగుల్‌ఫొటోలు, గూగుల్‌డ్రైవ్, డ్రాప్‌బాక్స్ తదితర క్లౌడ్ ఆధారిత సేవలను వినియోగించుకోవాలి. డేటాను తొలగించే ముందు దీనిలోకి బ్యాకప్ చేసుకోవాలి. లేదా హార్డ్‌డ్రైవ్, పెన్‌డ్రైవ్, సీడీల్లోకి డేటాను భద్రపరుచుకోవచ్చు.

ఇవి తొలగించాలి

- **ఖాతాను రిమూవ్ చేయాలి:** సెల్‌ఫోన్‌లో అప్పటివరకు వినియోగించిన గూగుల్ అకౌంట్ సహా సామాజిక మాధ్యమ ఖాతాలన్నింటినీ రిమూవ్ చేయాలి.
- **ఈ-సిమ్:** కొందరు ఈ-సిమ్ వినియోగిస్తుంటారు. అలాంటివారు ఫోన్ సెట్టింగ్‌లోకి వెళ్లి ఆ సదుపాయాన్ని డిలీట్ చేయడం మరిచిపోవద్దు.
- **ఫ్యాక్టరీ రీసెట్:** ఇది చివరగా చేయాల్సిన పని. తొలుత సెట్టింగ్‌లోని 'అకౌంట్స్ అండ్ బ్యాకప్'లోకి వెళ్లి గూగుల్ అకౌంట్లు, ఇతర ఆన్‌లైన్ అకౌంట్లన్నింటినీ మాన్యువల్‌గా లాగౌట్ లేదా రిమూవ్ చేయాలి. అనంతరం యూజర్‌తోసహా సెల్‌ఫోన్‌లోని సమాచారాన్నంతా తొలగించేందుకు ఫ్యాక్టరీ రీసెట్ చేయాలి. ఇందుకోసం 'బ్యాకప్ అండ్ రీసెట్ - ఫ్యాక్టరీ డేటా రీసెట్ - రీసెట్ డివైజ్' ఆప్షన్లను వినియోగించాలి.

ఈ జాగ్రత్తలన్నీ తీసుకోకుంటే మన డేటా ఇతరుల చేతుల్లో పడే ప్రమాదముంది.

- ఈనాడు, హైదరాబాద్

మీ పిల్లలకు ఇవి తప్పక చెప్పండి



- ఎవ్వరితో అనుకరించొద్దు. ఎవరితోనూ పోల్చుకోవద్దు. ఏ పని చేసినా సొంత ముద్ర ఉండేలా చూసుకోవాలి.
- సాధ్యమైనన్ని ఎక్కువ ప్రాంతాలు తిరిగి వివిధ సంస్కృతులపై అవగాహన పెంచుకోవాలి. అప్పుడే విశాల దృక్పథం ఏర్పడుతుంది.
- వైఫల్యంతో జీవితం అంతం కాదు. విభిన్న ప్రయత్నాలు చేయాలి. అనుభవం గడించాలి.
- ఆరోగ్యాన్ని మించిన సంపద లేదు. దానికే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి.

– టైలర్ టాడ్, ఫిట్‌నెస్ కోచ్

టాలెంట్ ఉంటే.. వెతుక్కుంటూ వస్తారబ్బా

కృష్ణయ్య, అంజిలమ్మ దంపతులు వెదురుతో వస్తువులు, కళాకృతులు చేయడంలో సిద్ధహస్తులు. వారు పెద్దగా చదువుకున్నవారు కాదు. 30 ఏళ్లుగా వెదురుతో వివిధ వస్తువుల తయారుచేసి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరు రూపొందించే గృహోపకరణాలు, వాల్‌హ్యాంగ్, తాజ్ మహల్, బుల్లెట్, స్కూటర్ తదితర కళాకృతులకు మంచి ఆదరణ ఉంది. వీరి కళను హైదరాబాద్ మాదాపూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్) గుర్తించింది. తమ విద్యార్థులను ఏటా వీరి దగ్గరకు పంపుతుంది. గురువారం నిఫ్ట్ విద్యార్థులు.. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వీరి ఇంటికి రాగా.. కృష్ణయ్య, అంజిలమ్మ ఇలా బోధిస్తూ కనిపించారు.



- బిహార్, కేరళ, మహారాష్ట్ర, హిమాచల్‌ప్రదేశ్, ఝార్ఖండ్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి సైతం విద్యార్థులు తమ వద్దకు వస్తారని, ఇప్పటివరకు 1500 మందికి ఈ కళలో శిక్షణ ఇచ్చామని దంపతులు తెలిపారు.

– ఈనాడు, మహబూబ్‌నగర్

పుట్టినచోటే పసిపాపలకు ఆధార్!

చిన్నారులకు ఆధార్ తీసుకోవడానికి తల్లి దండ్రులు పడే కష్టాలకు స్వస్తి పలికేందుకు కేంద్రం చొరవ తీసుకుంది. పుట్టిన వెంటనే శిశువులకు ఆధార్ జారీ చేసేందుకు పీహెచ్‌సీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రత్యేకంగా శిశు ఆధార్ సేవా కేంద్రాలు ప్రారంభించింది. జనన ధ్రువపత్రం, తల్లి లేదా తండ్రి ఆధార్, వేలిముద్ర తీసుకుని అక్కడికక్కడే కార్డు జారీ చేస్తున్నారు. – ఈనాడు, చిత్తూరు



వైకల్యాన్ని సాకల్యం చేయడమెలా?

ఏ క్లాస్ బై.. ఎల్లూరి శంకర్, బీకాం



పొలాలలో స్నేహితులతో కలిసి ఆడుకుంటుండగా విద్యుత్ తీగలు తగిలి.. రెండు చేతులూ కోల్పోయాడు ఎల్లూరి శంకర్. మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం కుశ్నపల్లికి చెందిన ఈ బాలుడు మూడో తరగతిలో ఉండగా జరిగిన ఘటన ఇది. చిన్నప్పుడే తండ్రిని కోల్పోయాడు. కుటుంబ పరిస్థితి అంతంత మాత్రమే. తల్లి లచ్చక్క కూలి పని చేస్తూ ముగ్గురు కుమారులను పోషించేది. కొందరి సహకారంతో ఆ బాలుడు మళ్లీ పాఠశాలకు వెళ్లడం ప్రారంభించాడు. కాళ్లతోనే రాయడం నేర్చుకున్నాడు. ఇప్పుడు శంకర్‌కు 23 ఏళ్లు. చదువులో రాణిస్తూ ఈ ఏడాదే బీకాం డిగ్రీ పూర్తిచేశాడు. కాలి వేళ్లతోనే కంప్యూటర్ ఆపరేట్ చేస్తాడు. జీవనం కోసం రోజూ చెప్పు చదువుతున్నాడు. సమయం దొరికినప్పుడు కాళ్లనే నమ్ముకొని కూలి పనులు చేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. మొక్కలు నాటడం, సైకిల్ తొక్కడం, క్రీడల్లో రాణించడం.. ఇలా ప్రతి అంశంలో ఇతరులకు తక్కువేమీ కాదని నిరూపిస్తున్నాడు. ఈ యువకుడిని చూసి ఇప్పుడు ఎందరో స్ఫూర్తి పొందుతున్నారంటే అతిశయోక్తి కాదు. – న్యూస్‌టుడే, నెన్నెల

తలన గంగమ్మ.. చెంత కృష్ణమ్మ ఏం ధ్యానం చేస్తున్నావో శివన్న!



నల్గొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం పెద్దమునిగల్‌లో నాగార్జునసాగర్ వెనుక జలాల తీరాన కొలువుదీరిన ఈ 34 అడుగుల శివయ్య విగ్రహం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. గ్రామస్థుల చందాలు, ఎన్టీపీసీ సహకారంతో 2003లోనే సుమారు రూ.35 లక్షలు ఖర్చుచేసి ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. శ్రీశైలం నుంచి జలసిరి నీటిని విడుదల చేయడంతో నీరు సాగర్ గేట్లను తాకే ఈ శివుడి చెంతకు చేరడంతో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. వర్షాలతో మట్టిపల్లి గుట్టలూ పచ్చదనాన్ని సంతరించుకోవడంతో ప్రకృతి పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి.

– ఈనాడు, నల్గొండ; న్యూస్‌టుడే– దేవరకొండ, చందంపేట

వరుణుడికి.. భానుడికి బెదిరేదే లేదు!

- కొర్రలు, అరికెల జన్యువులతో కొత్త వరి వంగడం సృష్టి

ఈనాడు, హైదరాబాద్: చిరుధాన్యాలైన కొర్రలు, అరికెల సాగుకు సాధారణ వర్షాలు కురిస్తే చాలు. కిలో కొర్రల దిగుబడికి 250 లీటర్ల నీరు సరిపోతుంది. అదే వరికి 2,500 లీటర్లు అవసరం. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) పరిశోధకులకు ఇదే మార్గదర్శనం చేసింది. కొర్రలు, అరికెల తరహాలో తక్కువ నీటితో పెరిగే వరి వంగడాలను రూపొందించేందుకు వర్సిటీలో మిల్లెట్ ల్యాబ్ వ్యవస్థాపకుడైన డాక్టర్ ఎం.ముతమిలరసన్ మార్గదర్శకత్వంలో ప్రయోగాలు ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుకు కేంద్రం ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ రూ.80 లక్షలు మంజూరు చేసింది. ఎలాంటి వాతావరణ పరిస్థితులనైనా తట్టుకుని పెరిగేందుకు కారణమైన జన్యువును కొర్రల్లో గుర్తించారు. ఆ జన్యువును వరి వంగడంలో ప్రవేశపెట్టేందుకు వివిధ వరి వంగడాల జీనోమ్ కోడ్‌లను విశ్లేషించారు. పూసా బాస్మతి రకం అనుకూలంగా ఉన్నట్లు తెలుసుకున్నారు.



కొర్రల గెలను పరిశీలిస్తున్న ముతమిలరసన్

పూసాపైనే పరిశోధన చేస్తున్న దిల్లీ వర్సిటీ ప్రొఫెసర్ మనోజ్‌కుమార్ సైతం తన వద్ద నున్న సమాచారాన్ని పంచుకున్నారు. ఇక్రిశాట్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్‌లోని శాస్త్రవేత్తల సూచనలు తీసుకుని... కొర్రల్లోని జన్యువును పూసా బాస్మతిలో ప్రవేశపెట్టారు. కొర్రలకు అవసరమైన దాని కంటే 50% మాత్రమే ఎక్కువ నీటినే పూసా బాస్మతి తీసుకుంది. ప్రాథమిక పరిశోధనలు విజయవంతం కావడంతో ఎకరం విస్తీర్ణంలో ఈ కొత్త వంగడాన్ని సాగు చేస్తున్నారు. పంట కోతకు వచ్చాక మళ్లీ విశ్లేషించిన అనంతరం సోనా మసూరి, ఐఆర్-64 వంగడాల్లోనూ ఈ జన్యువులను ప్రవేశపెట్టి మరిన్ని ప్రయోగాలు చేస్తారు. కొత్త వంగడాన్ని రెండేళ్లలోనే అందుబాటులోకి తెస్తామని ముతమిలరసన్ తెలిపారు.

మీ ఇంటి నుంచే పోస్టు చేయండి

అందుబాటులోకి 'పోస్టల్ 2.0'

ఈనాడు, అమరావతి: తపాలాశాఖ కొత్త హంగులను సమకూర్చుకుంది. గ్రామీణ ప్రాంతాలు మొదలు నగరాల వరకూ అన్ని తపాలా కార్యాలయాల్లోనూ ఏపీటీ (అడ్వాన్స్డ్ పోస్టల్ టెక్నాలజీ) పేరుతో నూతన సాంకేతికత అమలులోకి వచ్చింది. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ పోస్టల్ టెక్నాలజీ (సీఈపీటీ) సహకారంతో ఏపీటీని రూపొందించారు. దీన్నే 'పోస్టల్ 2.0'గా పిలుస్తున్నారు. ఈ నెల 22 నుంచి దేశవ్యాప్తంగా ఇది అమల్లోకి వచ్చింది. దీనివల్ల ప్రజలకు మెరుగైన సేవలు సులభంగా, వేగంగా అందనున్నాయి. గతంలో హెడ్ పోస్టాఫీసుల్లోనే అమల్లో ఉన్న యూపీఐ చెల్లింపులు ఇప్పుడు అన్నిచోట్లా అమల్లోకి వచ్చాయి. పోస్టల్ సేవింగ్ బ్యాంక్ సేవలు మినహా మిగతా అన్ని చెల్లింపులు యూపీఐ ద్వారా చేయవచ్చు.

వేగంగా పార్సిళ్లు, రిజిస్టర్ పోస్టుల బట్వాడా

పార్సిళ్లు, రిజిస్టర్ పోస్టుల వంటి వాటి బట్వాడా కూడా 'ఏపీటీ'తో సులభతరం కానుంది. గతంలోలా మధ్యలో మరో మజిలీ లేకుండా ఈ విధానంలో బీట్‌ల వారీగా వాటి వివరాలు పోస్ట్‌మెన్ మొబైల్ నంబర్లకే వెళతాయి. వినియోగదారుల నుంచి డిజిటల్ సంతకం తీసుకొని డెలివరీ చేస్తారు. బట్వాడా సమాచారం ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతుంది.

డాక్ సేవ యాప్‌లో బుకింగ్..

'డాక్ సేవ' యాప్ ద్వారా స్పీడ్ పోస్టు, రిజిస్టర్ పోస్టు, పార్సిల్, బల్క్ బుకింగ్‌లను మనం ఉన్నచోటు నుంచే యాప్ ద్వారా బుక్ చేసుకొని సొమ్ము చెల్లించవచ్చు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య టైం స్లాట్ ఆధారంగా పోస్ట్‌మెన్ మన వద్దకే వచ్చి వాటిని తీసుకెళతారు. నామమాత్రపు ధరే వసూలు చేస్తారు. లేదంటే బుకింగ్, చెల్లింపులు యాప్‌లో పూర్తిచేసి దగ్గరలోని పోస్టాఫీసులో ఉత్తరాలు ఇవ్వొచ్చు. దీనివల్ల సమయం కలిసి వస్తుంది. ఈ యాప్‌లో పోస్టల్ శాఖ సేవలన్నీ పొందవచ్చు. సేవల్లో ఏవైనా లోపాలుంటే ఇందులో ఫిర్యాదు చేయవచ్చు. వీటితోపాటు చిరునామాలను కచ్చితంగా గుర్తించేందుకు త్వరలో డిజి పిన్ అందుబాటులోకి రానుందని ఆంధ్రప్రదేశ్ సర్కిల్ పోస్టల్ సర్వీసెస్ డైరెక్టర్ సంతోష్ నేత తెలిపారు.

విశాఖ పెద్దన్న.. ఈ మహామర్రి!





ఎన్నో తుపానులకు, మరెన్నో చారిత్రక ఘట్టాలకు సాక్ష్యం ఈ మహా మర్రి. వయసు సుమారు 138 ఏళ్లు. విశాఖ నగరంలో తెలుగు తల్లి ఫ్లైఓవర్ వైపు వెళ్లిన వారికి చల్లని నీడనిస్తుంది. ఊడలు దిగిన కొమ్మలతో ఆకట్టుకుంటుంది. 2014లో వచ్చిన హుద్‌హుద్ తుపానుకు అడ్డుగా నిలిచి నష్ట తీవ్రత తగ్గించింది. విశాఖకు పెద్దన్నగా భావించే ఈ చెట్టు నీడనే నగరవాసులు ఏటా రాఖీ పౌర్ణమి నిర్వహించుకుంటారు. ఆగస్టు 9న రాఖీ పండగ ఉండటంతో అక్కడ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని ప్రకృతి ప్రేమికులు ప్రణాళికలు వేసుకుంటున్నారు. – ఈనాడు, విశాఖపట్నం

7 వేల అడుగుల నడకతో తగ్గనున్న మరణముప్పు



- లాన్సెట్ నివేదిక

దిల్లీ: రోజుకు 7వేల అడుగులు నడవడంతో మరణ ముప్పు 47% తగ్గుతుందని లాన్సెట్ తాజా నివేదిక పేర్కొంది. అంతేకాకుండా మతిమరుపు 38%, కుంగుబాటు 22% మేర తగ్గుతాయని వెల్లడించింది. 11 ఏళ్లలో (2014-25) నిర్వహించిన 88 అధ్యయనాల విశ్లేషణ ఆధారంగా ఈ నివేదికను ప్రచురించింది. ప్రపంచవ్యాప్తంగా 1.6 లక్షల మంది వయోజనులు ఈ సర్వేల్లో పాల్గొన్నారు. బ్రిటన్, ఆస్ట్రేలియా, స్పెయిన్, నార్వే, సిడ్నీ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు ఈ అధ్యయనం చేశారు. "2 వేల అడుగులతో పోల్చినపుడు 7వేల అడుగులు నడిచిన వారిలో అన్ని రకాల మరణ ముప్పు 47% తగ్గుతుంది. క్యాన్సర్ కారకాల వృద్ధి 6%, వాటి మరణాలు 37%, గుండె సంబంధిత వ్యాధులు 25%, వాటి మరణాలు 47%, డయాబెటిస్ 14%, టైప్ 2 డయాబెటిస్ 14%, మతిమరుపు 38%, కుంగుబాటు సంకేతాలు 22% మేర తగ్గుతాయి" అని లాన్సెట్ తన నివేదికలో పేర్కొంది.




మణుగూరు.. మరిగే నీటిలో ఇక జలకాలాడొచ్చు

హిమాచల్‌ప్రదేశ్ (మణికరణ్, వశిష్ఠ ఆలయం..), ఉత్తరాఖండ్ (గౌరికుండ్, తపోవన్) తదితర ప్రాంతాల్లోని సహజసిద్ధ వేడినీటి బుగ్గలకు పర్యాటకంగా ఎంతో ఆదరణ ఉంది. మన రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం పగిడేరులోనూ భూమి నుంచి సహజ సిద్ధంగా వేడినీరు ఉబికి వచ్చే కేంద్రాలు మూడు ఉన్నాయి. ఇక్కడి శాంతినగర్ ప్రాంతంలోని వేడినీటి కేంద్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ నిర్ణయించారు. ఇక్కడ ఈతకొలనుల మాదిరి 6 థెరపీ కేంద్రాల ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, మణుగూరు

ఎడారి దేశంలో ఇసుక అమ్ముకోవచ్చు

ఇంటర్నెట్ డెస్క్: సౌదీ అరేబియా భూభాగంలో 95 శాతం ఎడారే. అయినా ఆ దేశం ఇసుకను దిగుమతి చేసుకుంటోందంటే ఆశ్చర్యమే కదూ! చాలా నాజూకుగా ఉండే అక్కడి ఇసుక భవన నిర్మాణాలకు ఉపయోగపడదు. ఎడారిలో నిరంతరం వీచే గాలుల వల్ల కోతకు గురై ఇసుక రేణువులు గుండ్రంగా మారిపోతాయి. ఆ ఇసుకను సిమెంటుతో కలిపినా గట్టితనం రాదు. ఈ నేపథ్యంలో సౌదీ అరేబియా నిర్మాణాలకు అవసరమైన ఇసుకను ఆస్ట్రేలియా, చైనా, బెల్జియం నుంచి దిగుమతి చేసుకుంటోంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతార్ కూడా ఈ జాబితాలో ఉన్నాయి.





గాలి తగ్గిందా.. ఇదిగో టైర్ ఇన్‌ఫ్లేటర్

ఒక్కోసారి ఉన్నట్టుండి వాహనాల్లో గాలి తగ్గిపోతుంది. అలానే దగ్గరలోని పంక్చర్ దుకాణానికి తీసుకువెళ్తే ట్యూబు పాడైపోతుంది. ఈ కష్టాలకు చెక్ పెట్టేస్తూ ఎక్కడికైనా సులభంగా తీసుకెళ్లగలిగే ఆటోమేటిక్ టైర్ ఇన్‌ఫ్లేటర్లు అందుబాటులో ఉన్నాయి. సుమారు రూ.3 వేలకు దొరికే ఈ పరికరంతో ఏ వాహనాన్నికైనా గాలి పెట్టుకోవచ్చు. ప్రెషర్ పాయింట్లు పెంచుకోవడానికి, తగ్గించుకోవడానికి మీటలు ఉంటాయి. కావల్సిన ప్రెషర్ వచ్చాక దానంతట అదే ఆగిపోతుంది. ఒకసారి ఛార్జింగ్ చేస్తే నాలుగు టైర్లకు గాలి పెట్టుకోవచ్చు.

– ఈనాడు, హైదరాబాద్

మన దగ్గర వీధికుక్కల్లా.. అక్కడ వీధి గుర్రాలు

ఈటీవీ భారత్: మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్ నాగరత్ చౌక్ వద్ద నడిరోడ్డుపై వీధి గుర్రాల పోట్లాట వల్ల ఓ షోరూం ధ్వంసం అయింది. గుర్రాలు మళ్లీ రోడ్డుపైకి వచ్చి గొడవపడగా.. ఓ గుర్రం అటుగా వెళుతున్న ఆటోలోకి దూసుకుపోయింది. ఈ గుర్రాల పోరులో ఇద్దరు వ్యక్తులూ గాయపడ్డారు. మన వీధుల్లో తిరుగాడే కుక్కల్లా జబల్పూర్‌లోని సివిల్ లైను ప్రాంతంలో గుర్రాలు ఎక్కువగా తిరుగుతుంటాయి. ఇవి ఎవరికి చెందినవో తెలియదని, వాణిజ్య ప్రయోజనాలకూ ఎవరూ వాడటం లేదని స్థానికులు చెబుతున్నారు.



కంచి పట్టేశారు!

బంగారు జరీ మెరుపులు..
కళారూపాల అల్లికలు..
కాంచీపురం చీరల ప్రత్యేకతే వేరు!
తమిళనాడుకు చెందిన ఆ కళను
ఇప్పుడు మన కళాకారులూ
అందిపుచ్చుకుంటున్నారు.
ఎంతలా అంటే...
కంచి నుంచి వ్యాపారులు వచ్చి
మన దగ్గర కొనుగోలు చేసేంతగా..!





వస్త్ర ప్రపంచంలో కంచి పట్టు రారాజు. ఎన్ని చీరల మధ్య ఉన్నా కంచి పట్టును ఇట్టే గుర్తిస్తారు. దాని సొబగు, తళుకుబెళుకులు అలాంటివి మరి. ఇప్పుడు ఆ చీరలు తెలుగు రాష్ట్రాల్లోనూ తయారవుతున్నాయంటే నమ్మగలరా? తమిళనాడులోని కాంచీపురం పేరు మీద ప్రసిద్ధి చెందిన కంచి పట్టు చీరలను ఇక్కడి నేతన్నలూ నేస్తున్నారు. కొన్నేళ్లుగా కాంచీపురం నుంచి డిమాండ్‌కు తగ్గట్టు సరఫరా లేకపోవడంతో అక్కడి వ్యాపారులు ఇక్కడికి వచ్చి మన చీరల్ని కొని... అక్కడకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ఏపీలోని ధర్మవరం, మదనపల్లె నుంచి తమిళనాడు రాష్ట్రంలోని కాంచీపురం, కోయంబత్తూరు, సేలం, ఆరణి, చెన్నై, తదితర ప్రాంతాలకు ఏటా రూ.35 కోట్ల మేర కంచి పట్టు చీరలు ఎగుమతి అవుతున్నాయి. తెలంగాణ నుంచీ అదే స్థాయిలో వ్యాపారం జరుగుతోంది.

- ఈనాడు, అమరావతి

రకరకాల డిజైన్లలో...

- ధర్మవరంలో 20 వేలు, మదనపల్లెలో 5 వేల మగ్గాలపై కంచి పట్టు చీరలు నేస్తున్నారు. ఈ చీరల తయారీలో శుద్ధమైన జరీని వినియోగిస్తున్నారు. అంచుల్లో, చీర మధ్యనా బుటా పెద్దదిగా ఉండేలా చేస్తున్నారు.
- బుట్ట, కళాంజలి, సుమాంజలి, జరీ చెక్స్, కుట్టు, పైఠానీ పల్లు, లక్ష దీపాలు, బ్రొకేడ్, ఎంబోస్, ఈవెనింగ్-మార్నింగ్ డిజైన్లలో నేస్తున్నారు.
- ఈ చీరలు ప్రతి నెలా మదనపల్లెలో 20- 25 వేలు, ధర్మవరంలో 60 వేల వరకు తయారవుతున్నాయి. 90 శాతం ఎప్పటికప్పుడు అమ్ముడుపోతున్నాయి.

ఏటా రూ.90 కోట్లు...

ధర్మవరం, మదనపల్లె నుంచి ఇతర ప్రాంతాలకు ఏడాదికి రూ.90 కోట్ల మేర వ్యాపారం జరుగుతోందని మాస్టర్ వీవర్స్ చెబుతున్నారు. ఇవే చీరలను వస్త్రవ్యాపారులు ఇతర ప్రాంతాల్లో రూ.20 వేల నుంచి రూ.2 లక్షల వరకు విక్రయిస్తున్నట్లు పేర్కొంటున్నారు.

ఆదాయం బాగానే...

- పెద్ద చీర నేసినందుకు రూ.10వేలు కూలీ కింద గిట్టుబాటు అవుతోంది. నెలకు రూ.30 వేల నుంచి రూ.40 వేలు ఆదాయం వస్తోంది.

కాంచీపురంలో తగ్గిన మగ్గాలు...



- కాంచీపురంలో చేనేత మగ్గాల సంఖ్య తగ్గి పవర్ లూమ్స్ సంఖ్య క్రమంగా పెరుగుతోంది. గడిచిన 10 ఏళ్ల వ్యవధిలో చేనేత మగ్గాల సంఖ్య 5 వేల నుంచి 500కు తగ్గింది.
- చుట్టుపక్కల ప్రాంతాల్లో పరిశ్రమలు పెరిగాయి. ఎంతో మంది చేనేతలు మగ్గాలను వదిలేసి పరిశ్రమల్లో పనులకు వెళ్తున్నారు. దీంతో తెలుగు రాష్ట్రాల్లోని చీరలకు డిమాండ్ పెరిగింది.

తమిళ నేలపైనా వెలిగిన రుద్రమ కీర్తి

చిదంబరం ఆలయంలో వెలుగుచూసిన శిలాశాసనం



తమిళంలో శిలాశాసనం

చెన్నై(వడపళని), న్యూస్‌టుడే: తమిళనాడులోని చిదంబరం నటరాజ ఆలయ పశ్చిమ గోపురంపై రుద్రమదేవి పేరును ప్రస్తావించిన శిలాశాసనం వెలుగులోకి వచ్చింది. తమిళంలో పద్యరూపంలో ఉన్న ఈ శాసనంలో కేరళలోని ట్రావెన్‌కోర్ మహారాజు విక్రమపాండ్య సాధించిన విజయాలను ప్రస్తావించారు. ఆయన బిరుదులను 'భువనేకవీర', 'కోల్కై కావలం'గా పేర్కొన్నారు. విక్రమపాండ్య ఇక్కడి వరకు వరుస విజయాలు సాధిస్తూ వచ్చినా ఉత్తరం వైపునకు వెళ్లలేకపోయారని, ఆ సమయంలో ఆ ప్రాంతాన్ని కాకతీయరాజైన గణపతి కుమార్తె రుద్రమదేవి పాలించడమే కారణమని ఈ శాసనం చెబుతోంది. తమిళనాడు, తెలంగాణ ప్రాంతాల్లో ఒకప్పటి రాజకీయ చరిత్రకు ఈ శాసనం అద్దం పడుతోందని మైసూరులోని ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ (ఎపిగ్రఫీ) కె.మునిరత్నంరెడ్డి తెలిపారు.

కళానిధి మారన్ పిటిషన్ కొట్టివేత

స్పైస్‌జెట్ రూ.1,323 కోట్ల పరిహారం ఇవ్వాలని వ్యాజ్యం

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: స్పైస్‌జెట్ రూ.1323 కోట్ల పరిహారం ఇవ్వాలని కళానిధి మారన్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. 2015లో స్పైస్‌జెట్ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సమయంలో తన 58.46 శాతం షేర్లను స్పైస్‌జెట్ వ్యవస్థాపకుడు అజయ్‌సింగ్ పేరుపై మార్చినట్లు, అప్పుడు తాను పెట్టుబడి పెట్టిన రూ.679 కోట్లకు బదులు ఆ సంస్థ కన్వర్టిబుల్ వారెంట్స్, ప్రిఫరెన్స్ షేర్లను ఇవ్వాలని అజయ్‌సింగ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు, అయినా ఆ షేర్లను ఇవ్వలేదని కళానిధి మారన్ ఆరోపణలు చేశారు. ఈ మేరకు రూ.1,323 కోట్ల నష్టపరిహారం ఇవ్వాలని 2018లో దిల్లీ హైకోర్టులో పిటిషన్ వేశారు. కళానిధి మారన్ ఆరోపణలను స్పైస్‌జెట్ ఖండించిన నేపథ్యంలో 2023లో పిటిషన్‌ను దిల్లీ హైకోర్టు కొట్టివేసింది. అనంతరం ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో అప్పీల్ చేసిన నేపథ్యంలో అక్కడా కొట్టివేస్తూ బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

పత్రికల్లో పతాక శీర్షిక కోసం పిటిషన్ వేశారా?

కాంగ్రెస్ నేత కేవీపీని ఉద్దేశించి సీజేఐ జస్టిస్ గవాయ్ వ్యాఖ్య

ఈనాడు, దిల్లీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓటర్లను ప్రభావితం చేయడానికి అహేతుకమైన రీతిలో పంచుతున్న నగదు, ఉచిత పథకాల గురించి న్యాయ సమీక్ష చేయాలని కోరుతూ కాంగ్రెస్ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు దాఖలు చేసిన పిల్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఆరేళ్ల రాజ్యసభ సభ్యుడిగా ఉన్నప్పుడు దీనిపై బిల్లు తేవడానికి ప్రయత్నించకుండా ఇప్పుడు పత్రికల్లో హెడ్‌లైన్స్ కోసం పిటిషన్ వేసినట్లు కనిపిస్తోందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ వ్యాఖ్యానించారు. కేవీపీ గత నెల 17న వేసిన రిట్ పిటిషన్ గురువారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్‌చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది దామా శేషాద్రినాయుడు వాదనలు వినిపించారు. కేవీపీ ఇప్పటికే ప్రజాజీవితం నుంచి తప్పుకొన్నారని, నిజంగానే సమస్య పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నారని విన్నవించారు.

సజ్జలపై కేసు నమోదు చేస్తున్నారా? లేదా?

- వివరాలు సమర్పించండి
- రాజధాని వాసులపై అనుచిత వ్యాఖ్యల కేసులో హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి ప్రాంత ప్రజలను ఉద్దేశించి సంకరజాతి అంటూ అనుచితంగా మాట్లాడిన సజ్జల రామకృష్ణారెడ్డిపై కేసు నమోదు చేస్తున్నారా? లేదా? వివరాలు సమర్పించాలని ప్రాసిక్యూషన్ తరఫు పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ) లక్ష్మీనారాయణను హైకోర్టు ఆదేశించింది. సజ్జల ముందస్తు బెయిలుపై విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి గురువారం ఈమేరకు ఉత్తర్వులిచ్చారు. అమరావతి ప్రాంత ప్రజలను సంకరజాతి అంటూ సజ్జల నోరుపారేసుకున్న వ్యవహారంపై శాసనసభ ఉపసభాపతి రఘురామకృష్ణరాజు.. డీజీపీకి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిలు కోసం సజ్జల రామకృష్ణారెడ్డి.. హైకోర్టును ఆశ్రయించారు. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. అరెస్ట్ చేస్తారనే ఆందోళన ఉన్నప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు కాకపోయినా ముందస్తు బెయిలుకు పిటిషన్ వేసుకోవచ్చన్నారు. పీపీ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ.. ఇప్పటి వరకు ఆ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు కాలేదన్నారు. కేసు నమోదు కాకుండా ముందస్తు బెయిలు పిటిషన్ వేయడానికి వీల్లేదని ఇదే హైకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రస్తుత పిటిషన్‌కు విచారణ అర్హత లేదని, కొట్టేయాలని కోరారు.

పేర్ని నాని, అనిల్‌కుమార్‌ల పిటిషన్లపై విచారణ 31కి వాయిదా

'రప్పా రప్పా అనడం కాదు, చెప్పకుండా నరికివేయాలి. చీకట్లో కన్ను కొడితే పనైపోవాలి' అంటూ వైకాపా కార్యకర్తల సమావేశంలో రెచ్చగొట్టేలా మాట్లాడిన ఘటనపై మాజీ మంత్రి పేర్ని నాని, మాజీ ఎమ్మెల్యే కె.అనిల్‌కుమార్‌లపై కృష్ణా జిల్లా పామర్రు పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి విదితమే. ఆ కేసును కొట్టేయాలంటూ హైకోర్టులో వారిరువురూ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్లపై విచారణ ఈ నెల 31కి వాయిదా పడింది. వీరిపై తొందరపాటు చర్యలొద్దంటూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను 31 వరకు పొడిగిస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి ప్రకటించారు.

రమణకుమార్, హరనాథరెడ్డిపై క్రిమినల్ చర్యలు

- మంత్రిమండలికి జస్టిస్ సత్యనారాయణమూర్తి కమిషన్ సిఫార్సు

ఈనాడు, అమరావతి: వైకుంఠ ఏకాదశి దర్శనం టికెట్ల జారీ సందర్భంగా ఈ ఏడాది జనవరి 8న తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనకు అప్పటి డీఎస్పీ వి.రమణకుమార్, తితిదే గోసంరక్షణశాల డైరెక్టర్ కె.హరనాథరెడ్డి పూర్తి బాధ్యులని ఈ ఘటనపై విచారణ కోసం ఏర్పాటైన విశ్రాంత న్యాయమూర్తి ఎం.సత్యనారాయణమూర్తి కమిషన్ తేల్చింది. వారిద్దరిపైనా క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసింది. ఈ ఘటనలో నాటి తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడికి కమిషన్ క్లీన్‌చిట్ ఇచ్చింది. తితిదే జేఈఓ గౌతమి నిర్లక్ష్యంగా వ్యవహరించారని, ఆమెపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో సాధారణ పరిపాలనా శాఖ(జీఏడీ) పరిశీలించాలని సూచించింది. ఈ నెల 10న కమిషన్ సమర్పించిన నివేదికను గురువారం మంత్రిమండలి ముందు పెట్టారు. ఈ నివేదికలోని వివరాలను జీఏడీ ముఖ్యకార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా మంత్రులకు వివరించారు. టికెట్ల జారీ కేంద్రం నిర్వహణ పూర్తి బాధ్యత లేకపోయినా జేఈఓగా గౌతమి పర్యవేక్షించాలని, కానీ అలా చేయలేదని, ఆమె పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపించిందని కమిషన్ గుర్తించింది. కమిషన్ ప్రస్తావించిన ఈ విషయాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్ మంత్రిమండలిలో లేవనెత్తగా ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ.. ఆమె ఐఏఎస్ అధికారిణి కాబట్టి, విధినిర్వహణలో నిర్లక్ష్యంపై ఎలాంటి చర్యలు తీసుకోవచ్చనేది పరిశీలించి సిఫార్సు చేయాలని జీఏడీ అధికారులను ఆదేశించారు.



తిరుపతిలోని పద్మావతి పార్కు వద్ద తొక్కిసలాట ఘటన చోటుచేసుకున్న సమయంలో భక్తుల రద్దీ

నాకేం సంబంధం లేదు

'రామానాయుడు హైస్కూల్ టోకెన్ జారీ కేంద్రం మొత్తానికి ఇన్‌ఛార్జిగా కె.హరనాథరెడ్డిని నియమించారు. కానీ, స్కూలు మొత్తం చూసుకోవాల్సిన బాధ్యత తనకు లేదని.. పద్మావతి పార్కు, హోల్డింగ్ ప్రాంతం, క్యూలైన్ల వరకే తనకు సంబంధం అని చెబుతూ.. ఆయన హైస్కూల్‌లో రద్దీ నిర్వహణ ఏర్పాట్లు ఏం చేశారనేదీ పట్టించుకోలేదు. తనను తాను టోకెన్ జారీ కౌంటర్ల వద్దకే పరిమితం చేసుకున్నారు. కేంద్రం మొత్తానికి ఇన్‌ఛార్జిగా నియమితులై ఇలా చేయడం నిర్లక్ష్యమే' అని కమిషన్ తేల్చింది.

★ ఈ విషయంలో తితిదే, పోలీసులు, చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ తీసుకున్న చర్యల పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన కమిషన్.. రమణకుమార్, హరనాథరెడ్డి నిర్లక్ష్యమే దుర్ఘటనకు కారణమైందని స్పష్టం చేసింది.

★ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపైనా కమిషన్ కొన్ని సూచనలు చేసింది. తిరుమలలో వేంకటేశ్వర స్వామి దర్శనానికి వచ్చే భక్తుల భద్రత కోసం ఇంకా మెరుగైన చర్యలు ఎలా తీసుకోవచ్చనే అంశాలను కొన్నింటిని ప్రస్తావించినట్లు తెలిసింది.

డీఎస్పీ సమయానికి రాలేదు

'తిరుపతిలోని బైరాగిపట్టెడలో పద్మావతి పార్కు పక్కనున్న రామానాయుడు హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన టికెట్ల జారీ కేంద్రంలో క్యూలైన్ల నిర్వహణ, శాంతిభద్రతల పరిస్థితిని నియంత్రించేందుకు డీఎస్పీ రమణకుమార్‌కు బాధ్యత అప్పగించారు. మధ్యాహ్నం 2 గంటలకు ఆ కేంద్రానికి చేరుకోవాల్సిన డీఎస్పీ ఎప్పుడో సాయంత్రం వచ్చారు. పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించారు. పార్కులో ఉన్న భక్తులు, యాత్రికులను బ్లాకులుగా విభజించి ఒక్కో బ్లాక్‌ను క్యూలైన్‌లోకి పంపాలి. కానీ, అలా జరగలేదు. జనం మధ్యలో ఉన్న 70 ఏళ్ల వృద్ధురాలు శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతున్నారని ఆమెను బయటకు పంపేందుకు డీఎస్పీ గేటు తీశారు. ఆ గేటును తెరిచే ముందు, ఆమెను పంపాక గేటును మూసేటపుడు సరైన జాగ్రత్తలు తీసుకోలేదు. బ్లాకుల వారీగా యాత్రికులను టికెట్ కౌంటర్ల వద్దకు పంపేందుకు ఇన్‌స్పెక్టర్లు పార్కులోకి చేరుకున్నారు. కానీ, వారెవరికీ చెప్పకుండా డీఎస్పీ రమణకుమార్ గేటు తెరవడం తొక్కిసలాటకు దారితీసింది. ఐదుగురి మృతికి కారణమైంది. అనేకమంది గాయాలబారిన పడాల్సి వచ్చింది' అని కమిషన్ నివేదించింది.

ఎన్నికల వ్యవస్థ పారదర్శకంగా ఉండాలి

- ఎస్ఐఆర్‌పై అభిప్రాయాలు వెల్లడించిన రాజకీయ పార్టీలు

ఈనాడు, అమరావతి: ఎన్నికల వ్యవస్థ పారదర్శకంగా ఉండాలని రాజకీయ పార్టీలు అభిప్రాయపడ్డాయి. రాష్ట్రంలో ఓటర్ల జాబితా సవరణపై అభిప్రాయ సేకరణకు గుర్తింపు పొందిన పార్టీలతో ఎన్నికల సంఘం సచివాలయంలో గురువారం సమావేశం నిర్వహించింది. 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) విధానంలో ఓటరు జాబితా సవరణపై తెదేపా, భాజపా, వైకాపా సహా పలు పార్టీలు అభిప్రాయాలను వెల్లడించాయి. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్‌కు తెదేపా, భాజపా వినతిపత్రాలు సమర్పించాయి. సమావేశానంతరం పార్టీల నాయకులు మీడియాతో మాట్లాడారు.

పారదర్శక ఎన్నికల వ్యవస్థే మా విధానం: తెదేపా

ఎన్నికల వ్యవస్థ పారదర్శకంగా ఉండాలనేదే తెదేపా విధానమని ఎమ్మెల్సీ, తెదేపా నేత ఆలపాటి రాజా, మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు తెలిపారు. "రాష్ట్ర విభజన అనంతరం 2014 ఓటరు జాబితాను కటాఫ్ సంవత్సరంగా తీసుకోవాలని కోరాం. ఆధార్‌ను ఓటరు కార్డుకు అనుసంధానించాలని సూచించాం. ఒక ఓటరుకు ఒకే ఓటు, కార్డు ఉండేలా చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలో ఎస్ఐఆర్ చేయాలనే కచ్చితమైన ఆదేశాల్లేవని సీఈఓ తెలిపారు. ఎస్ఐఆర్ చేస్తే పకడ్బందీగా చేయాలని సీఈఓను కోరాం. వీవీప్యాట్ బ్లింకింగ్ సమయాన్ని పెంచాలని కోరాం" అని తెలిపారు.

ఓటర్ల జాబితా నిష్పక్షపాతంగా ఉండాలి: భాజపా

ఓటర్ల నమోదు నిష్పక్షపాతంగా ఉండాలని ఎన్నికల సంఘాన్ని కోరినట్లు భాజపా నేత కిలారు దిలీప్ తెలిపారు. "ఈవీఎంల విషయంలో మాకు సందేహాలు లేవు. ఎస్ఆర్ఐ తనిఖీ ఆధార్ ప్రాతిపదికన చేయాలని కోరాం. కృత్రిమమేధ ఆధారంగా తనిఖీ చేసి, ఒక ఓటరుకు ఒకే ఓటు ఉండేలా చూడాలని సూచించాం. ఒకే నియోజకవర్గంలో రెండు, మూడు చోట్ల ఓట్లుంటే వాటిని తొలగించాలని కోరాం" అని పేర్కొన్నారు.

బ్యాలట్ పేపర్లతోనే ఎన్నికలు నిర్వహించాలి: వైకాపా

ప్రజాభిప్రాయాలతో ప్రభుత్వాలు ఏర్పడాలన్నది వైకాపా అభిప్రాయమని ఆ పార్టీ నేత మల్లాది విష్ణు తెలిపారు. "ఎన్నికల్లోని లోపాల కారణంగా ప్రభుత్వాలు ఏర్పడకూడదని ఎన్నికల సంఘానికి చెప్పాం. గత ఎన్నికల్లో పోలింగ్ సమయం ముగిశాక 51లక్షల ఓట్లు అదనంగా పోలయ్యాయి. దీనిపై గతంలోనే ఫిర్యాదుచేసినా సమాధానం లేదు. ఎన్నికల సంఘం ప్రజల విశ్వాసం కోల్పోతోందని చెప్పాం. వీవీప్యాట్‌ల పనితీరునూ సమీక్షించాలని ఈసీని కోరాం. ఆధార్‌ను అనుసంధానం చేయడం ద్వారానే దొంగ ఓట్ల తొలగింపు సాధ్యమని చెప్పాం. ఈవీఎంల ద్వారా కాకుండా బ్యాలట్ పేపర్ల ద్వారానే ఎన్నిలు నిర్వహించాలని డిమాండ్ చేశాం" అని తెలిపారు.

ఎస్ఐఆర్‌పై దేశవ్యాప్త నిరసన: సీపీఎం

ఎస్ఐఆర్‌పై ఆగస్టు 8న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని సీపీఎం కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు తెలిపారు. "ఎస్ఐఆర్ ఎందుకు అమలు చేయకూడదో.. చేస్తే ఏం చేయాలో మేము పార్టీపరంగా చెప్పాం. 2003లో చేశారు. ఇప్పుడు మళ్లీ స్థానికత నిరూపించుకోవాలంటున్నారు. అందరి అభిప్రాయాలూ తీసుకుని.. అంగీకరించాకే ఎస్ఐఆర్ చేపట్టాలని కోరాం" అని తెలిపారు.

17 కార్పొరేషన్లలో ఆటోమేటిగ్గా మ్యుటేషన్

ఈనాడు, అమరావతి: వ్యవసాయ భూముల్లాగే నగరపాలక సంస్థల పరిధిలోని ఇళ్లు, ఫ్లాట్లకూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కాగానే యజమాని పేరుతో ఆస్తి బదలాయింపు (మ్యుటేషన్) ఆటోమేటిగ్గా జరగబోతోంది. ఈ కొత్త విధానం ఆగస్టు 1 నుంచి రాష్ట్రంలోని 17 కార్పొరేషన్ల పరిధిలో అమల్లోకి రాబోతోంది. విజయవాడలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ విధానం అమలు తీరు పరిశీలించిన తర్వాత ఈ సేవలను రాష్ట్రవ్యాప్తంగా నగరాలు, పట్టణాలకూ విస్తరించేందుకు రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ సిద్ధమైంది. దీనివల్ల సమయం ఆదా అవుతుంది. కార్పొరేషన్ల పరిధిలోని 260 గ్రామాల్లో జరిగే ఆస్తుల రిజిస్ట్రేషన్లకు ఆటోమేటిగ్గా మ్యుటేషన్ జరిగేందుకు సాఫ్ట్‌వేర్ (కార్డ్-2.0) సిద్ధం చేశారు. ప్రస్తుతం ఆటో మ్యుటేషన్ విధానం పొలాల కొనుగోళ్లకే ఉంది.

రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే..!

విజయవాడ కార్పొరేషన్ పరిధిలో మే నెలలో ప్రయోగాత్మకంగా ఆటోమ్యుటేషన్ ప్రవేశపెట్టారు. ఎసెస్‌మెంట్ నంబరు కలిగి, ఆస్తి అమ్మకం జరిగిన ఇళ్లు, కొత్త ఫ్లాట్ల కొనుగోలుకే ఈ విధానాన్ని వర్తింపజేశారు. అక్కడ మే నుంచి ఇప్పటివరకు 1,100 ఆటో మ్యుటేషన్లు జరిగాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ కాగానే ఆ వివరాలు కార్పొరేషన్ అధికారులకు ఆన్‌లైన్ ద్వారా తెలియజేస్తారు. అక్కడ పరిశీలించి, ఓకే చెప్పగానే 'ఆటోమ్యుటేషన్ సర్టిఫికెట్' జనరేట్ అవుతుంది. ఈ ప్రక్రియ ముగిశాక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా కొత్త డాక్యుమెంట్లతో పాటు ఆస్తి బదలాయింపు పత్రం కూడా పొందేలా చర్యలు తీసుకున్నారు. మార్కెట్ విలువ, విస్తీర్ణాన్ని బట్టి మ్యుటేషన్ ఛార్జీలు చెల్లించాలి.

53 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో..

వచ్చేనెల 1 నుంచి జరిగే ఆటోమ్యుటేషన్ విధానంలో విజయవాడ తరహాలో పరిమితులు విధించలేదు. ఒకే ఎసెస్‌మెంట్ నంబరుపై ఒకటి కంటే ఎక్కువ ఆస్తులు ఉన్నా.. పార్టుల వారీగా రిజిస్ట్రేషన్లు జరిగినా ఆటోమ్యుటేషన్ జరిగిపోతుంది. ప్రస్తుత విధానంలో పట్టణాలు, కార్పొరేషన్ పరిధిలో కొన్న ఆస్తుల దస్తావేజులను మున్సిపాల్టీలు, కార్పొరేషన్‌లోని అధికారులకు దరఖాస్తు చేసుకుంటేనే ఇంటిపన్ను రసీదులో పేరు మారుతుంది. దీనికి ఎక్కువ సమయం పడుతుంది. రిజిస్ట్రేషన్ జరిగే సమయంలో సదరు ఆస్తికి పూర్వ ఆస్తిపన్ను చెల్లింపులు జరగాల్సి ఉందా. . లేదా? అన్న విషయం చూడట్లేదు. కొత్త మ్యుటేషన్ విధానంలో బకాయిలు చెల్లిస్తేనే రిజిస్ట్రేషన్ సాధ్యమవుతుంది. విక్రయదారు సదరు ఇళ్లు, ఫ్లాట్‌కు ఆస్తిపన్ను బకాయిలు ఉంటే తప్పనిసరిగా చెల్లించాలి. అప్పుడే 'నో డ్యూస్' కింద గుర్తించి మ్యుటేషన్ చేస్తారు. కొనుగోలుదారు పేరుతో ఆటోమేటిగ్గా మ్యుటేషన్ జరిగితే హక్కు బదలాయింపునకు మరింత బలం చేకూరుతుంది. 17 మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో 53 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. భూ వినియోగ మార్పిడి (నాలా) విధానంలోనూ ప్రభుత్వం కొత్త విధానాన్ని అమల్లోకి తేనుంది. స్థానిక సంస్థల ద్వారానే భూ వినియోగ మార్పిడి అనుమతుల జారీ జరగనుంది. దీనివల్ల రియల్ ఎస్టేట్ వ్యాపారులకు సమయం ఆదా కానుంది.

తెలుగు రాష్ట్రాల్లో నదుల అనుసంధానానికి 8 అవకాశాలు

పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్

ఈనాడు, దిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో నదుల అనుసంధానానికి 8 అవకాశాలు ఉన్నట్లు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజభూషణ్ చౌధరి తెలిపారు. గురువారం లోక్‌సభలో కౌశలేంద్రకుమార్ అనే సభ్యుడు అడిగిన ప్రశ్నకు దేశంలో వివిధ రాష్ట్రాల్లో నదుల అనుసంధాన స్థితిగతులు వివరించారు. కృష్ణా, గోదావరి, పెన్నా నదుల అనుసంధానంతో ఏపీ, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా, తమిళనాడు, పుదుచ్చేరిలకు కలిగే ప్రయోజనం గురించి తెలిపారు. "నదుల అనుసంధానం కోసం కేంద్రం జాతీయ ప్రణాళిక (నేషనల్ పర్‌స్పెక్టివ్ ప్లాన్-ఎన్‌పీపీ) రూపొందించింది. పనులను జాతీయ జల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ)కు అప్పగించింది. దేశవ్యాప్తంగా అనుసంధానానికి 30 నదులను గుర్తించింది. ఇందులో 11 నదుల విషయంలో డీపీఆర్‌లు, మిగిలిన వాటికి ఫీజిబిలిటీ నివేదికలు తయారయ్యాయి. నీటి కొరత ఉన్న బేసిన్లకు మిగులు జలాలు తరలించడం వల్ల వరదలు, కరవు కొంత వరకు నివారించే వీలుంది. ఇందుకు కేంద్రం సాంకేతిక మార్గదర్శకం, సంక్లిష్ట ప్రాంతాల్లో వరదల నియంత్రణకు ఆర్థిక సాయమూ చేస్తుంది' అని వివరించారు. మణిభద్ర, ఇచ్చంపల్లి డ్యాంలపై ఏకాభిప్రాయం పెండింగ్‌లో ఉన్నందున గోదావరి జలాల మళ్లింపునకు ప్రత్యామ్నాయ అధ్యయనాలు చేసినట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

	ప్రాజెక్టు పేరు	ప్రయోజనం పొందే రాష్ట్రాలు	ప్రస్తుత స్థితి
1.	ఎ. మహానది (మణిభద్ర)- గోదావరి (ధవళేశ్వరం) లింక్ (లేక)	ఆంధ్రప్రదేశ్, ఒడిశా	ఫీజిబిలిటీ నివేదిక పూర్తి
	బి. మహానది (బార్ముల్)-రుషికుల్య-గోదావరి (ధవళేశ్వరం) లింక్	ఆంధ్రప్రదేశ్, ఒడిశా	ఫీజిబిలిటీ నివేదిక పూర్తి
2.	గోదావరి (పోలవరం) - కృష్ణా (విజయవాడ) లింక్	ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ	ఫీజిబిలిటీ నివేదిక పూర్తి
3.	ఎ. గోదావరి (ఇచ్చంపల్లి)- కృష్ణా (నాగార్జునసాగర్) లింక్ (లేక)	తెలంగాణ	ఫీజిబిలిటీ నివేదిక పూర్తి
	బి. గోదావరి (ఇచ్చంపల్లి/జానంపేట్)- కృష్ణా (నాగార్జునసాగర్) లింక్	తెలంగాణ	డీపీఆర్ పూర్తి
4.	గోదావరి (ఇచ్చంపల్లి/ఎస్ఎస్ఎంపీపీ)- కృష్ణా (పులిచింతల) లింక్	తెలంగాణ, ఆంధ్రప్రదేశ్	డీపీఆర్ పూర్తి
5.	కృష్ణా (నాగార్జునసాగర్)- పెన్నా (సోమశిల) లింక్	ఏపీ	డీపీఆర్ పూర్తి
6.	కృష్ణా (శ్రీశైలం)- పెన్నా లింక్	ఏపీ	డీపీఆర్ ముసాయిదా పూర్తి
7.	కృష్ణా (ఆలమట్టి)- పెన్నా లింక్	ఏపీ, కర్ణాటక	డీపీఆర్ ముసాయిదా పూర్తి
8.	ఎ. పెన్నా (సోమశిల)-కావేరి (గ్రాండ్ ఆనికట్) లింక్	ఏపీ, తమిళనాడు, పుదుచ్చేరి	డీపీఆర్ పూర్తి

రష్యన్ మహిళను పంపించే ప్రయత్నాలపై కర్ణాటక హైకోర్టు స్టే

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే: రష్యా మహిళ నీనా కుటీనా (40)ను స్వదేశానికి పంపించేందుకు చేస్తున్న ప్రయత్నాలను కర్ణాటక హైకోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ మేరకు జస్టిస్ ఎస్.సునీల్ దత్ స్టే విధిస్తూ ఉత్తర్వులిచ్చారు. కర్ణాటకలోని గోకర్ణ సమీప రామతీర్థ అడవిలో తన ఇద్దరు కుమార్తెలతో రహస్యంగా జీవిస్తున్న నీనాను పోలీసులు ఇటీవలే బయటకు తీసుకువచ్చి, తుమకూరు సమీపంలోని విదేశీయుల డిటెన్షన్ సెంటర్‌లో ఉంచిన విషయం తెలిసిందే. అయితే నీనా కుమార్తెలు ఇద్దరికీ పాస్‌పోర్టులు, ఇతర ధ్రువపత్రాలు లేవని కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లారు. ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన బాలల హక్కులను పరిగణనలోకి తీసుకొని తాత్కాలికంగా వారి బహిష్కరణను నిలిపివేస్తున్నామని న్యాయమూర్తి జస్టిస్ ఎస్.సునీల్ దత్ తెలిపారు. రెండు వారాల్లోపు అభ్యంతరాలు దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు. తదుపరి విచారణను ఆగస్టు 18కు వాయిదా వేశారు.



లక్ష్యం కోసం త్యాగాలు చేయకుంటే..

మీరు కోరుకున్న లక్ష్యం కోసం త్యాగాలకు సిద్ధపడకపోతే, చివరకు మీ లక్ష్యాన్నే త్యాగం చేయాల్సి వస్తుంది. అందుకే తాత్కాలిక ఆనందాన్నిచ్చే విషయాలను త్యజించి, మీ ఆశయ సాధనపైనే దృష్టి పెట్టండి.

– రోస్ పావెల్, ఏఐ కోచ్

చిన్న రైతుకు వెన్నుదన్నుగా నిలవాలి

- ఆహార ఉత్పత్తిలో వారిదే కీలక పాత్ర
- ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్



ప్రొఫెసర్ ప్రభావతికి మెరిటోరియస్ టీచర్ అవార్డును అందజేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

ఈనాడు, అమరావతి: 'దేశంలో చిన్న, సన్నకారు రైతులు 80-86% వరకు ఉన్నారని అంచనా. భూమి తక్కువున్నా.. ఆహార ఉత్పత్తిలో వారిదే కీలక భూమిక. వారు తరచూ పెట్టుబడి, గిట్టుబాటు ధరలు, మౌలిక సదుపాయాల విషయంలో ఇబ్బందులు పడుతున్నారు. భవిష్యత్తులో మీరు చేసే ప్రతి ప్రయత్నమూ.. చిన్న రైతులకు సౌకర్యాలు, ఆదాయం పెంచి వెన్నుదన్నుగా నిలబడేలా సాగాలి' అని గవర్నర్ అబ్దుల్ నజీర్ సూచించారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ 57వ స్నాతకోత్సవం గురువారం కృష్ణా జిల్లా ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్టులో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముఖ్య అతిథి, విశ్రాంత ఐఏఎస్ అధికారి వేణుప్రసాద్‌తో కలిసి బంగారు పతకాలు అందించారు. అనంతరం ప్రసంగించారు. 'ఎఫ్ఏఓ నివేదిక ప్రకారం 2050 నాటికి 823 కోట్ల ప్రపంచ జనాభాకు ఆహారం అందించడానికి మరో 60% ఆహారాన్ని ఉత్పత్తి చేయాలి. విత్తన ఎంపిక నుంచి పంట అమ్మకం వరకూ అన్నింటా ఏఐని వినియోగించుకోవాలి. ఎక్కువ ఆహారం ఉత్పత్తి చేయడంతో పాటు పోషకాహార సమస్యలు, దిగుమతులను తగ్గించుకోవడానికి పప్పు, నూనెగింజల ఉత్పత్తి పెంచాలి. అందుకు సాంకేతికత తెలిసిన మీలాంటి విద్యార్థుల కృషి అవసరం' అని గవర్నర్ స్పష్టం చేశారు. ముఖ్య అతిథి, పంజాబ్ ప్రభుత్వ మాజీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి, పంజాబ్ ప్రభుత్వ ఎన్ఆర్ఐ కమిషన్ సభ్యుడు వేణుప్రసాద్ మాట్లాడుతూ.. 'విద్యార్థులుగా బయటికి వెళ్తున్న మీరే రేపటి సాగు సంస్కరణలకు సారథులుగా నిలవాలి. చిన్న, సన్నకారు రైతులకు అందుబాటులో ఉండేలా సాంకేతిక పరిజ్ఞానం, యంత్రాలు అందుబాటులోకి వస్తే సాగు మరింత బాగుపడుతుంది. ఓలా, ఉబర్, యూపీఐ, వాట్సప్ లాంటివి ప్రజలకు ఎలా చేరువగా వచ్చాయో.. మీరు తెచ్చే మార్పులు సైతం కర్షకులకు అలా చేరువవ్వాలి' అని విద్యార్థులకు సూచించారు. వీసీ శారదా జయలక్ష్మీదేవి, వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి భక్తుడి వీలునామా

మరణానంతరం ఇల్లు, రూ.66 లక్షల నగదు అందజేత



దివంగత భాస్కర్‌రావు తరఫున తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరికి ఆస్తి పత్రాలు, చెక్కులను అందిస్తున్న ట్రస్టీలు ఎం.దేవరాజ్‌రెడ్డి, వి.సత్యనారాయణ, బి.లోకనాథ్, చిత్రంలో ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం

ఈనాడు-తిరుపతి, న్యూస్‌టుడే, తిరుమల: వేంకన్న భక్తులైన ఆ దంపతులు తమ తదనంతరం తమ ఇంటితో పాటు తాము బ్యాంకులో దాచుకున్న సొమ్ము మొత్తాన్ని తితిదేకు విరాళంగా అందజేయాలని నిర్ణయించుకున్నారు. అందుకనుగుణంగా వీలునామా రాసి.. ఒక ట్రస్టును ఏర్పాటుచేసి చివరకు తమ కోరికను నెరవేర్చుకున్నారు. హైదరాబాద్‌లోని యర్రాప్రగడ వెంకట సూర్య సత్యభాస్కర్‌రావు ఆదాయపు పన్ను శాఖలో అదనపు కమిషనర్ హోదాలో ఉద్యోగ విరమణ చేశారు. వనస్థలిపురం ప్రాంతంలోని శారదానగర్‌లో ఇల్లు నిర్మించుకుని 'ఆనంద నిలయం' అని పేరు పెట్టుకున్నారు. సంతానం లేని భాస్కర్‌రావు, లక్ష్మీకుమారి దంపతులు ఆ ఇంటిని వేంకటేశ్వరస్వామికి అర్పించాలని నిర్ణయం తీసుకున్నారు. కొవిడ్ సమయంలో లక్ష్మీకుమారి కన్నుమూశారు. కొవిడ్ ఉద్ధృతి తగ్గిన తర్వాత భాస్కర్‌రావు చార్టర్డ్ ఎకౌంటెంట్ ఎం.దేవరాజ్‌రెడ్డి, బి.లోకనాథ్, బావమరిది సత్యనారాయణలను తమ ఆస్తికి ట్రస్టీలుగా ఏర్పాటు చేసి వీలునామా రాశారు. 3,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఆ ఇంటిని ఆధ్యాత్మిక కార్యక్రమాలకు, వేంకటేశ్వర స్వామిపై భక్తిభావం పెంపొందించేందుకు వినియోగించాలని సూచించారు. కొద్ది కాలం క్రితం భాస్కర్‌రావు కూడా కన్నుమూయడంతో ఆయన కోరిక మేరకు ట్రస్టీలు గురువారం తిరుమలకు వచ్చి తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరిని కలిసి భాస్కర్‌రావు పొదుపుచేసిన రూ.66 లక్షలకు సంబంధించిన బ్యాంకు డీడీలను, ప్రస్తుతం రూ.3 కోట్ల విలువ చేసే ఆ ఇంటి పత్రాలను అందజేశారు. ఆ సొమ్ములో అన్నప్రసాదం ట్రస్టుకు రూ.36 లక్షలు, సర్వ శ్రేయ, వేద పరిరక్షణ, వేద గోసంరక్షణ, విద్యాదాన, శ్రీవాణి ట్రస్టులకు.. ఆరేసి లక్షల రూపాయల చొప్పున ఇవ్వాలని భాస్కర్‌రావు తన వీలునామాలో పేర్కొన్నారు.

తితిదేకు రూ. 2 కోట్ల విరాళం



తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరికి విరాళం డీడీలు అందిస్తున్న దాత ప్రతినిధులు

తిరుమల, న్యూస్‌టుడే: తితిదే ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన ట్రినిటీ కంబైన్ ప్రైవేట్ లిమిటెడ్ గురువారం రూ.2 కోట్లను విరాళంగా అందజేసింది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధులు ఆలయంలోని రంగనాయకుల మండపంలో అదనపు ఈవో వెంకయ్యచౌదరిని కలిసి విరాళం డీడీలను అందజేశారు. దాతలను అదనపు ఈవో అభినందించారు.

క్యాన్సర్ విస్తృతి అంచనాకు ఎన్‌సీడీ 4.0 సర్వే

వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఎన్‌సీడీ 3.0 సర్వే ఫలితాల ప్రకారం క్యాన్సర్ తీవ్రత తక్కువగా ఉన్నట్లు తేలడంతో.. మరింత లోతుగా అధ్యయనానికి సెప్టెంబర్ నుంచి ఎన్‌సీడీ 4.0 సర్వే నిర్వహించాలని నిర్ణయించినట్లు వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. అసంక్రమిత వ్యాధుల(ఎన్‌సీడీ) సర్వే నిర్వహణపై గుంటూరు జిల్లా చినకాకానిలో మూడు రోజుల రాష్ట్రస్థాయి కార్యశాలను మంత్రి గురువారం ప్రారంభించారు. ఎన్‌సీడీ 3.0 సర్వేలో 4.10 కోట్ల మందిని స్క్రీనింగ్ చేయాలని లక్ష్యంగా నిర్ణయిస్తే. . ఇప్పటివరకు 3 కోట్ల మందిని పరీక్షించినట్లు పేర్కొన్నారు. ఈ స్క్రీనింగ్‌లలో దాదాపు 0.35 శాతం మేరకే వ్యాధి నిర్ధారణ అయిందన్నారు. దేశవ్యాప్త క్యాన్సర్ ఉద్ధృతితో పోలిస్తే ఈ ఫలితాలు తక్కువగా ఉన్నట్లు తేలడంతో మరోసారి సర్వేకు నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి వెల్లడించారు.

భూ కుంభకోణంలో.. కాకాణికి 14 రోజుల రిమాండ్

నెల్లూరు, న్యూస్‌టుడే: కాకుటూరు భూ కుంభకోణం కేసులో వైకాపా నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి న్యాయస్థానం 14 రోజులు రిమాండ్ విధించింది. ఆయన ఇప్పటికే పలు కేసుల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. కాకుటూరు సమీపంలో జరిగిన భూ అక్రమాలకు సంబంధించి పోలీసులు రెండో అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఎదుట కాకాణిని గురువారం వర్చువల్‌గా హాజరుపరిచారు. ఈ కేసులో ఆగస్టు 7 వరకు రిమాండ్ విధించారు. 2021లో కొందరు వెంకటాచలం తహసీల్దార్ లాగిన్‌ను హ్యాక్ చేసి గుడ్లూరు డిప్యూటీ తహసీల్దార్ లాగిన్ ద్వారా.. కాకుటూరు పరిధిలో జాతీయ రహదారి పక్కన ఉన్న రూ.60 కోట్ల విలువైన ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులకు చెందినవంటూ మార్చారు. అప్పట్లో వెంకటాచలం తహసీల్దార్ ఫిర్యాదు మేరకు అనుమానితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కుంభకోణంపై విచారణకు ఒంగోలు డీఎస్పీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో వారం కిందట మరో ఇద్దరిని అరెస్టు చేసి, కేసులో కాకాణి పేరును చేర్చారు.

EENADU Vol: 51, Issue: 346 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

Hero

హీరో యొక్క స్కూటర్
స్కూటర్ యొక్క హీరో



★★★★★
లీడర్
మైలేజ్#లో

★★★★★
ప్రీమియం
క్రోమ్ యాక్సెంట్స్

★★★★★
స్థిరమైన
అల్లాయ్ వీల్స్

★★★★★
సౌకర్యవంతమైన
సీట్

★★★★★
విశాలమైన
ఫ్లోర్‌బోర్డు

★★★★★
అడ్వాన్స్డ్
ఆటో-క్యాన్సిల్
వింకర్స్

పరిచయం చేస్తున్నాం కొత్త
Destini 125

డెస్టినీ 125 | బెస్ట్-ఇన్-క్లాస్ మైలేజ్ 60## km/l | పెద్దవి మరియు వెడల్పు అల్లాయ్ వీల్స్ | మరింత పొడవైన ఫ్లష్ సీట్ | ఎల్ ఇ డి ప్రొజెక్టర్ హెడ్ లైట్ డి ఆర్ ఎల్ సహితం

SCAN TO KNOW MORE

LDP ₹1999^ | GREEN BONUS OF ₹2000$ FOR VEHICLE SCRAPPING | EXCHANGE BONUS ₹3000~ | HDFC BANK | IDFC FIRST Bank | Powered by pine labs | INSTANT DISCOUNT UP TO ₹10000* | *T & C apply. Offer applicable on select cards and on credit card EMI | TOLL FREE NO. 1800-266-0018 | INDIA'S FIRST 5 YEAR WARRANTY* *Conditions apply

Regd. Office: Hero MotoCorp Ltd., The Grand Plaza, Plot No.2, Nelson Mandela Road, Vasant Kunj - Phase -II, New Delhi - 110070, India. CIN: L35911DL1984PLC017354. It is our endeavour to improve our product. This could lead to changes in product specifications without notice. Accessories and features shown may not be a part of the standard fitment. Always wear a helmet while riding a two-wheeler. Available at select dealerships. #Compared to all scooters in the 125cc segment as per internal testing. ##Based on the testing report of govt. Certified agency. Actual mileage may vary as per riding conditions. ^Finance scheme is at the sole discretion of financiers and subject to its respective terms and conditions. ~Monsoon exchange carnival offer on scooters valid from 21st July till 28th July. $Green Bonus is applicable Pan India on select Hero products and bonus amount may vary as per model/variant. *T&C apply. Offer valid till 31st July. Offer is for limited period or till stock lasts. For further information, contact nearest Hero MotoCorp authorised outlet (s) or visit website www.heromotocorp.com

Authorised Dealers: Vijayawada: Sai Swarnika Motors, Ph: 9289923145, **Payakapuram** Ph: 9542812341, **R. M. Hero,** Ph: 9289922430, **Bhavanipuram,** Ph: 8790994368, **Vnagar** Ph: 9676833345, **Gudiwada: Sri Lakshmi Hero,** Ph: 9289922604, **Bhimavaram: Reddy And Reddy Hero,** Ph: 9289922520, **Eluru: Sai Swarna Hero,** Ph: 9289922629, **Tanuku: V, Somasundara Rao Hero,** Ph: 9289922423, **Jangareddygudem: Sai Satyan Hero,** Ph: 9289923017, **Guntur: Associated Hero,** Ph: 9289922516, **Annapurna Motors,** Ph: 9289233814, **Narasaraopet: Lotus Motor World,** Ph: 9289233907, **Chilakaluripet:** Ph: 7396099992, **Nellore: Sarayu Hero,** Ph: 9289922630, **A. M. Reddy Hero,** Ph: 9289922154, **Gudur: Viswa Sai Hero,** Ph: 9289922776, **Kavali: Sree Devi Motors,** Ph: 9289923008, **Ongole: Associated Hero,** Ph: 9289922517, **Chirala: Srinivasa Hero,** Ph: 9289922707, **Darsi: Srinivasa Hero,** Ph: 9289922707. **Associate Dealer: Jaggayyapet:** Ph: 07949294497, **Vijayawada:** Ph: 07949292160, **Ibrahimpatnam:** Ph: 9393882388, **Nuzvid:** Ph: 8143059341, **Ganapavaram Nidamarru:** Ph: 07949295959, **Eluru:** Ph: 8297312347, **Tadepalligudem:** Ph: 07949293342, **Nidadavole:** Ph: 9494984280, **Tenali:** Ph: 07949293344, **Ponnur:** Ph: 07949294496, **Sattenapalli:** Ph: 07949294498, **Cherukupalli:** Ph: 07949293345, **Kota:** Ph: 07949293349, **Naidupet:** Ph: 07949295931, **Bapatla:** Ph: 7273836666, **Markapur:** Ph: 07949293346, **Kandukur:** Ph: 07949295929, **Ongole:** Ph: 7997991788, **Cumbum:** Ph: 07949295950, **Nidadavole:** Ph: 07949293343, **Chilakaluripet:** Ph: 9154091997. **Also Available At: Mylavaram:** Ph: 9542951111, **Nandigama:** Ph: 07949294511, **One Town Vijaywada:** Ph: 8790994366, **Tiruvur:** Ph: 9491765548, **Kanchikacherla:** Ph: 9398931447, **Visannapeta:** Ph: 8520802819, **Phirangipuram:** Ph: 9705070555, **Krosur:** Ph: 8985621002, **Thullur:** Ph: 9666245777, **Epuru:** Ph: 9133834060, **Gompalagudem:** Ph: 9966667866, **Kaikalur:** Ph: 07949294510, **Bantumilli:** Ph: 9803874999, **Vuyyuru:** Ph: 9959094835, **Kuchipudi:** Ph: 07949294515, **Avanigadda:** Ph: 9440143424, **Challapalli:** Ph: 9346229464, **Palakole:** Ph: 07949293341, **Narsapur:** Ph: 07949295962, **Kalidindi:** Ph: 07949295963, **Akiveedu:** Ph: 9391677377, **Mogalthur:** Ph: 9951744446, **Hanuman Junction Bapalapadu:** Ph: 9246219119, **Koyalagudem:** Ph: 07949295964, **Narayanpuram:** Ph: 9493812347, **Chintalapudi:** Ph: 07949295960, **Bhimadole:** Ph: 9848356111, **Eluru:** Ph: 9297312347, **Jeelugumilli:** Ph: 9652319563, **Devarapall:** Ph: 8500347813, **Nallajerla:** Ph: 7720873737, **Neggipudi:** Ph: 9398673285, **Attili:** Ph: 9849331456, **Vinukonda:** Ph: 07949294509, **Mangalagiri:** Ph: 07949294513, **Piduguralla:** Ph: 9885988625, **Repalle:** Ph: 9515320031, **Dachepalli:** Ph: 9666406417, **Santhamaguluru:** Ph: 9573115012, **Karempudi:** Ph: 9440103681, **Venkatagiri:** Ph: 07949295942, **Podalakur:** Ph: 9010731522, **Tada:** Ph: 9966085189, **Sullurupet:** Ph: 07949295941, **Buchireddypalem:** Ph: 07949295937, **Rajupalem:** Ph: 07949295946, **Alluru:** Ph: 07949295938, **Atmakur:** Ph: 07949295935, **Vinjamur:** Ph: 9652206963, **Marthur:** Ph: 07949294512, **Ulavapadu:** Ph: 9110393870, **Kondepi:** Ph: 9000598785, **Inkollu:** Ph: 8639518979, **Medarametla:** Ph: 8019983505, **Kuricheedu:** Ph: 7036418459, **Tripurantakam:** Ph: 9010509004, **Gurazala:** Ph: 9666406419, **Podili:** Ph: 9701338001, **Kanigiri:** Ph: 07949295943, **Addanki:** Ph: 07949295947, **Chimakurthi:** Ph: 9100968864, **Yeragundapalem:** Ph: 7013630802, **Dornala:** Ph: 07949295955, **Giddaluru:** Ph: 07949293337,

RS/Hero/07/25

ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో

ఇండియా కూటమి పోటీ యోచన!

దిల్లీ: ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేసే యోచనలో ఇండియా కూటమి ఉన్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి ఉమ్మడి అభ్యర్థిపై సమష్టి నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు గురువారం వెల్లడించాయి. మెజారిటీ లేకపోయినా ఫలితంతో సంబంధం లేకుండా బలమైన సందేశాన్ని పంపే ఉద్దేశంతోనే పోటీ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేయడంతో ఖాళీ అయిన ఉప రాష్ట్రపతి పదవికి త్వరలో ఎన్నికలు జరగనున్నాయి.

భాజపా నుంచే తదుపరి ఉప రాష్ట్రపతి!

దిల్లీ: జగదీప్ ధన్‌ఖడ్ ఆకస్మిక రాజీనామాతో ఖాళీ అయిన ఉప రాష్ట్రపతి పదవికి ఎన్డీయే కూటమి.. ఎవరిని ఎంపిక చేస్తుందన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే రేసులో పలువురి పేర్లు తెరపైకి వస్తున్నాయి. జేడీయూ నేత, కేంద్ర మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్‌ను ఎంపిక చేసే అవకాశాలున్నట్లు ప్రచారం మొదలైంది. అయితే దీన్ని భాజపా వర్గాలు తోసిపుచ్చాయి. తదుపరి ఉప రాష్ట్రపతి భాజపాకు చెందిన నేతే అవుతారని స్పష్టం చేశాయి. భాజపా అధ్యక్షుడు జేపీ నడ్డాతో రామ్‌నాథ్ ఠాకూర్ భేటీ కావడంతో ఈ ఊహాగానాలొచ్చాయి.

'చారిత్రక' వివాదం!

- ఎప్పటి నుంచో థాయిలాండ్, కంబోడియా ఘర్షణ
- సరిహద్దుల నిర్ణయం.. మందుపాతరలు, ఆలయాలపై తరచూ కలహం
- గతంలోనూ 2 దేశాల మధ్య యుద్ధం



ఈశాన్య థాయిలాండ్‌లోని సురిన్ ప్రావిన్స్‌లో ఓ వంతెన కింద తలదాచుకున్న ప్రజలు

థాయిలాండ్, కంబోడియా మధ్య ఘర్షణ ఈ నాటిది కాదు. విడిపోయినప్పటి నుంచి సరిహద్దు గొడవలు, ఆలయాల వివాదం, మందుపాతరల ఘర్షణలు తరచూ వార్తల్లో నిలుస్తున్నాయి. తాజాగా మరోసారి రెండు దేశాలు ఘర్షణ పడ్డాయి. గతంలోనూ ఇవి రెండూ యుద్ధం చేశాయి.

ఆలయం చుట్టూ..

థాయిలాండ్, కంబోడియాల మధ్య 800 కిలోమీటర్ల సరిహద్దు ఉంది. ఇందులో అత్యధిక భాగాన్ని ఫ్రాన్స్ పాలన కింద ఉన్నప్పుడే గుర్తించారు. 1907లో మ్యాప్‌ను రూపొందించారు. అయితే ఈ సరిహద్దుల్లోని ప్రముఖ ఆలయాలైన ప్రీహ్ విహియర్, తా మెయిన్ థామ్‌తో పాటు పర్వతాలు, అరణ్యాల కోసం రెండు దేశాలు కలహించుకుంటున్నాయి. ఇందులో 9వ శతాబ్దానికి చెందిన ప్రీహ్ విహియర్ అత్యంత కీలకమైంది. దీనిని ఖెమర్ పాలకులు నిర్మించారు. ఈ ఆలయం కంబోడియాకు చెందుతుందని 1962లో అంతర్జాతీయ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. దానిని థాయ్‌లాండ్ అంగీకరించింది. కానీ ఆ దేవాలయం కేంద్రంగా స్థానిక సెంటిమెంట్లతో తరచూ వివాదాలు తలెత్తుతున్నాయి. కంబోడియా విజ్ఞప్తి మేరకు 2008లో ఈ ఆలయాన్ని యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించింది. దీనిని థాయ్‌లాండ్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఆ సమయంలో కంబోడియా చూపిన మ్యాప్‌లో 4.6 చదరపు మైళ్లు ఆక్రమించుకున్నట్లు థాయ్ ఆరోపించింది. వాస్తవానికి ఇక్కడ సరిహద్దుల నిర్ధారణ జరగలేదు. ఇది 2008-11 మధ్య పలుసార్లు రెండు దేశాల మధ్య ఘర్షణలకు దారితీసింది. 2011లో దాదాపు డజను మంది ప్రాణాలు కోల్పోయారు. సరిహద్దుల్లోని వేల మంది ఇళ్లను వదిలి పారిపోయారు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

2013లో ఐసీజే తీర్పుతో అగ్గి

2013లో ఐసీజే మరో తీర్పుతో మళ్లీ అగ్గి రాజుకుంది. ప్రీహ్ విహియర్ పరిసరాల్లో కంబోడియాకు సార్వభౌమత్వం ఉందని.. థాయ్ దళాలు వైదొలగాలని సూచించింది. దీనికి థాయ్ అంగీకరించినా.. మ్యాప్‌లు, సైనిక గస్తీలపై వివాదం మొదలైంది. ఇక థాయ్ సురిన్ ప్రావిన్స్‌లోని తా మోన్ థామ్, తా ముయెన్ థామ్ ప్రాంతాలూ వివాదాస్పద ప్రదేశాలుగా మారిపోయాయి.

మందుపాతరల వివాదం

ఇరు దేశాల మధ్య మందుపాతరల అంశమూ వివాదాస్పదంగా మారింది. సరిహద్దుల్లోని వివాదాస్పద ప్రదేశంలో బుధవారం మందు పాతర పేలడంతో థాయ్‌లాండ్ సైనికులు గాయపడ్డారు. ఇది తమ ప్రదేశంలో జరిగిందని థాయ్ చెబుతుండగా.. ప్రీహ్ విహియర్ ఆలయ పరిసరాల్లో చోటు చేసుకుందని కంబోడియా వాదిస్తోంది. వారం క్రితమూ వివాదాస్పద స్థలాల్లో ఇలాంటి ఘటనలే చోటు చేసుకున్నాయి. రష్యా నుంచి కొనుగోలు చేసిన మందు పాతరలను ఇటీవలే ఇక్కడి భూమిలో కంబోడియా పాతినట్లు థాయ్‌లాండ్ ఆరోపిస్తోంది. ఈ ఆరోపణలను కంబోడియా ఖండించింది.



బ్రిటన్ రాజుకు మొక్కను బహూకరించిన మోదీ

లండన్: బ్రిటన్ పర్యటనలో భాగంగా ఆ దేశ రాజు ఛార్లెస్-3తో ప్రధాని మోదీ నార్ఫోక్‌లోని సాండ్రింగ్‌హామ్ ఎస్టేట్‌లో గురువారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాజుకు ఒక మొక్కను బహూకరించారు. శరదృతువు వచ్చాక దాన్ని ఎస్టేట్‌లో నాటనున్నట్లు బకింగ్‌హామ్ ప్యాలెస్ ఓ ప్రకటనలో తెలిపింది. మోదీ భారత్‌లో 'అమ్మ పేరుతో ఒక మొక్క' కార్యక్రమాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఆ స్ఫూర్తితో బ్రిటన్ రాజుకు మొక్కను బహూకరించారు. అది 'సోనోమా డోవ్' మొక్క. దాన్ని హ్యాండ్‌కర్చీఫ్ చెట్టుగానూ పిలుస్తారు. నాటిన 2-3 ఏళ్లలోనే అది అధిక సంఖ్యలో పూలు పూస్తుంటుంది. బ్రిటన్ పర్యటనను ముగించుకొన్న తర్వాత మోదీ అక్కడి నుంచి మాల్దీవులకు బయలుదేరి వెళ్లారు.

కేంద్ర ఉద్యోగులకు 30 రోజుల సర్వీస్ సెలవులు

దిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 30 రోజుల సర్వీస్ సెలవులు ఉంటాయని, వాటిని వ్యక్తిగత అవసరాలకూ, వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణకు కూడా వినియోగించుకోవచ్చని కేంద్ర సిబ్బంది వ్యవహారాలశాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ రాజ్యసభకు వెల్లడించారు. ఉద్యోగులు తమ వృద్ధ తల్లిదండ్రులను చూసుకోవడం కోసం తీసుకునే సెలవులకు ఏదైనా నిబంధన ఉందా అని రాజ్యసభలో సమాధానమిచ్చారు.

జన్మతః పౌరసత్వంపై

ట్రంప్‌నకు వ్యతిరేకంగా కోర్టు తీర్పు

వాషింగ్టన్: జన్మతః పౌరసత్వం కల్పించే విధానాన్ని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రద్దు చేయడం రాజ్యాంగ విరుద్ధమని అమెరికా ఫెడరల్ అప్పీల్స్ కోర్టు గురువారం స్పష్టం చేసింది. ట్రంప్ నిర్ణయం దేశవ్యాప్తంగా అమలు చేయరాదని పేర్కొంటూ కిందిస్థాయి కోర్టు వెలువరించిన నిర్ణయాన్ని సమర్థించింది. 9వ అప్పీల్స్ సర్క్యూట్ కోర్టుకు చెందిన ముగ్గురు జడ్జీల కమిటీ ఈ ఆదేశాలు జారీ చేసింది. తదుపరి ఈ అంశం అమెరికా సుప్రీంకోర్టు సమక్షానికి వచ్చే అవకాశం ఉంది. అక్రమంగా, లేదా తాత్కాలికంగా వలసవచ్చిన జంటలకు అమెరికాలో జన్మించిన పిల్లలకు జన్మతః పౌరసత్వం అందించే విధానాన్ని రద్దు చేస్తూ ట్రంప్ యంత్రాంగం తీసుకున్న నిర్ణయం అమలులోకి రాకుండా తాజా తీర్పు అడ్డుకుంటుంది. జన్మతః లభించే పౌరసత్వాన్ని రద్దుచేయడం ద్వారా ట్రంప్ యంత్రాంగం రాజకీయ ప్రయోజనం కోసం రాజ్యాంగాన్ని ఉల్లంఘించిందని న్యాయమూర్తి అన్నారు.

ఉక్రెయిన్‌కు 32.2 కోట్ల డాలర్ల ఆయుధాలు

- అమెరికా నిర్ణయం

వాషింగ్టన్: ఉక్రెయిన్ గగన తల రక్షణ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు 32.2 కోట్ల డాలర్ల విలువైన ఆయుధాలు, అత్యాధునిక క్షిపణులు ఆ దేశానికి అందించేందుకు అమెరికా విదేశాంగ శాఖ అంగీకరించింది. ఈ నిర్ణయాన్ని అమెరికా చట్టసభకు తెలియజేశామని విదేశాంగ శాఖ తెలిపింది. ఇందులో 15 కోట్ల డాలర్లు అమెరికా ఇప్పటికే అమ్మిన ఆర్మర్డ్ వాహనాల నిర్వహణకు, 17.2 కోట్ల డాలర్లు భూ ఉపరితలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే క్షిపణి వ్యవస్థల కొనుగోలుకు వినియోగిస్తారు. ఉక్రెయిన్‌కు ఆయుధాల అందజేతను నిలుపుదల చేస్తున్నామని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ఇటీవల ప్రకటించారు. అనంతరం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రంగంలోకి దిగి ఉక్రెయిన్‌కు ఆయుధ సాయం కొనసాగిస్తామని ప్రకటించారు. "ఉక్రెయిన్ దారుణమైన దాడులకు గురవుతోంది. అందుకే ఉక్రెయిన్‌కు మరిన్ని ఆయుధాలు పంపుతున్నాం" అని ట్రంప్ ప్రకటించారు.

గాజా కాల్పుల విరమణ చర్చల నుంచి వైదొలగిన విట్కాఫ్

వాషింగ్టన్: అమెరికా చొరవతో గాజాలో కాల్పుల విరమణ జరిగి శాంతి పునరుద్ధరణ జరుగుతుందనుకున్న వారి ఆశ అడియాసే అయ్యింది. గాజా కాల్పుల విరమణపై సంప్రదింపుల్లో పాల్గొనేందుకు అమెరికా అధ్యక్షుని దూతగా రంగంలోకి దిగిన స్టీవ్ విట్కాఫ్ చర్చల నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించారు. ఖతార్‌లో కాల్పుల విరమణకై మధ్యవర్తిత్వం వహిస్తున్న అమెరికా బృందాన్ని ఉపసంహరించుకున్నారు. హమాస్ సంస్థ గాజాలో కాల్పుల విరమణపై చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదని విట్కాఫ్ ఆరోపించారు.

వెదురుతో విప్లవాత్మక పదార్థం

- మోటారు వాహనాలకు హరిత విడిభాగాలు

దిల్లీ: మోటారు వాహనాలలో వాడుతున్న ప్లాస్టిక్, ఫైబర్, ఇనుము, కొయ్య విడిభాగాలకు ప్రత్యామ్నాయాన్ని కనుగొనడంలో ఐఐటీ-గువాహతి పరిశోధకులు విజయం సాధించారు. ఈశాన్య భారతంలో అతి వేగంగా పెరిగే బాంబుసా టుల్డా అనే వెదురు చెట్ల గుజ్జును, సూక్ష్మజీవుల వల్ల సహజంగా విచ్ఛిన్నమయ్యే పాలిమర్లతో కలిపి పర్యావరణహితమైన మిశ్రమ పదార్థాన్ని తయారు చేయగలిగినట్లు ఐఐటీ అధికారులు గురువారం వెల్లడించారు. ఈ పదార్థం ఎంతో బలమైనది. అధిక వేడిని తట్టుకుంటుంది. పెద్దగా తేమను పీల్చుకోదు. చౌకలో లభిస్తుంది. ఈ పదార్థం వల్ల ప్లాస్టిక్ వ్యర్థాలు తగ్గిపోవడంతోపాటు మోటారు వాహన పరిశ్రమకు హరిత విడిభాగాలు లభిస్తాయని ఐఐటీ-గువాహతి మెకానికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ పూనమ్ కుమారి వివరించారు. ఈ వెదురు మిశ్రమ పదార్థం కిలో రూ.4,300 ధరకే లభిస్తుందని, దీంతో వాహన డాష్‌బోర్డులు, తలుపుల ప్యానల్స్, సీట్లను తయారుచేయవచ్చని తెలిపారు. ఈ మిశ్రమ పదార్థంతో ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్ పరికరాలు, భవన నిర్మాణ సామగ్రినీ తయారుచేయవచ్చు.

సహకార విధానాన్ని ప్రకటించిన అమిత్‌షా



దిల్లీ: కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్‌షా గురువారం జాతీయ సహకార విధానాన్ని ప్రకటించారు. పర్యాటకం, ట్యాక్సీ సేవలు, బీమా, సంప్రదాయేతర ఇంధన రంగాల్లో సహకార స్ఫూర్తిని విస్తరించాలని ఈ విధానం పేర్కొంటోంది. ఈ విధానాన్ని కేంద్ర మాజీ మంత్రి సురేష్ ప్రభు నేతృత్వంలోని 48 మంది సభ్యుల కమిటీ రూపొందించింది. 2002లో తొలి సహకార విధానాన్ని ప్రకటించిన భాజపా ప్రభుత్వం ఇప్పుడు రెండో విధానాన్నీ రూపొందించిందని అమిత్‌షా విధాన ప్రకటన సందర్భంగా పేర్కొన్నారు. దేశ స్థూల జాతీయోత్పత్తిలో సహకార రంగం వాటాను మూడింతలు చేసి 2047కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంలో ఈ రంగం కీలక భాగస్వామి కావాలన్న ఆశయాన్ని సాధించాలని ఈ విధానం ఆకాంక్షిస్తోంది. "2034కల్లా దేశ స్థూల దేశీయోత్పత్తిలో సహకార రంగం వాటా మూడింతలవుతుంది. ఈ లక్ష్యం సాధించడం కష్టసాధ్యమేనని నాకూ తెలుసు. అయితే మేం లక్ష్యసాధన కోసం తగిన విధంగా ప్రణాళికలు రూపొందించుకున్నాం" అని అమిత్‌షా పేర్కొన్నారు. 'పర్యాటకం, ట్యాక్సీ సేవలు, బీమా తదితర రంగాల్లో సహకార స్ఫూర్తి పెంపొందించేందుకు ప్రణాళికలు రూపొందించాం" అని ఆయన అన్నారు. విధాన లక్ష్యాల సాధనకు సహకార సంఘాల పునాదులు పటిష్ఠం చేయడం, చైతన్యాన్ని పెంపొందించడం, భవితవ్యానికి తగిన రీతిలో తీర్చిదిద్దడం, భిన్న వర్గాలను భాగస్వాముల్ని చేయడం, మరింతగా చొచ్చుకుపోవడం, కొత్త రంగాల్లోకి ప్రవేశించడం అనే ఆరు వ్యూహాలను అమలు పరచనున్నారు. 50 కోట్ల మంది ప్రజల్ని సహకార రంగంలో భాగస్వాముల్ని చేసేందుకు కృషి చేస్తామని అమిత్‌షా ప్రకటించారు. విస్తృత సంప్రదింపుల అనంతరం ఈ విధానాన్ని ఖరారు చేశారు.

హిందూ, ముస్లింల మధ్య చర్చలకు అంగీకారం

- ముస్లిం మత పెద్దలతో భాగవత్ భేటీ

దిల్లీ: పలు అంశాలపై హిందూ, ముస్లింల మధ్య చర్చలు జరిపేందుకు అంగీకారం కుదిరింది. గురువారం దిల్లీలోని హరియాణా భవన్‌లో జరిగిన సమావేశంలో ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్, ముస్లిం మత పెద్దలు, పండితుల మధ్య దీనిపై ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా చర్చలు కొనసాగాల్సిన అవసరముందని వారు నిర్ణయించారని ఆల్ ఇండియా ఇమామ్ ఆర్గనైజేషన్ (ఏఐఐవో) చీఫ్ ఉమర్ అహ్మద్ ఇలియాసీ తెలిపారు. సుమారు 3.30 గంటలపాటు జరిగిన ఈ సమావేశంలో ఇమామ్‌లు, ముఫ్తీలు, మదర్సాల అధిపతులైన మొహతామీలు పాల్గొన్నారు. ఏఐఐవో ఈ సమావేశాన్ని నిర్వహించింది. సీనియర్ ఆరెస్సెస్ నేతలు క్రిషన్ గోపాల్, ఇంద్రేశ్ కుమార్‌తో కలిసి భాగవత్ ఇందులో పాల్గొన్నారు.

ఇది సానుకూల పరిణామమని, నిరంతర చర్చల ప్రక్రియలో భాగమని ఆరెస్సెస్ పేర్కొంది. సమాజంలోని అన్ని వర్గాల వారితో చర్చించి.. వారిని దేశం కోసం కలిసి పనిచేయడంలో భాగస్వాములను చేసే ప్రక్రియని ఆరెస్సెస్ జాతీయ ప్రచార, మీడియా విభాగం అధిపతి సునీల్ అంబేడ్కర్ తెలిపారు.

✦ 'జాతీయ అంశాలపై స్వేచ్ఛాయుత వాతావరణంలో చర్చలు జరిగాయి. మందిరాలు- మసీదులు, ఇమామ్‌లు- పూజారులు, గురుకులాలు-మదర్సాల మధ్య చర్చలు జరగాలనే నిర్ణయం తీసుకున్నాం' అని ఇలియాసీ తెలిపారు. తమ నిర్ణయాన్ని భాగవత్ ప్రశంసించారని వెల్లడించారు. ఆరెస్సెస్, ఏఐఐవో కలిసి ఈ నిర్ణయాన్ని ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించాయని వివరించారు. 'ప్రతి సమస్యనూ చర్చలే పరిష్కరిస్తాయి. అపార్థాలను తొలగిస్తాయి. పరస్పర సమన్వయాన్ని సాధిస్తాయి. పరస్పర విశ్వాసాన్ని పెంపొందిస్తాయి' అని ఇలియాసీ తెలిపారు.

ఐదేళ్లలో మోదీ విదేశీ పర్యటనల ఖర్చు రూ.362 కోట్లు

దిల్లీ: ఈ సంవత్సరంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమెరికా, ఫ్రాన్స్ మొదలైన ఐదు దేశాల్లో చేసిన అధికారిక పర్యటనకు రూ.67 కోట్ల వ్యయం చేసినట్టు కేంద్ర ప్రభుత్వ గణాంకాలు తెలియజేస్తున్నాయి. 2021 నుంచి 2024 వరకూ ఆయన విదేశీ పర్యటనలపై మొత్తం రూ.295 కోట్లు వ్యయమైనట్టు కేంద్ర ప్రభుత్వం పార్లమెంటుకు సమర్పించిన గణాంకాలు వివరిస్తున్నాయి. ఈ సంవత్సరం ఇప్పటి వరకూ చేసిన ఖర్చును కలిపితే ఈ వ్యయం రూ.362 కోట్లకు చేరుతుంది. అయితే ఈ లెక్కల్లో ఇటీవలి కాలంలో మారిషస్, సైప్రస్, కెనడా, క్రొయేషియా, ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియా దేశాల పర్యటనకు ఎంత వ్యయమైందీ తెలపలేదు. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన రాజ్యసభ సభ్యుడు డెరెక్ ఓ బ్రియాన్ అడిగిన ప్రశ్నకు విదేశాంగ వ్యవహారాల సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ ఈ మేరకు లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. ఇటీవలి విదేశీ పర్యటనలకు సంబంధించిన బిల్లులు సిద్ధం చేస్తున్నామని, పూర్తి వ్యయం ఇంకా నిర్ధారించలేదని మంత్రి రాజ్యసభకు తెలిపారు. ఈ సంవత్సరం ప్రధాని పర్యటనలన్నింటిలోకీ అతి ఖరీదైనది ఫ్రాన్స్ పర్యటన. మోదీ ఫ్రాన్స్ పర్యటనకు రూ.25 కోట్లు ఖర్చు చేశారు. 2023లో మోదీ అమెరికా పర్యటనకు రూ.22 కోట్లు ఖర్చు చేశారు. మోదీ 2024లో 16 దేశాల్లో పర్యటించారు. అందుకు రూ.109 కోట్లు ఖర్చు చేశారు.

'రాజ్యాంగ పీఠిక నుంచి ఆ పదాలను తొలగించబోం'

దిల్లీ: ఎమర్జెన్సీ సమయంలో రాజ్యాంగ పీఠికలో ప్రవేశపెట్టిన 'సామ్యవాదం, లౌకికవాదం' పదాలను తొలగించే ఆలోచనలేదని కేంద్రం వెల్లడించింది. ఈ విషయమై గురువారం రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు.. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ప్రవేశిక నుంచి ఈ రెండు పదాలను తొలగించేందుకు ప్రభుత్వం అధికారికంగా ఎటువంటి చర్యలు తీసుకోలేదని స్పష్టం చేశారు.

రాజకీయ పార్టీల్లో మహిళా కార్యకర్తలకు

సురక్షిత వాతావరణం కల్పించాలి

- సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు

దిల్లీ: దేశంలోని రాజకీయ పార్టీలన్నీ 'పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం-2013' నిబంధనలను పాటించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. రాజకీయ పార్టీల్లో పనిచేసే మహిళా కార్యకర్తలకు సురక్షితమైన భద్రతా వాతావరణాన్ని కల్పించాలని పిటిషనర్ పేర్కొన్నారు. కార్యకర్తలు లైంగిక వేధింపులకు గురైతే అందుకు ఆయా రాజకీయ పక్షాలు బాధ్యత వహించాలని, దీనికి సంబంధించిన వివాదాల పరిష్కార యంత్రాంగాలనూ సంస్థాగతంగా ఏర్పాటు చేసుకునేలా ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రం, రాష్ట్రప్రభుత్వాలతో పాటు జాతీయ రాజకీయ పార్టీలైన భాజపా, కాంగ్రెస్‌లనూ ప్రతివాదులుగా చేర్చారు. రాజకీయాల్లో పనిచేసే మహిళా కార్యకర్తలను లైంగిక వేధింపుల నిరోధక చట్టం-2013 పరిధి నుంచి మినహాయించడాన్ని సవాల్ చేస్తున్నట్లు పిటిషనర్ తరఫు న్యాయవాది పి.శ్రీరామ్ తెలిపారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సాధారణ మహిళా కార్యకర్తలు లైంగిక వేధింపులకు గురయ్యే అవకాశం ఉంది కనుక వారికి కూడా ఈ చట్టం ద్వారా రక్షణ కల్పించాలన్నారు. రాజకీయ పక్షాల కార్యకర్తలు కూడా 'ఉద్యోగి' నిర్వచనం పరిధిలోకే వస్తారని తెలిపారు.

ఉచితాలపై పిటిషన్ తోసిపుచ్చిన సుప్రీం

నగదు బదిలీతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అందిస్తున్న వివిధ ఉచితాల ప్రతికూల ప్రభావంపై సమగ్ర అధ్యయనం నిర్వహించడానికి నిపుణుల కమిటీని నియమించాలని కోరుతూ దాఖలైన అభ్యర్థనను సుప్రీంకోర్టు గురువారం తోసిపుచ్చింది. "దీనిపై విచారణ జరపాలని మేం కోరుకోవడం లేదు. పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నాం" అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది.

రాహుల్‌పై పరువునష్టం దావా.. విచారణ 8కి వాయిదా

సుల్తాన్‌పుర్ (యూపీ): లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీపై నమోదు చేసిన పరువునష్టం దావా విచారణను సుల్తాన్‌పుర్‌లోని ఎంపీ-ఎమ్మెల్యేల కోర్టు వచ్చే నెల 8కి వాయిదా వేసింది. కర్ణాటక శాసనసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్‌గాంధీ కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు వ్యతిరేకంగా అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ 2018లో భాజపా నాయకుడు విజయ్ మిశ్ర కేసు దాఖలు చేశారు. బార్ అసోసియేషన్ ఎన్నికల కారణంగా న్యాయవాదులు విధులకు హాజరు కాకపోవడంతో గురువారం నాటి విచారణ వాయిదా పడిందని భాజపా నేత తరఫు న్యాయవాది సంతోష్‌కుమార్ పాండే అన్నారు.

సావర్కర్ కేసులో బెయిలు

హిందూత్వ సిద్ధాంతకర్త సావర్కర్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీపై దాఖలైన మరో పరువునష్టం కేసులో మహారాష్ట్రలోని ఒక కోర్టు ఆయనకు బెయిలు మంజూరు చేసింది. ఈ కేసులో తాను దోషిని కానని రాహుల్ ఇప్పటికే కోర్టుకు తెలిపారు.

లాలూపై భూమికి బదులు ఉద్యోగం కేసు.. విచారణపై తీర్పు రిజర్వు చేసిన హైకోర్టు

దిల్లీ: బిహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్జేడీ అధ్యక్షుడు లాలూప్రసాద్ యాదవ్, ఆయన కుటుంబ సభ్యులపై భూమికి బదులు ఉద్యోగం కుంభకోణానికి సంబంధించి సీబీఐ దాఖలు చేసిన కేసు విచారణను కింది కోర్టు వాయిదా వేయాలా వద్దా అన్న అంశంపై దిల్లీ హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. భూమికి బదులు ఉద్యోగం కుంభకోణంలో లాలూతోపాటు ఆయన భార్య, కుమారులు, కుమార్తెలందరిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసును 2022 మే 18న నమోదు చేశారు. రైల్వేశాఖ మాజీ మంత్రి అయిన లాలూను ప్రాసిక్యూట్ చేసేందుకు కావాల్సిన అనుమతులు లేని కారణంగా ఆయనపై దాఖలైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాల్సిందిగా దిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలైందని, దానిపై వచ్చేనెల 12న విచారణ జరగాల్సి ఉందని లాలూ తరఫు న్యాయవాది హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవీందర్ దెదెజాకు తెలియజేశారు. ఈ కేసులో 14 సంవత్సరాల తర్వాత 2022లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, సీబీఐ ప్రాథమిక విచారణ పూర్తిచేసి కేసు విచారణ మూసివేసిన తర్వాత మళ్లీ కేసు నమోదు చేశారని కోర్టుకు లాలూ విన్నవించారు.

ఎయిరిండియాకు డీజీసీఏ 4 షోకాజ్ నోటీసులు

ముంబయి: ఎయిరిండియాకు పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) నాలుగు షోకాజ్ నోటీసులను ఇచ్చింది. క్యాబిన్ సిబ్బంది పని నిబంధనలు- విశ్రాంతి వేళలు, శిక్షణ నియమాలు- కార్యాచరణకు సంబంధించిన విధానాలను ఉల్లంఘించిందన్న కారణంపై ఈ నోటీసులు జారీ చేసినట్లు డీజీసీఏ గురువారం వెల్లడించింది.

విమానంలో శిశువుకు జన్మనిచ్చిన మహిళ

ఇంటర్నెట్ డెస్క్: మస్కట్ నుంచి ముంబయికి వస్తున్న ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో గురువారం ఓ మహిళ ప్రసవించారు. థాయ్‌లాండ్‌కు చెందిన ఆ మహిళకు మార్గమధ్యంలో పురిటినొప్పులు మొదలయ్యాయి. క్యాబిన్ సిబ్బంది అప్రమత్తమై విమానంలో ప్రయాణిస్తున్న ఓ నర్సు సాయంతో ప్రసవం చేయగా.. ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు.



ఐస్‌లాండ్‌లోని రెకిజాన్స్ ద్వీపకల్పంలో గ్రిండావిక్‌కు ఆరు కిలోమీటర్ల దూరంలో నిప్పులు కక్కుతున్న అగ్నిపర్వతం

దినకూలీకి దొరికిన 8 వజ్రాలు

ఈటీవీ భారత్: మధ్యప్రదేశ్‌లోని పన్నాలో హర్‌గోవింద్ యాదవ్ అనే దినకూలీకి నిసార్ గనిలో 8 వజ్రాలు దొరికాయి. వాటి ధర సుమారు రూ.12 లక్షలు ఉంటుందని అధికారుల అంచనా.



ఛతర్‌పుర్ జిల్లాలోని కటియా గ్రామానికి చెందిన హర్‌గోవింద్, పవన్‌దేవి గత అయిదేళ్లుగా పన్నాలోని నిసార్ గనిలో పనిచేస్తున్నారు. ఈ దంపతులకు అదృష్టం తలుపుతట్టి ఒకేసారి 8 వజ్రాలు లభించాయి. వీటి విలువను నిపుణులు నిర్ధారించాక, వేలంలో వచ్చిన మొత్తం నుంచి పన్నులు మినహాయించి మిగతా డబ్బును గోవింద్ కుటుంబానికి అందజేస్తారు. హర్‌గోవింద్ మాట్లాడుతూ.. "భగవంతుడు ఈసారి మమ్మల్ని కనికరించాడు. గతంలోనూ ఓ వజ్రం దొరికింది. అప్పుడు అవగాహన లేకపోవడంతో కేవలం రూ.లక్ష మాత్రమే నా చేతికి వచ్చింది" అని తెలిపాడు.

రూ.5.8 కోట్ల బీమా కోసం.. కాళ్లు నరుక్కొన్న వైద్యుడు!



ఇంటర్నెట్ డెస్క్: బ్రిటన్ వైద్యుడు నెయిల్ హాపర్ (49) బీమా కింద 5 లక్షల పౌండ్లు (దాదాపు రూ.5.8 కోట్లు) వస్తాయన్న ఆశతో తన రెండు కాళ్లను తొలగించుకున్నాడు. ఇన్సూరెన్స్ సంస్థలు కోర్టుకెక్కడంతో ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఈ కేసు విచారణ పెండింగులో ఉంది. ఇదే తరహాలో ఇతరుల కాళ్లను కూడా తొలగించేలా మరో వైద్యుడిని నెయిల్ ప్రోత్సహించాడన్న అభియోగాలు రావడంతో కేసులోని చీకటికోణం బయటపడింది. శరీరానికి హాని కలగకుండా కాళ్లను ఎలా తొలగించుకోవచ్చన్న దానిపై నెయిల్ ఓ వెబ్‌సైటు నుంచి కొన్ని వీడియోలు కొనుగోలు చేశాడు. వాటి ఆధారంగా మరో వైద్యుడి సహకారంతో తన రెండు కాళ్లను తొలగించుకున్నాడు. అనంతరం బీమా సొమ్ము కోసం గతంలో పాలసీ తీసుకున్న రెండు సంస్థలను ఆశ్రయించాడు. తనకు రక్తనాళ సంబంధిత సమస్య ఉందని, కాళ్లను తొలగించుకోకపోతే అది శరీరమంతా వ్యాపిస్తుందని నమ్మించే ప్రయత్నం చేశాడు.

మూడేళ్ల కుమారుడిని బోరుబావిలో వేసిన తండ్రి!

ఈటీవీ భారత్: రాజస్థాన్‌లో ఓ కర్కశ తండ్రి కన్న కొడుకు పాలిట కాలయముడిగా మారాడు. మద్యం మత్తులో మూడేళ్ల కుమారుడిని చంపి బోరుబావిలో పడేశాడు. జైపుర్ జిల్లాలోని జమవా రాంగఢ్ పోలీస్‌స్టేషను పరిధిలో ఈ దారుణం జరిగింది. నిందితుడు లలిత్ తన భార్యతో గొడవ పెట్టుకోవడం వల్ల ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో కుమారుడికి ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. ఓవైపు భార్య పుట్టింటికి వెళ్లిపోవడం, మరోపక్క బిడ్డ అనారోగ్యం అతడిని తీవ్ర మనోవేదనకు గురిచేశాయి. దీంతో బాబును బోరుబావిలో పడేసినట్లు లలిత్ చెబుతున్నాడు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. బోరుబావిలో ఉన్న చిన్నారిని వెలికితీసే ప్రయత్నం చేస్తున్నట్లు డీఎస్పీ ప్రదీప్ యాదవ్ తెలిపారు. చిన్నారిని బయటికి తీసిన తర్వాతే ఇది హత్యా లేదా మరేదైనా కారణముందా అనేది తెలుస్తుందన్నారు.

అమెరికాలో పడిపోయిన జననాలు

న్యూయార్క్: సంపన్న పశ్చిమ యూరప్ దేశాల మాదిరిగానే అమెరికాలో కూడా 2024లో సంతానోత్పత్తి రేటు 1.6కన్నా దిగువకు పడిపోయింది. 1960లలో అమెరికాలో 3.5గా ఉన్న సంతానోత్పత్తి రేటు 1976లో 1.7కి తగ్గి, 2007లో 2.1కి పెరిగింది. 2023లో తిరిగి 1.621కి, 2024లో ఎన్నడూ లేనంతగా 1.599కి పడిపోయింది. ఆలస్యంగా పెళ్లిళ్లు జరగడం, పిల్లలను పెంచడానికి ఆర్థిక స్తోమత లేకపోవడం, వారిని కనడానికి ఆరోగ్య బీమా.. ఇతర వసతులు కొరవడటం వల్లనే సంతానోత్పత్తి తగ్గిపోతోంది. అమెరికాలో గతేడాది కన్నా ఈ ఏడాది జననాలు 1 శాతం పెరిగినట్లు కొన్ని అధికార గణాంకాలు తెలుపుతున్నా, వలసవచ్చినవారి వల్ల ఇలా జరిగి ఉండవచ్చని నిపుణుల అంచనా. అమెరికా పౌరుల్లో మాత్రం గడచిన రెండు దశాబ్దాల నుంచి జననాలు పడిపోతున్నాయి. పరిస్థితిని చక్కదిద్దడానికి ప్రయోగశాలలో పిండోత్పత్తి ఖర్చులను తగ్గిస్తామనీ, పిల్లలను కనేవారికి బోనస్‌లు ఇస్తామని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. పిల్లలను కన్నవారికి సెలవులు, బాలల సంరక్షణకు అధిక నిధులు సమకూర్చడం అవసరమనీ, ట్రంప్ వరాలు ప్రతీకాత్మకమే తప్ప అమెరికన్ల అవసరాలను తీర్చేవిగా లేవని నార్త్ కరోలినా విశ్వవిద్యాలయ పరిశోధకురాలు కరెన్ గజో వివరించారు.

రూ.3 కోట్ల దోపిడీ దొంగలను రూ.30 పావ్‌భాజీ పట్టించింది





కలబురిగి: కర్ణాటకలోని కలబురిగి సరాఫ్ బజారులో ఈ నెల 11న పట్టపగలు అయిదుగురు దొంగలు రూ.3 కోట్ల బంగారు నగలు, నగదు దోచుకోగా.. పట్టణంలో కలకలం రేపిన ఈ కేసును పోలీసులు పది రోజుల్లో ఛేదించారు. కేసు పరిశోధనలో పోలీసులకు 30 రూపాయల పావ్‌భాజీ కీలక ఆధారంగా మారడం విశేషం. వ్యూహం ప్రకారం.. బజారులోని మారాతుల్లా మాలిక్ బంగారు దుకాణంలోకి నలుగురు దొంగలు మాస్కులు ధరించి చొరబడ్డారు. దుకాణం బయట నిలబడి పర్యవేక్షిస్తున్న ప్రధాన సూత్రధారి ఫరూక్ అహ్మద్ మాలిక్ (40) అక్కడున్న బండిలో పావ్‌భాజీ తిన్నాడు. లోపలికి వెళ్లిన దొంగలు దుకాణ యజమాని కాళ్లూచేతులు కట్టేసి.. తుపాకీలా ఉన్న లైటరుతో బెదిరించి లాకర్ ఓపెన్ చేయించారు. దాదాపు 3 కిలోల నగలు, రూ.5 లక్షల నగదు దోచుకొని బయటపడ్డారు. వీరితో కలిసి ఫరూక్ వెళుతూ వెళుతూ తాను తిన్న పావ్‌భాజీ బిల్లు రూ.30 ఫోన్ పే ద్వారా చెల్లించాడు. ఆ తర్వాత అయిదుగురూ కలిసి బస్సులో ముంబయికి పరారయ్యారు. దుకాణం ముందున్న సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు పావ్‌భాజీకి చేసిన యూపీఐ చెల్లింపు ద్వారా ఫరూక్ ఫోన్ నంబరు గుర్తించి అతడితోపాటు మరో ఇద్దరిని అరెస్టు చేశారు. నిందితుల నుంచి 2.865 కిలోల బంగారు ఆభరణాలు, రూ.4.80 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ కమిషనరు ఎస్.డి.శరణప్ప తెలిపారు. మిగతా ఇద్దరు నిందితుల కోసం గాలిస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఫరూక్‌కు సొంత బంగారు దుకాణం ఉంది. వ్యాపారంలో వచ్చిన నష్టాల నుంచి బయటపడేందుకు ఇతర నేరగాళ్లతో కలిసి ఈ దోపిడీ పన్నాగం పన్నాడు.

ఈనాడు సినిమా

బాలకృష్ణ



అడవిలో అఖండ తాండవం

చిత్రసీమలో కొన్ని కలయికలు ఎంతో ప్రత్యేకం. వాళ్లు మళ్లీ జట్టు కట్టారంటే చాలు.. అంచనాలు ఆకాశాన్ని తాకుతాయి. అభిమానులు ఆత్రుతగా ఎదురు చూస్తారు. వ్యాపారం రెక్కలు తొడుగుతుంది. నందమూరి బాలకృష్ణ - బోయపాటి శ్రీను కలయిక అలాంటిదే! వరుసగా మూడు సినిమాలతో సంచలన విజయాల్ని సొంతం చేసుకున్నారు ఈ ఇద్దరూ. నాలుగో చిత్రం కోసం మరోసారి జట్టు కట్టారు. ఆ చిత్రం విజయవంతమైన 'అఖండ'కి కొనసాగింపుగా 'అఖండ 2: తాండవం' పేరుతో రూపొందుతోంది. 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపీ ఆచంట సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఎం.తేజస్విని నందమూరి సమర్పిస్తున్నారు. ఇందులో బాలకృష్ణ సరసన సంయుక్తా మేనన్ నటిస్తున్నారు. ఆది పినిశెట్టి ముఖ్య భూమిక పోషిస్తున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని మారేడుమిల్లి అడవుల్లో చిత్రీకరణ సాగుతోంది. వారం రోజులపాటు సాగే ఈ షెడ్యూల్‌లో బాలకృష్ణపై కొన్ని కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నట్టు సినీ వర్గాలు తెలిపాయి. దసరా సందర్భంగా సెప్టెంబరు 25న ప్రేక్షకుల ముందుకొస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, ఛాయాగ్రహణం: సి.రాంప్రసాద్, సంతోష్ డిటాకే, కళ: ఎ.ఎస్.ప్రకాశ్, కూర్పు: తమ్మిరాజు.

రహస్యాల్ని ఛేదించే వరకూ ఆట ఆగదు!

సిరీస్: 'మండలా మర్డర్స్'
నటీనటులు: వాణీ కపూర్, వైభవ్ రాజ్ గుప్తా
విడుదల: శుక్రవారం
ప్లాట్‌ఫామ్: నెట్‌ఫ్లిక్స్



కథాంశం: వరుస హత్యలు.. అంతుచిక్కని రహస్యాలు.. పోలీసుల ఇన్వెస్టిగేషన్‌లు.. ఈ అంశాలతో ఇప్పటి వరకు ఎన్నో కథలు వచ్చాయి. ఇప్పుడిదే కోవలో ప్రేక్షకులకు థ్రిల్ పంచడానికి సిద్ధమైంది 'మండలా మర్డర్స్' వెబ్ సిరీస్. బాలీవుడ్ నటి వాణీ కపూర్ ప్రధాన పాత్రలో నటించింది. ఈ క్రైమ్ థ్రిల్లర్‌ను గోపీ పుత్రన్, మనన్ రావత్ సంయుక్తంగా రూపొందించారు. వైభవ్ రాజ్ గుప్తా, సుర్వీన్ చావ్లా, శ్రియ పిల్గావ్‌కర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. యశ్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మించింది. 'మీరు అద్భుతాల్ని నమ్ముతారా?' అంటూ ఇటీవలే విడుదలైన ఈ సిరీస్ ట్రైలర్ సినీప్రియుల్ని ఆకట్టుకుంది. ఇందులో రియా థామస్ అనే పోలీసు అధికారిణిగా కనిపించనుంది వాణీ. చరణ్‌దాస్‌పూర్‌లో వరుస హత్యలు జరుగుతుంటాయి. ఈ కేసును పరిష్కరించడానికి రంగంలోకి దిగుతుంది రియా. ఆ తర్వాత ఏమైందనేదే ఈ సిరీస్ కథాంశం. మరి రహస్యాల్ని బయటపెట్టే వరకూ ఈ ఆట ఆగదంటూ ఆసక్తి రేకెత్తిస్తున్న ఈ రియా కథేంటో మీరూ చూసేయ్యండి.

రెడీ ఇన్ ఓటీటీ

కుమార్తె కోసం గోల్ఫ్ క్రీడాకారుడి పోరాటం

సినిమా: 'హ్యాపీ గిల్మోర్ 2'
నటీనటులు: ఆడమ్ శాండ్లర్, జూలీ బోవెన్
విడుదల: శుక్రవారం
ప్లాట్‌ఫామ్: నెట్‌ఫ్లిక్స్



కథాంశం: కొందరు క్రీడాకారులు తాము ఎన్నో ఏళ్లుగా ఇష్టపడుతూ ఆడుతున్న క్రీడలను ఒక్కసారిగా వదిలేస్తుంటారు. అయినప్పటికీ దాని వెనక ఏదో బలమైన కారణమే ఉంటుంది. కానీ వయసు పైబడిన తర్వాత తిరిగి ఆ ఆట ఆడాలనే కోరిక పుడితే మాత్రం అది చాలా కష్టంగా ఉంటుంది. కానీ వీటన్నింటినీ పక్కన పెట్టి నేను ఆడగలను అంటున్నాడు హ్యాపీ గిల్మోర్(ఆడమ్ శాండ్లర్). ఇతడొక ప్రొఫెషనల్ గోల్ఫ్ క్రీడాకారుడు. తన జీవితంలో మొదటి టూర్ ఛాంపియన్‌షిప్ గెలిచిన తర్వాత ఆటకు స్వస్తి చెప్తాడు. కానీ కొంత కాలం తర్వాత తన కుమార్తె వియన్నాని బ్యాలెట్ పాఠశాలలో చేర్పించడానికి డబ్బు అవసరమవుతుంది. ఆ ఖర్చుని భరించడానికి గిల్మోర్ తిరిగి ఈ ఆటను ఆడాలని నిర్ణయించుకుంటాడు. దాదాపు ఇరవై తొమ్మిది సంవత్సరాల తర్వాత తిరిగి గోల్ఫ్ ఆడాలనుకుంటున్న ఈ రిటైర్డ్ గోల్ఫ్ ఆటగాడు ఆడగలిగాడా? లేదా తెలియాలంటే 'హ్యాపీ గిల్మోర్ 2' సినిమా చూడాల్సిందే. స్పోర్ట్స్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాకి కైల్ న్యూచెక్ దర్శకత్వం వహించారు.



నవీన్ ఎర్నేని, జ్యోతి కృష్ణ, పవన్‌కల్యాణ్, నిధి అగర్వాల్, ఎ.ఎం.రత్నం, వై.రవిశంకర్

'హరి హర వీరమల్లు'తో ఆ బాధని చూపించాం!

-పవన్ కల్యాణ్

"చాలా మంది వసూళ్లు... రికార్డుల దగ్గరే ఆగిపోతుంటారు. వాటన్నిటికంటే కూడా సినిమాతో ప్రేక్షకులకు ఏం అందించాం, వాళ్లు తమతో పాటు ఏం తీసుకెళ్లారనేది ముఖ్యం. మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు జిజియా పన్నుతో చారిత్రక తప్పు చేశారు. ఆ బాధ ప్రతి హిందువు డీఎన్ఏలోకి వెళ్లింది. ఆ బాధని సినిమాతో బయటికి తీసి చూపించినందుకు ఆనందంగా ఉంది" అన్నారు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, ప్రముఖ కథానాయకుడు పవన్‌కల్యాణ్. ఆయన కథానాయకుడిగా తెరకెక్కిన 'హరి హర వీరమల్లు' సినిమా విజయోత్సవం గురువారం రాత్రి హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా నాకు గ్రామ పంచాయతీల గురించే తెలుసు. కానీ సినిమా పంచాయితీలు కూడా చేసి విడుదల చేయాల్సి వస్తుందని ఎప్పుడూ అనుకోలేదు. నా జీవితంలో ఎప్పుడూ ఏదీ తేలిగ్గా దొరకలేదు. నా ఇన్నేళ్ల సినీ జీవితంలో ఎప్పుడూ మాట్లాడనంతగా ఈ సినిమా కోసం మాట్లాడాను. నా సినిమా కోసం బాధ్యతని తీసుకోవడం ఆనందాన్నిచ్చింది. ప్రాంతీయ సినిమాని పాన్ ఇండియా సినిమాని చేయగలం అని నిరూపించిన నిర్మాతకు అండగా నిలబడటం బాధ్యత అనిపించిందని, డబ్బు వస్తుంది పోతుంది కానీ, మనుషుల్ని మమతల్ని కోల్పోతే తిరిగి రావనే విషయం తెలిసిన వ్యక్తిని నేను" అన్నారు పవన్‌కల్యాణ్. ఈ సినిమా విడుదలకు సహకారం అందించిన నిర్మాతలు నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, టి.జి.విశ్వప్రసాద్‌లకు కృతజ్ఞతలు చెప్పారు. "విజయాలు, రికార్డుల్ని ఎప్పుడూ తలకెక్కించుకోలేదు. ఇది ఏ స్థాయి విజయమో కూడా నాకు తెలియదు. విజువల్ ఎఫెక్ట్స్ కంటే కూడా, సినిమాతో భావోద్వేగంగా ఎంతగా ప్రభావితం చేశామన్నదే ముఖ్యం. చరిత్ర రాసినవాళ్లు మన రాజులపై చిన్న చూపు చూశారేమో. మొఘల్ చక్రవర్తుల గొప్పతనం గురించి చెప్పారు కానీ, ఔరంగజేబు జిజియా పన్ను గురించి ఎందుకు చర్చించలేదో ఆశ్చర్యంగా అనిపించింది. ఆ విషయాన్ని స్పృశించడానికి భయపడ్డారేమో! ఔరంగజేబు పాలన వెనక ఉన్న చీకటి కోణం గురించి మాట్లాడాలనే ఈ సినిమా చేశాం. కోహినూర్ వజ్రం కంటే మన వేద సంపద గురించే ఈ సినిమాలో ఎక్కువగా చెప్పాం. కోహినూర్ పగిలిపోవచ్చు కానీ, విజ్ఞానం అలా కాదు. వేదాల్ని కోహినూర్‌లాగా భద్రపరచలేదు. ఆ సంపదని మనసుల్లోనే పెట్టుకున్నాం. అదే మన దేశ సంస్కృతి గొప్పదనం. ఈ అంశాన్ని చర్చించడంలో 'హరి హర వీర మల్లు' విజయం సాధించింది. తొలి భాగంలోని సాంకేతిక పరమైన పొరపాట్లని రెండో భాగంలో సరిదిద్దుకుంటాం. రెండో భాగం సినిమా కూడా ఇప్పటికే 25 శాతం పూర్తయింది. అది త్వరగా రావాలని కోరుకుంటున్నా" అన్నారు పవన్‌కల్యాణ్. ఈ సినిమాని బహిష్కరించాలనే డిమాండ్లపై ఆయన స్పందిస్తూ... "నా సినిమాని ఆపే ప్రయత్నం చేస్తున్నారంటే నేను ఎంతగా ఎదిగానో వాళ్లు నాకు చెబుతున్నారు. ఓ హీరో సినిమా చేస్తే మిమ్మల్ని అది అంత భయపెట్టిందా?" అని ప్రశ్నించారు. "నెల్లూరులో వీధుల్లో పెరిగినవాడిని. ఇక్కడిదాకా రావడమే గొప్ప. ఏం చేస్తారో చేసుకోండని చెబుతున్నా. తాటాకు చప్పుళ్లకు బెదిరిపోను. ముఖ్యంగా అభిమానులకి చెబుతున్నా. నేనింత బలంగా ఉన్నానంటే కారణం అభిమానులే. ఎంత ఎదిగానో నాకు తెలియదు కానీ, ధైర్యంగా ఉండటమే నాకు తెలుసు. కుంగిపోయి కనిపించడం నాకు నచ్చదు. బతకడమే నాకు అద్భుతమైన విషయం అనిపిస్తుంది. అభిమానులు కూడా విమర్శల్ని తేలిగ్గా తీసుకోండి. ముందు జీవితాన్ని ఆస్వాదించండి. ధైర్యం ఉంటే తిరిగి విమర్శల దాడి చేయండి. ప్రతి సోషల్ మీడియా కామెంట్‌ని తిప్పి కొట్టండ"ని కోరారు పవన్‌కల్యాణ్. ఔరంగజేబు గురించి మాట్లాడగానే చాలామందికి బాధలు, కోపాలు వచ్చాయనీ, మొఘల్స్ గొప్పదనం చెప్పినప్పుడు వారు చేసిన అన్యాయాలు, అక్రమాల గురించి కూడా చెప్పాలి కదా అని ప్రశ్నించారు. అది సెక్యులరిజంలో భాగం కదా? అన్నారు పవన్. చిత్ర దర్శకుడు జ్యోతి కృష్ణ మాట్లాడుతూ "థియేటర్‌లో అభిమానులు, ప్రేక్షకుల స్పందన చూసి చాలా సంతోషం కలిగింది. ఇది కుటుంబంతో చూడాల్సిన సినిమా"అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర సమర్పకుడు ఎ.ఎం.రత్నం, కథానాయిక నిధి అగర్వాల్, నిర్మాతలు నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.


50 ఏళ్ల 'ముత్యాల ముగ్గు'

నేటి ఉదయం ఈటీవీలో



తెలుగు ప్రేక్షక లోకాన్ని సమ్మోహన పరిచిన బాపు-రమణల అద్భుత సృష్టి 'ముత్యాల ముగ్గు'. విడుదలై నేటికి యాభై వసంతాలు. ప్రేక్షక నీరాజనాలు అందుకున్న ఈ చిత్రంలో రావు గోపాలరావు సంభాషణలు నేటికీ వినిపిస్తూనే ఉంటాయి. సంగీత, శ్రీధర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రంలోని ఆరుద్ర కలం నుంచి జాలు వారిన 'ముత్యమంతా పసుపు ముఖమెంత ఛాయ' గీతం తెలుగు సంస్కృతిలో తియ్యదనాన్ని తట్టిలేపుతుంది. ఎప్పుడు చూసినా కొత్తగా అనిపించే వినోదం, అబ్బురపరిచే కథతో సాగే ఈ చిత్రాన్ని నేటి ఉదయం 10 గంటలకు మీ 'ఈటీవీ సినిమా'లో తప్పక చూడండి.

యువ నటుడితో ప్రేమ ప్రయాణం?



కరీనా కపూర్

ఈ మధ్య కాలంలో కథలకే ప్రాధాన్యతనిస్తూ.. వయసుతో సంబంధం లేకుండా జోడీ కడుతున్నారు మన సినీతారలు. ఇప్పుడీ బాటలోనే బాలీవుడ్ సీనియర్ కథానాయిక కరీనా కపూర్ అడుగులేయనున్నట్లు తెలుస్తోంది. ఈమె తన రాబోయే ప్రాజెక్టు కోసం ఓ యువనటుడితో తెరను పంచుకోనుందట. "కరీనా కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన చిత్రమిది. ఇందులో ఆమె దెయ్యం పాత్రలో మునుపెన్నడూ చూడని విధంగా కనిపించనుంది. ఇంకా పేరు ఖరారు కాని ఈ చిత్రం కోసం కరీనా ఓ యువ నటుడితో ప్రేమలో పడనుంది. ఈ చిత్రానికి దర్శకుడు అయాన్ ముఖర్జీ చిత్రాలకు పనిచేసిన హుస్సేన్ దలాల్ కథ అందించనున్నార"ని కరీనా సన్నిహిత వర్గాలు తెలిపాయి.

టొరంటో చిత్రోత్సవాల్లో బయాన్

బాలీవుడ్ సీనియర్ నాయిక హ్యూమా ఖురేషీ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'బయాన్'. బికాస్ రంజన్ మిశ్రా దర్శకుడు. తాజాగా ఈ చిత్రం టొరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ 2025 (టీఐఎఫ్ఎఫ్)కు ఎంపికైంది. ఇందులో



హ్యూమా ఖురేషీ

భాగంగా డిస్కవరీ విభాగంలో ప్రదర్శితం కానుందీ చిత్రం. ఈ ఏడాది ఈ విభాగంలో ఎంపికైన ఏకైక భారతీయ చిత్రం ఇదే కావడం విశేషం. ఈ విషయాన్ని తెలుపుతూ.. ఇన్‌స్టాలో ఓ పోస్ట్ పెట్టింది హ్యూమా. "మా సినిమా టీఐఎఫ్ఎఫ్‌లో డిస్కవరీ విభాగంలో ప్రదర్శితం కానుందనే విషయాన్ని తెలియజేయడానికి మేము గర్వపడుతున్నాం" అనే వ్యాఖ్యను జోడించింది. ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌లో డిటెక్టివ్ రూహిగా కనిపించనుందామె.


శరవేగంగా నేను రెడీ



హవీశ్

'నేను లోకల్', 'ధమాకా' లాంటి ఎన్నో హిట్ చిత్రాలతో ప్రేక్షకుల్ని అలరించారు దర్శకుడు త్రినాథరావు నక్కిన. ఇప్పుడీయన దర్శకత్వంలో రాబోతున్న చిత్రమే 'నేను రెడీ'. హవీశ్ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. కావ్య థాపర్ కథానాయిక. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా చేసుకుంటోన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన కొన్ని కీలక సన్నివేశాల చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతున్నట్లు సినీ వర్గాలు తెలిపాయి. వినోదాత్మకంగా తీర్చిదిద్దుతున్న ఈ సినిమాను నిఖితా కోనేరు నిర్మిస్తున్నారు. త్వరలో విడుదల తేదీని ప్రకటించనున్నారు.

నిత్యామేనన్



తోడు లేనందుకు బాధగా ఉన్నా.. స్వేచ్ఛగా జీవిస్తున్నా!

అవార్డులు, గుర్తింపులు.. ఇలా ఏదైనా కూడా మనలోని కళను, నైపుణ్యాల్ని మార్చలేవని అంటోంది అందాల తార నిత్యామేనన్. కాంబినేషన్ల కన్నా.. కథలు, పాత్రలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చే కథానాయికీమె. పక్కింటి అమ్మాయిలా ఉండే పాత్రల్ని ఎంచుకుంటూ ప్రేక్షకుల్ని కట్టిపడేస్తున్న ఈమె.. ప్రస్తుతం విలక్షణ నటుడు విజయ్ సేతుపతితో కలిసి 'తలైవాన్ తలైవి' చిత్రంలో నటించింది. దీన్ని పాండిరాజ్ తెరకెక్కించారు. ఈ ఫ్యామిలీ డ్రామా శుక్రవారం థియేటర్లలోకి రాబోతుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నిత్య ఈ సినిమా, రాబోయే ప్రాజెక్టుల గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది.

"తలైవాన్ తలైవి' సినిమాపై దర్శకుడు పాండిరాజ్‌కు ఉన్న స్పష్టతతోనే ఇందులో నటించడానికి అంగీకరించాను. ఇందులో విజయ్ సేతుపతితో కలిసి నటించడం మంచి అనుభవం. ఆయనతో ఇంతకు ముందు '19(1)(ఎ)' అనే మలయాళీ చిత్రంలో కలిసి పనిచేశా. అందులో మా ఇద్దరి కలయికలో ఎక్కువ సన్నివేశాలు లేవు. కానీ ఇప్పుడు రాబోయే చిత్రంలో మా ఇద్దరి జోడీ అందరినీ అలరిస్తుందని నమ్మకంగా ఉన్నా. నా దృష్టిలో నేను ఎవరితో నటిస్తున్నానేది ముఖ్యం కాదు. ఎంచుకున్న పాత్రకు 100 శాతం న్యాయం చేయాలి. అప్పుడే కెమిస్ట్రీ పండుతుంది".

అన్ని పాత్రల్లోనూ భాగం కావాలి

'రెండు దశాబ్దాలకు దగ్గరగా ఉంది నా సినీ ప్రయాణం. ఈ క్రమంలో నటిగా నన్ను నేను నిరూపించుకోవడానికి, కంఫర్ట్ జోన్ నుంచి రావడానికి హారర్ థ్రిల్లర్ చిత్రం 'కాంచన', ఫ్యామిలీ కామెడీ డ్రామా 'తలైవాన్ తలైవి' లాంటి భిన్నమైన జానర్ కథల్ని ఎంచుకుంటున్నా. ఎందుకంటే నేను నటిని.. అన్ని పాత్రల్లోనూ భాగం కావాలి.. అన్ని కథల్ని ఆస్వాదించాలి. నా కెరీర్‌లో నేను ఎదురుచూస్తున్నది.. ఎంచుకున్న పనిని సంతోషంగా చేయడం, సరైన వ్యక్తులతో కలిసి పనిచేయడం కోసమే. ఇప్పుడైనా.. భవిష్యత్తులోనైనా ఇదే నా కోరిక'.

ఈ విషయాన్ని అంగీకరించను

"నటీనటులు ఎవరైనా అవార్డు కోసం ఎదురుచూస్తూ సినిమాల్లో నటించరు. ఆ అవార్డులు.. గుర్తింపులు వారి నైపుణ్యాల్ని మారుస్తాయంటే దానితో నేను అంగీకరించను. గుర్తింపు మనల్ని ప్రేక్షకులకు మరింత దగ్గర చేస్తుందేమో కానీ.. మనలోని నైపుణ్యాల్ని మార్చదనేది నా అభిప్రాయం. అవార్డులు వచ్చిన తర్వాత సినీతారలకు అదనపు బాధ్యతలు ఉంటాయని అనుకుంటారు కొందరు. పురస్కారాలు మనల్ని తేలికగా.. సంతోషంగా ఉండేలా చేయాలి. ప్రస్తుతం నేను ఆ అనుభూతినే పొందుతున్నా".

పెళ్లి జీవితంలో ఓ భాగం మాత్రమే

"కొన్నేళ్ల క్రితం.. తల్లిదండ్రులు.. చుట్టూ ఉన్న సమాజం కారణంగా నాకు ఓ భాగస్వామి ఉండాల్సిందేనని అనిపించింది. కానీ ఇప్పుడు ప్రేమకు నా జీవితంలో ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం లేదు. వేరే విధంగా కూడా జీవితాన్ని ఆస్వాదించవచ్చని తర్వాత అర్థం చేసుకున్నా. అందరికీ ప్రేమించిన వ్యక్తినే పెళ్లి చేసుకోవడం సాధ్యం కాదు కదా! పెళ్లి అనేది జీవితంలో ఓ భాగం మాత్రమే. అది జరిగినా జరగకపోయినా పెద్దగా మార్పు ఉండదు. తోడు లేనందుకు ఒక్కోసారి బాధ కలిగినప్పటికీ.. స్వేచ్ఛగా జీవిస్తున్నందుకు ఆనందంగా ఉంది. జీవితంలో జరిగిన కొన్ని అనుభవాల నుంచి నేర్చుకున్న పాఠాల కారణంగానే నేను ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నాను".

ఇది దృష్టిలో పెట్టుకొనే ప్రాజెక్టుల్ని అంగీకరిస్తా

"నేను ఒక సినిమాను ఎంచుకునేటప్పుడు కచ్చితంగా మొత్తం కథను వింటాను.. చదువుతాను. ఈ విషయాన్ని ముందే దర్శకనిర్మాతలకు చెప్తాను. ఒక వేళ నేను ఇలా చేయకపోతే.. సినిమా ఎలా ఉంటుందో అంచనా వేయలేను. నేను పోషించే పాత్రను మాత్రమే కాదు.. స్క్రిప్ట్ మొత్తాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రాజెక్టుల్ని అంగీకరిస్తుంటా. సినిమా ఎలా ఉంటుంది.. దాన్ని తీర్చిదిద్దడానికి చిత్రబృందం ఎలాంటి ప్రణాళికలు చేస్తుంది లాంటివన్నీ తెలుసుకుంటా. నా దృష్టిలో అప్పుడే మనం సినిమాలో పూర్తిగా భాగమైనట్లు అర్థం".

పేదవాడి పక్షాన ప్రాసిక్యూటర్

సినిమా: 'ది ప్రాసిక్యూటర్'
జానర్: యాక్షన్ థ్రిల్లర్
ప్లాట్‌ఫామ్: అమెజాన్ ప్రైమ్ వీడియో (తెలుగు, హిందీ, ఇంగ్లిష్, తమిళం తదితర భాషల్లో అందుబాటులో ఉంది)

ఓ.. లుక్కేయొచ్చు!



అక్రమంగా మాదకద్రవ్యాలు తరలిస్తున్నది ఒకరు. కానీ అందులో చిక్కుకున్నది ఇంకొకరు. మనకే తెలియకుండా ఓ కేసులో మనం పట్టుబడితే? తీరా తెలిసాక అయిన అందులో నుంచి బయటపడపోతే ఏంటి పరిస్థితి? అందుకే తెలియని వ్యక్తులతో పరిచయాలు మంచివి కాదంటారు పెద్దలు. డబ్బు వస్తుందనే ఆశతో ఒకరికి సహాయం చేస్తే.. దాని వల్ల ఒకరు చనిపోతారు. అయితే ఇది 2016 హాంకాంగ్‌లో నిజంగా జరిగిన మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసు ఆధారంగా రూపొందించిన చైనీస్ యాక్షన్ థ్రిల్లర్. ఇది మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడినట్లు తప్పుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ వ్యక్తి కేసు దర్యాప్తే 'ది ప్రాసిక్యూటర్' చిత్రం.

కథాంశం: ఫోక్ చి-హో (డోనీయెన్) ప్రాసిక్యూటర్. మా కా-కిట్(ఫంగ్ హో యెయుంగ్) నిందితుడు. మా కా-కిట్‌ని చిన్నతనంలోనే అతని తల్లి డ్రగ్స్‌కి బానిసై హింసించేది. దీంతో వాళ్ల తాతయ్య అతణ్ని పెంచుకుంటాడు. పేదరికానికి చెందిన మా కా-కిట్ డబ్బు మీద ఆశతో తన పేరు మీద ఆర్డర్‌లు వస్తుంటే తీసుకొని దాంట్లో ఏముందో చూడకుండా వేరే వాళ్లకి ఇస్తాడు. ఒకరోజు మా కా-కిట్ ఇంటికి పోలీసులు వచ్చి అక్రమంగా మాదకద్రవ్యాలని తరలిస్తున్న కేసు కింద అతణ్ని అరెస్ట్ చేస్తారు. అతను తన డిఫెన్స్ న్యాయవాది తక్కువ శిక్ష పడుతుందని చెప్పడంతో నేరం చేయకపోయిన అంగీకరిస్తాడు. దాంతో అతనికి కోర్టు శిక్ష విధిస్తుంది. మాజీ పోలీసు అధికారి అయిన ఫోక్ ప్రాసిక్యూటర్‌గా అప్పుడే బాధ్యతలు చేపడతాడు. ఈ కేసులో మా కా-కిట్ నిర్దోషి అని నమ్మి ఆ కేసును నిరూపించడం అసాధ్యం కానీ నిరూపించాలి అని ఫోక్ అనుకుంటాడు. న్యాయవాదులంతా ఫోక్‌కి వ్యతిరేకంగా ఉంటారు. అసలు డిఫెన్స్ లాయర్ మంచోడేనా? ఇంతకీ అసలైన దోషులు ఎవరు? అసలు ఆ మాదకద్రవ్యాలు అక్రమంగా తరలిస్తుందెవరు? ఫోక్ వారిని పట్టుకుంటాడా? మా కా-కిట్‌ని నిర్దోషిగా బయటకి తీసుకొస్తాడా? లేదా? అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. 'ది ప్రాసిక్యూటర్' చిత్రానికి డోనీయెన్ దర్శకత్వం వహించారు. ఆయనే కథానాయకుడు కూడా.

- ప్రస్తుతం జరుగుతున్న ఎన్నో తప్పులకు ఒకరికి బదులుగా మరొకరు శిక్షను అనుభవిస్తున్నారు. అలాంటి తప్పు జరగకుండా ప్రాసిక్యూటర్ ఒక పేదవాణ్ని శిక్ష నుంచి తప్పించడం, దానికోసం తన కెరీర్, ప్రాణాల్ని పణంగా పెట్టడం, అతనికి న్యాయం చేయడం...

- ఇలా ప్రాసిక్యూటర్ పాత్ర నిజాయతీకి నిలువెత్తు రూపంలా ఉంటుంది. ఈ సినిమాలో విజువల్స్ బాగుంటాయి. కోర్టు రూమ్ సన్నివేశాలు డిఫరెంట్‌గా ఉంటాయి. క్లైమాక్స్ అదరగొడుతుంది. ఫోక్ ఈ కేసులో ఒక్కడే కష్టపడుతుంటే అతణ్ని నమ్మి... వ్యతిరేకంగా ఉన్న న్యాయవాదులంతా ఫోక్‌కి సహాయం చేయడం బాగా ఆకట్టుకున్న సన్నివేశం. డోనీయెన్ నటన అద్భుతంగా ఉంటుంది. నేపథ్య సంగీతం, కీలక సన్నివేశాలను ఎలివేట్ చేస్తుంది. ఇది ఒక ఆలోచనాత్మక లీగల్ థ్రిల్లర్. కోర్టు రూమ్ సన్నివేశాలు ఇష్టపడే వారికే ఈ సినిమా నచ్చుతుంది.

ఈనాడు బిజినెస్

30% పెరిగిన సైయెంట్ లాభం



ఈనాడు, హైదరాబాద్: ఐటీ, ఇంజినీరింగ్ సేవల సంస్థ సైయెంట్ లిమిటెడ్, జూన్ త్రైమాసికంలో రూ.163 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదేకాలంతో పోల్చితే లాభం 30% పెరిగింది. ఆదాయం 3.6% పెరిగి రూ.1,393 కోట్లకు చేరుకుంది. కంపెనీ చేతిలో రూ.1,894 కోట్ల నగదు నిల్వలున్నాయి. తమ అంచనాలకు తగ్గట్లు త్రైమాసిక ఫలితాలు నమోదయ్యాయని సైయెంట్ ఎండీ కృష్ణ బోదనపు వివరించారు. కంపెనీకి కొత్త క్లయింట్లు లభించడం, కొత్త విభాగాల్లో అవకాశాలు కనిపిస్తున్నందున ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి మెరుగైన ఫలితాలు సాధిస్తామనే విశ్వాసం ఉందన్నారు. సైయెంట్ నుంచి సెమీకండక్టర్ల వ్యాపారాన్ని విడదీసి, ప్రత్యేక కంపెనీగా ఏర్పాటు చేసే ప్రక్రియ పూర్తయినట్లు తెలిపారు. దీంతో ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి, సెమీకండక్టర్ల విభాగాల్లో సైయెంట్ గ్రూప్ సంస్థల క్రియాశీలక పాత్ర పోషించే అవకాశం కలుగుతోందని అన్నారు. సెమీకండక్టర్లలో అనలాగ్, మిక్స్డ్ సిగ్నల్ ఏఎస్ఐసీ విభాగంలో వేగంగా ఎదగగలమని చెప్పారు.

మైండ్‌స్పేస్ రీట్ చేతికి క్యూసిటీ

లావాదేవీ విలువ రూ.512 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్, హైదరాబాద్‌లో 8.1 లక్షల చదరపు అడుగుల వాణిజ్య భవనాన్ని సొంతం చేసుకుంది. నానక్‌రామ్‌గూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో 'క్యూసిటీ' అనే పేరున్న ఈ భవనాన్ని రూ.512 కోట్లకు కొనుగోలు చేసినట్లు తెలిపింది. మ్యాక్ సాఫ్ట్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ 'క్యూసిటీ' యాజమాన్య సంస్థ కాగా, ఈ కంపెనీలో 100 శాతం వాటాను మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్ కొనుగోలు చేసింది. దీనివల్ల హైదరాబాద్‌లో తమ కార్యకలాపాల విస్తరణకు అవకాశం కలుగుతుందని మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్ సీఈఓ, ఎండీ రమేశ్ నాయర్ తెలిపారు. ఈ సంస్థకు ముంబయి, పుణె, హైదరాబాద్, చెన్నైల్లో వాణిజ్య ప్రాంగణాలున్నాయి. మొత్తం 3.79 కోట్ల చదరపు అడుగుల విస్తీర్ణం గల వాణిజ్య స్థలం ఈ సంస్థ చేతిలో ఉంది. ఇందులో 3.08 కోట్ల చదరపు అడుగుల విస్తీర్ణం గల భవనాల నిర్మాణం పూర్తి కాగా, మిగిలిన భవనాలు నిర్మాణ/ప్రతిపాదన దశలో ఉన్నాయి.

ఇండియన్ బ్యాంక్ లాభం రూ.2973 కోట్లు

దిల్లీ: ఇండియన్ బ్యాంక్ జూన్ త్రైమాసికంలో రూ.2973 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.2403 కోట్ల కంటే ఇది 24% అధికం. మొత్తం ఆదాయం రూ.16,945 కోట్ల నుంచి రూ.18,721 కోట్లకు పెరిగింది. వడ్డీ ఆదాయం రూ.15,039 కోట్ల నుంచి రూ.16,283 కోట్లకు రాణించింది. స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏ) 3.77% నుంచి 3.01 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.39% నుంచి 0.18 శాతానికి తగ్గాయి. ఇందువల్ల కేటాయింపులు రూ.1,258 కోట్ల నుంచి రూ.691 కోట్లకు పరిమితమయ్యాయి.

కోడి గుడ్డు

25న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (వంద) (రూపాయల్లో)

హైదరాబాద్	425
వరంగల్	427
విజయవాడ	475
గోదావరి	455
విశాఖపట్నం	465
చిత్తూరు	503



● భారత ఎగుమతుల్లో 99% వస్తువులకు టారిఫ్ తగ్గింపు
● వ్యవసాయం నుంచి ఐటీ రంగం దాకా ప్రయోజనాలు
● 95% వ్యవసాయ, ప్రాసెస్ ఆహారంపై సున్నా సుంకం
● ఆయా రంగాల్లో వేలకొద్దీ ఉద్యోగాలు

బ్రిటన్‌తో భారత్ ఒప్పందం ప్రభావం

రంగరంగ వైభోగమే

భారత్, బ్రిటన్ గురువారం కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) మన ఎగుమతి వాణిజ్యంలో ఒక మైలురాయిలాంటిది. భారత ఎగుమతుల్లో 99% వస్తువులకు టారిఫ్‌లను బ్రిటన్ తగ్గించింది. ఫలితంగా దాదాపు 23 బిలియన్ డాలర్ల అవకాశాలు కార్మిక ఆధారిత రంగాలకు రానున్నాయి. వేలకొద్దీ ఉద్యోగాలు రానున్నాయి. బ్రిటన్‌కు మన ఎగుమతులు 2040 కల్లా 60% అంటే అదనంగా 15.7 బిలియన్ పౌండ్ల మేర పెరగనున్నాయని అంచనా. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం దీర్ఘకాలంలో 39% (ఏటా 25.5 బి. పౌండ్లు) వృద్ధి చెందే అవకాశం ఉంది.

జౌళి, దుస్తులు

మనదేశం నుంచి బ్రిటన్‌కు ఎగుమతి అయ్యే జౌళి, దుస్తుల (1143 టారిఫ్ లైన్ల)కు సున్నా టారిఫ్ వర్తిస్తుంది. ఈ రంగంలో మన అంతర్జాతీయ ఎగుమతులు 36.71 బి. డాలర్లు అయినా, బ్రిటన్‌కు వెళ్లేది 1.79 బి. డాలర్లే. రెడీ మేడ్ దుస్తులు, హోం టెక్స్‌టైల్స్, కార్పెట్లు, హ్యాండ్‌క్రాఫ్ట్స్ విభాగాల్లో భారీ వృద్ధి కనిపించనుంది.

తోలు, పాదరక్షలు

రెండేళ్లలో బ్రిటన్‌లో అదనంగా కనీసం 5% వాటా మనకు లభిస్తుంది. మన ఎగుమతులు 900 మి.డాలర్లను అధిగమించగలవని అంచనా. వియత్నాం, ఇండోనేసియా, కాంబోడియా, తుర్కియే, బంగ్లాదేశ్ వంటి దేశాలకు మించి రాణించే వీలుంది.

వ్యవసాయ ఉత్పత్తులు

95% వ్యవసాయ - ఆహార ప్రాసెసింగ్ ఉత్పత్తులపై బ్రిటన్ సుంకాలను ఎత్తివేసింది. వ్యవసాయ రంగంలో 1,437 రకాల ఉత్పత్తులున్నా, బ్రిటన్‌కు మననుంచి చేరుతోంది 811 మి. డాలర్ల విలువైనవే. టీ, మామిడి పళ్లు, ద్రాక్ష, సుగంధ ద్రవ్యాలు, సముద్ర ఉత్పత్తులకు మంచి మార్కెట్‌గా మారనుంది. 985 ఉత్పత్తులున్న ఆహార ప్రాసెసింగ్ రంగంలో మనదేశం నుంచి బ్రిటన్‌కు వెళుతున్నవి 309.5 మి. డాలర్లే.

✦ ఓట్స్‌కు సుంకం నుంచి మినహాయింపు ఇవ్వలేదు. కానీ పసుపు, మిరియాలు, యాలకులు, మామిడి పల్ప్, ఊరగాయలు, పప్పు ధాన్యాలు, రొయ్యలు, ట్యూనా చేపలకు ఎటువంటి సుంకం ఉండదు. నూనెగింజల ఎగుమతిదార్లకు కూడా టారిఫ్ కలిసిరానుంది.

సముద్ర ఉత్పత్తులు

శీతలీకరించిన మన సముద్ర ఉత్పత్తులకు బ్రిటన్ మంచి వినియోగదారుగా ఉంది. రొయ్యలు, వైవిధ్యమైన ఉత్పత్తులకు అత్యధిక గిరాకీ ఉంది. ఆంధ్రప్రదేశ్, కేరళ, గుజరాత్, తమిళనాడు, ఒడిశా వంటి రాష్ట్రాల్లో ఎగుమతి ఆధారిత ఉద్యోగాలు పెరగనున్నాయి.

ఇంజినీరింగ్ వస్తువులు

అధిక టారిఫ్ లైన్లు (1659) ఉండే ఈ రంగానికే, యంత్రాలు, విడిభాగాలు, సామగ్రికి 18% టారిఫ్ కాస్తా సున్నాకు చేరింది.

దేశీయ వాహన రంగానికి ఇబ్బంది లేకుండా..

3000 సీసీ పెట్రోలు/2500 సీసీ డీజిల్ ఇంజిన్ సామర్థ్యంపైన ఉన్న వాహనాలకే కోటా, సుంకం తగ్గింపు వర్తిస్తుంది. చిన్న(1500 సీసీ వరకు), మధ్య స్థాయి (1500-3000 సీసీ పెట్రోలు, 2500 సీసీ వరకు డీజిల్) వాహనాలకు ఇబ్బంది ఉండదు. తొలి అయిదేళ్లలో ఎలక్ట్రిక్, హైబ్రిడ్, హైడ్రోజన్ ఆధారిత వాహనాలకు ఎటువంటి మినహాయింపులు ఉండవు.

ఎలక్ట్రానిక్స్-సాఫ్ట్‌వేర్

సున్నా సుంకం వల్ల ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, స్మార్ట్‌ఫోన్లు, ఓవెన్‌లు, ఇన్వర్టర్ల వంటి వాటికి బ్రిటన్‌లో మంచి వాటా దక్కుతుంది. మన సాఫ్ట్‌వేర్ కంపెనీలకు ఎగుమతుల వాటా పెరుగుతుంది.

ఔషధ రంగం

ఈ రంగంలో 56 టారిఫ్ లైన్లే ఉన్నా, విలువ అధికం. మన జనరిక్ ఔషధాలు ఎక్కువగా చేరుతోంది బ్రిటన్‌కే. సర్జికల్ సామగ్రి, డయాగ్నొస్టిక్ సామగ్రి, ఈసీజీ మెషిన్లు, ఎక్స్ రే మెషిన్లకు ఇక సుంకం వర్తించదు. దీంతో భారత మెడ్ టెక్ కంపెనీలకు వ్యయాలు తగ్గుతాయి.

రత్నాభరణాలు

బ్రిటన్‌కు 941 మి. డాలర్ల రత్నాభరణాలను ఎగుమతి చేస్తున్నాం. ఇందులో 400 మి. డాలర్లు ఆభరణాలే. ఎఫ్‌టీఏ వల్ల 2-3 ఏళ్లలో రత్నాభరణాల ఎగుమతులు రెట్టింపు కానున్నాయి.

ఇతర రంగాలు: రసాయనాలు, ప్లాస్టిక్స్, స్పోర్ట్స్ వస్తువులు, బొమ్మల వంటి రంగాలకూ ఎఫ్‌టీఏతో ప్రయోజనం దక్కనుంది. బ్రిటన్‌కు రసాయనాల ఎగుమతులు 30-40% పెరగొచ్చు. అయిదేళ్లలో స్పోర్ట్స్ వస్తువులు, బొమ్మల ఎగుమతుల్లో 15% వృద్ధి కనిపించొచ్చు.

ఎఫ్‌టీఏతో వీటికి ఇప్పుడు సున్నా టారిఫ్.. గతంలో ఇలా (%లో)

ఆహార ప్రాసెసింగ్	70
సముద్ర, జంతు ఉత్పత్తులు	20
టీ, కాఫీ	10
సుగంధ ద్రవ్యాలు	8
నూనెగింజలు	8
పళ్లు	20
రొయ్యలు, ట్యూనా	4.2-8.5
ఇంజినీరింగ్ వస్తువులు	18

75,000 ఐటీ ఉద్యోగులకు ఊరట

బ్రిటన్‌లోని భారతీయ కంపెనీలు ఎఫ్‌టీఏ కింద మూడేళ్ల పాటు ఉద్యోగులకు సామాజిక భద్రత చెల్లింపులు చేయాల్సిన అవసరం లేదు. దీంతో 900 కంపెనీలు, 75,000 మందికి పైగా భారతీయ ఐటీ సిబ్బందికి ప్రయోజనం కలగనుంది. మన ఐటీ పరిశ్రమకు రెండో అతిపెద్ద ఎగుమతి మార్కెట్‌గా బ్రిటన్ ఉన్న నేపథ్యంలో, ఈ చర్య ఐటీ వర్గాల్లో హర్షాతిరేకాలను కలిగిస్తోంది.

బ్రిటన్‌కు ప్రయోజనాలు..

- స్కాచ్ విస్కీ, జిన్‌లపై దిగుమతి సుంకాలను తక్షణం 150% నుంచి 75 శాతానికి తగ్గించారు.
- బ్రిటన్‌లో తయారైన కార్లపై ప్రస్తుతం 100% పైగా సుంకం ఉండగా.. అది కోటా ఆధారిత వ్యవస్థ కింద 10 శాతానికి పరిమితం చేస్తారు. ఆస్టన్ మార్టిన్‌తో పాటు టాటా మోటార్స్‌కు చెందిన జాగ్వార్ లాండ్ రోవర్‌కు ప్రయోజనం.
- ఎఫ్‌టీఏ వల్ల ఏటా ఆ దేశ జీడీపీ 4.8 బి. డాలర్లు రాణిస్తుంది. బ్రిటన్ సంస్థలకూ భారత ప్రభుత్వ వస్తు సమీకరణలో మినహాయింపులు ఇస్తారు.

కెనరా బ్యాంకు లాభం రూ.4,752 కోట్లు

● అమరావతిలో సొంత భవనం



కె.సత్యనారాయణ రాజు

ఈనాడు, హైదరాబాద్: కెనరా బ్యాంకు ఏప్రిల్- జూన్ త్రైమాసికానికి రూ.4,752 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదేకాల లాభం రూ.3,905 కోట్లతో పోల్చితే ఇది 22% అధికం. మొత్తం ఆదాయం రూ.34,020 కోట్ల నుంచి రూ.38,063 కోట్లకు పెరిగింది. నిర్వహణ లాభం రూ.7,616 కోట్ల నుంచి రూ.8,554 కోట్లకు పెరిగింది. ఇతర ఆదాయం రూ.5,318 కోట్ల నుంచి 32.7% అధికమై రూ.7,060 కోట్లకు చేరింది. స్థూల నిరర్థక ఆస్తులు 2.69 శాతానికి, నికర నిరర్థక ఆస్తులు 0.63 శాతానికి తగ్గాయి. నిర్దేశించిన లక్ష్యానికి మించి.. ప్రాధాన్యతా రంగాలకు 45.63%, వ్యవసాయ రంగానికి 23.25% రుణాలు జారీ చేశారు. ఫలితాలు ఆకర్షణీయంగా ఉండటంతో, బీఎస్‌ఈలో షేరు 5.29% పెరిగి, రూ.113.50 వద్ద స్థిరపడింది.

42 లక్షల రికరింగ్ డిపాజిట్ ఖాతాలు: బ్యాంకింగ్ రంగం అనేక ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నా.. గత రెండేళ్లుగా తాము తీసుకున్న చర్యలతో బ్యాంకు మెరుగైన ఫలితాలు సాధిస్తోందని కెనరా బ్యాంకు ఎండీ, సీఈఓ కె.సత్యనారాయణ రాజు 'ఈనాడు'కు వివరించారు. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో బ్యాంకు సిబ్బంది భాగస్వామ్యంతో 42 లక్షల రికరింగ్ డిపాజిట్ ఖాతాలు ప్రారంభించినందున, ప్రతినెలా రూ.1,000 కోట్ల డిపాజిట్లు లభిస్తాయని అన్నారు. గత నెలలో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం వల్ల, ఇప్పటికే నాణ్యమైన కొత్త సేవింగ్స్ ఖాతాలు 35 లక్షలు లభించాయని తెలిపారు.

వినూత్న డిజైన్‌తో విజయవాడ జోనల్ కార్యాలయం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతిలో కెనరా బ్యాంకు సొంత భవనాన్ని సంప్రదాయాన్ని ప్రతిబింబించే విధంగా, వినూత్న డిజైన్‌తో నిర్మిస్తామని కె.సత్యనారాయణ రాజు తెలిపారు. ఈ భవనంలో విజయవాడ జోనల్ కార్యాలయం, ప్రాంతీయ కార్యాలయాలు, ఇతర కార్యకలాపాల విభాగాలు ఏర్పాటు చేస్తామని అన్నారు.

కోరమాండల్ రికార్డు స్థాయి ఫలితాలు

ఈనాడు, హైదరాబాద్: కోరమాండల్ ఇంటర్నేషనల్ రికార్డు స్థాయి ఫలితాలు నమోదు చేసింది. జూన్ త్రైమాసికంలో రూ.7,083 కోట్ల మొత్తం ఆదాయాన్ని ఆర్జించింది. 2024-25 ఇదేకాల ఆదాయం రూ.4,768 కోట్లతో పోల్చితే ఇది 49% అధికం. నికరలాభం రూ.331 కోట్ల నుంచి 54% వృద్ధితో రూ.508 కోట్లకు చేరింది. రుతుపవనాలు త్వరగా వచ్చి, పంటల సాగు మొదలైనందున, తమ అమ్మకాలు పెరిగినట్లు సంస్థ ఎండీ, సీఈఓ ఎస్.శంకరసుబ్రమణియన్ తెలిపారు. కోరమాండల్ కెమికల్స్ లిమిటెడ్ అనే సబ్సిడరీ కంపెనీ ద్వారా ఆఫ్రికా దేశమైన సెనెగల్‌కు చెందిన బావ్‌బ్యాబ్ మైనింగ్ అండ్ కెమికల్స్ కార్పొరేషన్ ఎస్.ఏ., అనే కంపెనీలో మరో 17.69% వాటా కొనుగోలు చేసేందుకు సంస్థ దాదాపు రూ.66 కోట్లు వెచ్చించనుంది.

జోయా పరిమిత కాల ఆభరణాల ఎడిషన్



హైదరాబాద్: టాటా గ్రూప్‌నకు చెందిన విలాస ఆభరణాల బ్రాండ్ జోయా, పరిమిత కాల ఆభరణాల (క్యాప్సూల్)ను ఆవిష్కరించింది. ఇందుకోసం అంతర్జాతీయ గుర్తింపు కలిగిన బ్రిటిష్ డిజైనర్ అలిస్ సికోలినీతో జట్టు కట్టింది. భారత విలాస ఆభరణాల కోసం ఇది తొలి అంతర్జాతీయ భాగస్వామ్యం అని కంపెనీ తెలిపింది. మన దేశ విలాసాన్ని ప్రతిబింబించే కవితాత్మక కళా రూపాల్లో ఒకటైన ఎనామెల్‌కు ఈ క్యాప్సూల్ ఒక ప్రతిబింబం అని పేర్కొంది. వజ్రాలు, రంగురాళ్లు కలిగిన ఆభరణాలను తీసుకురావడంలో అగ్రగామిగా ఉన్న జోయా, ఈ కలెక్షన్‌ను లాసా ఆర్కిటెక్చర్ స్ఫూర్తితో రూపొందించింది. మహిళలను నిర్వచించే విధంగా రంగులు, చేతి నైపుణ్యాలను ప్రతిబింబిస్తూ ఈ కలెక్షన్ ఉంటుంది. చెర్రీ పువ్వులు, చెవ్రాన్ నమూనాలు, సంక్లిష్ట ఎనామెల్ పని వంటివి అలిస్ నైపుణ్యాల్లో తాజాదనాన్ని తీసుకొచ్చాయి. ప్రతి ఆభరణాన్ని అన్‌కట్ వజ్రాలు, శాటిన్ సాఫ్ట్ 18 క్యారెట్ల పసిడితో రూపొందించామని టైటన్ చీఫ్ డిజైన్ అధికారి రేవతి కాంత్ వెల్లడించారు.

30 నుంచి ఎన్ఎస్‌డీఎల్ రూ.4,000 కోట్ల ఇష్యూ

దిల్లీ: నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్) పబ్లిక్ ఇష్యూ ఈనెల 30న ప్రారంభమై ఆగస్టు 1న ముగియనుంది. ఈ ఇష్యూ పరిమాణం రూ.4,000 కోట్లుగా ఉండొచ్చు. ఈ ఐపీఓ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపేణా జరగనుంది. అందువల్ల ఎన్ఎస్‌డీఎల్‌కు ఎటువంటి నిధులు రావు. ఈ కంపెనీలో వాటాలున్న నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఈ), స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, అడ్మినిస్ట్రేటర్ ఆఫ్ స్పెసిఫైడ్ అండర్‌టేకింగ్ ఆఫ్ ది యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (ఎస్‌యూయూటీఐ) సంస్థలు ఆఫర్ ఫర్ సేల్ ద్వారా 5.01 కోట్ల షేర్లను విక్రయించనున్నాయి. ఎన్ఎస్‌డీఎల్ లిస్టింగ్ పూర్తయితే... దేశంలోని స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదైన రెండో డిపాజిటరీ అవుతుంది. 2017లో సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ లిమిటెడ్ (సీడీఎస్ఎల్) షేర్లు ఎన్ఎస్ఈలో నమోదైన సంగతి తెలిసిందే. సెబీ నిబంధనల ప్రకారం.. ఒక డిపాజిటరీ సంస్థలో ఏ కంపెనీకి 15 శాతానికి మించి వాటా ఉండకూడదు. ప్రస్తుతం ఎన్ఎస్‌డీఎల్‌లో ఐడీబీఐ బ్యాంక్‌కు 26.10%, ఎన్ఎస్ఈకి 24% వాటాలు ఉన్నాయి.

ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ పథకంలోకి రూ.16,000 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు!



దిల్లీ: ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ పథకం (ఈసీఎంఎస్)లోకి రూ.16,000 కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలు ప్రభుత్వానికి చేరినట్లు సమాచారం. ఈ ఏడాది మే 1న ప్రభుత్వం రూ.22,805 కోట్ల ఈసీఎంఎస్ పథకానికి దరఖాస్తులు ఆహ్వానించిన సంగతి విదితమే. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, అనుమతులిచ్చే ప్రక్రియ ప్రారంభమైందని.. ఎంపిక చేసిన ప్రాజెక్టుల జాబితాను సెప్టెంబరులో ప్రభుత్వం ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. దేశీయ సంస్థలు - విదేశీ కంపెనీలు దరఖాస్తు చేశాయని.. ఇందులో టాటా ఎలక్ట్రానిక్స్, డిక్సన్ టెక్నాలజీస్, ఫాక్స్‌కాన్ వంటి పెద్ద సంస్థలు ఉన్నట్లు తెలుస్తోంది.

గిరాకీ-సరఫరా అంతరం రూ.21 లక్షల కోట్లు: దేశీయంగా ఎలక్ట్రానిక్స్‌కు ఉన్న గిరాకీ - సరఫరా మధ్య అంతరాన్ని తగ్గించే ఉద్దేశంతో ప్రభుత్వం ఈసీఎంఎస్‌ను ప్రతిపాదించింది. దేశీయ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ సమాఖ్య అయిన ఎలక్ట్రానిక్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అంచనా ప్రకారం, 2030 నాటికి ఎలక్ట్రానిక్స్ రంగంలో గిరాకీ-సరఫరా అంతరం 248 బిలియన్ డాలర్లు (సుమారు రూ.21 లక్షల కోట్ల)గా ఉండొచ్చు. అంటే 500 బి.డాలర్ల (సుమారు రూ.43 లక్షలకోట్ల) విలువైన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. లేకపోతే దిగుమతులను అనుమతించాల్సి వస్తుంది.

✦ డిక్సన్ టెక్నాలజీస్ ఇటీవల చైనాకు చెందిన ఎలక్ట్రానిక్ తయారీ సంస్థలు ఛోంగ్‌కింగ్ యుహాయ్ ప్రెసిషన్ మానుఫ్యాక్చరింగ్ కంపెనీ, భారతీయ అనుబంధ సంస్థ కున్‌షాన్ క్యూ టెక్నాలజీలతో ఒప్పందాలను కుదుర్చుకుంది.

కరూర్ వైశ్యా బ్యాంక్ బోనస్ షేరు

చెన్నై: ప్రైవేటు రంగ కరూర్ వైశ్యా బ్యాంక్, మదుపర్లకు రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతి 5 షేర్లకు 1 బోనస్ షేరు (1:5) కేటాయించేందుకు డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది. 2025-26 జూన్ త్రైమాసిక ఫలితాల సందర్భంగా విషయాన్ని వెల్లడించింది. సమీక్షా త్రైమాసికంలో రూ.521.45 కోట్ల నికర లాభాన్ని బ్యాంక్ నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.458.65 కోట్లతో పోలిస్తే ఇది 14% అధికం. మొత్తం ఆదాయం రూ.2,672.88 కోట్ల నుంచి రూ.3,015.80 కోట్లకు పెరిగింది. బ్యాంక్ మొత్తం వ్యాపారం రూ.1,70,059 కోట్ల నుంచి రూ.1,96,024 కోట్లకు చేరింది. స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏ) 1.32% నుంచి 0.66 శాతానికి; నికర ఎన్‌పీఏలు 0.38% నుంచి 0.19 శాతానికి తగ్గాయి.

ఎన్ఎఫ్ఆర్ఏ ఛైర్‌పర్సన్ నితిన్ గుప్తా బాధ్యతల స్వీకరణ

దిల్లీ: నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అథారిటీ (ఎన్ఎఫ్ఆర్ఏ) ఛైర్‌పర్సన్‌గా నితిన్ గుప్తా బాధ్యతలు స్వీకరించారు. సీబీడీటీకి 2022 జూన్ నుంచి 2024 జూన్ వరకు ఛైర్మన్‌గా గుప్తా వ్యవహరించారు. ఎన్ఎఫ్ఆర్ఏ పూర్తికాల సభ్యులుగా స్మితా జింగ్రాన్, సుశీల్ కుమార్ జైశ్వాల్, పి.డానియేల్ కూడా బాధ్యతలు స్వీకరించినట్లు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది.

13% తగ్గిన నెస్లే లాభం

దిల్లీ: నెస్లే ఇండియా ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో రూ.646.59 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.746.6 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 13.4% తక్కువ. అధిక కమొడిటీ ధరలు ప్రభావం చూపాయని కంపెనీ తెలిపింది. మొత్తం విక్రయాలు రూ.4,792.97 కోట్ల నుంచి 5.86% పెరిగి రూ.5,073.96 కోట్లకు చేరాయి. దేశీయ విక్రయాలు రూ.4,608.50 కోట్ల నుంచి 5.45% పెరిగి రూ.4,860.01 కోట్లుగా ఉన్నాయి. 'సమీక్షిస్తున్న త్రైమాసికంలో అధిక కమొడిటీ ధరలు ప్రభావం చూపాయి. గత 7-8 నెలల్లో తయారీ కార్యకలాపాల విస్తరణ కారణంగా నిర్వహణ వ్యయాలు అధికమయ్యాయి. వాణిజ్య బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలతో ఖర్చులు పెరిగాయి. వంటనూనె, కోకో ధరలు స్థిరీకరించుకోగా, కాఫీ ధరలు తగ్గాయి. పాల ధరలు స్వల్పంగా పెరిగాయి' అని నెస్లే ఛైర్మన్, ఎండీ సురేశ్ నారాయణన్ పేర్కొన్నారు. నెస్లే ఇండియా బోర్డు ఛైర్మన్‌గా మనీశ్ తివారీని నియమించినట్లు కంపెనీ ప్రకటించింది. ఆగస్టు 1 నుంచి అయిదేళ్ల పాటు కొత్త ఛైర్మన్‌గా తివారీ వ్యవహరించనున్నారు.

ఏసీసీ లాభం రూ.375 కోట్లు

దిల్లీ: ఏసీసీ ఏప్రిల్-జూన్‌లో రూ.375.4 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.359.74 కోట్లే. ఈసారి పరిమాణం పరంగా అధిక విక్రయాలు, నిర్వహణ సామర్థ్యాలు మెరుగవ్వడం లాభాలు పెరిగేందుకు కారణమైనట్లు సంస్థ తెలిపింది. కార్యకలాపాల ఆదాయం రూ.5113.05 కోట్ల నుంచి 18% వృద్ధి చెంది రూ.6035.11 కోట్లుగా నమోదైంది. సమీక్షా త్రైమాసికంలో 1.15 కోట్ల టన్నుల సిమెంటు విక్రయించామని, సంస్థ చరిత్రలో ఒక త్రైమాసికానికి సంబంధించి ఇప్పటివరకు ఇదే అధికమని, 2024-25 జూన్‌తో పోల్చితే 12% ఎక్కువని సంస్థ సీఈఓ వినోద్ బహేతి వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరం మొత్తం మీద సిమెంటు గిరాకీ వృద్ధి 6-7 శాతంగా నమోదు కావచ్చని తెలిపారు.

బజాజ్ ఫైనాన్స్ లాభం రూ.4,765 కోట్లు

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) మొదటి త్రైమాసికంలో బజాజ్ ఫైనాన్స్ రూ.4,765 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదుచేసింది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.3,912 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 22% ఎక్కువ. ఏకీకృత ఆదాయం రూ.16,100 కోట్ల నుంచి 21% వృద్ధితో రూ.19,524 కోట్లుగా నమోదైంది. నికర వడ్డీ ఆదాయం రూ.8,365 కోట్ల నుంచి 22% పెరిగి రూ.10,227 కోట్లకు చేరింది. ఆస్తుల నాణ్యత చూస్తే.. స్థూల ఎన్‌పీఏలు 0.86% నుంచి 1.03 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.38% నుంచి 0.50 శాతానికి చేరాయి.

ఏప్రిల్ - జూన్ త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2025-26	2024-25	2025-26	2024-25
ఆర్ఈసీ★	4466	3460	14824	13092
ఎంఓఎఫ్ఎస్ఎల్	1162	882	2737	2314
ఏఈఎస్ఎల్	539	(1191)	7025	5490
సీజీ పవర్	267	241	2878	2228
ఆదిత్యబిర్లా ఏఎంసీ	277	236	447	387
ఎస్‌బీఐ లైఫ్	590	520	38,696	34,392
యూటీఐ ఏఎంసీ	237	254	547	529
ఏథర్ ఇండస్ట్రీస్	47.02	29.93	256.13	180.01
ఐఈఎక్స్	120.69	96.44	184.17	154.47

★ మధ్యంతర డివిడెండ్ రూ.4.60 (రికార్డు తేదీ ఆగస్టు 1)

మదుపర్ల లాభాల స్వీకరణ

సెన్సెక్స్ ▼542 82184 | నిఫ్టీ ▼158 25062

ఎఫ్ఐఐ విక్రయాలు.. రూ.2133.69 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు... రూ.2617.14 కోట్లు

సమీక్ష

పెద్ద కంపెనీల (బ్లూచిప్) షేర్లలో మదుపర్లు లాభాలు స్వీకరించడంతో గురువారం మన స్టాక్ మార్కెట్ నష్టాలతో ముగిసింది. విదేశీ సంస్థాగత మదుపర్లు అమ్మకాలు కొనసాగించడమూ ప్రభావం చూపింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 1 పైసా పెరిగి రూ.86.40 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు ధర 0.85% పెరిగి 69.10 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లన్నీ లాభాల్లో ముగియగా.. ఐరోపా మార్కెట్లు సానుకూల ధోరణిలోనే ఆరంభమయ్యాయి.


✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2.25 లక్షల కోట్లు తగ్గి, రూ.458.10 లక్షల కోట్ల (5.31 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.

లాభారంభమే అయినా..: సెన్సెక్స్ (క్రితం ముగింపు 82,726.64) స్వల్ప లాభంతో 82,779.95 పాయింట్ల వద్ద ఆరంభమైంది. వెంటనే నష్టాల్లోకి జారుకుని, ఒక దశలో 82,047.22 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని చేరింది. చివరకు 542.47 పాయింట్ల నష్టంతో 82,184.17 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 157.80 పాయింట్లు కోల్పోయి 25,062.10 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 25,246.25 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని, 25,018.70 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసింది.

ఆరు కంపెనీలకే లాభాలు..: సెన్సెక్స్ 30 షేర్లలో 6 కంపెనీలు మినహా మిగతా షేర్లన్నీ నష్టాల్లో ముగిశాయి. ట్రెంట్ 3.92%, టెక్ మహీంద్రా 3.15%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.53%, హెచ్‌సీఎల్ టెక్ 1.51%, బజాజ్ ఫిన్‌సర్వ్ 1.4% నష్టపోయాయి. ఎటర్నల్ 3.44%, టాటా మోటార్స్ 1.51%, సన్‌ఫార్మా 0.56%, టాటా స్టీల్ 0.4%, టైటన్ 0.34% చొప్పున లాభపడ్డాయి.

✦ ఏప్రిల్- జూన్‌లో ఫలితాలు బాగున్నా, ఇన్ఫోసిస్ షేర్లలో మదుపర్లు లాభాలు స్వీకరించారు. దీంతో బీఎస్ఈలో ఈ షేరు 1.32% నష్టంతో రూ.1,553.55 వద్ద ముగిసింది.

✦ రిలయన్స్ గ్రూపు ఛైర్మన్ అనిల్ అంబానీతో సంబంధమున్న కంపెనీలపై మనీ లాండరింగ్ కేసు వ్యవహారంలో ఈడీ సోదాలు నిర్వహించడంతో గురువారం రిలయన్స్ పవర్ షేరు 5% నష్టంతో రూ.59.70 వద్ద; రిలయన్స్ ఇన్‌ఫ్రా షేరు 4.99% కుదేలై రూ.360.05 వద్ద ముగిశాయి.



✦ జీఎన్‌జీ ఎలక్ట్రానిక్స్ తొలి పబ్లిక్ ఆఫర్ రెండో రోజు ముగిసేసరికి 6.90 రెట్ల స్పందన లభించింది. 1,41,88,644 షేర్లను జారీ చేయనుండగా.. 38,16,47,826 షేర్లకు బిడ్‌లు దాఖలయ్యాయి. చిన్న మదుపర్ల విభాగంలో 23.01 రెట్ల స్పందన లభించింది.

జౌళి, తోలు, ఔషధ, వాహన కంపెనీల షేర్ల రాణింపు: భారత్, బ్రిటన్ మధ్య స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందం కుదరడంతో జౌళి, తోలు, ఔషధ, వాహన రంగాల కంపెనీల షేర్లు లాభాలతో ముగిశాయి. ఈ రంగాల నుంచి ఎగుమతులు పెరుగుతాయనే అంచనాలే ఇందుకు కారణం.

✦ బీఎస్ఈలో తోలు రంగానికి చెందిన ఏకేఐ ఇండియా 5%, మిర్జా ఇంటర్నేషనల్ 1.86%, జెనిత్ ఎక్స్‌పోర్ట్స్ 0.96%, సూపర్‌హౌస్ 0.47% పెరిగాయి.

✦ జౌళి రంగానికి సంబంధించి పెరల్ గ్లోబల్ ఇండస్ట్రీస్ 3.67%, వెల్‌స్పన్ లివింగ్ 2.36%, వర్ధమాన్ టెక్స్‌టైల్స్ 1.88%; ట్రైడెంట్ 1.68%, అరవింద్ 1.04%, అలోక్ ఇండస్ట్రీస్ 0.2% లాభపడ్డాయి.

✦ వాహన రంగంలో టాటా మోటార్స్ 1.51%, వాహన విడిభాగాల తయారీ సంస్థ సోనా బీఎల్‌డబ్ల్యూ ప్రెసిషన్ ఫోర్జింగ్స్ 0.28% రాణించాయి.

✦ ఔషధ రంగంలోని డాక్టర్ రెడ్డీస్ 1.39%, లుపిన్ 1.2%, సన్‌ఫార్మా 0.56%, ఆల్కెమ్ లేబొరేటరీస్ 0.44% లాభంతో ముగిశాయి.

ఐపీఓ సమాచారమ్

కంపెనీ	ధరల శ్రేణి	ప్రారంభం-ముగింపు
శ్రీలోటస్ డెవలపర్స్	రూ.140-150	జులై 30- ఆగస్టు 1
ఆదిత్య ఇన్ఫోటెక్	రూ.640-675	జులై 29- 31

సంక్షిప్తంగా...

✦ ప్రైవేట్ ప్లేస్‌మెంట్ పద్ధతిలో మార్పిడి రహిత డిబెంచర్ల జారీ ద్వారా రూ.18,000 కోట్లు సమీకరించేందుకు వాటాదార్ల అనుమతి పొందినట్లు ప్రభుత్వ రంగ ఎన్‌టీపీసీ వెల్లడించింది.

✦ ఫ్రాన్స్‌కు చెందిన పెర్నాడ్ రికార్డ్ నుంచి ఇంపీరియల్ బ్లూ బ్రాండును కొనుగోలు చేయనున్న తిలక్ నగర్ ఇండస్ట్రీస్ రూ.6,500 కోట్లు సమీకరించే ప్రణాళికలో ఉంది. అర్హులైన మదుపర్ల నుంచి మలివిడత పబ్లిక్ ఆఫర్, రైట్స్ ఇష్యూ లేదా ఈ రెండు మార్గాల్లో కలిపి ఈ నిధులు సమీకరించాలని అనుకుంటోంది. ఇంపీరియల్ బ్లూ కొనుగోలు కోసం రుణ పరిమితిని రూ.5,000 కోట్లకు పెంచేందుకు తిలక్‌నగర్ ఇండస్ట్రీస్ బోర్డు ఆమోదం తెలిపింది.

✦ స్మార్ట్ మీటర్ డేటా మేనేజ్‌మెంట్ వ్యవస్థను రూపొందించి, అమలు చేసేందుకు సౌదీ ఎలక్ట్రిసిటీ కంపెనీకి చెందిన పూర్తి స్థాయి అనుబంధ సంస్థ నేషనల్ గ్రిడ్ నుంచి ఆర్డర్లు వచ్చినట్లు విప్రో తెలిపింది. అయితే లావాదేవీ వివరాలను కంపెనీ వెల్లడించలేదు.

ఆదాయపు పన్ను రిటర్నులను ఎప్పుడూ సరైన పత్రంలోనే దాఖలు చేయాలి. లేకపోతే రిఫండు ఆలస్యం కావొచ్చు, కొన్నిసార్లు జరిమానాలూ పడొచ్చు. మరి పొరపాటున ఒక ఐటీఆర్ ఫారం బదులు మరోటి ఎంచుకుంటే? ఆ తప్పును ఎలా సరిదిద్దుకోవాలి? ఇందుకు గల మార్గాలేమిటి.. చూద్దాం.

ఐటీఆర్ ఎంపికలో తప్పు చేస్తే



గత ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేసేందుకు సెప్టెంబరు 15 వరకూ గడువు ఉంది. వీలైనంత తొందరగా ఈ బాధ్యతను పూర్తి చేయడం మంచిది. చాలామంది చేసే పొరపాటు ఏమిటంటే.. ఉద్యోగులు తమకు ఇతర ఆదాయ వనరులు లేదా మూలధన లాభాలు ఉన్నప్పటికీ ఐటీఆర్-1 మాత్రమే సరిపోతుందనే భావనలో ఉంటారు. కానీ, వీరికి కొన్నిసార్లు ఐటీఆర్-2, లేదా ఐటీఆర్-3 వర్తించే అవకాశం ఉంది. ముఖ్యంగా షేర్లలో పెట్టుబడులు పెట్టిన వారు, ఎఫ్అండ్ఓలు చేసే వారికి ఇది వర్తిస్తుంది. ఇలా ఫారం ఎంచుకోవడంలో చేసే పొరపాటు కొన్నిసార్లు ఇబ్బందులకు గురిచేయొచ్చు.

అనుకోకుండా తప్పు రిటర్ను ఫారం ఎంచుకున్నప్పుడు దాన్ని సవరించేందుకు ప్రయత్నించాలి. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 139(5) కింద దీన్ని అనుమతిస్తారు. సంబంధిత అసెస్‌మెంట్ సంవత్సరం (ప్రస్తుతం 2025-26) ముగిసే 3 నెలల ముందు, లేదా ఆదాయపు పన్ను అధికారులు ఆ రిటర్నులను అసెస్ చేసే ముందు.. ఇందులో ఏది ముందు పూర్తయితే అప్పటి వరకూ సవరించిన రిటర్నులు దాఖలు చేయొచ్చు.

వ్యవధిలోపే రిటర్నులు దాఖలు చేశారనుకోండి. రిటర్నులలో సవరణ చేయడం తేలికే. ఇ-ఫైలింగ్ వెబ్‌సైటులోకి వెళ్లి, సరైన ఐటీఆర్‌ను ఎంచుకోవాలి. ఫైలింగ్ సెక్షన్‌లో '139(5)రివైజ్- రిటర్న్ రివైజ్డ్ ఆఫ్టర్ ఫైలింగ్ ఒరిజినల్ రిటర్న్'ను క్లిక్ చేయాలి.

✦ ఇప్పటికే మీరు దాఖలు చేసిన ఒరిజనల్ ఐటీఆర్ రశీదు నంబరును ఇక్కడ నమోదు చేయాల్సి ఉంటుంది. అవసరమైన మార్పులు చేసి, రిటర్నులు సమర్పించే వీలుంటుంది. ఇ-వెరిఫై చేయడం మర్చిపోవద్దు.

ఇలా సవరించిన రిటర్నులు దాఖలు చేసినప్పటికీ, దీన్ని ఒరిజినల్ రిటర్నుగానే పరిగణిస్తారు. కానీ, తరచూ మార్పులు చేస్తుంటే, ఐటీ శాఖ కృత్రిమ మేధ (ఏఐ) దృష్టిని ఆకర్షించే ఆస్కారం ఉంది.

✦ పెద్ద సవరణలు చేసినప్పుడు మీ నిర్లక్ష్యం లేదా ఆదాయాన్ని దాచే ప్రయత్నానికి సంకేతం ఇవ్వొచ్చు. ఫారం 26ఏఎస్, ఏఐఎస్, టీఐఎస్‌లోని సమాచారంతో మీ రిటర్ను సరిపోలకపోతే, నోటీసులు వచ్చే అవకాశాలూ ఉన్నాయి.

రివైజ్డ్ రిటర్నులను అన్ని సందర్భాల్లోనూ ఉపయోగించేందుకు వీలు కాదు. ఉదాహరణకు నష్టాన్ని ప్రకటించేందుకు, పెద్ద మొత్తంలో రిఫండును క్లెయిం చేసేందుకు అప్‌డేటెడ్ రిటర్న్ దాఖలు చేయలేరు. అలాగే పన్ను విభాగం ఇప్పటికే వివిధ సెక్షన్‌ల కింద అసెస్‌మెంట్‌ను ప్రారంభించినా ఇది సాధ్యం కాదు.

ఐటీ రిటర్నులు దాఖలు చేసే ముందు మీ ఫారాన్ని ఒకటికి రెండు సార్లు తనిఖీ చేయండి. ఆ తర్వాతే వాటిని సబ్మిట్ చేసి, ఇ-వెరిఫై చేయడం మంచిది.

ఆర్థికంగా మనం ఎంత క్రమశిక్షణతో ఉన్నాం అనేది నిర్ణయించేది క్రెడిట్ స్కోరు. కొత్తగా రుణం తీసుకోవాలని అనుకున్నప్పుడు బ్యాంకులు/ ఆర్థిక సంస్థలు ఇదే విషయాన్ని ప్రధానంగా చూస్తుంటాయి. మంచి క్రెడిట్ స్కోరుంటే.. అప్పు తేలిగ్గా దొరకడమే కాకుండా, వడ్డీలోనూ రాయితీ లభిస్తుంది. దీనివల్ల రుణ వ్యవధిలో ఎంతో మొత్తం ఆదా చేసుకునేందుకు వీలవుతుంది. సాధారణంగా క్రెడిట్ స్కోరు 300-900 మధ్య గణిస్తారు. 800కు మించి ఉన్నప్పుడు మంచి స్కోరుగా పరిగణిస్తారు. 670-739 వరకూ ఉన్న స్కోరుతోనూ ఇబ్బంది లేదు. 600లకు లోపు ఉన్నప్పుడు మాత్రం రుణ సంస్థలు ఆ వ్యక్తిని పట్టించుకోవు. ఈ నేపథ్యంలో ఈ స్కోరును పెంచుకునేందుకు, నిలబెట్టుకునేందుకు ఏం ఏయాలో తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.



క్రెడిట్ స్కోరు పెంచుకుందాం

దేశంలో ప్రధానంగా నాలుగు సంస్థలు.. ట్రాన్స్‌యూనియన్ సిబిల్, ఈక్విఫాక్స్, ఎక్స్‌పీరియన్, క్రిఫ్ హైమార్క్ క్రెడిట్ స్కోరును అందిస్తున్నాయి. ఈ సంస్థలు రుణగ్రహీతల చెల్లింపుల తీరును ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉంటాయి.

సమయానికి చెల్లించండి

క్రెడిట్ స్కోరును ప్రభావితం చేసే అతి ముఖ్యమైన అంశం రుణ వాయిదాలు, కార్డు బిల్లుల చెల్లింపు చరిత్ర. మీ అన్ని ఈఎంఐలను పూర్తిగా, సకాలంలో చెల్లించేందుకు ప్రయత్నించండి. ఒక్క చెల్లింపు తప్పినా లేదా ఆలస్యమైనా స్కోరుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అలాగే, మీ రుణాలు, క్రెడిట్ కార్డులపై కనీస చెల్లింపు మాత్రమే చేస్తూ కాలం వెళ్లదీస్తుంటే, కాలక్రమేణా క్రెడిట్ స్కోరు తగ్గుతూ వస్తుంది.

వినియోగ నిష్పత్తిని గమనించండి

చాలామంది క్రెడిట్ కార్డును పూర్తిగా వినియోగించడం వల్ల పెద్ద ఇబ్బందులేమీ రావని అనుకుంటారు. కానీ, ఇది వాస్తవం కాదు. మీ క్రెడిట్ వినియోగ నిష్పత్తిని గమనిస్తూ ఉండాలి. ప్రతి నెలా మీరు కార్డు ద్వారా ఎంత ఖర్చు చేస్తున్నారో చూసుకోండి. మీ కార్డు పరిమితిలో అది ఎంత శాతం అన్నది కీలకం. నిపుణుల అభిప్రాయం ప్రకారం కార్డు పరిమితిలో 30-40 శాతానికి మించని వినియోగ నిష్పత్తి శ్రేయస్కరం. అప్పుడే మీరు బాధ్యతాయుతంగా ఖర్చు చేసే వ్యక్తి అని రుణదాతలు నమ్ముతారు. మీ క్రెడిట్ వినియోగ నిష్పత్తి 70-80 శాతం కంటే ఎక్కువగా ఉంటే, మీ క్రెడిట్ స్కోరు తగ్గిపోవచ్చు. తక్కువ పరిమితి ఉన్న కార్డులను వీలైనంత వరకూ వాడకుండా చూసుకోవాలి. అధిక పరిమితి ఉన్న కార్డులో కాస్త ఎక్కువ ఖర్చు చేసినా నిష్పత్తితో ఇబ్బంది ఉండదు.

ఈఎంఐలుగా మార్చొద్దు..

క్రెడిట్ కార్డుపై ఏదైనా పెద్ద మొత్తంలో కొనుగోలు చేసి, ఆ బిల్లును ఈఎంఐగా మార్చడం సులభంగా అనిపిస్తుంది. కానీ, ఇది ఏమాత్రం మంచిది కాదు. తీసుకున్న అప్పును సరిగా చెల్లించలేకపోతున్నారనే అర్థంలో బ్యాంకులు తీసుకుంటాయి. మీ క్రెడిట్ స్కోరు తగ్గేందుకు చాలా సందర్భాల్లో ఇదీ ఒక కారణం అవుతుంది. వాయిదాల్లోకి మార్చడమంటే మీ ఆర్థిక సామర్థ్యానికి మించి అప్పు తీసుకుంటున్నట్లే. వీలైనంత వరకూ బడ్జెట్ వేసుకొని, దానికి అనుగుణంగా కొనుగోళ్లు చేయడమే మంచిది.

రుణాల కోసం దరఖాస్తులు

క్రెడిట్ కార్డు బాకీ తీర్చేందుకు మరో రుణం తీసుకోవడం.. అప్పులను అటూ ఇటూ బదిలీ చేయడం కొందరికి అలవాటు. దీని వల్ల స్వల్పకాలంలో వెసులుబాటు లభిస్తుంది. కానీ, దీర్ఘకాలంలో అప్పులు పెరిగి, వడ్డీ భారమవుతుంది. స్కోరు తక్కువగా ఉన్నప్పుడు కొత్త రుణాలు, కార్డుల కోసం దరఖాస్తు చేయొద్దు. తక్కువ వ్యవధిలో ఇలాంటి దరఖాస్తులు ఎక్కువగా చేస్తే, మీ స్కోరు పడిపోతుంది. రుణదాతలు మీరు డబ్బు కోసం ఇబ్బంది పడుతున్నారని భావిస్తారు. వారు అప్పు ఇవ్వరు సరికదా.. మీ స్కోరును తగ్గించే విధంగా రిపోర్టు చేస్తారు.

సిరి
siri@eenadu.net

లోపాలున్నాయా?

కొన్నిసార్లు మీరు అన్ని చెల్లింపులనూ సకాలంలో చేసినా, మీ క్రెడిట్ రిపోర్టు తప్పుగా ఉండొచ్చు. లేదా అప్‌డేట్ కాకపోవచ్చు. ఇలాంటి సందర్భాల్లో వెంటనే సమస్యను క్రెడిట్ బ్యూరోకు నివేదించాలి. తద్వారా పొరపాట్లు వీలైనంత తొందరగా సరిచేసేందుకు వీలవుతుంది.

హామీతో రుణాలు..

క్రెడిట్ స్కోరు తక్కువగా ఉన్నప్పుడు పెంచుకునేందుకు ఉన్న మార్గాల్లో ఒకటి.. హామీతో కూడిన రుణాలను తీసుకోవడం. ఉదాహరణకు బంగారంపై రుణం. ఫిక్స్‌డ్ డిపాజిట్ హామీతో క్రెడిట్ కార్డులాంటివి. క్రెడిట్ కార్డును ఉపయోగిస్తూ.. ఎప్పటికప్పుడు బిల్లు చెల్లిస్తూ ఉంటే, క్రమంగా స్కోరు పెరుగుతుంది. బంగారం రుణాన్నీ గడువులోపే తీర్చేయడం ద్వారా మీపై నమ్మకం పెంచుకోవచ్చు.

తనిఖీ చేసుకోండి

రుణం, క్రెడిట్ కార్డు ఉన్నవారు కచ్చితంగా ఆరు నెలలకోసారి క్రెడిట్ నివేదికను చూసుకోవాలి. కొన్నిసార్లు తెలియకుండానే, మీకు ఏమాత్రం సంబంధం లేని రుణాలు మీ క్రెడిట్ నివేదికలో చేరొచ్చు. ఇలాంటి వాటిపై వెంటనే ఫిర్యాదు చేయండి. సిబిల్ ఏడాదికోసారి ఈ నివేదికను ఉచితంగా అందిస్తుంది. కొన్ని సంస్థలు నెలనెలా రిపోర్టును ఉచితంగానే ఇస్తున్నాయి.

అన్ని విభాగాల కంపెనీల్లో

క్యాపిటల్‌మైండ్ మ్యూచువల్ ఫండ్ తన తొలి పథకాన్ని తీసుకొచ్చింది. ఇది ఫ్లెక్సీ క్యాప్ పథకం. క్యాపిటల్‌మైండ్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ అనే ఈ పథకం ఎన్ఎఫ్ఓ ముగింపు తేదీ ఈ నెల 28. కనీస పెట్టుబడి రూ.5,000. ఈ పథకం లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ తరగతులకు చెందిన అన్ని కంపెనీల్లో పెట్టుబడి పెడుతుంది. లార్జ్ క్యాప్ తరగతికి చెందిన షేర్లకు ఎక్కువ పెట్టుబడి కేటాయించే అవకాశం ఉంది. క్వాంటిటేటివ్ ఫ్యాక్టర్ ఆధారిత విధానాల ద్వారా కంపెనీలను ఎంపిక చేస్తారు. నిఫ్టీ 500 టీఆర్ఐని ఈ పథకం పనితీరుకు కొలమానంగా తీసుకుంటారు. ఫండ్ మేనేజర్.. అనూప్ విజయ్‌కుమార్.

వినూత్న వ్యూహాలతో

ఆదిత్య బిర్లా సన్ లైఫ్ మ్యూచువల్ ఫండ్ నుంచి రెండు కొత్త పథకాలు అందుబాటులోకి వచ్చాయి. అవే ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ బీఎస్ఈ 500 మొమెంటమ్ 50 ఇండెక్స్ ఫండ్, ఆదిత్య బిర్లా సన్ లైఫ్ బీఎస్ఈ 500 క్వాలిటీ 50 ఇండెక్స్ ఫండ్. ఇటీవలి కాలంలో మొమెంటమ్, క్వాలిటీ తరహా పెట్టుబడి విధానాలు ఆదరణ పొందుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ పథకాలను ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఆవిష్కరించింది. వీటి ఎన్ఎఫ్ఓలు వచ్చే నెల 4 వరకూ అందుబాటులో ఉంటాయి. కనీస పెట్టుబడి రూ.500. ఆదిత్య బిర్లా సన్ లైఫ్ బీఎస్ఈ 500 మొమెంటమ్ 50 ఇండెక్స్ ఫండ్‌కు బీఎస్ఈ 500 మొమెంటమ్ 50 టీఆర్ఐ సూచీ కొలమానంగా ఉంటుంది. బీఎస్ఈ 500లోని టాప్-500 కంపెనీలపై ఈ పథకం దృష్టి పెడుతుంది. నాణ్యమైన పునాదులపై వేగంగా వృద్ధి చెందుతున్న కంపెనీలపై పెట్టుబడి పెట్టాలనేది ఆదిత్య బిర్లా సన్ లైఫ్ బీఎస్ఈ 500 క్వాలిటీ 50 ఇండెక్స్ ఫండ్ వ్యూహం. ఈ రెండు పథకాల్లోనూ కాస్త అధిక నష్టభయం ఉంటుంది. లాభాలూ అదే విధంగా ఉంటాయి.

విద్యుత్ సంస్థల షేర్లలో

బీఎస్ఈ పవర్ ఇండెక్స్‌లోని షేర్లపై పెట్టుబడి పెట్టి, అధిక లాభాలు ఆర్జించాలనే లక్ష్యంతో గ్రో మ్యూచువల్ ఫండ్ ఒక కొత్త పథకాన్ని తీసుకొచ్చింది. ఇది ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ (ఈటీఎఫ్) పథకం. గ్రో బీఎస్ఈ పవర్ ఈటీఎఫ్ అనే ఈ పథకం ఎన్ఎఫ్ఓ ముగింపు తేదీ వచ్చే నెల 1. ఎన్ఎఫ్ఓలో కనీస పెట్టుబడి రూ.500. మన దేశంలో విద్యుత్తు రంగానికి చెందిన షేర్లలో పెట్టుబడి పెట్టే తొలి ఈటీఎఫ్ మ్యూచువల్ ఫండ్ పథకం ఇదే. విద్యుత్తు రంగంలో వస్తున్న మార్పులు, విస్తరణ, అభివృద్ధి అవకాశాలను పరిగణనలోకి తీసుకొని, ఈ కొత్త పథకానికి రూపకల్పన చేశారు. దీర్ఘకాలంలో ఈ పథకం మెరుగైన పనితీరును చూపించే అవకాశం ఉంది. బీఎస్ఈ పవర్ ఇండెక్స్ ఈ పథకానికి కొలమానంగా ఉంటుంది. ఫండ్ మేనేజర్లు.. నిఖిల్ సాతమ్, ఆకాశ్ చౌహాన్, శశి కుమార్.

ఉద్యోగంలో చేరినప్పుడే పదవీ విరమణ ఎప్పుడు చేయాలనే ఆలోచనతో ఉంటున్నారు చాలామంది. 45-50 ఏళ్ల వయసు వచ్చేనాటికి రిటైర్ కావడానికి సిద్ధమవుతున్నారు. 'ఫైనాన్షియల్ ఇండిపెండెన్స్, రిటైర్ ఎర్లీ (ఫైర్)' ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ ఆలోచన రావడం సులభమే. కానీ, ఆచరణ అంత సులభం కాదు. అలా అని అసాధ్యమూ కాదు. కచ్చితమైన ఆర్థిక ప్రణాళికలు, వ్యూహాలను రూపొందించుకొని, దీన్ని వాస్తవంగా మార్చుకోవచ్చు. ముందస్తు పదవీ విరమణకు సిద్ధం కావాలంటే.. ఏం చేయాలో తెలుసుకుందామా..

తొందరగా రిటైర్ అవుతారా?

ఆర్థిక క్రమశిక్షణ.. ఎంత ముఖ్యమో మనకు తెలియనిది కాదు. మరో 15-20 ఏళ్లలో ఉద్యోగం నుంచి విరమణ పొందాలని అనుకునే వారికి ఇది తప్పనిసరి. 30 ఏళ్లు దాటిన వారు దీర్ఘకాలిక పెట్టుబడులకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఆలస్యం చేస్తున్న కొద్దీ మీ లక్ష్యం చేజారిపోతుంది. కాబట్టి, ఆలోచన వచ్చిన మరుక్షణమే దాన్ని నిజం చేసుకునేందుకు అనువైన పెట్టుబడులు పెంచాలి.



మరింత పెట్టుబడి..

సాధారణంగా మనం సంపాదించే మొత్తంలో కనీసం 20 శాతం పెట్టుబడి పెట్టాలనేది ఆర్థిక సూత్రం. కానీ, ముందుగానే రిటైర్ కావాలనుకుంటే మాత్రం ఇది ఏమాత్రం సరిపోదు. వచ్చిన మొత్తంలో కనీసం 35-40 శాతం పొదుపు చేసేందుకు ప్రయత్నించాలి. ఇంకా ఎక్కువ దాచినా మంచిదే. స్మార్ట్ బడ్జెట్‌ను సృష్టించుకోండి. మీ ఖర్చులను ఒకసారి పరిశీలించండి. వాటిని వీలైనంత వరకూ తగ్గించాలి. కేవలం పొదుపు చేస్తేనే సరిపోదు కదా.. ఈ మొత్తాన్ని కనీసం 12శాతానికి మించి రాబడినిచ్చే పథకాల్లో మదుపు చేయాలి. డబ్బు ఎప్పుడూ తక్కువ రాబడి వచ్చే చోట ఉండకూడదు.

ఈక్విటీలతో..

రాబడి హామీ ఉన్న పెట్టుబడులు ఎప్పుడూ మీ లక్ష్యాన్ని చేరుకోవడంలో సహాయం చేయవు. మీ లక్ష్యం ఏమిటో.. అందుకు ఉన్న వ్యవధి ఎంతో స్పష్టంగా అంచనా వేయాలి. ఆ తర్వాత చేయాల్సింది.. అందుకు అనువైన నిధిని సృష్టించాలి. మీ రూపాయి.. రూపాయిలను సంపాదించే మార్గాలను ఎంచుకోవాలి. అధిక రాబడిని సాధించేందుకు దూకుడుగా ఉండే పెట్టుబడి ప్రణాళిక అవసరం. అందువల్ల కాస్త నష్టభయం ఉన్నా.. దీర్ఘకాలంలో మంచి రాబడిని ఇచ్చే ఈక్విటీ ఆధారిత పెట్టుబడులను పరిశీలించాలి.

మీ పొదుపు మొత్తంలో ఎక్కువ భాగం వీటికే కేటాయించాలి. 15-20 ఏళ్ల వ్యవధిలో ఉన్నప్పుడు ఇవి ఆశించిన ప్రతిఫలాన్ని ఇస్తాయనే చెప్పొచ్చు. మంచి రాబడి చరిత్ర, అధిక రేటింగ్ ఉన్న ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేయొచ్చు. మీకు మార్కెట్‌పై అవగాహన ఉంటే, నేరుగా షేర్లనూ ఎంచుకోవచ్చు. అధిక నష్టభయం ఉంటుందన్న సంగతి గుర్తుంచుకోవాలి. నెలనెలా నిర్ణీత మొత్తంతోనే సరిపెట్టకుండా, ఏటా కనీసం 10 శాతం పెట్టుబడిని పెంచుకోవాలి.

30 ఏళ్లలోపే..

మీరు 30 ఏళ్లకు చేరుకునేలోగానే.. మీపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు తగిన రక్షణ కల్పించాలి. అందుకోసం మీ వార్షికాదాయానికి కనీసం 10-12 రెట్ల విలువైన టర్మ్ పాలసీ తీసుకోవాలి. మీకు 75 ఏళ్లు వచ్చేదాకా ఆ పాలసీ రక్షణ కల్పించాలి. మీ ఆదాయం పెరుగుతున్నప్పుడు, బాధ్యతలు మారినప్పుడు మీ బీమా విలువనూ అందుకు తగ్గట్లుగా సర్దుబాటు చేసుకోవడం మేలు. సంపాదించే కుటుంబ పెద్దకు అనుకోనిది ఏదైనా జరిగినప్పుడు.. ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకూడదు. చిన్న వయసులో తీసుకుంటేనే టర్మ్ పాలసీకి తక్కువ ప్రీమియం ఉంటుంది.

ఇక కుటుంబానికి అంతటికీ వర్తించేలా ఆరోగ్య బీమా పాలసీ తీసుకోవడమూ మర్చిపోవద్దు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కనీసం ఈ పాలసీ విలువ రూ.10 లక్షలకు తగ్గకుండా ఉండాలి. మీరు ముందుగానే పదవీ విరమణ చేసినప్పుడు.. ఉద్యోగంలో ఉన్న కొన్ని ప్రయోజనాలు దూరం చేసుకోక తప్పదు. ముఖ్యంగా యాజమాన్యం అందించే బృంద ఆరోగ్య బీమా పాలసీ రక్షణ.. మీరు ఉద్యోగంలో ఉన్నప్పుడే వర్తిస్తుంది. ముందస్తు పదవీ విరమణ ఆలోచన ఉన్నవాళ్లు ఈ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. కనీసం నాలుగైదేళ్ల ముందుగానే సొంతంగా ఒక ఆరోగ్య బీమా పాలసీని తీసుకోవడం శ్రేయస్కరం. ఉద్యోగ విరమణ చేసిన తర్వాత పాలసీ రక్షణ లేకపోతే.. అనారోగ్యం బారిన పడినప్పుడు.. దాచుకున్న సొమ్ము ఆసుపత్రి పాలవుతుంది.

అప్పులు తీర్చేయాలి..

రిటైర్ కావడానికి ఇంకా రెండుమూడేళ్ల వ్యవధి ఉండగానే సాధ్యమైనంత వరకూ అప్పులు లేకుండా చూసుకోవాలి. ముఖ్యంగా గృహరుణం, వాహన రుణాల్లాంటివి ఉండకూడదు. వ్యక్తిగత రుణాలను తీసుకోకూడదు. అప్పులన్నీ తీరిస్తేనే పదవీ విరమణ ప్రశాంతంగా ఉంటుంది. వడ్డీ అధికంగా ఉన్న అప్పులను ముందుగా తీర్చేయండి. ఆ తర్వాత తక్కువ వడ్డీ ఉండే వాటిని చెల్లించండి. రుణ బాధ్యతలు ఉండగానే పదవీ విరమణ చేయడం అంత మంచి ఆర్థిక ప్రణాళిక కాదు.

సొంత ఆరోగ్య బీమా తీసుకోండి

నేను ప్రభుత్వ ఉద్యోగిని. రూ.60లక్షల వరకూ టర్మ్ పాలసీ తీసుకున్నాను. మాకు నాలుగేళ్ల అమ్మాయి ఉంది. తన పేరుమీద ఏడాదికి రూ.లక్ష చెల్లించి, ఒక బీమా పాలసీ తీసుకోవాలని అనుకుంటున్నాను. 21 ఏళ్ల తర్వాత ఎంత మొత్తం వస్తుంది. - నూతన్

టర్మ్ పాలసీ తీసుకోవడం అందరికీ అవసరం. మీరు చిన్న వయసులోనే రూ.60 లక్షల పాలసీ తీసుకోవడం మంచిదే. దీంతోపాటు రూ.50లక్షలకు వ్యక్తిగత ప్రమాద, డిజేబిలిటీ బీమానూ తీసుకోండి. అమ్మాయి ఉన్నత చదువుల కోసం మరో 13-14 ఏళ్ల సమయం ఉంది. క్రమశిక్షణతో మదుపు చేస్తే, మంచి మొత్తంలో డబ్బు జమ చేయొచ్చు. సంప్రదాయ బీమా పాలసీలో 4-5 శాతం వరకూ రాబడి అందుతుంది. యూనిట్ ఆధారిత పాలసీలో కాస్త రాబడి అధికంగా వచ్చే అవకాశాలున్నాయి. ఈ రెండింటికీ మించి ప్రత్యామ్నాయం కావాలంటే.. డైవర్సిఫైడ్ ఈక్విటీ ఫండ్లను ఎంచుకోవచ్చు. నెలకు రూ.8,500 చొప్పున క్రమానుగతంగా పెట్టుబడి పెట్టండి. ఇలా చేయడం వల్ల 15 ఏళ్ల తర్వాత సగటున 12 శాతం వార్షిక రాబడి అంచనాతో మీ దగ్గర రూ.38,02,530 జమ అయ్యే అవకాశం ఉంది.

నేను బ్యాంకులో పనిచేస్తున్నాను. మా సంస్థ మాకు ఇచ్చే ఆరోగ్య బీమా సరిపోతుందా? లేదా సొంతంగా మరో పాలసీ తీసుకోవాలా? - ధన

సాధారణంగా బృంద ఆరోగ్య బీమా పాలసీలు రూ.5 లక్షల వరకూ ఉంటాయి. ప్రస్తుతం వైద్య ద్రవ్యోల్బణం 10-12 శాతం వరకూ ఉంది. తీవ్ర అనారోగ్యం వస్తే.. రూ.లక్షల్లోనే బిల్లు అవుతోంది. మీ సంస్థ ఇచ్చే బృంద ఆరోగ్య బీమా మీకు సరిపోకపోవచ్చు. కనీసం రూ.10లక్షల వరకూ ఆరోగ్య బీమా ఉండేలా చూసుకోండి. క్లెయిం చెల్లింపుల చరిత్ర బాగున్న కంపెనీని ఎంచుకొని, బీమా తీసుకోండి. దీనిపై సూపర్ టాపప్ తీసుకునే విషయాన్నీ ఆలోచించండి.

నా వయసు 40. నెలకు రూ.2,000 వరకూ అయిదేళ్ల వరకూ పెట్టుబడి పెట్టగలను. ఎక్కడ జమ చేయాలి? - రాజు

ముందుగా కుటుంబానికి తగిన ఆర్థిక రక్షణ కల్పించే ప్రయత్నం చేయండి. మీ వార్షికాదాయానికి కనీసం 10 రెట్ల వరకూ టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకోవడం మంచిది. ఆరోగ్య బీమా పాలసీని తీసుకోవడమూ మర్చిపోవద్దు. మీరు పెట్టుబడి పెట్టాలనుకుంటున్న రూ.2వేలను హైబ్రిడ్ ఈక్విటీ ఫండ్లలో కనీసం 8-10 ఏళ్ల వరకూ మదుపు చేయండి.

- తుమ్మ బాల్‌రాజ్,
సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

(ఆర్థిక విషయాల్లో మీకున్న సందేహాలను siri@eenadu.netకు మెయిల్ చేయండి.)

పెట్టుబడి పెట్టిన వెంటనే రెట్టింపు రాబడి రావాలనే ఆలోచన ఎప్పుడూ మంచిది కాదు. పెట్టుబడి పథకాలు ఎప్పుడూ దీర్ఘకాలిక వ్యూహాలతో ఉండాలి. సమీక్షించుకునే సమయంలోనూ దీన్ని మర్చిపోకూడదు. ఇటీవలి కాలంలో చాలామంది అత్యవసర నిధిపై దృష్టి పెడుతున్నారు. ఈ నిధిని దీర్ఘకాలిక పెట్టుబడి పథకాల్లో ఉంచడం అంత మంచిది కాదు. ఈ పథకాలు స్వల్పకాలంలో కొన్నిసార్లు నష్టాలను ఇచ్చే ఆస్కారం ఉంది. కాబట్టి, ఈ విషయంలో స్వల్పకాలిక పథకాలే మెరుగైనవి. నష్టభయం అధికంగా ఉండే పథకాల్లో.. కాలం గడుస్తున్న కొద్దీ అది తగ్గిపోతుంది. ఉదాహరణకు ఈక్విటీలు ఎప్పుడు ఎలా ప్రవర్తిస్తాయో తెలియదు. కానీ, వాటిలో అధిక లాభాలకు ఆస్కారం ఉంటుందన్న సంగతి తెలిసిందే. ద్రవ్యోల్బణాన్ని మించి రాబడి సాధించాలంటే ఇవి కావాల్సిందే. మదుపు చేసిన మ్యూచువల్ ఫండ్లు ప్రస్తుత మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా పనిచేస్తున్నాయా లేదా చూసుకోండి. ఆర్థికంగా నష్టపోకుండా ఉండాలంటే.. పోర్ట్‌ఫోలియో ఎప్పుడూ విభిన్న పథకాలతో నిండి ఉండాలి. మీరు సమీక్షించుకునేటప్పుడు ఈ విషయాన్ని గమనించాలి. షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, స్థిరాదాయం అందించే పథకాలు, బంగారం ఇలా పెట్టుబడులు విస్తరించాలి. ఈ వ్యూహాన్ని ఎప్పుడూ మర్చిపోవద్దు.

ఆశయాలకు అనుగుణంగా..

ప్రతి పెట్టుబడికీ ఒక ఆశయం ఉండాలి. మీ నష్టభయం భరించే సామర్థ్యం, ఆశిస్తున్న రాబడి ఆధారంగా ఈక్విటీలు, డెట్ పథకాల్లో మదుపు చేయాలి. దీంతోపాటు.. మార్కెట్ హెచ్చుతగ్గులు మారుతున్న వడ్డీ రేట్లనూ గమనిస్తూ ఉండాలి. మీ ఆదాయం పెరిగినప్పుడు లేదా.. మీ ఆర్థిక లక్ష్యాలు మారినప్పుడు అందుకు అనుగుణంగా పెట్టుబడి పథకాల్లో మార్పులు చేర్పులు రావాలి. ఉదాహరణకు 50 ఏళ్ల వయసులోకి వచ్చాక ఈక్విటీల్లో పెట్టుబడులు కాస్త తగ్గాలి. హైబ్రిడ్ ఈక్విటీ ఫండ్లు, డెట్ పథకాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. మీరు పెట్టుబడులను సమీక్షించుకునేటప్పుడు ఈక్విటీ పెట్టుబడుల శాతం మీరు అనుకున్నదానికన్నా అధికంగా ఉంటే, ఆ నిష్పత్తిని సర్దుబాటు చేసుకోవాలి.



మీ పెట్టుబడులు ఎలా ఉన్నాయ్?

అందుబాటులో ఎన్నో పెట్టుబడి పథకాలు.. వీటిలో మదుపు చేయడమూ సులభమే. మీరు ఎంచుకున్న పథకాల్లో డబ్బు పెరుగుతుందా.. ఇదే ఎప్పుడూ ముఖ్యం. మీరు మదుపు చేసిన పథకాల గురించి, ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి. స్టాక్ మార్కెట్ పోకడలను అర్థం చేసుకోవాలి. కనీసం ఆరు నెలలకోసారైనా మీరు మదుపు చేసిన పథకాల పరిస్థితిని చూసుకోవాలి. అప్పుడే డబ్బు డబ్బును సృష్టిస్తుంది.

ఆదాయంలో కలిపితే..

వచ్చిన రాబడికి పన్ను భారం తక్కువగా ఉండేలా చూసుకోవాలి. కొన్ని పథకాల మీద వచ్చిన రాబడిని మొత్తం ఆదాయంలో కలిపి చూపించాల్సి వస్తుంది. స్వల్పకాలిక ఈక్విటీ లాభాలపై 15 శాతం పన్ను వర్తిస్తుంది. దీర్ఘకాలిక పెట్టుబడులపై పన్ను విధానం వేరేగా ఉంటుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో దీర్ఘకాలిక మూలధన లాభం రూ.1.25 లక్షలకు మించితే, ఆ పై మొత్తానికి 12.5శాతం పన్ను చెల్లించాల్సి వస్తుంది. ఆర్థిక సంవత్సరం మధ్యలో ఉన్న నేపథ్యంలో పన్ను గురించి ఆలోచించేందుకు ఇదే సరైన తరుణం. కొత్త పన్ను విధానాన్ని ఎంచుకున్న వారు.. పన్ను ఆదా పెట్టుబడులను చూపించాల్సిన అవసరం లేదు. అంతమాత్రాన పెట్టుబడులు విస్మరించకూడదు. ప్రజా భవిష్య నిధి (పీపీఎఫ్), ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాలు (ఈఎల్ఎస్ఎస్)లాంటి వాటిని ఎప్పుడూ ఎంచుకోవచ్చు. ఆర్థిక లక్ష్యాల సాధనకే పెట్టుబడులు అన్న విషయాన్ని మర్చిపోవద్దు.

అవసరం వస్తే..

మదుపు దీర్ఘకాలం కొనసాగాలి. ఇది ఆర్థిక సూత్రం. ఇది అన్నిసార్లూ కుదరకపోవచ్చు. అందుకే, పెట్టుబడులు వీలైనంత వరకూ త్వరగా నగదుగా మార్చుకునే వీలుండాలి. స్వల్పకాలిక అవసరాల కోసం మనీ మార్కెట్ పథకాలు, లిక్విడ్ ఫండ్లు, స్వీప్-ఇన్ ఫిక్స్‌డ్ డిపాజిట్ల లాంటివి పరిశీలించాలి. కనీసం 8-10 ఏళ్లకు పైగా కొనసాగించే వీలున్నప్పుడే ఈక్విటీ ఆధారిత పెట్టుబడులు ఎంచుకోవాలి. మీ పెట్టుబడి పథకాల బాగోగులు చూస్తున్నప్పుడు ఈ విషయానికి ప్రాధాన్యం ఇవ్వండి.

పెట్టుబడులు వృద్ధి చెందాలంటే వాటికి తగిన సమయం ఇవ్వాలనేది నిపుణుల సూచన. అయితే, మదుపు చేశామా.. మర్చిపోయామా అనే ధోరణి సరికాదు. సమయానుకూలంగా మార్పులు చేర్పులు చేయకపోతే లాభాలు పంచాల్సిన పథకాలు నష్టాలను మిగిల్చే అవకాశం ఉంది.

అమైనో ఆమ్లాలు

అమైనో ఆమ్లాలు జీవ అణువులు. ప్రోటీన్ల ప్రాథమిక నిర్మాణ ప్రమాణాలు. ఇవి కార్బన్, హైడ్రోజన్, ఆక్సిజన్, నైట్రోజన్‌తో, కొన్ని సందర్భాల్లో సల్ఫర్ లాంటి మూలకాలతో రూపొందుతాయి. ప్రతి అమైనో ఆమ్లం ఒక అమైన్ గ్రూప్ (-NH_2), ఒక కార్బాక్సిల్ గ్రూప్ (-COOH), ఒక సైడ్ చైన్ (R-గ్రూప్) కలిగి ఉంటుంది. ఇది ప్రతి అమైనో ఆమ్లానికి నిర్దిష్టంగా ఉంటుంది.



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
బయాలజీ

ఆ విలువ తటస్థమైతే జ్విట్టర్ అయాన్ రూపం

అమైనో ఆమ్లాల నిర్మాణం

- సాధారణ నిర్మాణం: $H_2N – CH(R) – COOH$
- అమైన్ గ్రూప్ (–NH_2): ఆల్కలీన్ లేదా క్షార స్వభావం కలిగి ఉంటుంది.
- కార్బాక్సిల్ గ్రూప్ (–COOH): ఆమ్ల స్వభావం కలిగి ఉంటుంది.
- R-గ్రూప్: ఇది అమైనో ఆమ్లం లక్షణాలను నిర్ణయిస్తుంది
  ఉదా: హైడ్రోఫోబిక్, హైడ్రోఫిలిక్, ఆమ్ల లేదా ఆల్కలీన్

అమైనో ఆమ్లాలు - రకాలు

మానవ శరీరంలో సాధారణంగా 20 రకాల స్టాండర్డ్ అమైనో ఆమ్లాలు ఉన్నాయి. వీటిని రెండు రకాలుగా విభజించవచ్చు. అవి:

అవశ్యక (ఎసెన్షియల్) అమైనో ఆమ్లాలు:

ఇవి శరీరంలో సంశ్లేషణ కావు, ఆహారం ద్వారా తీసుకోవాలి.

ఉదా: హిస్టిడిన్, ఐసోలూసిన్, లూసిన్, లైసిన్, మెథియోనిన్, ఫినైల్ ఎలనిన్, థియోనిన్, ట్రిప్టోఫాన్, వాలిన్.

అనావశ్యక (నాన్–ఎసెన్షియల్) అమైనో ఆమ్లాలు:

ఇవి శరీరంలో సంశ్లేషణ అవుతాయి.

ఉదా: అలనైన్, అస్పార్టిక్ ఆమ్లం, గ్లూటామిక్ ఆమ్లం, గ్లైసిన్, సెరైన్.

వర్గీకరణ

R-గ్రూప్ ఆధారంగా అమైనో ఆమ్లాలను నాలుగు రకాలుగా వర్గీకరిస్తారు: అవి:

- **నాన్–పోలార్ (హైడ్రోఫోబిక్):** అలనైన్, వాలిన్, అస్పార్టిక్ ఆమ్లం
- **పోలార్ (హైడ్రోఫిలిక్):** సిస్టీన్, సెరైన్, థ్రియోనిన్
- **ఆమ్ల స్వభావం:** అస్పార్టిక్ ఆమ్లం, గ్లూటామిక్ ఆమ్లం
- **ఆల్కలీన్ స్వభావం:** లైసిన్, ఆర్జినిన్, హిస్టిడిన్

ముఖ్యమైన అమైనో ఆమ్లాలు, అవి లభించే వనరులు

అమైనో ఆమ్లం	ఆహార వనరులు
హిస్టిడిన్	గుడ్డు, మాంసం, చేపలు
లూసిన్	సోయాబీన్స్, బాదం, గుడ్డు
లైసిన్	పాల ఉత్పత్తులు, చేపలు, మాంసం
మెథియోనిన్	గుడ్డు, సోయాబీన్స్, నట్స్
ట్రిప్టోఫాన్	ఓట్స్, చాక్లెట్, బాదం

అమైనో ఆమ్లాల ధర్మాలు

అమైనో ఆమ్లాల ధర్మాలను వాటి రసాయన నిర్మాణం, R-గ్రూప్ (సైడ్ చైన్) ఆధారంగా నిర్ణయిస్తారు.

ఆమ్ఫోటెరిక్ స్వభావం: అమైనో ఆమ్లాలు అమైన్ గ్రూప్ (–NH_2), కార్బాక్సిల్ గ్రూప్ (–COOH) కలిగి ఉంటాయి. ఇవి వరుసగా ఆల్కలీన్, ఆమ్ల స్వభావాన్ని కలిగి ఉంటాయి.

- ఇవి ఆమ్లాలు, క్షారాలతో సంయోగం చెందుతాయి. కాబట్టి వీటిని ఆమ్ఫోటెరిక్ సమ్మేళనాలుగా పరిగణిస్తారు.

జ్విట్టర్ అయాన్ ఏర్పాటు: తటస్థ pH వద్ద అమైనో ఆమ్లాలు జ్విట్టర్ అయాన్ రూపంలో ఉంటాయి. అంటే ఇవి ఒకేసారి ధనావేశం (–NH_3^+), రుణావేశం (–COO^-) రెండింటినీ కలిగి ఉంటాయి. ఇది అమైనో ఆమ్లాలకు రసాయన స్థిరత్వాన్ని అందిస్తుంది.

ఐసోఎలక్ట్రిక్ పాయింట్: ఇది అమైనో ఆమ్లం నికర విద్యుదావేశం సున్నా అయ్యే pH విలువ.

- ప్రతి అమైనో ఆమ్లానికి దాని R-గ్రూప్ ఆధారంగా ఒక నిర్దిష్ట pI విలువ ఉంటుంది.

ద్రావణీయత: అమైనో ఆమ్లాలు సాధారణంగా హైడ్రోఫిలిక్‌లు. ఇవి నీటిలో కరుగుతాయి. కానీ R-గ్రూప్ హైడ్రోఫోబిక్ అయితే (ఉదా: వాలిన్, లూసిన్) నీటిలో తక్కువగా కరుగుతాయి.

- ఆల్కహాల్, బెంజీన్ లాంటి సేంద్రియ ద్రావణుల్లో సాధారణంగా కరగవు.

ఆప్టికల్ యాక్టివిటీ: గ్లైసిన్ మినహా అన్ని స్టాండర్డ్ అమైనో ఆమ్లాలు కైరల్ కార్బన్ కేంద్రకాన్ని (ఆల్ఫా కార్బన్) కలిగి ఉంటాయి. కాబట్టి ఇవి ఆప్టికల్ యాక్టివిటీని ప్రదర్శిస్తాయి.

- ఇవి L–, D– రూపాల్లో ఉంటాయి. కానీ జీవుల్లో సాధారణంగా L– అమైనో ఆమ్లాలు మాత్రమే కనిపిస్తాయి.



రచయిత
కొర్లాం సాయివెంకటేష్,
అసిస్టెంట్ ప్రొఫెసర్

జీవుల్లో అమైనో ఆమ్లాల విధులు

అమైనో ఆమ్లాలు జీవుల్లో అనేక కీలక విధులను నిర్వర్తిస్తాయి. ఈ విధులు జీవ రసాయన ప్రక్రియల్లో వాటి పాత్ర ఆధారంగా విభిన్నంగా ఉంటాయి.

ప్రోటీన్ సంశ్లేషణ: అమైనో ఆమ్లాలు పెప్టైడ్ బంధాల సహాయంతో ప్రోటీన్లను ఏర్పరుస్తాయి.

▼ ప్రోటీన్లు ఎంజైమ్‌లు, హార్మోన్లు, యాంటీబాడీలు, రవాణా వాహకాలు లాంటి వాటిని నిర్మించే విధులను నిర్వర్తిస్తాయి.

ఉదా: హిమోగ్లోబిన్ (ఆక్సిజన్ రవాణా) అమైనో ఆమ్లాల నుంచి ఏర్పడుతుంది.

ఎంజైమ్‌లు, కో–ఎంజైమ్‌ల ఉత్పత్తి: అమైనో ఆమ్లాల నుంచి అనేక ఎంజైమ్‌లు ఏర్పడతాయి. ఇవి జీవ రసాయన ప్రతిచర్యలను వేగవంతం చేస్తాయి.

ఉదా: ట్రిప్సిన్, లైసోజైమ్ లాంటి ఎంజైమ్‌లు.

హార్మోన్ల సంశ్లేషణ: కొన్ని హార్మోన్లు అమైనో ఆమ్లాల నుంచి తయారవుతాయి.

ఉదా: టైరోసిన్ నుంచి థైరాక్సిన్, ఎపినెఫ్రిన్, ట్రిప్టోఫాన్ నుంచి మెలటోనిన్.

న్యూరోట్రాన్స్‌మీటర్ల ఉత్పత్తి: అమైనో ఆమ్లాలు న్యూరోట్రాన్స్‌మీటర్ల సంశ్లేషణలో పాత్ర వహిస్తాయి.

ఉదా: ట్రిప్టోఫాన్ నుంచి సెరటోనిన్, ఫినైల్‌అలనైన్ లేదా టైరోసిన్ నుంచి డోపమైన్, నోరెపినెఫ్రిన్.

శక్తి ఉత్పత్తి: అమైనో ఆమ్లాలు గ్లూకోనియోజెనెసిస్ ద్వారా గ్లూకోజ్‌ను ఉత్పత్తి చేసి శక్తిని అందిస్తాయి.

ఉదా: అలనైన్, గ్లూటామైన్ శక్తి ఉత్పత్తిలో ఉపయోగపడతాయి.

ఇమ్యూన్ సిస్టం–సహాయం: అమైనో ఆమ్లాలు యాంటీబాడీల తయారీలో పాల్గొంటాయి. ఇవి రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి.

ఉదా: గ్లూటామైన్ రోగనిరోధక కణాలకు శక్తిని అందిస్తుంది.

డిటాక్సిఫికేషన్: కొన్ని అమైనో ఆమ్లాలు శరీరంలో విష పదార్థాలను తొలగించడంలో సహాయపడతాయి.

ఉదా: గ్లైసిన్, సిస్టీన్ గ్లూటాథయోన్ (ఒక యాంటీఆక్సిడెంట్) సంశ్లేషణలో పాల్గొంటాయి.

కణ నిర్మాణం, రిపేర్: అమైనో ఆమ్లాలు కణాల నిర్మాణంలో, కణ గోడలు, కణ త్వచాల మరమ్మతులో సహాయపడతాయి.

ఉదా: ప్రోలిన్, లైసిన్ కొల్లాజెన్ తయారీలో కీలకం.

నైట్రోజన్ జీవక్రియ: అమైనో ఆమ్లాలు నైట్రోజన్ జీవక్రియలో పాల్గొని, యూరియా సైకిల్‌లో సహాయపడతాయి.

ఉదా: ఆర్జినిన్ యూరియా సంశ్లేషణలో పాత్ర వహిస్తుంది.

721 Word of the Day

Blithe

Telugu meaning: అత్యుత్సాహం గల, హంగామా

English meaning: The word blithe (బ్లైత్) is an adjective that describes someone who is cheerful, carefree, or showing a lack of proper concern.

Synonyms: Cheerful, Joyful

Antonyms: Worried, Gloomy

Usage: **1.** Her blithe attitude towards deadlines often frustrates her more serious coworkers.

2. The children danced around in blithe spirits, unaware of the approaching storm.

కరెంట్ అఫైర్స్ - వీడియో లెసన్

పోటీపరీక్షల్లో కీలకమైన కరెంట్ అఫైర్స్‌ను ఈనాడు ఈప్రతిభ ఇప్పుడు వీడియో లెసన్ రూపంలోనూ మీకు అందిస్తోంది. వారంలో జరిగిన ముఖ్య సంఘటనలను అంశాల వారీగా మీ ముందుకు తీసుకువచ్చింది. ఇవేకాకుండా వీటి నుంచి ఎలాంటి ప్రశ్నలు అడగొచ్చు, ప్రశ్నా సరళి, వేటిని గుర్తుంచుకోవాలనే అంశాలను మీకు అందిస్తోంది. 2025, జులై 1 నుంచి 7 వరకు జరిగిన ముఖ్యమైన విషయాలకు సంబంధించిన వీడియో 'ఈనాడు ఈప్రతిభ' యూట్యూబ్ ఛానల్‌లో అందుబాటులో ఉంది. చూసేందుకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..

నో టి ఫి కే ష న్స్

టీయూఎఫ్ఐడీసీలో ఉద్యోగాలు

తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీయూఎఫ్ఐడీసీ) వివిధ విభాగాల్లో అర్బన్ ప్లానర్, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎక్స్‌పర్ట్, అసోసియేట్ అకౌంటెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 12. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ 2025 జులై 31.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (జులై 25) చివరి తేదీ

- ఎన్ఐఈఎల్ఐటీలో 83 ఫ్యాకల్టీ పోస్టులు. డిగ్రీ, బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.
- ఎడ్‌సిల్ లిమిటెడ్‌లో కన్సల్టెంట్ పోస్టులు. బీఈ/ బీటెక్/ బీసీఏ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

స్టడీ - జోన్

భారతదేశంలో టాప్-10 అతిపెద్ద జాతీయ ఉద్యానవనాలు

అడవులు వివిధ రకాల జంతువులు, మొక్కలు - వృక్షాలకు నిలయం. భూమిపై పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడటంలో ఇవి ముఖ్యపాత్ర పోషిస్తాయి. అయితే ప్రస్తుతం వాతావరణ మార్పులు, మానవ చర్యల ఫలితంగా అడవులు తరిగిపోతున్నాయి. దీంతో ప్రకృతి సంపదకు నష్టం వాటిల్లుతోంది. వన్యప్రాణులకు నివాసం లేక, జనావాసాల్లోకి వచ్చి ప్రమాదాలకు గురవుతున్నాయి. వేట, వన్యప్రాణుల అక్రమ రవాణా వల్ల కూడా ఇవి అంతరించిపోతున్నాయి. ఇది జీవవైవిధ్యానికి తీవ్ర ముప్పుగా పరిణమిస్తోంది.



- వన్యప్రాణులు, సహజ వృక్ష సంపద రక్షణ కోసం ప్రభుత్వం జాతీయ పార్కులు, వన్యప్రాణుల అభయారణ్యాలు, జీవావరణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. చెరువులు, సరస్సులు, చిత్తడి ప్రాంతాలను అభివృద్ధి చేస్తోంది.
- ఏదైనా భౌగోళిక ప్రాంతాల్లో మానవ కార్యకలాపాల వల్ల అంతరించిపోయే దశలో ఉన్న వన్యప్రాణులు, ప్రకృతి సంపదను రక్షించేందుకు ఏర్పాటు చేసిన ఆవాసాలు/రక్షిత ప్రాంతాలను జాతీయ పార్కులు అంటారు. వీటికి నిర్ణీత సరిహద్దులు ఉంటాయి. ఈ హద్దులను పార్లమెంట్ నిర్ణయిస్తుంది. వీటిల్లో ప్రైవేట్ కార్యకలాపాలు నిషేధం. అంటే వంట చెరకు సేకరణ, పశువులను మేపడం, అటవీ ఉత్పత్తులను సేకరించడం, వ్యవసాయ కార్యకలాపాలు చేయకూడదు.
- వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఐఐ)కి చెందిన నేషనల్ వైల్డ్ లైఫ్ డేటాబేస్ సెంటర్ ప్రకారం, భారతదేశంలో 106 జాతీయ ఉద్యానవనాలు ఉన్నాయి. అవి మొత్తం 44,402.95 చ.కి.మీ. ఇది దేశంలోని భౌగోళిక ప్రాంతంలో 1.35%.
- మన దేశంలో అత్యధిక జాతీయ పార్కులు ఉన్న రాష్ట్రం - మధ్యప్రదేశ్ (11), కేంద్రపాలిత ప్రాంతం - అండమాన్ నికోబార్ దీవులు (9).


భారతదేశంలో టాప్–10 అతిపెద్ద జాతీయ ఉద్యానవనాలను పరిశీలిస్తే..

నేషనల్ పార్క్	విస్తీర్ణం (చ.కి.మీ.)	రాష్ట్రం/ కేంద్రపాలిత ప్రాంతం
హెమిస్	4400	లద్దాఖ్
డిసెర్ట్	3162	రాజస్థాన్
సిమ్లిపాల్	2750	ఒడిశా
గంగోత్రి	2390	ఉత్తరాఖండ్
నమ్దఫా	1985.23	అరుణాచల్ ప్రదేశ్
కాంచన్‌జంగ్	1784	సిక్కిం
గురు ఘాసిదాస్	1440	ఛత్తీస్‌గఢ్
గిర్ ఫారెస్ట్	1410.30	గుజరాత్
సుందర్‌బన్స్	1330.10	పశ్చిమ బెంగాల్
జిమ్ కార్బెట్	1380	ఉత్తరాఖండ్

జనరల్ స్టడీస్ - రసాయనశాస్త్రం

కాంతి రసాయన శాస్త్రం - క్వాంటం దక్షత

ఒక పదార్థంతో కాంతి పరస్పర చర్య జరపడం వల్ల కలిగే భౌతిక మార్పు లేదా రసాయనిక మార్పును అధ్యయనం చేసే రసాయనశాస్త్ర శాఖను 'కాంతి రసాయన శాస్త్రం' అంటారు. కాంతి భౌతిక ప్రక్రియలు, నియమాలు, రసాయన చర్యలపై పలువురు శాస్త్రవేత్తలు తమ అభిప్రాయాలు వెల్లడించారు. పోటీపరీక్షార్థులు ప్రతిదీప్తి, స్ఫురదీప్తి, ఉత్తేజిత సింగ్లెట్, ట్రిప్లెట్ స్థితులు తదితర అంశాలపై అవగాహన ఏర్పర్చుకోవాలి.



క్వాంటం ప్రాప్తి

ఒక కాంతి రసాయన చర్యలో క్రియాజనక అణువులు శోషించుకున్న కాంతిని ఎంత సమర్థవంతంగా ఉపయోగించుకుంటాయో తెలిపే కొలమానమే క్వాంటం ప్రాప్తి. దీన్నే క్వాంటం దక్షత అని పిలుస్తారు.

వికిరణ ఉద్గార రహిత పరివర్తనాలు

- కాంతి భౌతిక ప్రక్రియల ద్వారా ఉత్తేజిత అణువు ఎలాంటి రసాయనిక మార్పునకు గురికాకుండా శోషించుకున్న శక్తిని ఉష్ణం లేదా కాంతి రూపంలో ఉద్గారించి తిరిగి భూస్థాయికి చేరుకుంటుంది.

వికిరణ ఉద్గార పరివర్తనాలు

- ఉత్తేజిత అణువు శోషించిన వికిరణ శక్తిని తిరిగి కాంతి రూపంలో విడుదల చేసి భూస్థాయికి చేరడాన్ని వికిరణ ఉద్గార పరివర్తనం అంటారు.

కాంతి రసాయన చర్యల క్వాంటం దక్షతలు, అణువులోని వివిధ ఎలక్ట్రానిక్ స్థితులు, వాటి భ్రమణ బాహుళ్యత, జబ్లోన్స్‌కీ చిత్రం మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో ఈ–బుక్ రూపంలో 'జనరల్ స్టడీస్ ఈ–బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

The founder of Rashtrakuta dynasty...

Current Affairs

1. The 97th Foundation Day of which premier agricultural research organization was celebrated in New Delhi?
A) ICMR B) CSIR
C) ICAR D) ISRO

2. Dr. Aniesrani Delfiya, D.S., received the prestigious NAAS Young Scientist Award 2025 for her contributions in which field?
A) Crop Genetics B) Animal Nutrition
C) Agricultural Engineering and Technology
D) Plant Pathology

3. Which country's parliament recently approved Yuliia (Yulia) Svyrydenko as its new Prime Minister, marking the first significant cabinet change since the 2022 invasion?
A) Poland B) Czech Republic
C) Ukraine D) Belarus

4. Which union public institution recently launched India's first indigenous advanced carbon fibre foot prosthesis, expected to cost less than Rs.20,000?
A) ISRO & AIIMS Delhi
B) DRDO & AIIMS Bibinagar
C) DRDL & AIIMS Patna
D) ICMR & AIIMS Mumbai

5. International Nelson Mandela Day is observed annually on which date?
A) 13 November B) 18 July
C) 10 December D) 5 May

6. Which of the following institutions recently launched "YD One", India's lightest indigenously developed active wheelchair?
A) Indian Institute of Science (IISc) Bangalore
B) Indian Institute of Technology (IIT) Delhi
C) Indian Institute of Technology (IIT) Bombay
D) Indian Institute of Technology (IIT) Madras

History

7. The Prarthana Samaj, founded in Bombay in 1867, was established by which reformer?
A) Waman Abaji Modak
B) Dadoba Pandurang
C) Mahadev Govind Ranade
D) Atmaram Pandurang

8. Who is popularly known as the "Morning Star of Indian Renaissance"?
A) Swami Vivekananda
B) Ishwar Chandra Vidyasagar

SSC Exams Special

General Awareness

C) Raja Rammohan Roy
D) Dayanand Saraswati

9. Who is regarded as the founder of the League of Nations?
A) Winston Churchill
B) Franklin D. Roosevelt
C) Woodrow Wilson
D) Harry S. Truman

10. Lala Lajpat Rai presided over the Indian National Congress session held at Calcutta in which year?
A) 1916 B) 1920
C) 1923 D) 1919

11. Who among the following was the founder of Rashtrakuta dynasty?
A) Krishna-I B) Dantidurga
C) Amoghavarsha D) Krishna - III

General Knowledge

12. Veer Savarkar International Airport is located in which union territory of India?
A) Lakshadweep
B) Puducherry C) Goa
D) Andaman and Nicobar Islands

13. The Gobi Desert, one of the largest deserts in the world, is primarily located in which country?
A) Pakistan B) Kazakhstan
C) Mongolia D) India

14. Who is the author of the book "Declared"?
A) Ricky Ponting B) Brendon McCullum
C) Michael Clarke D) AB de Villiers

15. Champaner-Pavagadh Archaeological Park, a UNESCO World Heritage Site, is located in which Indian state?
A) Rajasthan B) Madhya Pradesh
C) Uttar Pradesh D) Gujarat

16. What is the name of the famous folk drama of Bhils?
A) Jatra B) Gavari
C) Tamasha D) Yakshagana

General Science

17. What does the scientific field of Myrmecology focus on?
A) Reptiles B) Ants C) Fungi D) Birds

18. Which bacterium causes the plague, and what are its main forms based on the part of the body affected?
A) Salmonella typhi - affects intestines
B) Yersinia pestis - affects lymph nodes, blood, and lungs
C) Mycobacterium tuberculosis - affects lungs
D) Vibrio cholerae - affects intestines

19. What is the scientific name of the domestic cow?
A) Bos grunniens B) Bos indicus
C) Bos taurus D) Bison bison

20. What does Trichology refer to the study of?
A) Skin and nails
B) Bones and joints
C) Hair and scalp
D) Cells and tissues

Scan the QR code for Key

These model questions were prepared by subject experts.

ఐసెట్

నీట్

మాక్ కౌన్సెలింగ్ 2025



కరెంట్ అఫైర్స్



■ ప్రఖ్యాత కొడైకెనాల్ సోలార్ అబ్జర్వేటరీని ఏర్పాటు చేసి ఎన్ని సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఇటీవల భారత తపాల శాఖ ఓ స్మారక స్టాంపును విడుదల చేసింది? **జ:** 125 (1899లో ఏర్పాటు చేసిన కొడైకెనాల్ సోలార్ అబ్జర్వేటరీ 125వ వార్షికోత్సవం 2024, ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమైంది.)

మాదిరి ప్రశ్నలు

■ భారత దేశ విస్తారమైన మాన్యుస్క్రిప్ట్ వారసత్వాన్ని కాపాడే లక్ష్యంతో 2025, జూన్ 9న పునరుద్ధరించిన నేషనల్ మాన్యుస్క్రిప్ట్స్ మిషన్ (ఎన్.ఎం.ఎం.) ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఏ పేరుతో ప్రారంభించారు? (2025, కేంద్ర బడ్జెట్‌లో దీనికి రూ.60 కోట్లను కేటాయించారు. విద్యాసంస్థలు, గ్రంథాలయాలు, మ్యూజియాలు, ప్రైవేట్ సేకరణల్లో ఉన్న ఒక కోటి కంటే ఎక్కువ మాన్యుస్క్రిప్ట్‌లను సర్వే, డాక్యుమెంట్, డిజిటలైజ్ చేయడం, సంరక్షించడం ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యాలు.) **జ:** జ్ఞాన్ భారతం మిషన్

■ అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? (ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ మ్యూజియమ్స్ (ఐఓఎం) ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. 'ద ఫ్యూచర్ ఆఫ్ మ్యూజియమ్స్ ఇన్ ర్యాపిడ్లీ ఛేంజింగ్ కమ్యూనిటీస్' అనే థీమ్‌తో ఈ ఏడాది దినోత్సవాన్ని నిర్వహించారు.) **జ:** మే 18

మరింత సమాచారం

ఆధునిక యుద్ధతంత్రంలో అద్భుత అస్త్రాలు!

జనరల్ స్టడీస్

సైన్స్ అండ్ టెక్నాలజీ



దేశాల మధ్య ఇప్పుడు సంప్రదాయ యుద్ధాలు తెరమరుగవుతూ, అన్నీ సాంకేతిక సమరాలే జరుగుతున్నాయి. ఆధునిక యుద్ధతంత్రంలో క్షిపణులే ప్రధాన ఆయుధాలుగా అవతరించాయి. స్వల్ప వ్యవధిలోనే సుదూర ప్రాంతాలకు దూసుకెళ్లి పెను విధ్వంసాన్ని సృష్టిస్తున్న క్షిపణులు, వాటిలో రకాలు, వాడే సాంకేతికతపై పోటీ పరీక్షార్థులకు కనీస అవగాహన ఉండాలి. క్షిపణి టెక్నాలజీలో భారత్ ప్రగతి ప్రస్థానం, దేశీయ పరిజ్ఞానంతో రూపొందించుకున్న వివిధ శ్రేణుల క్షిపణులు, వాటి సామర్థ్యాలను గుర్తుంచుకోవాలి. ప్రపంచం దృష్టిని ఎక్కువగా ఆకర్షిస్తూ, నిత్యం వార్తల్లో నిలుస్తున్న ఆ అద్భుత అస్త్రాల గురించి తెలుసుకోవాలి.

క్షిపణులు

సుదూరం నుంచే గమ్యాన్ని ఛేదించ గలిగే ఆయుధాలే క్షిపణులు. ప్రయోగించే వారికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. కానీ శత్రువులకు మాత్రం భారీ నష్టాన్ని కలిగిస్తాయి. ఆధునిక యుద్ధాల్లో ఈ అస్త్రాలు అత్యంత కీలకంగా మారాయి. ఇప్పుడు క్షిపణులను అభివృద్ధి చేసుకున్న దేశాలదే యుద్ధ రంగంలో పైచేయి అవుతోంది. భారత్ క్షిపణుల అభివృద్ధిలో స్వయంసమృద్ధిని సాధించింది. ఇటీవల పాకిస్థాన్‌తో జరిగిన సైనిక ఘర్షణలోనూ దేశం ఆధిక్యతకు ప్రధాన కారణం స్థానికంగా అభివృద్ధి చేసుకున్న క్షిపణులే. ఈ విజయంతో ఇతర దేశాలు కూడా భారత క్షిపణుల కొనుగోలుకు ముందుకు వస్తున్నాయి.

నిర్వచనం: సొంత ఇంజిన్‌తో ఎగురుకుంటూ దూరాలకు ప్రయాణించగలిగే ఆయుధాన్ని 'క్షిపణి'అని పేర్కొంటారు. ఇందులో సాధారణంగా 'జెట్ ఇంజిన్' లేదా 'రాకెట్ ఇంజిన్' ఉంటుంది. ప్రస్తుతం అధునాతన రామ్‌జెట్, స్క్రామ్ జెట్ ఇంజిన్‌లను వాడుతున్నారు. ఈ రెండింటిని 'ఎయిర్ బ్రీతింగ్ ఇంజిన్‌లు' అంటారు. అంటే ఇవి ఇంధనాన్ని మండించడానికి గాలి నుంచి ఆక్సిజన్‌ను తీసుకుంటాయి. దీనివల్ల ఎక్కువ బరువు ఉన్న ఆయుధాలను తీసుకెళ్లగలుగుతాయి. సాధారణం కంటే ఎక్కువ దూరం ప్రయాణిస్తాయి.

రామ్‌జెట్ ఇంజిన్ వల్ల క్షిపణి సూపర్ సోనిక్ వేగంతో వెళుతుంది. స్క్రామ్ జెట్ ఇంజిన్ వల్ల హైపర్ సోనిక్ వేగాన్ని పొందుతుంది. ఈ రెండింటి కలయికతో ఏర్పడిన మరో ఇంజిన్ 'డ్యూయల్ మోడ్ రామ్‌జెట్ ఇంజిన్'. దీంతో క్షిపణి మొదట రామ్‌జెట్ వేగాన్ని, ఆ తర్వాత స్క్రామ్ జెట్ వేగాన్ని అందుకుంటుంది.



రామ్‌జెట్ ఇంజిన్

క్షిపణిలో వాడే ఇంధనాలు

క్షిపణుల్లో ఘన, ద్రవ ఇంధనాలను వాడతారు. ఘన ఇంధనాలు ఉండటం వల్ల క్షిపణులను తేలికగా నిల్వ చేయవచ్చు. ద్రవ ఇంధనాలున్న క్షిపణులను సులభంగా నిల్వ చేయలేం. ఘన, ద్రవ రెండూ ఉన్న ఇంధనాలను 'హైబ్రిడ్ ఇంధనాలు' అంటారు.

క్షిపణి ప్రయాణించే మార్గం

పరావలయ మార్గం లేదా లక్ష్యాన్ని అనుసరిస్తూ ప్రయాణిస్తాయి. క్షిపణుల ప్రయాణ మార్గం ఆధారంగా వాటిని బాలిస్టిక్ క్షిపణులు, క్రూయిజ్ క్షిపణులుగా వర్గీకరించవచ్చు.



అగ్ని

బాలిస్టిక్ క్షిపణులు: ఇవి రాకెట్ ఇంజిన్‌లను కలిగి ఉంటాయి. ప్రారంభంలో గాలిలో నిట్టనిలువుగా భూమి ఆకర్షణకు వ్యతిరేకంగా ప్రయాణిస్తాయి. నిర్ణీత ఎత్తును చేరిన తర్వాత భూమి ఆకర్షణ దిశలో ప్రయాణించి లక్ష్యాల వైపు దూసుకెళ్లి పేలుడు పదార్థాలను జారవిడుస్తాయి. ఈ రకమైన క్షిపణులను సాధారణంగా నేలపై నుంచి ప్రయోగించి నేలపై ఉన్న లక్ష్యాలను ఛేదించడానికి ఉపయోగిస్తారు. ఇవి ఎక్కువ ఎత్తులో ప్రయాణిస్తాయి. వీటిని రాడార్‌ల ద్వారా గుర్తించడం తేలిక. వీటి ద్వారా ఒకేసారి అనేక లక్ష్యాలపై దాడి చేయవచ్చు. ఖండాంతర క్షిపణులు బాలిస్టిక్ క్షిపణులకు మంచి ఉదాహరణగా పేర్కొనవచ్చు.



పృథ్వీ

భారతదేశం అభివృద్ధి చేసిన బాలిస్టిక్ క్షిపణులు అగ్ని, పృథ్వీ. వీటిలో అగ్ని-V ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి.

క్రూయిజ్ క్షిపణులు: ఇవి తక్కువ ఎత్తులో ప్రయాణిస్తాయి. వీటిని రాడార్‌లు తేలికగా గుర్తించలేవు. ఇవి భూవాతావరణంలోనే ప్రయాణించి లక్ష్యాలను ఛేదిస్తాయి. జెట్ ఇంజిన్ లేదా టర్బోజెట్ ఇంజిన్‌ను కలిగి ఉంటాయి. బాలిస్టిక్ క్షిపణులతో పోలిస్తే ఇవి లక్ష్యాన్ని కచ్చితత్వంతో ఛేదిస్తాయి. ఇవి సాధారణ, అణుబాంబులను మోసుకెళతాయి. ఈ రకమైన క్షిపణులను రాడార్‌లు, ఇతర విధానాల ద్వారా నియంత్రించవచ్చు. తక్కువ దూరం వెళ్లగలిగే ఈ క్షిపణులను కదులుతున్న లక్ష్యాలైన శత్రుదేశాల యుద్ధ విమానాలు, క్షిపణులు, డ్రోన్‌లను కూల్చడానికి ప్రయోగిస్తారు. క్రూయిజ్ క్షిపణులను అన్ని రకాలుగా అంటే నేలపై నుంచి, విమానాల నుంచి, నౌకల నుంచి ప్రయోగించవచ్చు.

క్షిపణుల లక్ష్యాలు

1) **వ్యూహాత్మక లక్ష్యాలు:** భూమిపై ఉన్న లక్ష్యాలైన వంతెనలు, మిలిటరీ స్థావరాలు, ఇంధన నిల్వలు, విద్యుత్తు కేంద్రాలు, ఎయిర్ బేస్‌లు లాంటివి వీటికి ఉదాహరణలుగా చెప్పవచ్చు. వీటిని 'స్థిర లక్ష్యాలు' అంటారు.

2) **కదిలే లక్ష్యాలు:** శత్రుదేశాల యుద్ధ విమానాలు, హెలికాప్టర్‌లు, క్షిపణులు, డ్రోన్‌లు లాంటివి వీటికి ఉదాహరణ.

ప్రయాణించే దూరం ఆధారంగా క్షిపణుల రకాలు

1) **తక్కువ దూరం ప్రయాణించే బాలిస్టిక్ క్షిపణులు:** వీటి దూరం 1000 కి.మీ. కంటే తక్కువగా ఉంటుంది. **ఉదా:** అగ్ని-1.

2) **మధ్య శ్రేణి (మీడియం రేంజ్) బాలిస్టిక్ క్షిపణులు:** ఇవి 1000 కి.మీ. నుంచి 3000 కి.మీ. వరకు వెళ్లగలవు. **ఉదా:** అగ్ని-2.

3) **ఇంటర్మీడియట్ రేంజ్ బాలిస్టిక్ క్షిపణులు:** వీటి పరిధి 3000 కి.మీ. నుంచి 5500 కి.మీ. వరకు ఉంటుంది. **ఉదా:** అగ్ని-4.

4) **ఖండాంతర క్షిపణులు (ఇంటర్‌కాంటినెంటల్ బాలిస్టిక్):** ఇవి ప్రయాణించే దూరం 5,500 నుంచి 10,000 కి.మీ. వరకు ఉంటుంది.

ఉదా: అగ్ని-5, అగ్ని-6.



క్షిపణిలో అమర్చిన ఆయుధాల ఆధారంగా రకాలు

1) సాధారణ ఆయుధాలను లేదా సంప్రదాయ ఆయుధాలైన రసాయనిక పేలుడు పదార్థాలను తీసుకెళ్లేవి.

2) రేడియోధార్మిక పదార్థాలైన అణుబాంబులను మోసుకెళ్లేవి.

ప్రయోగించే విధానం ఆధారంగా క్షిపణుల రకాలు

1) **ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించేవి:** వీటిని నేలపై నుంచి ప్రయోగించి ఉపరితలం లక్ష్యాలైన సైనిక స్థావరాలు, నౌకాశ్రయాలు, వైమానిక స్థావరాలు లాంటి వాటిని ధ్వంసం చేయడానికి వాడతారు. అగ్ని, పృథ్వీ లాంటివి వీటికి ఉదాహరణలు.

2) **ఉపరితలం నుంచి గాలిలోకి ప్రయోగించేవి:** ఈ రకమైన క్షిపణులను నేలపై నుంచి ప్రయోగించి గాలిలో ఉన్న శత్రుదేశ విమానాలు, క్షిపణులు, డ్రోన్లు, హెలికాప్టర్లను నాశనం చేయడానికి ఉపయోగిస్తారు. **ఉదా:** త్రిశూల్ క్షిపణి.

3) **గాలి నుంచి గాలిలోకి ప్రయోగించేవి:** వీటిని విమానాల నుంచి ప్రయోగించి శత్రుదేశాల విమానాలు, డ్రోన్లను కూల్చడానికి వాడతారు. ఉదా: అస్త్ర క్షిపణి. దీన్ని సుఖోయ్ యుద్ధవిమానం నుంచి ప్రయోగిస్తారు. ఈ క్షిపణిని 'బియాండ్ విజువల్ రేంజ్ క్షిపణి' అంటారు.

4) **సముద్రం నుంచి ఉపరితలానికి ప్రయోగించేవి:** వీటిని యుద్ధనౌకలు లేదా జలాంతర్గాముల నుంచి ప్రయోగించి నేలపై ఉన్న లక్ష్యాలను ఛేదిస్తారు. ఉదా: కె-15 క్షిపణి. దీన్ని 'సాగరిక' అని కూడా అంటారు. దీన్ని ఐఎన్ఎస్-అరిహంత్ జలాంతర్గామిలో ఉంచారు.

5) **గాలి నుంచి ఉపరితలానికి ప్రయోగించేవి:** ఈ రకమైన క్షిపణులను హెలికాప్టర్ లేదా యుద్ధవిమానాల నుంచి ప్రయోగించి నేలపై ఉన్న శత్రుదేశాల లక్ష్యాలను నాశనం చేయడానికి వాడతారు. బ్రహ్మోస్ క్షిపణుల్లో ఒక రకం దీనికి ఉదాహరణ.



6) **ఉపరితలం నుంచి సముద్రం పైకి ప్రయోగించేవి:** వీటిని నేలపై నుంచి ప్రయోగించి సముద్రంలోని శత్రుదేశాల యుద్ధనౌకలు నాశనం చేయడానికి వాడతారు.


7) **సముద్రం నుంచి సముద్రంపైకి ప్రయోగించేవి:** వీటిని యుద్ధనౌకలు లేదా జలాంతర్గామి నుంచి ప్రయోగించి శత్రుదేశాల యుద్ధనౌకలను నాశనం చేస్తారు.

యాంటీ రేడియేషన్ క్షిపణి: ఈ క్షిపణి అన్నింటి కంటే ప్రత్యేకమైంది. ఇది శత్రుదేశాల రాడార్ వ్యవస్థలు, నిఘా పరికరాలు, వ్యవస్థలను ధ్వంసం చేస్తుంది. మాక్-2 వేగం ఉన్న ఈ క్షిపణిని సుఖోయ్-30 ఎంకేఐ యుద్ధవిమానం నుంచి ప్రయోగిస్తారు. భారత్ వద్ద ఉన్న ఈ తరహా క్షిపణి రుద్రం-1..



ట్యాంకు విధ్వంసక క్షిపణులు: వీటితో యుద్ధరంగంలో శత్రుదేశాల ట్యాంకులను ధ్వంసం చేస్తారు. భారత్ వద్ద పలురకాల ట్యాంకు విధ్వంసక క్షిపణులు ఉన్నాయి.

1) **నాగ్:** ఇది ఫైర్ అండ్ ఫర్‌గెట్ రకం క్షిపణి. ఎనిమిది కిలోల పేలుడు పదార్థాలను మోసుకెళుతుంది. పరిధి 4 కి.మీ. ఇటీవల మూడో తరానికి చెందిన మనిషి మోసుకెళ్లగలిగే యాంటీ ట్యాంకు గైడెడ్ క్షిపణిని రూపొందించారు. పరిధి 2.5 కి.మీ.



2) **అమోఘ:** భారత్ డైనమిక్స్ లిమిటెడ్ సంస్థ దీనిని రూపొందించింది. ఇది మూడో తరానికి చెందిన యాంటీ ట్యాంకు క్షిపణి. పరిధి 2.5 కి.మీ.

3) **ధ్రువాస్త్ర:** వైమానిక దళం ఉపయోగించే ట్యాంకు విధ్వంసక క్షిపణి. ఇది మూడో తరానికి చెందింది. పరిధి 7 కి.మీ. అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ నుంచి ప్రయోగించవచ్చు.

4) **హెలీనా:** హెలికాప్టర్ నుంచి ప్రయోగించే నాగ్ క్షిపణిని హెలీనా అని పిలుస్తారు. ఇది పదాతి దళం ఉపయోగించే ట్యాంకు విధ్వంసక క్షిపణి. దీని పరిధి 7- 8 కి.మీ. 3 కిలోల పేలుడు పదార్థాలు తీసుకెళుతుంది.

5) **మిలన్–2టీ:** రెండో తరానికి చెందిన మనిషి మోసుకెళ్లగలిగే ట్యాంకు విధ్వంసక క్షిపణి.



రచయిత: డాక్టర్ బి. నరేశ్

అతడే చరిత్రలో మొదటి పితృహంతకుడు!

ప్రాచీన భారతదేశంలోని మహాజనపదాల్లో మగధ శక్తిమంతమైంది. సహజవనరుల అనుకూలతలకు తోడు పాలకుల పరాక్రమంతో ఉపఖండమంతా విస్తరించి తొలి మహా సామ్రాజ్యంగా అవతరించింది. హర్యంక, శిశునాగ, నంద, మౌర్య వంశాలు పాలించిన మగధలో శాస్త్రీయ, సాంస్కృతిక, మతపరమైన వికాసం జరిగింది. హిందూ పురాణాలు, బౌద్ధ, జైన మత గ్రంథాలతోపాటు పలు చారిత్రక, సాహిత్య ఆధారాలు వెల్లడించిన ఈ సామ్రాజ్య వైభవం, నాటి పరిస్థితుల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. వంశాల వారీగా మగధ పాలకుల క్రమం, వారి విశిష్టతలు, చేసిన యుద్ధాలు, సాధించిన విజయాలతో పాటు చరిత్రలో గొప్ప పాలకుడైన అశోకుడు వేయించిన శాసనాల వివరాలనూ తెలుసుకోవాలి.

మగధ సామ్రాజ్యం

భారతదేశ చరిత్ర

1. చంద్రగుప్త మౌర్యుడు నంద రాజులపై చేసిన తిరుగుబాటు కథాంశంగా ఉన్న గ్రంథం?
   1) కౌటిల్యుడు - అర్థ శాస్త్రం
   2) విశాఖదత్తుడు - ముద్రారాక్షసం
   3) పతంజలి - మహాభాష్యం
   4) మాండలీన్ - స్లేడ్

2. మౌర్య వంశస్థాపకుడు చంద్రగుప్త మౌర్యుడి గురించి సరైనవి గుర్తించండి.



   ఎ) క్రీస్తు పూర్వం 321లో మౌర్య సామ్రాజ్యాన్ని స్థాపించాడు.
   బి) ఇతడు 'మొరియా' తెగకు చెందినవాడు.
   సి) జైన, బౌద్ధ మత గ్రంథాల ప్రకారం మౌర్యులు క్షత్రియులు.
   డి) పురాణాల ప్రకారం చంద్రగుప్త మౌర్యుడు శూద్ర వంశానికి చెందినవాడు.
   1) ఎ, బి, డి　2) ఎ, బి, సి, డి
   3) ఎ, బి, సి　4) ఎ, డి

3. కింది వాటిని జతపరచండి.

రచయితలు	గ్రంథాలు
1) ప్లినీ	ఎ) ఇండికా
2) ప్లూటార్క్	బి) ది లైవ్స్
3) టాలమీ	సి) నేచురల్ హిస్టరీ
4) మెగస్తనీస్	డి) జాగ్రఫీ


   1) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి
   2) 1-సి, 2-బి, 3-డి, 4-ఎ
   3) 1-డి, 2-సి, 3-ఎ, 4-బి
   4) 1-ఎ, 2-బి, 3-డి, 4-సి

4. కింది వాటిలో అశోకుడి గురించి తెలుసుకోవడానికి ఆధారమైన స్వదేశీ గ్రంథాలు, వాటి రచయితలను జతపరచండి.

1) రాజతరంగిణి	ఎ) విశాఖదత్తుడు
2) పరిశిష్ట పర్వన్	బి) హేమచంద్ర
3) ముద్రారాక్షసం	సి) సోమదేవుడు
4) కథాకవితా సాగరం	డి) కల్హణుడు

   1) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి
   2) 1-సి, 2-బి, 3-ఎ, 4-డి
   3) 1-సి, 2-బి, 3-డి, 4-ఎ
   4) 1-డి, 2-సి, 3-ఎ, 4-బి

5. కౌటిల్యుడి అర్థశాస్త్రం గురించి సరైనవి గుర్తించండి.



   ఎ) కౌటిల్యుడిని 'చాణుక్యుడు', 'విష్ణుగుప్తుడు' అంటారు.
   బి) తంజావూర్ వద్ద 1905లో దొరికిన సంస్కృతంలో రాసి ఉన్న అర్థ శాస్త్రాన్ని ఆంగ్లంలోకి అనువదించినవారు ఆర్.శ్యామ శాస్త్రి.
   సి) అర్థశాస్త్రం అనే గ్రంథంలో 15 అధికరణలు, 180 ప్రకరణలుంటాయి.
   డి) మౌర్యుల కాలంలో ఉన్న ధర్మసేయ అనే పౌర న్యాయస్థానం, కంఠక శోధన అనే క్రిమినల్ న్యాయస్థానాల గురించి ఉంది.
   1) ఎ, బి, సి　2) ఎ, బి, సి, డి
   3) ఎ, బి, డి　4) ఎ, సి, డి

6. 'ఇండికా' గ్రంథం గురించి సరైన అంశాలను గుర్తించండి.
   ఎ) ఈ గ్రంథాన్ని రచించింది గ్రీకు దేశానికి సెల్యూకస్ నికేటర్ రాయబారి మెగస్తనీస్.
   బి) ఈ గ్రంథం నేడు అందుబాటులో లేదు.
   సి) ఇందులో చంద్రగుప్త మౌర్యుడి సైనిక వ్యవస్థ గురించి ఉంది.
   డి) మెగస్తనీస్ ప్రకారం మగధలో బానిస వ్యవస్థ లేదు.
   1) ఎ, బి, సి, డి　2) ఎ, సి
   3) ఎ, సి, డి　4) ఎ, బి, డి

7. కింది వారిలో జునాగఢ్ శాసనం వేయించింది?
   1) అశోకుడు　2) చంద్రగుప్త మౌర్యుడు
   3) రుద్రదమనుడు　4) బిందుసారుడు

8. కింది వాటిలో చంద్రగుప్త మౌర్యుడు, సెల్యూకస్ నికేటర్‌తో జరిగిన యుద్ధంతో సంబంధం లేనిది?
   1) వీరి మధ్య యుద్ధం క్రీ.పూ.305లో జరిగింది.
   2) వీరి మధ్య సంధి క్రీ.పూ.303లో జరిగింది.
   3) సెల్యూకస్ నికేటర్ రాయబారిగా మెగస్తనీస్ పాటలీపుత్రంలో చాలాకాలం ఉన్నాడు.
   4) చంద్రగుప్త మౌర్యుడు, సెల్యూకస్ నికేటర్‌కు 5000 ఏనుగులు ఇచ్చాడు.

9. సంగమ సాహిత్యం అంటే?
   1) చోళ సాహిత్యం　2) పాండ్య సాహిత్యం
   3) చేర సాహిత్యం　4) పైవన్నీ

10. బిందుసారుడి గురించి సరైన వాక్యాలను గుర్తించండి.
    ఎ) బిందుసారుడిని 'అమిత్రఘాత' అంటారు.
    బి) బిందుసారుడు అజీవక మతం ఆచరించాడు.
    సి) సిరియా రాజు ఏంటియోకస్-1తో సంబంధాలు ఉండేవి.
    డి) సిరియా రాజు రాయబారి డైమోకస్ మౌర్యుల ఆస్థానంలో ఉండేవాడు.
    1) ఎ, బి, డి　2) ఎ, బి, సి, డి
    3) ఎ, సి, డి　4) ఎ, బి

11. బిందుసారుడి కాలంలో అతడి ఆస్థానంలో ఉన్న సిరియా రాయబారి?
    1) స్ట్రాబో　2) హెరిడోటస్
    3) డైమోకస్　4) ప్లినీ

12. బిందుసారుడి కాలంలో తక్షశిల వద్ద జరిగిన తిరుగుబాటు అణచివేయడానికి వెళ్లిన యువరాజు?
    1) సుశిమా　2) మహేంద్ర
    3) అశోకుడు　4) బృహద్రదుడు

13. అశోకుడి గురించి సరైనవి గుర్తించండి.




మస్కి శాసనం

    ఎ) అశోకుడి పేరు శాసనాల్లో దేవానాం ప్రియ, ప్రియదర్శి అని పేర్కొన్నారు.
    బి) అశోకుడి పేరుతో కర్ణాటకలోని మస్కి వద్ద శాసనం ఉంది.
    సి) టిబెట్ చరిత్రకారుడు తారానాథ్ ప్రకారం అశోకుడు ఒక వైశ్య స్త్రీకి జన్మించాడు.
    డి) అశోకుడు అంటే శోకించలేనివాడు అని అర్థం.
    1) ఎ, డి　2) ఎ, బి, సి, డి
    3) బి, సి, డి　4) ఎ, బి, సి

14. 'చార్లిమేన్, కాన్‌స్టాంటన్ గురించి తెలిసిన వారి కంటే అశోకుడి గురించి తెలిసినవారే ఎక్కువ' అని అన్నదెవరు?
    1) ప్లినీ　2) హెచ్.జి.వెల్స్
    3) టాలమీ　4) ప్లూటార్క్

15. కళింగ యుద్ధం గురించి సరైనవి గుర్తించండి.



    ఎ) కళింగ అంటే నేటి ఒడిశా ప్రాంతం.
    బి) ఈ యుద్ధం గురించి 13వ శిలాశాసనం తెలుపుతుంది.
    సి) ఈ యుద్ధం అశోకుడు రాజైన ఎనిమిదేళ్లకు చేశాడు.
    డి) కళింగ యుద్ధంలో లక్షకు పైగా మరణించగా, 1,50,000 మంది బందీలయ్యారు.
    1) ఎ, బి, సి, డి　2) ఎ, బి, డి
    3) ఎ, సి　4) బి, డి

16. మగధ సామ్రాజ్య విస్తరణకు కారణాలు గుర్తించండి.
    ఎ) గంగానది పరీవాహక ప్రాంతంలో ఉండటం.
    బి) ఖనిజ వనరులు పుష్కలంగా ఉండటం.
    సి) సారవంతమైన ఒండ్రు నేలలు ఉండటం.
    డి) గొప్ప రాజులు పరిపాలించడం.
    1) ఎ, బి, సి, డి　2) బి, సి, డి
    3) ఎ, బి, సి　4) బి, సి

17. కింది వాటిలో మగధను పరిపాలించిన రాజ వంశాలను అవరోహణ క్రమంలో అమర్చండి.
    ఎ) హర్యంక　బి) శిశునాగ　సి) నంద　డి) మౌర్య
    1) ఎ, బి, సి, డి　2) డి, సి, బి, ఎ
    3) ఎ, సి, డి, బి　4) ఎ, బి, డి, సి

18. హర్యంక రాజవంశానికి సంబంధించి భిన్నమైన వారిని గుర్తించండి.
    1) ఉదయనుడు　2) శిశునాగుడు
    3) అజాత శత్రువు　4) బింబిసారుడు

19. ప్రాచీన మగధ సామ్రాజ్యంలో మొదటి రాజు?
    1) బిందుసారుడు　2) బింబిసారుడు
    3) మహాపద్మనందుడు　4) చంద్రగుప్త మౌర్యుడు

20. కింది వాటిలో అజాత శత్రువుకు సంబంధించి సరికానిది గుర్తించండి.
    1) ఇతడి బిరుదు కునిక.
    2) భారతదేశ చరిత్రలో మొదటి పితృ హంతకుడు
    3) పాటలీపుత్రం నిర్మాణం పూర్తిచేశాడు.
    4) కోసల రాజు ప్రసేనజిత్తుతో యుద్ధం చేశాడు.

21. కింది వాటిలో బింబిసారుడికి సంబంధించి సరైనవి గుర్తించండి.
    ఎ) వైశాలి రాజైన చేతకుడి కుమార్తెను వివాహం చేసుకున్నాడు.
    బి) ప్రసేనజిత్తు వద్ద నుంచి కాశీ రాజ్యం పొందాడు.
    సి) మాద్రా రాజులను ఓడించాడు.
    డి) ఇతడు బుద్ధుడికి, వర్ధమాన మహావీరుడికి సమకాలీనుడు.
    1) ఎ, బి, సి, డి　2) బి, సి, డి
    3) ఎ, బి, సి　4) బి, డి

22. క్రీ.పూ.483 లో రాజగృహ వద్ద మొదటి బౌద్ధ సమావేశం నిర్వహించిన రాజు?



    1) అజాతశత్రువు
    2) కాలాశోకుడు
    3) ఉదయనుడు
    4) అశోకుడు

23. రాజధానిని రాజగృహ నుంచి పాటలీపుత్రానికి మార్చిన హర్యంక వంశ రాజు?
    1) బిందుసారుడు　2) బింబిసారుడు
    3) ఉదయనుడు　4) అజాతశత్రువు

24. శిశునాగ వంశం గురించి సరైనవి గుర్తించండి.
    ఎ) ఈ వంశంలో రాజులు శిశునాగుడు, కాలాశోకుడు.
    బి) ఈ వంశం రాజధాని వైశాలి.
    సి) శిశునాగుడి కుమారుడు కాలాశోకుడు.
    డి) శిశునాగుడు 4వ బౌద్ధ సమావేశం నిర్వహించాడు.
    1) ఎ, బి, సి　2) బి, సి, డి
    3) ఎ, బి, సి, డి　4) ఎ, బి, డి

25. 'ఉగ్రసేనులు' అని ఏ రాజులను పిలుస్తారు?
    1) నందులు　2) శిశునాగులు
    3) హర్యంకులు　4) మౌర్యులు


26. నందవంశ రాజుల్లో గొప్పవాడు?
    1) మహా పద్మనందుడు　2) ధననందుడు
    3) అశోకుడు　4) కాలాశోకుడు

27. మహాపద్మనందుడి బిరుదు?
    1) మహక్షాంత్రక　2) ఏకవిరాట్
    3) ఉగ్రసేనుడు　4) పైవన్నీ

28. మహాపద్మనందుడి కాలంలో ప్రసిద్ధి చెందిన విశ్వవిద్యాలయం?
    1) నలంద　2) ఉజ్జయిని
    3) తక్షశిల　4) కాంచీపురం

29. ధననందుడు ఏ గ్రీకు రాజుకు సమకాలీనుడు?
    1) అలెగ్జాండర్　2) డేరియస్ - 1
    3) సైరస్ ది గ్రేట్　4) అందరూ

30. నందవంశ పరిపాలనా కాలం?
    1) క్రీ.పూ.364 - క్రీ.పూ.321
    2) క్రీ.పూ.372 - క్రీ.పూ.329
    3) క్రీ.పూ.314 - క్రీ.పూ.215
    4) క్రీ.పూ.176 - క్రీ.పూ.192



రచయిత: గద్దె నరసింహారావు

సమాధానాలు

1-2; 2-2; 3-2; 4-3; 5-2; 6-1; 7-3; 8-4; 9-4; 10-2; 11-3; 12-3; 13-2; 14-2; 15-1; 16-1; 17-2; 18-2; 19-2; 20-3; 21-1; 22-1; 23-3; 24-3; 25-1; 26-1; 27-4; 28-3; 29-1; 30-1.

ఎంబార్కేషన్ పాయింట్ కేటాయించాలి

కేంద్ర మంత్రికి సీఎం చంద్రబాబు లేఖ

ఈనాడు, అమరావతి: విజయవాడ విమానాశ్రయం నుంచి హజ్ యాత్రకు వెళ్లేందుకు వీలుగా ఎంబార్కేషన్ పాయింట్ కేటాయించాలని కోరుతూ కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజుకు సీఎం చంద్రబాబు ఇటీవల లేఖ రాశారు. ఇప్పటికే కేంద్ర హజ్ కమిటీ ప్రకటించిన ఎంబార్కేషన్ పాయింట్లలో విజయవాడకు చోటు కల్పించలేదని, 2026 హజ్ యాత్రకైనా ఎంబార్కేషన్ పాయింట్ కేటాయించాలన్నారు.

దేశంలోనే తొలి డేటా సిటీ అభివృద్ధి

విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్

ఈనాడు, అమరావతి: దేశంలోనే తొలిసారిగా విశాఖపట్నంలో డేటా సిటీని అభివృద్ధి చేస్తున్నట్లు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం ఎక్స్ వేదికగా తెలిపారు. 'ఫైబర్ స్పైన్ డేటా సెంటర్ల ఏర్పాటుకు రాష్ట్రంలో అన్ని వనరులూ ఉన్నాయి. రాబోయే ఏఐ విప్లవంలో హరిత ఇంధనం, పుష్కలమైన నీటి వనరులతో నడిచే డేటా సెంటర్లు అవసరం. రాయలసీమకు విస్తారమైన పునరుత్పాదక ఇంధనాన్ని సరఫరా చేసే సామర్థ్యం ఉంది. స్థానిక యువతకు శిక్షణ ఇచ్చి వీటి నిర్వహణకు ఉపక్రమిస్తాం' అని పేర్కొన్నారు.

◆ భారత్- బ్రిటన్ దేశాల స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేయడం చరిత్రాత్మకమని మంత్రి నారా లోకేశ్ గురువారం ఎక్స్ వేదికగా తెలిపారు.

'ఉపాధి' బకాయిలు రూ.605 కోట్లు విడుదల

ఈనాడు, అమరావతి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో శ్రామికులకు కేంద్ర ప్రభుత్వం రూ.605 కోట్ల వేతన బకాయిలు విడుదల చేసింది. ఈ మేరకు శ్రామికుల బ్యాంకు ఖాతాల్లో మూణ్నాలుగు రోజుల్లో నిధులు జమ కానున్నాయి. ఉపాధి పథకంలో పనిచేస్తున్న శ్రామికులకు కేంద్ర ప్రభుత్వం రూ.2,500 కోట్లకు పైగా వేతనాల బకాయి పడింది. ఈ ఏడాది మే 28 తర్వాత మళ్లీ ఇప్పటివరకు వేతనాలు చెల్లించలేదు. బకాయిలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖకు లేఖ రాసింది. ఈ మేరకు రూ.605 కోట్లు గురువారం విడుదలయ్యాయి. మిగతా బకాయిలు దశల వారీగా కేంద్రం విడుదల చేస్తుందని అధికారులు తెలిపారు.

హెచ్‌పీసీఎల్‌తో రాపిడో భాగస్వామ్యం

ఈనాడు, హైదరాబాద్: రాపిడో తన బైక్, క్యాబ్ కెప్టెన్ల వాహనాలకు ప్రయోజనం కల్పించేలా హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్)తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకుంది. అన్ని 'హెచ్‌పీసీఎల్ స్టేషన్ల'లో రాపిడో కెప్టెన్లకు ఇంధన ధరలో 1.25%, ల్యూబ్రికెంట్స్, వాహన కిట్‌పై 50% తగ్గింపు లభించనుంది. దీన్ని ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రారంభించామని, త్వరలో దేశంలోని 11 నగరాలకు విస్తరిస్తామని సంస్థ వెల్లడించింది. హైదరాబాద్‌లో దాదాపు 3.8 లక్షల మందికి ఇది ప్రయోజనం కల్పిస్తుందని పేర్కొంది. ఇప్పటికే 300లకు పైగా 'హెచ్‌పీసీఎల్ స్టేషన్ల'లో ఇంధన రాయితీపై లబ్ధిపొందిన, ఎంపిక చేసిన 100 కేంద్రాల్లో ల్యూబ్రికెంట్స్, వాహన కిట్‌లు లభిస్తాయని రాపిడో సెంటర్ సర్వీస్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణ చైతన్య రఘునందన్ తెలిపారు.

ఫ్లేవర్డ్ మిల్క్‌పై 5% జీఎస్టీనే వర్తింపు

● సుప్రీంకోర్టు తీర్పు

ఈనాడు, దిల్లీ: ఫ్లేవర్డ్ మిల్క్‌పై 12 శాతానికి బదులు 5 శాతం జీఎస్టీనే వర్తింపజేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. 12% జీఎస్టీ చెల్లించాలంటూ కేంద్ర ప్రభుత్వం గతంలో నోటీసులిచ్చింది. దీనిని సవాల్ చేస్తూ 'హెరిటేజ్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, మోడల్ డెయిరీ ప్రైవేట్ లిమిటెడ్‌లు 2021లో ఏపీ హైకోర్టుకు వెళ్లాయి. ఈ నేపథ్యంలో హైకోర్టు ఆ సంస్థలకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. దీనిపై కేంద్ర ప్రభుత్వం పిటిషన్ వేసింది. ఆ పిటిషన్‌ను జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ ప్రసన్న బి.వరాలేతో కూడిన ధర్మాసనం విచారించింది. 'ఫ్లేవర్డ్ మిల్క్‌ను ఐటం నంబరు 403 కింద పరిగణించి 5% పన్ను విధించాలా? లేదా నంబరు 9930గా గుర్తించి 12% పన్ను విధించాలా అన్నది పిటిషన్‌లో ప్రధాన ప్రశ్న. ఈ సమస్యపై ఇప్పటికే సుప్రీంకోర్టు తీర్పును వెలువరించింది. దాని ప్రకారం ఫ్లేవర్డ్ మిల్క్‌ను ఐటం నంబరు 403 కింద పరిగణించి 5% పన్నునే విధించాలి. కేంద్రం వేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నాం' అని ధర్మాసనం తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు ఐదేళ్లకోసారి అనుబంధ గుర్తింపు

యాజమాన్యాలతో ఎమ్మెల్సీల చర్చల్లో నిర్ణయం

ఈనాడు, అమరావతి: ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు ఐదేళ్లకోసారి అనుబంధ గుర్తింపు విధానం అమలు చేసేలా తెదేపా ఎమ్మెల్సీల చర్చల్లో అంగీకరించారని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణజీ, రాజకుమార్ తెలిపారు. సచివాలయంలో మంత్రి లోకేశ్ కార్యాలయంలో ఎమ్మెల్సీలు శ్రీకాంత్, రాంగోపాల్‌రెడ్డి, ఆలపాటి రాజా, చిరంజీవితో జరిగిన చర్చల్లో పలు అంశాలకు ఆమోదం తెలిపారని వెల్లడించారు. 30 ఏళ్ల రిజిస్టర్ లీజు ఉన్న వారికి ఐదేళ్ల అనుబంధ గుర్తింపు అమలు చేస్తామని, డిగ్రీ ఫీజుల నిర్ణయంపై పునఃసమీక్షిస్తామని తెలిపారని పేర్కొన్నారు. పెండింగ్ ఫీజులను వచ్చే నెల నుంచి విడతల వారీగా విడుదల చేయనున్నట్లు చెప్పారని వెల్లడించారు.

డిసెంబరు 31లోపే సరిహద్దులు మార్చుకోవాలి

- ఆ తర్వాత 2027 మార్చి వరకు నిషేధం
- జనగణన నేపథ్యంలో కేంద్రం ఆదేశాలు
- 5 నెలలే సమయం ఉండటంతో వేగంగా అడుగులు వేయాల్సిందే

ఈనాడు- అమరావతి: దేశ వ్యాప్తంగా జనగణన-2027 నిర్వహణ ఏర్పాట్లు మొదలయ్యాయి. ఈ క్రమంలో జిల్లాలు, మున్సిపాలిటీలు, మండలాలు, గ్రామాల హద్దుల్లో మార్పుచేర్పులను ఈ ఏడాది డిసెంబరు 31 నాటికి పూర్తి చేయాలని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఆ తర్వాత 2026 జనవరి 1 నుంచి 2027 మార్చి 31 వరకు హద్దుల్లో మార్పులపై నిషేధం విధించింది. ఈ నేపథ్యంలో ఎన్నికల సందర్భంగా జిల్లాల పేర్లు, హద్దుల మార్పు వంటి వాటిపై ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు. వీటిపై స్పందించిన సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు పేర్లు, సరిహద్దుల మార్పునకు వచ్చిన విజ్ఞప్తులు, వాటి అవసరంపై సాధ్యాసాధ్యాలపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటైంది. కేంద్ర ప్రభుత్వ తాజా ఆదేశాల ప్రకారం 5 నెలలు మాత్రమే గడువు ఉన్నందున చర్యల్లో వేగం పెంచింది. ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల నుంచి వచ్చే వినతులపై జిల్లా అధికారుల నుంచి నివేదికలు తెప్పించుకుంది. వీటిపై నిర్ణయాలు తీసుకుని నోటిఫికేషన్లు జారీ చేసి, అభ్యంతరాలు స్వీకరించి, పరిశీలించి, ఖరారు చేయడంలో వేగం పెంచాలి. లేదంటే 2027 మార్చి వరకు హద్దులు మార్చేందుకు సాధ్యం కాదు. గత వైకాపా ప్రభుత్వం లోక్‌సభ నియోజకవర్గాల ప్రాతిపదికన కొత్త జిల్లాలు ఏర్పాటు చేయడంతో పలుచోట్ల కొత్త సమస్యలు తలెత్తాయి.

వై.రామవరం మండల విభజనపై ప్రతిపాదనలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వై.రామవరం మండల విభజనపై తీవ్ర జాప్యం జరిగింది. 2017లో సీఎం చంద్రబాబు వై.రామవరం మండలాన్ని విభజించి, కొత్తగా మరో మండలాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మండలం ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో ఉంది. వై.రామవరం అప్పర్ (ఎగువ) మండల కేంద్రంగా వై.రామవరం, వై.రామవరం లోయర్ (దిగువ) మండల కేంద్రంగా గుర్తేడును పేర్కొంటూ తాజాగా ప్రతిపాదనలు తయారయ్యాయి.

ఏప్రిల్ నుంచి తొలి దశ చర్యలు: జనగణనలో భాగంగా 2026 ఏప్రిల్ 1 నుంచి తొలిదశ ప్రక్రియ ప్రారంభం కానుంది. గ్రామాలు, పట్టణాలను 'ఎన్యుమరేషన్ బ్లాకులు'గా విభజించనున్నారు. ఈ మేరకు కేంద్ర రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ అన్ని రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులకు లేఖ పంపారు.

సైబర్ మోసాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తాం

● ఏపీటీఎస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ



ఈనాడు, అమరావతి: సైబర్ నేరాల్లో మోసాల బారిన పడకుండా ప్రజలకు రక్షణ కల్పించేందుకు ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ (ఏపీటీఎస్) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సైబర్ సెక్యూరిటీ అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ తెలిపారు. అలాగే సైబర్ సెక్యూరిటీ ఆడిట్ సేవలను ప్రభుత్వ విభాగాలతో పాటు ప్రైవేట్ రంగంలోని సంస్థలకూ అందిస్తామని చెప్పారు. బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్ సంస్థల ఆడిట్ కూడా చేయబోతున్నట్లు పేర్కొన్నారు. దీంతో పాటు తెలంగాణ, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల ప్రభుత్వాలకూ ఆడిట్ సేవలు అందించేందుకు సంప్రదింపులు జరుగుతున్నాయని వివరించారు. విజయవాడలోని ఏపీటీఎస్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. "రాష్ట్ర ఐటీ నెట్‌వర్క్‌కు సైబర్ దాడుల నుంచి ఏపీ సైబర్ సెక్యూరిటీ ఆపరేషన్ సెంటర్ (ఏపీసీఎస్‌ఓసీ) నిరంతరం రక్షణ కల్పిస్తోంది. సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సినీ ప్రముఖులతో పలు మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేయిస్తాం. సైబర్ సెక్యూరిటీ ఆడిట్ సేవలు అందించేందుకు ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సెర్ట్-ఇన్)లో ఏపీటీఎస్ ఎంప్యానెల్ అయింది. రాష్ట్రాన్ని సెక్యూర్ డిజిటల్ ఫ్యూచర్‌గా నిర్మించడంలో యువతను భాగస్వాముల్ని చేస్తున్నాం. దీని కోసం ఐటీఐలకు సైబర్ సెక్యూరిటీ హ్యాకథాన్ నిర్వహించి, 30 మందిని ఎంపిక చేశాం. వారికి ఆరు నెలల పాటు సైబర్ సెక్యూరిటీలో నిపుణుల ద్వారా శిక్షణ ఇప్పిస్తాం. శిక్షణ పూర్తి చేసిన వారికి దేశ, విదేశాల్లో ఐటీ కంపెనీల్లో అవకాశాలు వచ్చేలా చూస్తాం" అని పేర్కొన్నారు.

విమానయాన రంగంలో పెట్టుబడులకు ఆసక్తి

మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కలిసిన పలు సంస్థల ప్రతినిధులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో విమానయాన రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు స్కై బర్డ్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్, హెలి టాక్సీ సర్వీసెస్ సంస్థలు ఆసక్తి వ్యక్తం చేశాయి. ఆయా సంస్థల ప్రతినిధులు పెట్టుబడుల ప్రతిపాదనలను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి సచివాలయంలోని ఛాంబర్‌లో గురువారం అందించారు. స్కై బర్డ్ సంస్థ రూ.600 కోట్ల పెట్టుబడులతో ఫుల్ ఫ్లైట్ సిమ్యులేషన్ సెంటర్, హెలి టాక్సీ సర్వీసెస్ సంస్థ రూ.210 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు అంగీకరించాయి. ఫెలిక్స్ ఏవియేషన్ అకాడమీ సంస్థ ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ ఏర్పాటుకు ఆసక్తి వ్యక్తం చేసింది. వీటికి ప్రభుత్వ అనుమతులను త్వరితగతిన ఇస్తామని మంత్రి వారికి హామీ ఇచ్చారు.

ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీల భర్తీ పరీక్ష కేంద్రాల్లో గందరగోళం

భీమవరం టౌన్, న్యూస్‌టుడే: ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీలను ఒప్పంద పద్ధతిలో భర్తీ చేసేందుకు నిర్వహించనున్న పరీక్ష కేంద్రాల కేటాయింపుల్లో గందరగోళం నెలకొంది. 27న ఈ పరీక్షలకు హాజరు కావాలని అభ్యర్థులకు ఐటీఐల పోస్టల్ ద్వారా సమాచారం పంపారు. దరఖాస్తు చేసుకున్న పాఠశాలల్లోనే పరీక్ష ముఖాముఖి జరుగుతుందని పేర్కొన్నారు. తాజాగా ఆన్‌లైన్ హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని అభ్యర్థుల సెల్‌ఫోన్లకు సందేశాలు వచ్చాయి. అందులో పరీక్ష కేంద్రాల చిరునామాలు వేర్వేరుగా ఉండటంతో అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది. ఒక అభ్యర్థి ఒకే పాఠశాలలో రెండు పోస్టులకు దరఖాస్తు చేసుకుంటే కేంద్రాలు వేర్వేరు చోట్ల ఇచ్చారు. పరీక్ష తేదీ, సమయం ఒకటే ఉండటంతో రెండు పరీక్షలకు ఒకేసారి ఏ విధంగా హాజరు కావాలని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై పశ్చిమ గోదావరి జిల్లా విద్యాశాఖాధికారి నారాయణను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా హాల్‌టికెట్‌లో పేర్కొన్న కేంద్రంలోనే పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ప్రస్తుతం సుమారు 25 ఎయిడెడ్ పాఠశాలల్లో 112 పోస్టులను మూడేళ్ల కాల పరిమితికి ఒప్పంద పద్ధతిలో భర్తీ చేయనున్నారు.

నేడు, రేపు ఎస్ఆర్‌పీసీ సమావేశం

ఈనాడు, అమరావతి: దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ విద్యుత్ కమిటీ (ఎస్ఆర్‌పీసీ) సమావేశం రాజస్థాన్‌లోని ఉదయ్‌పుర్‌లో శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు జరగనుంది. ఈ సమావేశంలో ఏపీ, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, కేరళ రాష్ట్రాల విద్యుత్ సంస్థల అధికారులు పాల్గొంటారు. గత ఏడాది డిస్కంలలో ఉపయోగించిన సాంకేతికత.. విద్యుత్ వినియోగం, దక్షిణాది గ్రిడ్ నిర్వహణ, సరఫరా లైన్లకు సంబంధించి రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలు, కొత్త ప్రాజెక్టులకు అనుమతులపై చర్చిస్తారు.

కాటన్ స్ఫూర్తితోనే నదుల అనుసంధానం

మంత్రి రామానాయుడు

ఈనాడు, అమరావతి: 'కాటన్ స్ఫూర్తితోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నదుల అనుసంధాన ప్రాజెక్టులు చేపడుతున్నారు. జలవనరుల సద్వినియోగంతోనే ఏ ప్రాంతాన్నైనా అభివృద్ధి చేయవచ్చని కాటన్ నిరూపించారు' అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. గురువారం కాటన్ వర్ధంతి సందర్భంగా సచివాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. జగన్ ప్రభుత్వంలో నీటిపారుదల రంగానికి జరిగిన నష్టం అపారమన్నారు. చంద్రబాబు మళ్లీ ఈ రంగాన్ని గాడిన పెట్టారని.. రూ.700 కోట్లతో పంట కాలువలు, డ్రెయిన్ల నిర్వహణ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు.

శ్రీసత్యసాయి జిల్లాలో పారిశ్రామిక పార్కుకు 439 ఎకరాల కేటాయింపు

- కొత్తగా నూర్‌బాషా/దూదేకుల ఆర్థిక సంస్థ
- మంత్రిమండలి సమావేశంలో నిర్ణయాలు
- వెల్లడించిన మంత్రి కొలుసు పార్థసారథి

ఈనాడు, అమరావతి: శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలం ఆర్.అనంతపురం గ్రామంలో పారిశ్రామిక పార్కు ఏర్పాటు కోసం ఏపీఐఐసీకి 439.27 ఎకరాల భూమిని కేటాయిస్తూ.. గురువారం మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది. సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి రాష్ట్ర సచివాలయంలో వెల్లడించారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 'తల్లికి వందనం' పథకం అమలుకు పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులను మంత్రిమండలి ఆమోదించింది. ఇప్పటి వరకు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న ఏపీ నూర్ బాషా/దూదేకుల సంక్షేమం, అభివృద్ధి సంస్థ.. స్థానంలో కొత్తగా 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూర్‌బాషా/దూదేకుల ఆర్థిక సంస్థ'ను ఏర్పాటు చేయనున్నారు.

మరికొన్ని నిర్ణయాలివీ..

- ◆ నంద్యాల జిల్లా అవుకులో ఆర్‌వీఆర్ ప్రాజెక్ట్స్ ద్వారా 800 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్, డోన్ పశ్చిమ ప్రాంతంలో రీన్యూ విక్రం శక్తి కంపెనీ ద్వారా 600 మెగావాట్ల సౌర విద్యుత్తు ప్రాజెక్టు ఏర్పాటు.
- ◆ డోన్ పశ్చిమ ప్రాంతంలో రీన్యూ వ్యోమన్ పవర్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో 300 మెగావాట్ల పవన విద్యుత్తు ఏర్పాటుకు సవరించిన అనుమతుల ఆమోదం.
- ◆ కర్నూలు జిల్లా గుండు తండా వద్ద శ్రీజ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీకి కేటాయించిన 328 మెగావాట్ల పవన విద్యుత్తు, అనంతపురం జిల్లాలో ఆరో ఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్‌కు కేటాయించిన 800 మెగావాట్ల శింగనమల పీఎస్‌పీ కెపాసిటీ ప్రాజెక్టు రద్దు.
- ◆ ఏసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు నిధులతో ఏపీ అర్బన్ వాటర్ సప్లై, సెప్టేజ్ మేనేజ్‌మెంట్ అభివృద్ధి ప్రాజెక్టు కింద ఇప్పటికే ఉన్న 20 ప్యాకేజీల్లో పనులను రద్దు చేసి, మళ్లీ టెండర్లు పిలిచేందుకు ఆమోదం.
- ◆ ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌ల్లోని ఎంఐజీ లేఅవుట్లకు సంబంధించి రాష్ట్రస్థాయి కమిటీ చేసిన సిఫారసుల్లో నిర్దిష్ట మార్పులు.
- ◆ నంద్యాల జిల్లా బనగానపల్లెలోని మార్కెట్ యార్డుకు దక్షిణంగా ఉన్న భూమిలో 5.97 ఎకరాలు బీసీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, వసతి గృహానికి కేటాయింపు.

సీఎంను కలిసిన ఎమ్మెల్సీలు

ఈనాడు, అమరావతి: తెదేపా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలైన వెపాడ చిరంజీవి, ఆలపాటి రాజా, శ్రీకాంత్, రాంగోపాల్‌రెడ్డి, రాజశేఖర్ గురువారం రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిశారు. జాబ్ క్యాలెండర్ విడుదల, గ్రూపు-2 ఫలితాల విడుదలకు ముందు రిజర్వేషన్ రోస్టర్‌పై అభ్యర్థులకు అవగాహన కల్పించాలని కోరారు. పలు అంశాలతో కూడిన వినతి పత్రం సమర్పించారు.

రాష్ట్ర మహిళా కమిషన్ కార్యదర్శిగా అనురాధ నియామకం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర మహిళా కమిషన్ కార్యదర్శిగా పి.అనురాధను నియమిస్తూ మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫారిన్ సర్వీస్ కింద ఆమెను డిప్యుటేషన్‌పై నియమించారు.

మంత్రి నిమ్మలపై దాడి కేసు సీఐడీకి

ఈనాడు, అమరావతి: తెదేపా సీనియర్ నాయకుడు, ప్రస్తుత మంత్రి నిమ్మల రామానాయుడిపై 2022లో వైకాపా శ్రేణులు దాడి చేసిన కేసును సీఐడీకి అప్పగిస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడ సీఐడీ డీఎస్పీ మోహన్ నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో సిట్ ఏర్పాటు చేశారు. 2022లో పాలకొల్లులో టిడ్కో గృహాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అప్పటి మంత్రులు ఆదిమూలపు సురేష్, కారుమూరి నాగేశ్వరరావు, కొట్టు సత్యనారాయణ, నరసాపురం ఎమ్మెల్యే ప్రసాదరాజు కార్యక్రమంలో పాల్గొన్నారు. నాడు పాలకొల్లు ఎమ్మెల్యేగా ఉన్న రామానాయుడు వేదిక ఎక్కుతుండగా.. వైకాపా కార్యకర్తలు భౌతికదాడికి పాల్పడ్డారు. దీనిపై ఫిర్యాదు చేసినా, కేసు నమోదు చేయలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత నరసాపురం డీఎస్పీ ఆధ్వర్యంలో ఈ కేసును విచారించారు. మరింత లోతుగా విచారణ అవసరమని భావిస్తూ.. తాజాగా సీఐడీ డీఎస్పీ ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటు చేశారు.

విద్యా హక్కు చట్టం ప్రవేశాలకు ఫీజుల ఖరారు

ఈనాడు, అమరావతి: విద్యా హక్కు చట్టం కింద ప్రైవేట్ పాఠశాలల్లో భర్తీ చేస్తున్న 25% సీట్లకు ఫీజులను ఖరారు చేస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. స్టార్ రేటింగ్ ఆధారంగా ఫీజులను నిర్ణయించారు. ఒక స్టార్ ఉంటే రూ.8,500, రెండు స్టార్లకు రూ.10 వేలు, మూడు స్టార్లకు రూ.11,500, నాలుగు స్టార్లకు రూ.13 వేలు, ఐదు స్టార్లకు రూ.14,500 ఫీజులను నిర్ణయించారు. రాష్ట్రంలో ఏ ప్రైవేట్ పాఠశాలకు ఐదు స్టార్ల రేటింగ్ లేదు. పాఠశాలల్లోని మౌలిక సదుపాయాలు, ఇతరత్ర సౌకర్యాల ఆధారంగా ఈ రేటింగ్ ఇచ్చారు. ఒక్కో విద్యార్థిపై ఆయా పాఠశాలలు చేస్తున్న వ్యయాన్ని ఫీజుల నిర్ణయానికి పరిగణనలోకి తీసుకున్నారు. ఈ ఫీజుల డబ్బులను ప్రభుత్వమే నేరుగా పాఠశాల బ్యాంకు ఖాతాకు బదిలీ చేస్తుంది. మొదట 50% ఫీజును సెప్టెంబరు, మిగతా ఫీజును జనవరిలో పాఠశాలకు ప్రభుత్వమే నేరుగా చెల్లిస్తుంది.



నర్సాపురం వద్ద వశిష్ఠ గోదావరి తీవ్ర కలుషితం

లోక్‌సభలో కేంద్రమంత్రి రాజ్‌భూషణ్ చౌధరి వెల్లడి

ఈనాడు, దిల్లీ: నరసాపురం పొడవునా వశిష్ఠ గోదావరి నది తీవ్రంగా కలుషితమైనట్లు కేంద్ర జలశక్తిశాఖ సహాయమంత్రి రాజ్‌భూషణ్ చౌధరి తెలిపారు. ఇక్కడ ప్రతి లీటరు నీటిలో 58 మిల్లీగ్రాముల బయో కెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (బీఓడీ) ఉందని చెప్పారు. అందువల్ల ఈ ప్రాంతాన్ని తొలి ప్రాధాన్య కేటగిరీలో చేర్చినట్లు వెల్లడించారు. ఆయన గురువారం లోక్‌సభలో రాజమహేంద్రవరం భాజపా ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. వేంద్ర గ్రామం వద్ద గోస్తనీ నదిలో 8.6 మేర బయో కెమికల్ ఆక్సిజన్ డిమాండ్ ఉందని, దీన్ని నాలుగో ప్రాధాన్య కేటగిరీలో చేర్చామని చెప్పారు. శుద్ధి చేయని మురుగునీటిని వదలడం వల్లే దేశంలో నదులు కలుషితమవుతున్నాయని వివరించారు.

ఇంకా 2 బోయింగ్‌లు ఎగరడంలేదు

ప్రస్తుతం దేశంలో ఉన్న 33 బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్లలో ఇంకా రెండు విమానాలు ఎగరడం లేదని పౌర విమానయాన శాఖ సహాయమంత్రి మురళీధర్ మోహోల్ తెలిపారు. ఆయన లోక్‌సభలో జనసేన ఎంపీ వల్లభనేని బాలశౌరి అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. 'దేశంలో బోయింగ్ 787 విమానాలు 33 ఉన్నాయి. వాటిలో 31 విమానాల తనిఖీ పూర్తయింది. ఇంకా రెండు విమానాలు మెయింటెనెన్స్ కిందే ఉన్నాయి' అని కేంద్ర మంత్రి వివరించారు.

ఏపీ నుంచి 21.62 లక్షల దరఖాస్తులు

18 సంప్రదాయ హస్తకళల విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు నైపుణ్య శిక్షణ అందించడానికి ఉద్దేశించిన పీఎం విశ్వకర్మ స్కీం కింద ఆంధ్రప్రదేశ్ నుంచి 21,63,925 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 2,22,943 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని కేంద్ర ఎంఎస్ఎంఈ సహాయ మంత్రి శోభా కరంద్లాజే తెలిపారు. ఆమె లోక్‌సభలో తెదేపా సభ్యులు బస్తిపాటి నాగరాజు, కేశినేని శివనాథ్‌లు అడిగిన ప్రశ్నకు ఈ మేరకు సమాధానమిచ్చారు.

యూరియా కొరతను పరిష్కరించండి

కేంద్ర మంత్రి నడ్డాకు తెదేపా ఎంపీల వినతి



కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు వినతిపత్రం ఇస్తున్న తెదేపా ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు, తెన్నేటి కృష్ణప్రసాద్

ఈనాడు, దిల్లీ: ఈ సీజన్ కోసం కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన యూరియాలో ఇప్పటివరకు 80,515 టన్నులు సరఫరా చేయలేదని, దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని తెదేపా ఎంపీల బృందం ఎరువులు రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డాకు విజ్ఞప్తి చేసింది. గురువారం తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు, తెన్నేటి కృష్ణప్రసాద్‌లు పార్లమెంటులో జేపీ నడ్డాను కలిసి వినతిపత్రం సమర్పించారు. "జులైలో కేంద్రం రాష్ట్రానికి 1.30 లక్షల టన్నుల యూరియా కేటాయించగా, ఇప్పటివరకూ 49,485 టన్నులే సరఫరా చేసింది. దీంతో తీవ్ర కొరత ఏర్పడింది. వర్షాకాల సీజన్ త్వరగా మొదలైనందు వల్ల కాలువలకూ త్వరగా నీరు వదిలారు. ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు 8.21 లక్షల హెక్టార్లలో వివిధ పంటలు వేశారు. యూరియా కొరత నివారణకు తక్షణం చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలి" అని కేంద్ర మంత్రిని కోరారు. జేపీ నడ్డా సానుకూలంగా స్పందించి.. తక్షణం చర్యలు తీసుకోనున్నట్లు హామీ ఇచ్చారు.

సుబ్రహ్మణ్యం హత్య కేసులో... 'తదుపరి దర్యాప్తు' ఉత్తర్వుల్ని రద్దు చేయండి

హైకోర్టును ఆశ్రయించిన వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు

ఈనాడు, అమరావతి: కాకినాడకు చెందిన దళిత యువకుడు, వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు మాజీ డ్రైవర్.. వీధి సుబ్రహ్మణ్యాన్ని అత్యంత కిరాతకంగా చంపి మృతదేహాన్ని డోర్ డెలివరీ చేసిన కేసులో తదుపరి దర్యాప్తునకు రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు మంగళవారం అనుమతి ఇచ్చిన సంగతి విదితమే. ఆ ఉత్తర్వులను రద్దుపరచాలని కోరుతూ అనంతబాబు గురువారం హైకోర్టులో పిటిషన్ వేశారు. 'తదుపరి దర్యాప్తు చేపట్టడానికి ప్రాసిక్యూషన్ వద్ద ఎలాంటి ఆధారాలూ లేవు. ఉత్తర్వులను రద్దు చేయండి' అని ఆయన కోరారు. దీనిపై అత్యవసర విచారణ చేపట్టాలని అనంతబాబు తరపు సీనియర్ న్యాయవాది సి.రఘు అభ్యర్థించారు. శుక్రవారం విచారిస్తామని న్యాయమూర్తి ప్రకటించారు.

ప్రసూతి సహాయకుల సేవలు, వస్త్రధారణపై మార్గదర్శకాలు విడుదల

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్యశాలల్లో మాతాశిశు సేవల నాణ్యత పెంపుపై ప్రభుత్వం దృష్టిసారించింది. సిజేరియన్ ప్రసవాలను తగ్గించి, సహజ ప్రసవాలను ప్రోత్సహించడంతోపాటు.. మాతాశిశు మరణాలకు ఆస్కారం లేకుండా సమర్థ సేవలు అందించేలా యంత్రాంగాన్ని సన్నద్ధం చేస్తోంది. ఈ క్రమంలో వైద్యశాలల్లో సేవలందించే ప్రసూతి సహాయకులు (మిడ్‌వైఫ్), మిడ్‌వైఫ్ ఎడ్యుకేటర్ల శిక్షణ, వస్త్రధారణ, మాతాశిశు సేవలు, ప్రసవాలు, ప్రసవానంతర సేవలపై వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు గురువారం మార్గదర్శకాలను విడుదల చేశారు. రాష్ట్రంలో తొలి దశలో 1,246 ప్రసూతి సహాయకులకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ఇప్పటికే గుంటూరు, తిరుపతిలోని రాష్ట్రస్థాయి శిక్షణ కేంద్రాల్లో 60 మందికి 18 నెలల నర్స్ ప్రాక్టీషనర్స్ ఇన్ మిడ్‌వైఫరీ (ఎన్‌పీఎం) తర్ఫీదు ఇచ్చారు.

శాప్ ఎండీగా అజయ్‌జైన్‌కు పూర్తి అదనపు బాధ్యతలు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) వైస్ ఛైర్మన్, ఎండీగా ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం శాప్ ఎండీగా ఉన్న గిరీశ శిక్షణ నిమిత్తం ముస్సోరికి వెళ్లడంతో ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించింది.

రాష్ట్ర పర్యాటకానికి.. ఎమర్జింగ్ కోస్టల్, హెరిటేజ్ అవార్డు

ఈనాడు, అమరావతి: పర్యాటక రంగాన్ని పెద్దఎత్తున అభివృద్ధి చేస్తున్నందుకు రాష్ట్రానికి 'ఎమర్జింగ్ కోస్టల్, హెరిటేజ్ అవార్డు' దక్కిందని పర్యాటకాభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ) మేనేజింగ్ డైరెక్టర్ ఆమ్రపాలి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యాటక రంగంలో తీసుకొచ్చిన వినూత్న విధానాలు, విప్లవాత్మక సంస్కరణలకు సంబంధించి '10వ ఇంటర్నేషనల్ టూరిజం కాన్‌క్లేవ్, ట్రావెల్ అవార్డు సంస్థ' రాష్ట్రానికి అవార్డు ప్రకటించిందని ఆమె పేర్కొన్నారు. దిల్లీలో ఈనెల 26న అవార్డును అందుకోనున్నట్లు వివరించారు.

క్రీడాశాఖ విజయాలపై త్వరలో ప్రత్యేక కార్యక్రమం

ఈనాడు, అమరావతి: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా క్రీడా శాఖ సాధించిన విజయాల్ని ప్రజలకు తెలియజేసేలా విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. శాప్ ఆధ్వర్యంలో చేస్తున్న కార్యక్రమాలు, క్రీడాపాలసీ, సంస్కరణలు, క్రీడాకారులకు అందించిన సహాయ సహకారాలు, ప్రోత్సాహకాలు, మెగా డీఎస్సీలో క్రీడా కోటా అమలు, క్రీడా యాప్, క్రీడా వికాస కేంద్రాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యల్ని ఇందులో వివరించనున్నారు. వీటిపై ఫొటో గ్యాలరీ ఏర్పాటు చేస్తారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని అధికారుల్ని మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం తనను కలిసిన శాప్ ఛైర్మన్ రవినాయుడుతో ఆయన ఈ అంశంపై చర్చించారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వివరించనున్నారు. అనంతరం కార్యక్రమం తేదీ ఖరారు చేయనున్నారు.

విద్యార్థుల సృజనకు వేదిక మనబడి మాసపత్రిక

పిల్లలు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలకు స్థానం

ప్రతి నెలా 50 వేలకు పైగా కాపీలు బడులకు ఉచితంగా అందజేత

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల చదువులు, రచనలు, ఆట, పాటల్లో సాధించిన విజయాలు, సైన్సులో ప్రయోగాలు, స్ఫూర్తిదాయక కథనాలకు కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన 'మనబడి' మాసపత్రిక వేదికగా నిలుస్తోంది. ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల కోసం దీన్ని సమగ్ర శిక్షా అభియాన్ రూపొందిస్తోంది. పిల్లల రచనలు, పాఠశాలల్లో అవలంబిస్తున్న ఉత్తమ విధానాలు, ప్రభుత్వ ప్రశంసలు అందుకున్న అంశాలు, నూతన ఆవిష్కరణలు వంటి వాటికి ఇందులో స్థానం కల్పిస్తున్నారు. 2017లో అప్పటి తెదేపా ప్రభుత్వం మొదట కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో బాలికల కోసం 'కస్తూరి' పేరుతో ద్వైమాసపత్రికను తీసుకొచ్చింది. బాలికా విద్య, రక్షణ, ఆరోగ్య అవగాహన పెంపొందించేలా దాన్ని అప్పట్లో నిర్వహించారు. కరోనా సమయంలో నిలిపివేశారు. తిరిగి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అందరూ చదివేలా ప్రత్యేకంగా ఒక మాసపత్రిక ఉండాలనే ఉద్దేశంతో గతేడాది డిసెంబరు నుంచి 'మనబడి' మాసపత్రికను తీసుకొచ్చారు. ఇది 24 పేజీలతో ప్రచురితమవుతోంది. ప్రతి నెలా 50 వేలకు పైగా కాపీలను ముద్రించి, పాఠశాలలకు ఉచితంగా అందిస్తున్నారు. పాఠశాల గ్రంథాలయాల్లో దీనికి స్థానం కల్పిస్తున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారానూ దీన్ని పంపిస్తున్నారు.



విద్యార్థిని విజయగాథతో మొదలై..

పదో తరగతిలో 537 మార్కులు తెచ్చుకున్నా.. ఆర్థిక ఇబ్బందుల కారణంగా తల్లిదండ్రులు చదువు మాన్పిస్తే, చదువుకోవాలనే తన కోరికను సాధించేందుకు సజ్జగూడ నిర్మల అనే విద్యార్థిని చేసిన ప్రయత్నాన్ని విజయగాథగా మొదటి పత్రికను తీసుకొచ్చారు. పిల్లలు రాసే మంచి కవితలు, వారు గీసే చిత్రాలు, రచనలు, మీకు తెలుసా? పజిల్స్ ఉపాధ్యాయులు వివిధ అంశాలపైనా, బోధనపైనా రాసిన కథనాలు, విద్యావేత్తల విశ్లేషణలు, విశ్రాంత ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అధికారుల అనుభవాలు, పాఠశాల వాతావరణంపై వారి అభిప్రాయాలు, విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు పడే శ్రమ వంటి వాటికి ఈ పత్రికలో చోటుకల్పిస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థి మిత్ర కిట్లు, తల్లిదండ్రులు- ఉపాధ్యాయుల మెగా సమావేశానికి సన్నద్ధత, ప్రాముఖ్యతలను ప్రత్యేక కార్యక్రమాలుగా ఇందులో ఇస్తున్నారు. విద్యార్థులు విజ్ఞాన యాత్రలకు వెళ్లేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలూ ప్రచురిస్తున్నారు. గంజాయి, డ్రగ్స్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలు, అనారోగ్య సమస్యలపైనా ప్రచారం కల్పిస్తున్నారు. 'ఇన్ హౌస్' పేరుతో పాఠశాల విద్యలో వస్తున్న మార్పులు, విద్యాశాఖ సాధించిన విజయాలు, చేపట్టబోయే కార్యక్రమాలను ప్రత్యేకంగా ఇస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ల పాఠశాలల సందర్శన, వారిచ్చే సూచనలు, సలహాలకూ ప్రాధాన్యం ఇస్తున్నారు.